



# మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 105: ఆదివారం 30 నవంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




## శ్రీలంకలో ద్వితా బీభత్సం

వరదలకు ఇప్పటికే 123మంది మృతి

మరికొందరి ఆచూకీ గల్లంతు

దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటన

03

## 1 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

03



# రాజధాని రైతులంతా ఒకే గొడుగు కిందకు రావాలి

## మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక జోన్లు



**రాజధాని రైతుల నుంచి డబ్బులు డిమాండ్**

**సీఆర్‌డిఏ అధికారుల తీరుపై మండిపడ్డ సీఎం**

**కఠిన చర్యలు తీసుకుంటామని గట్టిగా హెచ్చరిక**

**మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం చంద్రబాబు**

**అమరావతి :** రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 3 ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాజధాని రైతులంతా ఒకే గొడుగు కిందకు రావాలని పిలుపునిచ్చారు. వారు జెఎసిగా ఏర్పడి ప్రభుత్వంతో సంప్రదింపులకు సిద్దంగా ఉండాలన్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్ఠి సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులంతా అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కిందకు రావాలని, జేఏసీగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు గురించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించాం. ఈ అంశంపై కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం అని చంద్రబాబు చెప్పారు.. రాజధాని రైతుల నుంచి

మిగతా 2 లో



# కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం

**రెండు కార్లు ఢీకొని ఐదుగురు మృత్యువాత**

**ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృతి**

**మంత్రాలయం దర్శనం కోసం వస్తుండగా ఘటన**

**మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు**

**కర్నూలు :** కర్నూలు జిల్లా పరిధిలో శని వారం ఉదయం రెండు రోడ్డు ప్రమాదాలు సంభవిం చాయి. ఓ ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని ఐదుగురు కర్నాకట వాసులు దుర్మరణం చెందారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ

మిగతా 2 లో

## కర్నూలు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

▪ తక్షణ సహాయక చర్యలకు ఆదేశం ▪ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన

## రాష్ట్ర అంశాలపై పార్లమెంట్‌లో గట్టిగా గళం విప్పాలి

**పోలవరం, అమరావతి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి**

**పార్లమెంట్ సమావేశాలు.. జనసేన ఎంపీలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం**

**జనసేన ఎంపీలు బాలశౌరి, ఉదయ శ్రీనివాస్‌తో పవన్ కల్యాణ్ భేటీ**

**కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్ర సమస్యలు వివరించాలని ఆదేశం**

**అమరావతి :** డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ ఎంపీలకు కీలక దిశానిర్దేశం చేశారు. అమరావతిలో లోక్‌సభ సభ్యులు బాలశౌరి, తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమై, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై

మిగతా 2 లో



## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా 'సర్గమ్ 2025'

నేవీ డే సన్నాహక కార్యక్రమాల్లో అలరించిన నేవీ బ్యాండ్

# కర్నాటకలో మళ్లీ రాజకీయ సెగ

కాంగ్రెస్ అధిష్టానం ఆదేశంతో సిద్దుతో డీకే భేటీ

ఇరువురు నేతలు బ్రేక్‌ఫాస్ట్ చర్చలు 3

2028లో గెలుపు కోసం చర్చించామని వెల్లడి





# అమరావతి అంతులేని కథ

## చంద్రబాబుపై అంబటి రాంబాబు ఫైర్

**భూసేకరణపై మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శలు**

**చంద్రబాబు అధికారంలోకి రాగానే భూముల ధరలు తగ్గాయన్న అంబటి**

**రాజధాని పేరుతో చంద్రబాబు దోచుకుంటున్నారని ఆరోపణ**

2

## తదుపరి సీఎస్‌గా సాయిప్రసాద్

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

2

## స్లీపర్ బస్సు ప్రమాదాలపై ఆందోళన

ఆ బస్సులను తక్షణం పక్కన పెట్టేయండి

రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశం

2



## రాజధాని భూములపై త్రిసభ్య కమిటీ భేటీ

**ఎంపిక చేసిన ప్లాట్లకు వాస్తు సమస్యలు**

**రైతులు కోరితే మరోచోట కేటాయిస్తామన్న మంత్రి పెమ్మసాని**


**అమరావతి :** సీఎం చంద్రబాబు సూచనల మేరకు రాజధాని రైతులపై త్రిసభ్య కమిటీ సమావేశం జరిగిందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం రాయపూడి సీఆర్డీఏ కార్యాలయంలో రాజధాని రైతు కమిటీ సభ్యులు, సీఆర్డీఏ అధికారులతో త్రీ మెన్ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. రాజధాని

మిగతా 2 లో

# మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక జోన్లు

మొదటి పేజీ తరువాయి

ఎవరైనా సిబ్బంది డబ్బులడిగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. భూ త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించాలి. ఈ విషయంలో తొలుత కొంత గ్యాప్ ఉంది. నాతో సమావేశమైన అనంతరం రైతులకు అన్నింటిపైనా స్పష్టత వచ్చింది. రాజధాని రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. రెండో దశ భూ సమీకరణ ఉపయోగాలను వారికి వివరించానని అన్నారు. అమరావతి ఓ మున్సిపాలిటీగా మిగిలిపోకూడదు. ఇది మహానగరంగా మారితే వచ్చే ఫలితాలను రైతులు అర్థం చేసుకున్నారు. త్రిసభ్య కమిటీ నిరంతరం రైతులతో సంప్రదింపులు జరుపుతోంది. రాజధాని అభివృద్ధి ఇక అన్‌స్టాపబుల్. రాజధాని పరిసర ప్రాంతాల్లో లేఅవుట్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం అన్నారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాం. త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తాం అని సీఎం చంద్రబాబు తెలిపారు. రైతులకు సంబంధించిన ప్రతి పనికి సిఆర్‌డిఏ అధికారులు డబ్బులు డిమాండ్ చేయడంపై విచారణ చేయిస్తాం అన్నారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతుల నుంచి సిబ్బంది డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూమిని త్యాగం చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా డబ్బులు డిమాండ్ చేస్తారా అని మండిపడ్డారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం.. ఇందుకు అనుగుణంగా 3 ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది నాటికి అమరావతి నిర్మాణం ఒక కొలిక్కి వస్తుంది.. రాజధాని ప్రాంతంలో కాకుండా మిగిలిన ప్రాంతాల్లో లేఔట్స్ కి త్వరలోనే అనుమతి ఇస్తాం.. క్యాపిటల్ గెయిన్సు కు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించాం.. కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుంది.. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తాం.. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాం.. త్వరలోనే ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తామని సూచించారు.



## రాజధాని భూములపై త్రిసభ్య కమిటీ భేటీ



మొదటి పేజీ తరువాయి

రైతుల సమస్యలపై చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 1286 ప్లాట్లకు వీధి పోటు సమస్యలు ఉన్నాయని.. వాస్తు ప్రకారం కొన్ని ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. 156 మంది రైతులకు వాస్తు ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఒక వేళ వాస్తు బాగాలేని రైతులు తమకు వేరే చోట కావాలని చెప్తే కేటాయిస్తారని అన్నారు. రైతులకు పెన్షన్, హెల్త్ కార్డు సమస్యలు ఉన్నాయని.. ఒక నెలలోనే పరిష్కారం అవుతాయని వెల్లడించారు. లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టామన్నారు. అసైన్డ్ ల్యాండ్‌ను మిగిలిన భూములతో సెపరేట్ చేసి క్యాబినెట్‌లో చర్చిస్తామని అన్నారు. ప్రతి రెండు వారాలకు అందరి రైతుల సమస్యలు వింటామని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు. అమరావతి రాజధాని రైతుల సమస్యలను త్రి సభ్య కమిటీ ఎప్పటికప్పుడు తెలుసుకుంటోందని మంత్రి నారాయణ అన్నారు. గ్రామ కంఠాల్లో ఇచ్చిన భూములు, జరీబు, నాన్ జరీబు అన్ని భూములపై దృష్టి పెడతామని చెప్పారు. వచ్చే క్యాబినెట్‌లో అసైన్డ్ భూములు, లంక భూములపై చర్చించనున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని గ్రామాల్లో హెచ్‌డీ లైన్స్, ఇతర మౌలిక వసతులపై దృష్టి పెట్టామన్నారు. గ్రామకంఠాల్లో ఎవరికైతే ఎ÷-లాట్లు ఇచ్చారో వాటిపై ఉన్న అనుమానాలు నేపథ్యంలో అన్ని వెర్గి÷ చేయమని అధికారులకు చెప్పినట్లు తెలిపారు. లంక భూముల విషయంలో ప్రస్తుతానికి ఇబ్బంది లేదన్నారు. ఆర్ అండ్ బి రోడ్‌లకు సంబంధించి పరిహారం తక్షణం వచ్చేలా సీఆర్డీఏ చూస్తుందన్నారు. ఆర్ అండ్ బి ఇవ్వాల్సిన పరిహారాన్ని సీఆర్డీఏ ముందుగా చెల్లిస్తుందన్నారు. 9 గంటలకు అని సమయం ఇచ్చామనని.. అయితే కొందరు రైతుల అలస్యంగా వచ్చారని తెలిపారు. వచ్చే సమావేశం నాటికి అందరినీ పిలుస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## విశాఖ హోటళ్లలో దారుణం

### నాసిరకం, పాచిపోయిన ఫుడ్ సరఫరా

### అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అధికారుల హెచ్చరిక

**విశాఖపట్టణం :** పర్యాటక నగరంగా పేరుగాంచిన విశాఖపట్నంలో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు కస్టమర్ల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పేరుకు మాత్రమే హంగులతో ఆకర్షిస్తూ, లోపల మాత్రం రోజుల తరబడి నిల్వ ఉంచిన పాచిపోయిన ఆహారాన్ని వేడి చేసి వడ్డిస్తున్నారు. రుచి కోసం రకరకాల రంగులు, హానికరమైన రసాయనాలు కలుపుతూ ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎన్నిసార్లు తనిఖీలు చేపట్టినా యాజమాన్యాల తీరు మారకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి హోటళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తాము తినే పదార్థాలు తాజావా కాదా అని నిర్ధారించుకోవాలని హచ్చరించారు. నగరంలో హోటళ్ల అరాచకం రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో, ఆహార భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో అధికారులకు కళ్లు బైర్లు కమ్మే దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. దాదాపు ఏ రెస్టారెంట్ చూసినా కల్తీగా మారిపోయింది. ఈ ఏడాది ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన విస్తృత తనిఖీల్లో 40 హోటళ్లు, రెస్టారెంట్లలో కిలోల కొద్దీ నిల్వ ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా 17 హోటళ్లలో అత్యంత దారుణ స్థితిలో ఉన్న ఆహారాన్ని గుర్తించి, వాటిపై కేసులు నమోదు చేశారు. అక్కయ్యపాలెంలోని నరసింహ నగర్ లో ముంతాజ్ హోటల్ ఈ ఏడాది జూన్ నెలలో జరిపిన తనిఖీల్లో ఇక్కడ కుళ్లిపోయిన కోడిగుడ్లు, చికెన్, చేప, రొయ్య వంటకాలను గుర్తించారు. హోటల్‌పై కేసు కూడా నమోదు చేశారు. అలాగే, ఏంవీపీ కాలనీలో గల ఆహా ఏమి రుచులు రెస్టారెంట్ లో ఆగస్టు 22న జరిపిన దాడుల్లో ఈ రెస్టారెంట్లో నాలుగైదు రోజులకు మించి నిల్వ ఉన్న 85 కిలోల చికెన్, మటన్, రొయ్యలు, చేపలను అధికారులు గుర్తించారు. మరో హోట్ సెలబ్రేషన్స్ పై తనిఖీ చేయగా నిల్వ ఉంచిన బిర్యానీ లభించింది. అలాగే, నగరంలో దాదాపు 1000 వరకు హోటళ్లు, రెస్టారెంట్లలో ఉన్న ఎక్కడ తనిఖీ చేసినా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు దొరకడంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ హోటల్స్ తీరు మారడం లేదు.

# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

పరిధిలోని కొటేకల్ గ్రామం వద్ద ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది.. రెండు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు. కర్ణాటక నుంచి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం దర్శనం కోసం మంత్రాలయం వెళ్తుండగా.. కోటేకల్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వీరిని కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిక్కహోసల్లి గ్రామానికి చెందిన.. వెంకటేశప్ప(60), ఆయన కూతురు మీనాక్షి(32), అల్లుడు సతీశ్(36), మనవళ్లు రుత్విక్, బన్నీగౌడ్‌లుగా తేల్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బెంగళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న కర్ణాటక బస్సు పత్తికొండ పరిధిలోని తుగ్గలి, రాతన గ్రామాల మధ్య బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 29 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. వారిలో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.



## కర్నూలు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

### తక్షణ సహాయక చర్యలకు ఆదేశం

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన

**అమరావతి :** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మరో ముగ్గురికి అత్యవసర వైద్య సహాయం అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇక.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ, రేంజ్ ఐజీలు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతి చెందిన ఐదుగురు కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్టు సీఎం చంద్రబాబుకు అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లా రోడ్డు ప్రమాదంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీశారు. కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఐదుగురు చనిపోవడం.. మృతుల్లో చిన్నారులు ఉండటంపై విచారం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ.. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ప్రయాణికులు ప్రయాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రతా ప్రమాణాలపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు మరోసారి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై ప్రయాణికుల నిర్లక్ష్యానికి తావు లేకుండా పర్యవేక్షణ పెంచాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు చేశారు. కర్నూలు రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని మంత్రులు ఆదేశించారు. ఈ ఘటన జరగడం ఎంతో బాధాకరమని.. మృతుల కుటుంబాలకు మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు సంతాపం తెలిపారు.

## రాష్ట్ర అంశాలపై పార్లమెంట్‌లో గట్టిగా గళం విప్పాలి



మొదటి పేజీ తరువాయి

చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై పార్లమెంట్‌లో గట్టిగా గళం విప్పాలని సూచించారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన చర్చల్లో చురుగ్గా పాల్గొనేందుకు ముందస్తుగా సిద్ధం కావాలని ఎంపీలకు తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు సంబంధిత కేంద్ర మంత్రులతో సమావేశమై, వివరణాత్మక నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్, రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం అందిస్తున్న సహకారం చాలా కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు కేంద్ర పథకాల ద్వారా రావాల్సిన నిధులపై రాష్ట్ర అధికారులతో సమీక్షించి, ఆ వివరాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా 'సర్గమ్ 2025'

### నేవీ డే సన్నాహక కార్యక్రమాల్లో అలరించిన నేవీ బ్యాండ్



డిసెంబర్ 4వ తేదీన జరగబోయే నేవీ డే ఉత్సవాలకు ముందస్తుగా తూర్పు ప్రాంత నావికాదళ కమాండ్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన సర్గం 2025 – ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శనివారం సాయంత్రం సముద్రిక ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్‌కి విశాఖపట్నం విమానాశ్రయంలో నేవల్ ఆఫీసర్లు రజనీష్ శర్మ, కిషోర్, శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, వంశీ కృష్ణ యాదవ్, సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా ఈస్టర్న్ నావల్ కమాండ్ లోని శౌర్య అతిథి గృహం చేరుకున్నారు. ఉప ముఖ్యమంత్రివర్యులతో విశాఖ పోలీస్ కమిషనర్ శ్రీ శంఖబ్రత బాగ్చి సమావేశమయ్యారు. అనంతరం శ్రీ పవన్ కళ్యాణ్ గారు సముద్రిక చేరుకున్నారు. చీఫ్ అడ్మిరల్ శ్రీ సంజయ్ భల్లా, ఆయన సతీమణి శ్రీ ప్రియా భల్లా స్వాగతం పలికారు.

**అలరించిన నేవీ బ్యాండ్**

సర్గం 2025లో భాగంగా తూర్పు ప్రాంత నావికాదళ సింఫనీక్ బ్యాండ్ లయబద్దంగా చేసిన సంగీత విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మ్యూజిక్ కంపోజర్, ఈస్టర్న్ నావెల్ కమాండ్ బ్యాండ్ డైరెక్టర్ శ్రీ సతీష్ ఛాంపియన్, ఈస్టర్న్ నావెల్ బ్యాండ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ప్రదీప్ కుమార్ లు లయబద్ధంగా సంగీతానికి దర్శకత్వం వహించగా, దేశభక్తి గీతాలు, హిందీ పాటలతో పాటు ఎన్విరాన్మెంట్ సంబంధిత అంశాలపై కూడా ఈస్టర్న్ నేవీ బ్యాండ్ చేసిన సంగీతం అందరిని ఆకట్టుకుంది. సుమారు గంటకు పైగా చేసిన ఈ సంగీత విన్యాసాలు అందరిని సమ్మోహితం చేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ పవన్ కళ్యాణ్ గారి చేతుల మీదుగా లయన్ కింగ్ మ్యూజిక్ మెమొంటోను శ్రీ శరత్ కుమార్ సింగ్ బాబుకి అందజేశారు. తూర్పు ప్రాంత నావికాదళ కమాండ్ వైస్ అడ్మిరల్ శ్రీ సంజయ్ భల్లా చేతుల మీదుగా ముఖ్యఅతిథి శ్రీ పవన్ కళ్యాణ్ గారు టోకెన్ ఆఫ్ రెమెంబెన్స్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పవన్ కళ్యాణ్ గారి కుమారుడు శ్రీ అకీరా నందన్ పాల్గొన్నారు.

## తదుపరి సీఎస్‌గా సాయిప్రసాద్

మొదటి పేజీ తరువాయి

స్వీకరించనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత సీఎస్ కె. విజయానంద్ పదవీకాలాన్ని మరో మూడు నెలల పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది సర్కార్. ఈ మేరకు జీవో నంబర్ 2230ను విడుదల చేసింది ప్రభుత్వం. మరోవైపు.. పదిమంది డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జీవో ఆర్టీ నెంబర్ 2228 జారీ చేశారు సీఎస్ విజయానంద్.

## అమరావతి అంతులేని కథ

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విస్తరణ కోసం ప్రభుత్వం మరోసారి భూసేకరణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు చేశారు. అమరావతి కథ ఒక అంతులేని కథలా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతిలో భూముల ధరలు పడిపోయాయని వ్యాఖ్యానించారు. రాజధాని పేరుతో చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతూ దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు. ఇప్పటికే రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాల భూములు త్యాగం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ భూములతో కలిపి మొత్తం 50 వేల ఎకరాలతో ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నిర్మిస్తానని గతంలో చంద్రబాబు ప్రగల్భాలు పలికారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ భూసేకరణకు ఎందుకు సిద్ధమవుతున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల అమరావతి రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని అంబటి ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణంపై స్పష్టత ఇవ్వకుండా, పదేపదే భూసేకరణ అనడం రైతులను ఇబ్బందులకు గురి చేయడమేనని ఆయన అన్నారు. ప్రభుత్వ తీరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

## తిరుమల కల్తీనెయ్యి కేసు

### మరో 11మందిని నిందతులుగా చేర్చిన అధికారులు

**తిరుమల :** తితిదే కల్తీ నెయ్యి కేసులో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ వేగవంతం చేసింది. కేసు నమోదు చేసిన సమయంలో 15 మందిని, ఆ తర్వాత 9 మందిని నిందితులుగా పేర్కొన్న సిట్.. తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేరుస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసింది. వారిలో ఏడుగురు తితిదే ఉద్యోగులు ఉన్నారు. 2019-2024 మధ్య తితిదే కొనుగోలు విభాగంలో పని చేసిన జీఎంలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లపై సిట్ కేసులు నమోదు చేసింది. గతంలో జీఎంలుగా పని చేసిన జగదీశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ, ఎస్వీ గోశాల పూర్వ డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి ఇందులో ఉన్నారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు పేర్కొన్న నిందితుల సంఖ్య 35కి చేరింది. వారిలో 10 మందిని అరెస్టు చేశారు.

# స్లీపర్ బస్సు ప్రమాదాలపై ఆందోళన



**న్యూఢిల్లీ :** ఇటీవల స్లీపర్ బస్సుల కారణంగా జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ రంగంలోకి దిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్లీపర్ బస్సులను తక్షణం పక్కనపెట్టేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ మార్గదర్శకాల ప్రకారం.. ఏఐఎస్:052, ఏఐఎస్:119 నిబంధనల మేరకు వాహనాలు ఉండేలా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ సమయంలో చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. బస్-బాడీ బిల్డింగ్ సంస్థలు, వాహనాల ఆపరేటర్లు నిబంధనలను అతిక్రమించకుండా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వాహనాల భద్రతకు సంబంధించి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు (సీఐఆర్‌టీ) మార్గదర్శకాలను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేయాలి. ఎమర్జెన్సీ సమయాల్లో అడ్డంకిగా మారే అవకాశం ఉన్న బస్సులోపలి ఏర్పాట్లను తొలగించాలి. అవసరమైన మేరకు బస్సులను రికాల్ చేసి మార్పులు చేసేలా మార్గదర్శకాలు జారీ చేయాలి. మోటార్ వాహన చట్టం, ఏఐఎస్ ప్రమాణాల ఉల్లంఘనలకు బస్సు తయారీదారులతో పాటు అధికారులు కూడా బాధ్యులు అయ్యేలా చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాద ఘటనల్లో బాధితులకు సహాయం, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ వద్ద ఫిర్యాదు దాఖలైంది. నిబంధనల అతిక్రమణ కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఇది జీవించే హక్కు ఉల్లంఘనేనని తెలిపారు. దీంతో.. ప్రమాదానికి గల కారణాలపై అధ్యయనం నిర్వహించాలని సీఐఆర్‌టీని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది.

# 1నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

## రాజ్‌నాథ్ అధ్యక్షతన నేడు అఖిలపక్ష భేటీ

**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించ నున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరుగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలపై చర్చకు విపక్షం కసరత్తు చేస్తోంది. సర్‌తో సహా ఢిల్లీ కాలుష్యం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇకపోతే కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన 'ది ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో 'ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, ది హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, ది మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉండనున్నాయి. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956లను విలీనం చేసేందుకు 'సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025'ను కేంద్రం తీసుకువస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ, పొడిగింపుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా, అత్యంత పారదర్శకంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్ (సవరణ) బిల్లును తెస్తోంది. చేయని తప్పులకు కంపెనీ డైరెక్టర్లు బాధ్యులు అవుతున్నందున అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలేయేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనిపై సూచనల కోసం కమిటీకి సిఫారసు చేసే అవకాశం ఉంది. కాగా, ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లుతో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకురానుంది. కాగా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణ పరిధిలోకి తెచ్చే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని అనుకున్నప్పటికీ అలాంటి ఆలోచన ఏదీ లేదని ఇటీవల కేంద్రం ప్రకటించింది. కాగా, ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ జాబితా, అదానీ అంశం, ఢిల్లీ పొల్యూషన్ వంటి అంశాలను లేవనెత్తే అవకాశాలున్నాయి. దీనికి సంబంధించిన విపక్ష నేత రాహుల్ ఇప్పటికే ప్రకటన చేశారు.

# ఢిల్లీ పేలుడు నిందితులకు మరో పదిరోజుల జ్యుడిషియల్ కస్టడీ



**న్యూఢిల్లీ :** ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితులైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనయి, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథెర్, డాక్టర్ సహీన్ సయీద్, ముఫ్తో ఇర్ఫాన్ అహ్మద్ వాగాయ్‌లకు 10 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పాటియాలా హౌస్ కోర్టు శనివారంనాడు ఆదేశించింది. ఇంతకుముందు విధించిన 10 రోజుల కస్టడీ శనివారంతో ముగియడంతో ఈ నలుగురిని కోర్టు ముందు హాజరుపరిచారు. జమ్మూకశ్మీర్ పోలీసులు వెలుగులోకి తీసుకువచ్చిన 'వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్'కు సంబంధించి ఇంతవరకూ ఏడుగురికి పైగా అనుమానితులను అరెస్టు చేసారు. ఈ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌కు నేరుగా ఢిల్లీ పేలుడుతో సంబంధం ఉందని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఆత్మహుతి పేలుడుకు సంబంధించిన ఆధారాలతో వివిధ రాష్ట్రాల్లో సోదాలు జరుపుతున్నామని, దాడిలో ప్రమేయమున్న వారిని గుర్తించేందుకు ఆయా రాష్ట్రాల పోలీసుల సమన్వయంతో దర్యాప్తు సాగిస్తున్నామని ఎన్ఐఏ తెలిపింది. కాగా, డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనయి అదదెకు తీసుకున్న రెండు నివాసాలను కూడా ఢిల్లీ పోలీసులు తాజాగా గుర్తించారు. తప్పుడు సమాచారం ఇచ్చి ఆ ఇళ్లను చాలాకాలంగా గనయి వాడుకుంటున్నాడు. తాను మాజీ సర్పెంచ్‌ననీ, పండ్ల వ్యాపారం చేయాలనుకుంటున్నానని ఆ ఇంటి యజమానికి గనయి చెప్పినట్టు, ఏప్రిల్ నుంచి జూలై వరకూ నెలసరి అ÷-దదెగా రూ. 8,000 చొప్పున చెల్లించినట్టు గుర్తించారు. అ ప్రాంతానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోనే అల్-ఫలా యూనివర్శిటీ ఉంది. అరెస్టు ముందు వరకూ అందులోనే గనయి పనిచేశాడు.

# కర్నాటకలో మళ్లీ రాజకీయ సెగ

### కాంగ్రెస్ అధిష్టానం ఆదేశంతో సిద్దుతో డీకే భేటీ

### ఇరువురు నేతలు బ్రేక్‌ఫాస్ట్ చర్చలు

### 2028లో గెలుపు కోసం చర్చించామని వెల్లడి





**బెంగళూరు :** కర్ణాటక సీఎం కుర్చీ కోసం సమరం వేళ కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు శనివారం బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు ఒక్కచోట కలిశారు. ఇక్కడ ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదిర్చేందుకు కాంగ్రెస్ నానా తంటాలు పడుతోంది. ఎట్టకేలకు కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య శనివారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ జరిగింది. దీనికి సంబంధించి డీకే శివకుమార్ ఎక్స్‌లో పోస్ట్ కూడా చేశారు. ఉదయం బెంగళూరులోని కావేరి నివాసంలో అల్పాహార సమావేశం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిశానని డీకే చెప్పారు. కర్ణాటక ప్రాధాన్యతలు, ముందుకు సాగాల్సిన మార్గాలపై ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించారు. అయితే, డీకే శివకుమార్ తన ఎక్స్ సందేశంలో తెలుపనప్పటికీ సీఎం సిద్దరామయ్యతో టీపార్టీ మీటింగ్ ముఖ్యంగా రొటేషనల్ సీఎం ఒప్పందంపై చర్చించుకునేందుకే నన్నది అందరికీ తెలిసిన విషయమే. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకే ఇరువురు నేతలు టీపార్టీ మీటింగ్ పేరిట కలుసుకుని మాట్లాడుకున్నట్టు సమాచారం. ఇలా ఉండగా, 2023లో కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎవరు రాష్ట్రానికి సీఎం కావాలన్న ప్రశ్న ఉదయించింది. అయితే, అధిష్టానం సూచన మేరకు ఇరువురు నేతలు రొటేషనల్ ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రిగా వ్యవహరించలన్న ఒప్పందం జరిగింది. దీంతో సిద్దారామయ్య సిఎంగా, శివకుమార్ డిప్యూటీగా నియమితులయ్యారు. ఇప్పుడు, ఆయా కాలం పూర్తయ్యే సమయంలో, ఈ ఒప్పందం మళ్లీ తెరమీదకి వచ్చింది. ప్రజల ఎన్నికల తీర్పు ప్రకారం 2028 వరకు పూర్తి కాలంపాటు సీఎంగా వ్యవహరిస్తానని సీఎం సిద్ధరామయ్య పలు సందర్భాల్లో వ్యాఖ్యనించారు. అయితే, అదే సమయంలో పార్టీ హై కమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పుకొస్తున్నారు. దీంతో ఈ ఇప్పుడు ఈ అంశం మీద అందరి దృష్టి పడింది. మరోవైపు, ఢిల్లీలో సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలతో స్ట్రాటజీ గ్రూప్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఇరువురు నేతలు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సమావేశంలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయం కర్నాటక రాజకీయాల్ని కొత్త మలుపు తిప్పవచ్చు. దీంతో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కెసి వేణుగోపాలు ఆదేశంతో తాము ఇద్దరం భేటీ అయ్యామని డిప్యూటి సిఎం డికె శివకుమార్ చెప్పారు. తాము 2028 ఎన్నికల గురించి చర్చించామని సిఎం సిద్దరమాయ్య అన్నారు. ఈ భేటీ అనంతరం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు తాము బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నామని.. కానీ ఏ విషయం పైనా చర్చించలేదని తెలిపారు. నెల రోజుల ముందు నుంచి అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని సిద్ధరామయ్య దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తాను, డీకే ఉమ్మడిగా ఎదుర్కొంటామని అన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. 2028లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కర్ణాటక ప్రజల మద్దతుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. వారికిచ్చిన వాగ్దానం ప్రకారం తాను సిద్ధరామయ్యతో కలిసి పని చేస్తానని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. తాము పార్టీకి విశ్వాసపాత్రులైన సైనికుల్లా పని చేస్తున్నామని.. హైకమాండ్ ఏం చెప్పినా.. దానిని అందరం అనుసరిస్తామని స్పష్టంచేశారు. ప్రస్తుతం పార్టీ పలు సమస్యలు ఎదుర్కొం టోందని.. 2028లో రానున్న కర్ణాటక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళు_న్నామన్నారు. నాయకత్వం విషయంలోనూ హైకమాండ్ నిర్ణయమే ÷నైల్ అని పేర్కొన్నారు. సీఎం సిద్ధరామయ్యతో జరిగిన భేటీలో రాబోయే అసెంబ్లీ సమావేశం సహా పలు విషయాలపై చర్చలు జరిపినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. రెండున్నరేళ్ల తర్వాత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించేలా అప్పట్లో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది. పార్టీ దీనిని పదే పదే ఖండిస్తున్నా.. ఈ అంశం రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ హైకమాండ్ సూచనల మేరకు సిద్ధూ, డీకే నేడు ఒక్కచోట సమావేశమయ్యారు.

# దిత్వా తుఫాను.. శ్రీలంక అతలాకుతలం



కొలంబో : దిత్వా తుఫాను కారణంగా శ్రీలంక చిగురుటాకులా వణికింది. ఈ ఆకస్మిక వరదలు, కొండ చరియలు విరిగిపడటంతో ఇప్పటి వరకు 123 మంది మరణించగా.. అనేక మంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో శ్రీలంక ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. వరదల వల్ల ఏర్పడిన విధ్వంసం కారణంగా తలెత్తిన అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే దేశమమంతటా అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. శనివారం శ్రీలంకను దాటిన దిత్వా తుఫాను 123 మందికి పైగా ప్రాణాలను బలిగొందని, విధ్వంసం, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిందని ఆ దేశ అధికారులు తెలిపారు. 'దిత్వా శ్రీలంక నుండి భారత తీరం వైపు వెళ్లింది. ఈ క్రమంలో భారీ వర్షం, అధిక వేగంతో కూడిన గాలులు వీశాయి. ఈ తుఫాన్ కారణంగా ఇప్పటికే అనేక ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయి. ఎంతో మంది జీవనం అస్తవ్యస్తంగా మారింది' అని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ అతుల కరుణనాయకే మీడియాతో తెలిపారు. ఇదే సమయంలో విపత్తు నిర్వహణ కేంద్రం శనివారం ఓ ప్రకటనలో పలు విషయాలను వెల్లడించింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయనియని తెలిపింది. 43వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ సంపత్ తెలిపారు. పోలీసులు, అధికారులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నా యన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. వందలమందిని తాత్కాలిక పునరావాసాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ వెల్లడించారు.

# ఏపీ వైపు దూసకొస్తున్న దిత్వా తుపాన్

### మూడురోజుల్లో భారీనుంచి అతి భారీ వర్షాలు

### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన విపత్తుల నిర్వహణ సంస్థ

**అమరావతి :** దిత్వా తుఫాను ఆంధ్రప్రదేశ్ వైపునకు దూసుకుని వస్తోంది. దీంతో పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేశారు. నైరుతి బంగాళాఖాతం ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో దిత్వా తుఫాను ప్రభావం కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రస్తుతానికి ఇది కారైకాల్‌కి 150 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 280 కిలోమీటర్లు, చెన్నైకి 350 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం అయిందని వెల్లడించారు. గడిచిన 6 గంటల్లో 8 కిలోమీటర్ల వేగంతో తుఫాను కదులుతుందని వివరించారు. ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న తుఫాను చెన్నైకి అతి సమీపానికి వస్తుందని వివరించారు. ఈరోజు రాత్రికి తుపాను 60కిలోమిటర్ల వరకు ప్రయాణిస్తుందని చెప్పుకొచ్చారు. తీరానికి సమాంతరంగా ప్రయాణిస్తూ ఆయా ప్రాంతాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. మూడు రోజుల్లో ఏపీలో కొన్నిచోట్ల భారీ, మరికొన్ని చోట్ల అతి భారీ, ఇంకొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రెండు రోజుల వరకు తుఫాను తీరం దాటే పరిస్థితి లేదని అన్నారు. తీరం దాటకుండానే తుఫాను క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఆదివారం తెల్లవారుజామునకు తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. తుఫాను ప్రభావంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. తుఫాను ప్రభావం దృష్ట్యా మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరిగి రావాలని కోరారు. మూడు రోజులపాటు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు.

# సిమ్ లేకుండా వచ్చే కాల్స్‌కు చెక్

**న్యూఢిల్లీ :** సైబర్ నేరగాళ్లు వెబ్, ఇతర వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అర్టటై వంటి కమ్యూనికేషన్ యాప్స్ ద్వారా కాల్స్ చేయకుండా కట్టడికి కేంద్రం రంగంలోకి దిగింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. సిమ్ బైండింగ్‌ను తప్పనిసరి చేసింది. అంటే డివైజ్‌లో సిమ్ కార్డు ఉంటేనే యాప్ సర్వీసులను పనిచేసేలా చూడాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ సూచించింది. టెలికమ్యూనికేషన్ సైబర్ సెక్యూరిటీ సవరణ నిబంధనలు, 2025లో భాగంగా యాప్ ఆధారిత కమ్యూనికేషన్ సేవలందించే సంస్థలకు తాజాగా డాట్ ఈ ఆదేశాలు జారీ చేసింది. కమ్యూనికేషన్ యాప్స్ దుర్వినియోగం కాకుండా నిత్యం సిమ్ కార్డుతో అనుసంధానం అయ్యేలా చూడడం ఈ రూల్ ముఖ్య ఉద్దేశం. 90 రోజుల్లో ఈ నిబంధనలను అమలు చేయాలని పేర్కొంది. కొత్త నిబందనల ప్రకారం.. కమ్యూనికేషన్ యాప్స్‌ను టెలి కమ్యూనికేషన్ ఐడెంటిఫై యూజర్ ఎంటిటీస్గా పేర్కొంటారు. యూజర్ ఏ సిమ్‌తో అయితే అకౌంట్ రిజిస్టర్ చేశారో, ఆ సిమ్ మాత్రమే ఆ ఫోన్‌లో ఉంటేనే యాప్ పని చేస్తుంది. సిమ్ తీసేస్తే లేదా ఫోన్ మార్చితే యాప్ ఆటోమాటిక్‌గా లాగౌట్ అవుతుంది. ఒకవేళ యూజర్ వెబ్ బ్రౌజర్‌లో ఈ సేవలను ఉపయోగిస్తే.. సదరు ప్లాట్‌ఫామ్ ప్రతి ఆరు గంటలకు లాగౌట్ అయ్యేలా చూడాలి. మళ్లీ సేవలు పొందాలంటే క్యూఆర్ కోడ్ ద్వారా లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఒకవేళ సదరు డివైజ్ నుంచి సిమ్‌కార్డు తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్‌ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది.

సిమ్ బైండింగ్ నిబంధనల వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వీటిని వాట్సప్, టెలిగ్రామ్ వంటి సంస్థలు ఎలా అమలు చేస్తాయో చూడాలి. ఎవరైతే డీయాక్టివేట్ అయిన సిమ్‌కార్డుతో వాట్సప్ వంటి యాప్స్‌ను వినియోగిస్తున్నారో వారు కూడా ఈ నిబంధనల వల్ల సేవలు పొందలేరు. ప్రస్తుతం యూపీఐ పేమెంట్ యాప్స్ సిమ్ ఉంటేనే సేవలందిస్తున్నాయి.



సంపాదకీయం

# రాజకీయ పార్టీల నిబద్ధతకు పరీక్ష!

రాజకీయాల్లో సంకల్ప బలం ముఖ్యం. తమతో పాటు బడుగుబలహీన వర్గాలను ముందుకు తీసుకుని వెళ్లామన్న ప్రయత్నం చేయాలి. ఎంతసేపు వారే పల్లకి మోయాలన్న ఫ్యూడల్ భావాలను వీడాలి. పల్లకి ఎక్కే అవకాశం వారికి కూడా కల్పించాలి. వారినీ సానబెట్టి రాటదేలేలా చేయాలి. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ల అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఇదే అదనుగా కాంగ్రెసేతర పార్టీలు కాంగ్రెస్‌ను తిట్టిపోస్తూ రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నాయి. నిజానికి రాజకీయంగా లబ్ధి పొందాలంటే ఆయా వర్గాల్లో పట్టును సాధించాలి. అందుకు పార్టీ పరంగా ఆయా వర్గాలను ముందుకు తీసుకుని వెళ్లాలి. హైకోర్టు తీర్పు తరవాత గత్యంతరం లేని పరిస్థితు ల్లో ప్రభుత్వం పాతపద్దతిలోనే స్థానిక ఎన్నికలకు సిద్దం అయ్యింది. ఇది ఆహ్వానించదగ్గ విషయం. రిజర్వేషన్లు ఉంటేనే బిసిలను, ఎస్సీ,ఎస్టీలను ఆదరించడం కాదు...లేకున్నా వారికి రాజకీయంగా ప్రవేశం కల్పించాలి. ఇప్పుడు రాజకీయ పార్టీలు అదేపనిగా పాత వ్యవహారాలను తవ్వుతూ పోకుండా తమ పార్టీ పరంగా బిసిలు, ఎస్సీలు, ఎస్టీలను రాజకీయంగా పైకి తీసుకుని వచ్చే ప్రయత్నాలు చేయాలి. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టగానే ఎందరో ఎస్సీలు, ఎస్టీలు, బిసిలకు టిక్కెట్లు ఇచ్చి రాజకీయంగా వారికి అండగా నిలిచారు. అనామకులు ఎందరో రాజకీయంగా తెరపైకి చ్చారు. గుంటూరులో కాంగ్రెస్ దిగ్గజం ఆచార్య ఎన్‌జి రంగా లాంటి వారు అనామకుడి చేతిలో ఓటమి చెందారు. అలా ఆనాడు ఎన్టీఆర్ సృష్టించిన ప్రభంజనంలో మహామహులు ఓటమి చెందారు. కొత్త తరం రాజకీయాల్లోకి వచ్చింది. అలా రాజకీయాల్లోకి వచ్చి నిలదొక్కుకున్న వారు నిలదొక్కుకున్నారు. ఆ తరవాత అదే ఒరవడి సాగింది. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బడుగు, బలహీనవర్గాల రాజకీయ ప్రవేశాలకు నాంది పలికింది. కుల ప్రాతిపదికను మొదటి కమిషన్ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే, కులాన్ని ఒక సూచికగా తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం మండల్ కమిషన్ తీర్పులో స్పష్టం చేసింది. 1992లో ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని ఇచ్చిన తీర్పు ఫలితంగా తమిళనాడు సహా ఎన్నో రాష్ట్రాల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. చివరికి ఇందిరా సహానీ కేసు కూడా పరీక్ష ఎదుర్కొనక తప్పలేదు. తమిళనాడు 69శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ సుప్రీంకోర్టు విధించిన పరిధి వల్ల సందిగ్ధత ఏర్పడింది. దీంతో అసెంబ్లీలో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి, 69శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేట్టు, సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిధి నుండి రక్షణ పొందడానికి రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చేట్టుగా అప్పటి ముఖ్యమంత్రి జయలలిత పావులు కదిపారు. అయితే ఇదంతా అసెంబ్లీ, పార్లమెంట్ వ్యవహారాల్లో పోరాడాల్సిన అంశం. అప్పటి వరకు ఈ వర్గాలను దూరం చేసుకోవడం తగదు. నిజానికి ఈ వర్గాలను దగ్గరకు చేసుకునేందుకు ఇదో మహత్తర అవకాశంగా రాజకీయ పార్టీలు భావించాలి. సర్పంచ్ పదవి అన్నది ఎవరైనా రాజకీయంగా ఎదగడానికి పరమపద సోపానం లాంటిది. యువతను రాజకీయాల్లో ఆహ్వానిం చేందుకు, గ్రామాలను అభివృద్దిలో నిలిపేందుకు ఇదో మంచి అవకాశం. అధికార కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు సర్పంచ్ ఎన్నికల్లో వివిధ కులవర్గాలకు చెందిన సమర్థులైన యువతను నిలపాలి. చదువున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. నిజాయితీ రాజకీయాలను ప్రోత్సహించాలి. అందుకు రిజర్వేషన్లు లేనిచోట్ల ఎస్సీ,ఎస్టీ, బిసి వర్గాలను నిలబెట్టాలి. వారంతా రాజకీయంగా ఎదగడానికి అవకాశం వస్తుంది. దీంతో రాజకీయాల్లో కొత్తనీరు రావడానికి ప్రాతిపదిక వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించక తప్పడం లేదు. మరొకవైపు శాసనసభలో చేసిన తీర్మానాలకు కట్టుబడి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రక్షణ కల్పించేలా 9వ షెడ్యూల్‌ను ఆశ్రయించాలనే ఉద్యమం కొనసాగుతోంది. ఈ విషయంలో ప్రచారం వేగంగా మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా చేరింది. గ్రామాల్లో కూడా ఇప్పుడిప్పుడే యువత రాజకీయాల వైపు మొగ్గుచూపుతోంది. ఎంతకాలం వృద్ధ జంబుకాలే పార్టీల్లో వేలాడకుండా కొత్తతరాన్ని ఆహ్వానించాలి. సమాజంలో అట్టడుగుస్థాయి వర్గాలను వెతికి పట్టుకుని, వారిని రాజకీయాల్లో ముందుకు తీసుకుని రావాలి. ఎంతకాలం వారిని కేవలం కార్యకర్తలుగానే ఉపయోగించుకునే దౌర్భాగ్యం నుంచి బయటపడి నవతరం నాయకత్వం అవతరించే దిశగా నేడు పార్టీలు అడుగులు వేయాలి. పార్టీపరంగా వారికి అండదండలు కల్పించాలి. సవాళ్లను ఎదుర్కోవడానికి నిరంతర అవగాహన కల్పించాలి. వారిని రాజకీయాల్లో రాటుదేలేలా చేయాలి. విద్యార్థి ఉద్యమాలతో రాటుదేలిన వారిని ముందుకు దింపాలి. ఇందుకు పార్టీపరంగా సమైక్య పోరాటం అనివార్యంగా గుర్తించాలి. తెలంగాణ శాసనసభలో చేసిన ఏకగ్రీవ తీర్మాణాలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు 42శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపాయి. అదే స్ఫూర్తితో బీసీ సభ్యులను ఇప్పుడు గెలిపించుకోవాలి. పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ ఎన్నికకు పార్టీ గుర్తు ఉండదన్న నెపంతో వీరిని పక్కన పెట్టాలని చూస్తే అసెంబ్లీ తీర్మానాలకు విలువ ఉండదు. అందువల్ల అన్ని పార్టీలు ఈ విషయంలో తీవ్రంగా ఆలోచన చేసి, రిజర్వేషన్లు లేనిచోట్ల వివిధ వర్గాల అభ్యర్థులను నిలబెట్టి ముందుకు నడిపించాలి. రాజకీయాలలో ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా మనకు సమానత్వం ఉంది. కానీ సామాజిక, ఆర్థిక జీవితంలో మనకు అసమానతలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా రాజకీయాల్లో పదవుల పందేరంలో ఇప్పటికీ అంగ్రవర్గాలదే పైచేయిగా ఉంటోంది. మనం ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తొలగించాలి. లేకుంటే అసమానతలు ఎదుర్కొంటున్న వారిలో ఆవేశం కట్టలు తెంచుకుంటే, అజమాయిషీ చెలాయిస్తున్న వారు అడుసులో కూరుకు పోతారు. ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని బలోపేతం చేయాలంటే అసమానతలు అన్నవి తొలగించుకుంటూ పోవాలి. అందుకు రిజర్వేషన్లే ప్రాతిపదిక కానవసరం లేదు. రాజకీయ సంకల్పం ఉంటే ఇది సాధ్యం అవుతుంది. ఉన్నత వర్గాల వారికి చట్టసభల్లో స్థానాలు తగ్గించి, బీసీ వర్గాలకు స్థానాలు పెంచడం వల్ల సామాజిక సామరస్యత వస్తుంది. ఇప్పుడు రిజర్వేషన్ల కోసం కొట్లాడుతున్న బీసీ నాయకులను ఎన్నికలలో గెలిపించిన చరిత్రను లిఖించినవారు అవుతారు.




కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

## ఆక్స్‌ఫర్డ్ చర్చలకు రాకుండా అబద్ధాల ప్రచారం

### భారత్‌పై నోరు పారేసుకున్న పాక్ ప్రతినిధులు

### గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి



**న్యూఢిల్లీ, నవంబర్ 29:** తప్పుడు ప్రచారాలు చేయడం ద్వారా తప్పుకోవడం అలవాటు చేసుకున్న పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. యూకేలో జరిగే ప్రముఖ చర్చలో పాల్గొనకుండా.. భారత్ అధికారులు వెనుదిరిగారంటూ తప్పుడు ప్రచారానికి తెర లేపింది. అయితే, దీన్ని భారత్ గట్టిగా తిప్పికొట్టింది. వివరాల్లోకి వెళితే.. యూకేలో ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో గురువారం భారత్-పాక్ అధికారుల మధ్య చర్చజరగాల్సి ఉంది. ఇందులో భారత్ తరఫున మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవాణెళి, సుబ్రమణియన్ స్వామి, రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్‌లు పాల్గొనాల్సి ఉంది. పాక్ నుంచి ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ, యూకేలోని రాయబారి మొహమ్మద్గ ÷సైల్, రిటైర్డ్ జనరల్ జుబైరా మహమూద్ హయత్‌లు హాజరుకానున్నారు. అయితే, ఈ చర్చలో పాల్గొనకుండా భారత్ అధికారులు చివరి నిమిషంలో వెనుదిరిగారంటూ యూకేలోని పాక్ రాయబార కార్యాలయం తప్పుడు ప్రచారానికి తెరలేపింది. 'పాక్ బృందం ఇప్పటికే లండన్‌లో సిద్ధంగా ఉంది. ఆక్స్‌ఫర్డ్ చర్చల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే, ఇందులో పాల్గొనకుండా భారత్ బృందం వైదొలగాలని నిర్ణయించుకుందని యూనియన్ నిర్వాహకులు తెలిపారు. అందుకు గల కారణాలు మాత్రం తెలపలేదని ఎక్స్‌లో రాసుకొచ్చింది. అయితే పాక్ అబద్ధపు ప్రచారాన్ని భారత్‌కు చెందిన సీనియర్ న్యాయవాది సాయి దీపక్ గట్టిగా తిప్పికొట్టారు. పాక్ తన తప్పుడు ప్రచారాలను ఇంకా కొనసాగిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. సుబ్రమణియన్, నరవాణెళి కొన్ని కారణాల వల్ల చర్చకు హాజరుకాలేకపోతున్నందున, వీరికి ప్రత్యామ్నా యాలు చూపాలని యూనియన్ అధికారులు తనను కోరారని దీపక్ చెప్పారు. ఈ క్రమంలో తాను యూకేకు వెళ్లి మరో బృందంతో చర్చకు సిద్ధమయినట్లు తెలిపారు. అయితే.. చర్చకు కొన్ని గంటల ముందు యూనియన్ అధికారులు తనకు కాల్ చేసి.. పాక్ తరఫున హాజరవ్వాల్సిన బృందం యూకేకు రాలేదని వెల్లడించారన్నారు. దీంతో చర్చ ఆగిపోవడం తనకు ఆగ్రహం తెప్పించిందన్నారు. పాక్ బృందం కూడా యూకేలోనే ఉందని, భారత్‌తో చర్చల్లో పాల్గొనేందుకు భయపడి వెనుదిరిగినట్లుగా కనిపిస్తుందని విమర్శించారు. తమను ఎదుర్కోలేక పిల్లల వెనక దాక్కుందని ఎద్దేవా చేశారు. దాయాది బృందం ఇంకా ఆక్స్‌ఫర్డ్‌లోనే ఉంటే.. తమతో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. దీపక్ పోస్టులతో పాక్ ప్రకటనలు తప్పు అని మరోసారి స్పష్టమైంది. పాక్ చర్చలో పాల్గొనాల్సి వస్తే బేలతనం బయటపడుతుందనే ఇలా చేసి ఉంటుందని అనుకుంటున్నారు.

## ఢిల్లీ పేలుడు నిందితులకు మరో పదిరోజుల జ్యుడిషియల్ కస్టడీ

**న్యూఢిల్లీ, నవంబరు 29:** ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితులైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనయి, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథెర్, డాక్టర్ సహీన్ సయీద్, ముఫ్తీ ఇర్ఫాన్ అహ్మద్ వాగాయ్‌కు 10 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పాటియాలా హౌస్ కోర్టు శనివారం ఆదేశించింది. ఇంతకుముందు విధించిన 10 రోజుల కస్టడీ శనివారంతో ముగియడంతో ఈ నలుగురిని కోర్టు ముందు హాజరుపరిచారు. జమ్మూకశ్మీర్ పోలీసులు వెలుగులోకి తీసుకువచ్చిన 'వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్'కు సంబంధించి ఇంతవరకూ ఏడుగురికి పైగా అనుమానితులను అరెస్టు చేసారు. ఈ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌కు నేరుగా ఢిల్లీ పేలుడుతో సంబంధం ఉందని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.



## స్మృతి, పలాశ్‌ల వివాహం రద్దంటూ పుకార్లు

### ఒక్క ఎమోజీతో చెక్ పెట్టిన ఇరువురు

### త్వరలోనే పెళ్లి అంటూ కుటుంబ సభ్యుల వెల్లడి

ముంబై, నవంబర్ 29: భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడిన క్రమంలో అనేక పుకార్లు షికారు చేస్తున్నాయి. వీరి వివాహం మొత్తానికే రద్దయ్యిందన్న వార్తలు ప్రచారం సాగాయి. వారు వివాహాన్ని పూర్తిగా రద్దు చేసుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ వార్తలకు స్మృతి-పలాశ్ దిష్టి రక్ష ఎమోజీతో చెక్ పెట్టారు. వారిరంవురూ తాజాగా తమ ఇన్‌స్టాగ్రామ్ బయోలో దిష్టి రక్ష ఎమోజీని చేర్చుకున్నారు. దీంతో వారిరువురి మధ్య ఎటువంటి సమస్యలు లేవనే విషయంపై స్పష్టతనిచ్చినట్లైంది. ఇటీవల ఆమె ఇన్‌స్టా ఖాతాలో పెళ్లికి సంబంధించిన పోస్టులు కన్పించకపోవడం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. పలాశ్‌తో ఎంగేజ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ.. ఎంగేజ్‌మెంట్ రింగ్‌ను చూపిస్తూ స్మృతి పోస్టు చేసిన వీడియో ఆమె ఇన్‌స్టాలో కనిపించలేదు. ఇదే వీడియోను స్మృతి స్నేహితురాళ్లు జెమీమా, శ్రేయాంక కూడా సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించడంతో పలాశ్‌కు, ఆమెకు మధ్య మనస్పర్థలు వచ్చాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అదే సమయంలో పలాశ్ ముచ్చల్ మరో మహిళతో మంధానను కించపరుస్తూ చాట్ చేసినట్లు ఆరోపిస్తున్న స్క్రీన్‌షాట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో పలు వదంతులు వ్యాపించాయి. శుక్రవారం పలాశ్ తల్లి అమిత, ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ.. ఇప్పుడు అంతా బాగానే ఉందని, త్వరలో వారిద్దరి వివాహం జరుగుతుందని వివరించారు. 'స్మృతి మంధాన, పలాశ్ ముచ్చల్ ఇద్దరూ ప్రస్తుతం కష్టాల్లో ఉన్నారు. పలాశ్.. స్మృతిని అర్ధాంగిగా ఇంటికి తీసుకురావాలని కలలు కన్నాడు. నేను కూడా వారికి ప్రత్యేకంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నా. ఇప్పుడంతా బాగానే ఉంది. వారిద్దరి వివాహం అతిత్వరలో జరుగుతుందని ఆమె అన్నారు. ఈ సమయంలో స్మృతి-పలాశ్ ఇన్‌స్టాలో తమ బయోను అప్‌డేట్ చేయడం గమనార్హం. ఈ ప్రకటనతో ఇక పుకార్లకు తెరపడే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు.

## శుక్రమౌఢ్యమి ప్రవేశంతో శుభకార్యాలకు సెలవు

### ఫిబ్రవరి వరకు ముహూర్తాలు లేవంటున్న పండితులు

**తిరుమల, నవంబర్ 29:**

గ్రహాల గమన స్థితిని బట్టి ఇప్పుడు శృక్ర మౌఢ్యమి నడుస్తోంది. దీంతో శుభకార్యాలకు తావు లేదు. సాధరణంగా డిసెంబర్‌లో మళ్లీ మంచి ముహూర్తాలు వచ్చేవి కానీ ఈ యేడు అలాంటి అవకాశం లేదు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలు లేవని పండితులు సెలవిస్తున్నారు. ఈనెల 26న మార్గశిర మాసం శుద్ధ షష్ఠి నుంచి ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17 వరకూ కొనసాగనుంది. దీంతో సుమారు 84 రోజుల పాటు శుభకార్యాలకు ముహూర్తాలు లేవు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం.. ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి అంటారు. దీనినే వాడుక భాషలో మూఢమి అంటే చీకటి అంటారు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడూ అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిషులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభసూచకం కాదని సూచిస్తున్నారు. మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. అయితే.. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలే ఉండగా.. పుష్యం శూన్య మాసం అవుతుంది. ఇక మాఘంలోనూ ఒక్క మూహూర్తం లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథ సప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘ్‌గా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులూ ఈసారి మూఢంలోనే కలిసిపోయాయి. ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలల పాటు శుభకార్యాలకు మంచిరోజులు లేవని తిరుమల పండితులు చెబుతున్నారు. శుక్రమౌఢ్యం వల్ల ఒక్క శుభముహూర్తం కూడా లేదని అన్నారు. శుభకార్యాలతో పాటు గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలూ వంటివీ నిర్వహించడానికి అవకాశం లేదని సూచించారు. దీంతో దీనికి సంబంధించిన వ్యాపారాలపైనా ప్రభావం పడనుంది.

## 16 ఏండ్ల క్రితం ఉద్యమాన్ని మలుపుతిప్పిన దీక్ష

### ఆనాటి రోజులు గుర్తు చేసుకున్న కేటీఆర్, హరీష్

హైదరాబాద్, నవంబర్ 29: దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమం నాటి రోజులను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక మలుపుగా నిలిచిన రోజు 2009 నవంబర్ 29 అని అన్నారు. రాష్ట్ర సాదనకు 16 ఏండ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు నాంది పలికిందని అన్నారు. తెలంగాణ గమ్యాన్ని మార్చిన చారిత్రాత్మక రోజు అని తెలిపారు. కరీంనగర్‌లో కేసీఆర్‌ను అరెస్టు చేసిన సమయంలో ప్రజల్లో నుంచి వచ్చిన ఆగ్రహ జ్వాలలు తెలంగాణ ఉద్యమానికి కొత్త ఊపు ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు అప్పటి పరిస్థితులను గుర్తుచేస్తూ ఆనాడు కరీంనగర్‌లో తీసిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అలాగే దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమం నాటి రోజులను బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు గుర్తుచేసుకున్నారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో 2009 నవంబర్ 29న ప్రారంభించిన ఆమరణ దీక్ష, ఉద్యమ గతిని మలుపు తిప్పిందని.. సరికొత్త చరిత్రకు నాంది పలికిందని.. తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసిందని తెలిపారు. 'రానే రాదు, కానే కాదు' అన్న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును సబ్బండ వర్గాలను ఏకం చేసి సుసాధ్యం చేసి చూపిన ఘన చరిత కేసీఆర్‌ది అని కొనియాడారు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష సాధనకు అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర కేసీఆర్‌ది అని అన్నారు.పదవులే కాదు, తెలంగాణ కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడ్డ ధీరత్వం కేసీఆర్‌ది అని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. నాలుగు కోట్ల ప్రజల్లో మార్మోగే 'జై తెలంగాణ' అనే రణ నినాదం కేసీఆర్ అని అన్నారు. నవంబర్ 29న కేసీఆర్ దీక్ష లేకుండా డిసెంబర్ 9 ప్రకటన లేదు. డిసెంబర్ 9 ప్రకటన లేకుండా తెలంగాణ రాష్ట్రమే లేదని స్పష్టం చేశారు.



## రేవంత్ సొంతూరులో సర్పంచ్ ఏకగ్రీవం

### పోటీచేసే వారి నుంచి ఒకరిని ఎన్నుకోవాలని నిర్ణయం

కొడంగల్, నవంబరు 29: సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లె సర్పంచ్ ఏకగ్రీవమైంది.. ఎస్సీకి రిజర్వ్ అయిన కొండారెడ్డిపల్లె సర్పంచ్ పదవికి 15 మంది పోటీ పడ్డారు. చివరికి సర్పంచ్ ఎన్నికను గ్రామ పెద్దలు ఏకగ్రీవం చేశారు.. 15 మందిలో ఒకరి పేరును సీల్డ్ కవర్‌లో ప్రకటించనున్నారు. ఎవరి పేరు వచ్చినా గ్రామం మొత్తం సమిష్టిగా ఆ నిర్ణయాన్ని గౌరవించాలనేది గ్రామ నాయకత్వం అభిప్రాయంగా చెబుతున్నారు. మరోవైపు.. మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు నేటితో పూర్తయ్యింది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించినట్టు అధికారులు తెలిపారు. గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తుండగా శుక్రవారం సర్పంచి పదవులకు 4,901 నామినేషన్లు వచ్చాయి. దీంతో మొత్తం నామపత్రాల సంఖ్య 8,198కి చేరింది. అటు మొన్న, నిన్న కలిపి వార్డు సభ్యులకు 11,502 నామినేషన్లు దాఖలైనట్టు అధికారులు వెల్లడించారు. తొలి విడతలో 4,236 సర్పంచ్, 37,440 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ డిసెంబర్ 3. డిసెంబర్ 11న మొదటి దశ ఎన్నికలు జరుగుతాయి. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నాం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది, అదే రోజు మధ్యాహ్నాం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
ఆదివారం 30 నవంబర్ 2025 పేజీ : 5

# కొత్త పంచాయతీల ఏర్పాటు కు రంగం సిద్ధం



గొలుగొండ, నవంబర్ 29,(మనసులో మాట ):రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీల ఏర్పాటు ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గ్రామస్థాయి నాయకుల్లో నూతన ఆశలు చిగురిస్తున్నాయి. గొలుగొండ మండలంలో ప్రస్తుతం 24 పంచాయితీలు ఉండగా, గత వైసీపీ ప్రభుత్వ కాలంలో 3 కొత్త పంచాయతీలు ఏర్పాటయ్యాయి. ఆ కొత్త పంచాయతీలన్నింట్లోనూ వైసీపీ సర్పంచ్లు గెలిచిన విషయం తెలిసిందే. దీంతో మొత్తం పంచాయితీల సంఖ్య 27 కు పెరిగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా కొత్త పంచాయతీల ఏర్పాటు కోసం మార్గం సుగమం చేయడంతో, పంచాయితీ సర్పంచ్ అభ్యర్థులుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలన్న ఆసక్తి ఆశావహుల్లో కనిపిస్తోంది. అదే సమయంలో తమకు తలనొప్పిగా మారుతున్న శివారు గ్రామాలను విడదీసి, కొత్త పంచాయతీలుగా తీర్మానం చేయాలనే ఆలోచనలో కొందరు స్థానిక నాయకులు ఉన్నట్లు సమాచారం. మండలంలో కొత్తగా ప్రతిపాదించే అవకాశాలు ఉన్న గ్రామాల జాబితా పరిశీలిస్తే గొలుగొండ పంచాయతీ పరిధిలో కొత్త జోగంపేట శ్రీరాంపురం జోగంపేట కాలనీ, కలిపికొత్త పంచాయతీగా ఏర్పాటు చెందే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా గొలుగొండ మండలం , ఏల్లవరం పంచాయతీల నుంచి రాజుపేట, కరక, డొంకాడ, జిల్లేడిపూడి కలిపి మరో పంచాయతీ ఏర్పడే ముహూర్తం వచ్చినట్లు తెలుస్తోంది.... అలా జరిగితే పంచాయతీలసంఖ్య పెరగనుంది..

# పేరుకే ఉచితం ఇసుక అంతా అక్రమం!

- ప్రభుత్వ అధికారులు కను సన్నల్లో ఇసుక రీచ్ లు
- అనాదరేజుడుగా ఇసుక వేలం పాటలు







**విమాడుగుల నవంబర్ 29 (విమనసులో మాట)..** ఉచిత ఇసుక పేరుతో అక్రమార్కులు లక్షలాది రూపాయలు ఆర్జిస్తూ జేబులో నింపు కుంటున్న సంఘటన అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలో చోటు చేసు కుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న పేర్కొన్నారు శనివారం అక్రమ ఇసుక ర్యాంపులను పరిశీలించిన అనంతరం అయిన మాట్లాడారు, దేవరాపల్లి మండలం లోని రాజకీయ నేతల అండ దండలతో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి పూటలా ఇసుకను జెసిబిలతో తీసిపగల పూట డాక్టర్ల ద్వారా దర్జాగా తరలించకు పోయి విక్రయిస్తున్నారని తెలిపారు, మండలం లోని తేనుగుబూడి తామారబ్బ వెంకట రాజుపురం తిమిరా వేచలం బోయిల కింతాడ తో పాటు మరి కొన్ని గ్రామాలు శారదా నది పరివాహ ప్రాంతంలో ఉండటం వల్ల తరచూ ఇక్కడ ఇసుక లభిస్తుందని తెలిపారు మొంథా తుపాను వల్ల రైవాడ గేట్లు తెరవడం తో శారదా నదిలో ఇసుక కుప్పలు తెప్పలుగా వచ్చి చేరిందన్నారు ఇదే అదునుగా కొంత మంది అనాదేజుడుగా లక్షలాది రూపాయకు వేలం పాటలు నిర్వహించి ప్రభుత్వానికి రావలసిన సొమ్మును ఇసుక అక్ర మార్కులు కాజేస్తున్నారని తెలిపారు,అయితే ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అడ్డం పెట్టు కొని అడ్డగోలుగా వ్యాపారం సాగిస్తున్న,, పోలీసు రెవిన్యూ అధికారులకు తెలిసిన చూసి చూడ నట్లు వది లేస్తుండడంతో అక్రమార్కులు జంకు బొంకు లేకుండా దర్జాగా ర్యాంపులను వేసి మరి డాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి పోతున్నారని తెలిపారు కోన్ని ట్రాక్టర్లుకు కావలసిన కాగితాలు లేకపోయినా కనీసం డ్రైవర్లుకు.లైసెన్సులు లేక పోయిన విచ్చల విడిగా తోల కాలు చేపాడుతున్నాని ఇది అత్యంత ప్రమాదమని తెలిపారు అయితే ఇసుక రీచ్ లు స్థానిక రెవెన్యూ పోలీసులు కనుసన్నల్లో జరగడం విడ్డూరంగా ఉందన్నారు దింతో ఇసుక వ్యాపారులు ఎవరు వచ్చినా ఏమి చేయ లేరని తోల కాలు చేపాడు తున్నాని తెలిపారు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మాత్రం మేక పోతు గాం భీర్యం ప్రదర్శిస్తు పోలిసులకు రెవెన్యూ సచి వలయం ఉద్యోగులకు సైతం అదేశాలు ఇచ్చామని దీన్ని ప్రజలు కూడా బైటకు ఇసుక వెళ్ళకుండా చూడాలని బైటకు చేప్పిన మొత్తం వ్యవహరం ఎమ్మెల్యే చేతులు మీదుగా జరుగుందని తెలిపారు నిబంధ నలకు విరుద్ధంగా ఇసుక రీచ్ లు ఏర్పాటు చేసి వాగులు వంకలు నదీ ప్రాంతాల్లో భారీ గుంతలు ఏర్పాటు,,, నదులపై బ్రిడ్జిలు కూలు పోతున్న పరిస్థితులు ప్రమాద భరితంగా ఉన్నప్పటికీ అధికారులు స్పందించక పోవడం అన్యాయ మన్నారు కొన్ని చోట్ల నదుల ఒడ్డున ఉన్న పెద్ద పెద్ద చెట్లను సైతం తొలగించి జెసిబి తో రహదారులు ఏర్పాటు చేసి ఇసుకను రోజు పదుల కొద్ది ట్రాక్టర్ల ద్వారా తరలించకపోయి విక్రయిస్తున్నారని తెలిపారు.నదులు నుండి ఇసుక ఒడ్డుకు తీసుకు వచ్చి కుప్పలు కుప్పలుగా వేసి రాత్రి పూటలా లారిలతో సైతం విక్రయిస్తు న్నారని తెలిపారు ఒక్కొక్క ట్రాక్టర్ లోడ్ కు 2500 వరకు నది పరివాహక ప్రాంతంలో విక్రయిస్తున్నారని అది ఇతర ప్రాంతాలకు తరలించి మూడు వేల నుండి 4 వేల వరకు టాక్టర్ లోడ్ విక్రయిస్తు న్నారని అన్నారు సామాన్యుడికి ఉచితంగా ఇసుక అందించాలని ప్రభుత్వం చెబుతుంటే అదే సామాన్యుడు ఇసుకను కొనుక్కోలేని పరిస్థితి ప్రస్తుతం చుట్టు ప్రక్కల మండలంలో నెల కుందని తెలిపారు.



విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న

## ఆపదమిత్ర వాలంటీర్లు

### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అభినందన

**అనకాపల్లి, నవంబర్ 29 (మనసు లో మాట)..** యువ ఆపద మిత్ర స్కీమ్ లో భాగంగా జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్ డిఎంఎ ) ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ లో ఒడిస్సా రాష్ట విపత్తుల నిర్వహణ సంస్థ (ఓడిడిఎం ఎస్ ఏ ) ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టిఓటి ) ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అక్టోబర్ 10 నుంచి నవంబర్ 7 వరకు జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా నుంచి 10 మంది ఆపదమిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసి జిల్లాకు విచ్చేసిన అనంతరం శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న సహాయక చర్యలు, రక్షణ కార్యకలాపాలు (రిలీఫ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్) అత్యవసర సన్నద్ధత మరియు ప్రాథమిక జీవరక్షణ పద్ధతుల గురించి వారు కలెక్టర్ విజయ కృష్ణన్ , జాయింట్ కలెక్టర్ల జాహ్నవి లకు వివరించారు. ఈ సంధర్భంగా ఆపదమిత్ర వాలంటీర్ల కృషి ని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అభినందిస్తూ, జిల్లా స్థాయిలో విపత్తు నివారణ మరియు స్పందన చర్యల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సమాజాధారిత విపత్తు నిర్వహణలో ఆపదమిత్ర వాలంటీర్ల సేవలు అమూల్యమని కలెక్టర్ విజయ కృష్ణన్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో కలెక్టర్ కార్యాలయం సమన్వయ విభాగం పర్యవేక్షకులు ఎస్ వివిఎస్ వాసునాయుడు, సీనియర్ సహాయకులు రెహమ్ తుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

### డిఐపిఆర్ఓ ఎస్.వి. రమణ

**అనకాపల్లి, నవంబర్ 29 (మనసు లో మాట):** జర్నలిస్టులకు జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు నవంబర్ 30 తో ముగియనున్న నేపథ్యంలో, పాత్రికేయుల పని నిరంతరంగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి ని మరో రెండు నెలలు పొడిగించినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె విశ్వనాథన్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. డిసెంబర్ 1 వ తేదీ నుంచి జనవరి 31, 2026 వరకు లేదా కొత్త కార్డులు జారీ చేసే ప్రక్రియ ముందుగా పూర్తయ్యేవరకు ఈ పొడిగింపు అమల్లో ఉంటుందని జిల్లా డిఐపిఆర్ఓ ఎస్.వి రమణ తెలిపారు. ప్రస్తుతం నవంబర్ 30 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి విధుల్లో కొనసాగుతున్న పాత్రికేయులకు మాత్రమే ఈ గడువు పొడిగింపు వర్తిస్తుందని స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లా పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులు తమ పత్రికా యాజమాన్యాల సిఫార్సు లేఖ లను డిసెంబర్ 01, 2025 నుంచి జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో సమర్పించి సంబంధిత రెన్యువల్ స్లిప్పులను పొందవచ్చని ఆయన సూచించారు. పాత్రికేయుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా డిఐపిఆర్ఓ ఎస్.వి. రమణ తెలిపారు.



## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యం

**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 29 :** రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్య సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే గుర్తింపు పొందిన ఆసుపత్రిలో సుమారు రూ.1.50 లక్షలు విలువైన వైద్యాన్ని ఉచితంగా పొందవచ్చు. దీనికోసం జిల్లా కలెక్టర్ బ్యాంకు ఖాతాను పీఎఫ్ఎంఎఫ్ కు అనుసంధానం చేయాల్సి ఉంది. వీరికోసం శుక్రవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీడియో కానారెటన్స్ లో ఎంఓఆర్టిహెచ్ (మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్పోర్ట్ అండ్ హైవేస్) అధికారులు విధివిధానాలను వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఐఆర్ఏడి జిల్లా మేనేజర్ ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

## గిరిజనులకు ఇబ్బందులు పెట్టడం సరికాదు

### - వైస్ సర్పంచ్ జగ్గు నాయుడు.

### పట్ట భూమి కలిగిన గిరిజనుడికి ఎన్ ఓ సి ఎందుకు ఇవ్వటం లేదు.?



**దుంబ్రిగుడ, నవంబర్ 29, (మనసులో మాట):** పట్ట భూమి కలిగిన స్థానిక గిరిజనులకి అధికారులు ఇబ్బందులు పెట్టడం సరికాదని స్థానిక వైస్ సర్పంచ్ జగ్గు నాయుడు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక గిరిజనులు వారి వారి సొంత స్థలాలలో పట్ట భూమి కలిగి ఉన్న స్థలాలలో బతుకుతెరువు కోసం దుకాణాలు పెట్టుకుంటే పంచాయతీ అధికారులు నిలుపుదల చేయడం సరికాదని చెప్పారు. వలస వచ్చిన గిరిజన నేతరులు ఇష్టరాజ్యంగా ప్రభుత్వ భూములు ఆక్రమణ చేసి శాశ్వత గృహాలతో పాటు కిరాణా దుకాణాలు నిర్మాణాలు కళ్ళముందే చేస్తున్నప్పటికీ కూడా వారికి ఎటువంటి నోటీసులు గానీ ఇవ్వకుండా స్థానిక గిరిజనులు సొంత స్థలాలలో పట్ట భూముల్లో దుకాణాలు పెట్టుకుంటే నిలుపుదల చేయడం సరికాదని చెప్పారు. ఒకటి బై 70 చట్టానికి నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. అన్ని హక్కులు కలిగి ఉన్న గిరిజనులకు ఇలా ఇబ్బందులు చేయడం ఏమాత్రం సరికాదని దీనిపై పూర్తిగా విచారణ చేపట్టి గిరిజనులకు తగిన న్యాయం జరపాలని ఆయన చెప్పారు.

## గంజాయి - మాదకద్రవ్యాల నిర్మూలనపై

# భారీ ర్యాలీ





**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 29:** మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా విశాఖపట్నం రేంజ్ పరిధిలో ప్రారంభించిన “అభ్యుదయం సైకిల్ యాత్ర” విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి, ఆదేశాలతో, విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఉత్తర్వులతో విజయనగరం జిల్లా గజపతినగరం మరియు దత్తిరాజేరు మండలాలలో విశేష స్పందనతో కొనసాగింది. మొదటగా భవ్యశ్రీ కళాశాల, గజపతినగరం నుండి అభ్యుదయం సైకిల్ యాత్రను గజపతినగరం ఎస్ఐ కె.కిరణ్ కుమార్ నాయుడు, బొండపల్లి ఎస్ఐ యు.మహేష్, గజపతినగరం ఎమ్మార్వో , స్థానిక అధికారులు మరియు స్థానిక మండల నాయకులు ఘనంగా ప్రారభించారు. అభ్యుదయం సైకిల్ ర్యాలి సుమారు 1000 మంది విద్యార్థులు, ప్రజలతో కోలాటాలు, వాయిద్యాలు, తీన్మార్, డిజెల నడుమ జన సందోహంతో కలిసి మార్గ మధ్యలో కరపత్రాలు పంచుతూ, ప్లకార్డులు చూపిస్తూ, గజపతినగరం ఆర్.టి.సి. కాంప్లెక్స్లోకి ప్రవేశించిది. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి, అక్కడనుండి హనుమాన్ గుడి జంక్షన్ మీదుగా మరుపల్లి బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకుంది. అక్కడ సుమారు 500 మంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా, కళాశాల యాజమాన్యం, స్థానిక అధికారులు మరియు స్థానిక మండల నాయకులు పాల్గోన్నారు.అనంతరం ఈ అభ్యుదయం సైకిల్ యాత్ర సుమారు 600 మంది విద్యార్థులు, ప్రజలతో దత్తిరాజేరు మండలంలోకి ప్రవేశించింది. మానాపురం ఎస్ఐ ఆర్.జయంతి ఈ అభ్యుదయం సైకిల్ యాత్రను ఘనంగా స్వాగతం పలికారు. అక్కడనుండి సుమారు 300 మంది విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి యాంటి డ్రగ్స్ పై నినాదాలు చేస్తూ మానాపురం సంత వద్దకు చేరుకొని అక్కడ అవగాహన కార్యక్రమం చేపట్టారు. బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ 300 మంది విద్యార్థులు, గ్రామస్తులతో సైకిల్ ర్యాలీకి స్వాగతం పలికారు. తదుపరి ఎపిబిసి రెసిడెన్షియల్ పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులతో డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు 1972 ఆకారంలో నిలబడి అవగాహన కల్పించారు. అనంతరం రొంపల్లి జంక్షన్ వద్ద రామభద్రాపురం మండలంలోకి ప్రవేశించి, ఆరికతోట వద్ద జెడ్పి ఉన్నత పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. తదుపరి ఈ అభ్యుదయం సైకిల్ యాత్ర రేపు రామభద్రాపురం మండలం నుండి మొదలవుతుంది. కార్యక్రమంలో గజపతినగరం బొబ్బిలి రూరల్ సిఐ కె.నారాయణరావు, ఎస్ఐ కె.కిరణ్ కుమార్ నాయుడు, బొండపల్లి ఎస్ఐ యు.మహేష్, మానాపురం ఎస్ఐ ఆర్.జయంతి, బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్, రామభద్ఎరాపురం ఎస్ఐ వి.ప్రసాద్, బాడంగి ఎస్ఐ జె.తారకేస్వర రావు, తెర్లాం ఎస్ఐ సాగర్ బాబు, స్థానిక అధికారులు, స్థానిక మండల నాయకులు, ఈగల్ సిబ్బంది, స్థానిక మండల నాయకులు, వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

**విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, సందేశం –**

“మాదకద్రవ్యాల నిర్మూలన కోసం కఠిన చర్యలు” మాదకద్రవ్యాలు, ముఖ్యంగా గంజాయి వినియోగం మరియు అక్రమ రవాణా, యువత భవిష్యత్తును, కుటుంబాల మనశ్శాంతిని , సమాజ అభ్యున్నతిని తీవ్రంగా దెబ్బతీసే పెద్ద ముప్పు. ఉత్తరాంధ్రలో ముఖ్యంగా అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతాలు గంజాయి సాగుకు కేంద్రంగా మారకుండా పూర్తిగా నిర్మూలించాము, అలాగే రాష్ట్రం మొత్తం గంజాయి రవాణా పూర్తిగా అణచివేయడానికి విశాఖపట్నం రేంజ్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా లో గత 14 నెలల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి పంటను పండిరచే రైతులకు అవగాహన కల్పించి, వారికి ప్రత్యామ్నాయ పంటల సాగు అవకాశాలు కల్పించాము. ఏఎస్ఆర్ జిల్లాలో 2024-2025 వ సంవత్సరం కి గాను 10,817.25 ఎకరాల్లో సుమారు 46.8 లక్షల వాంక్కలనం ప్రత్యామ్నాయం పంటలు పంపిణి చేయడం జరగగా, 2025-2026 వ సంవత్సరం కి 196 మంది రైతులకు 210 ఎకరాలు లో 1,35,453 యూకలిప్టస్ మొక్కలు పంపిణీ చేయడం జరిగింది.దీని ఫలితంగా, గంజాయి పంట సాగు 2021 -2022 వ సంవత్సరం కి గాను 7515 ఎకరాలలో సాగు చేయగా 2024-2025 వ సంవత్సరం కి గాను 93 ఎకరాలకు, 2025-2026 వ సంవత్సరం కి సాగు కు తీసుకురావడం జరిగింది. ఆ పంటను పూర్తిగా ధ్వంసం చేసి, చట్టపరమైన చర్యలు తీసుకున్నాం. డ్రోన్ లు, ఉపగ్రహ చిత్రాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం వలన గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించామని నిర్ధారించబడిరది. గంజాయి సాగు జరగకుండా టెక్నాలజీ అనగా డ్రోన్ లు, ఉపగ్రహ నిఘా లను వినియోగించి గంజాయి సాగు ను మూలాల నుంచి నిర్మూలన చేయడం జరిగినది మరియు ప్రత్యేక దాడులు, సంయుక్త ఆపరేషన్లు కొనసగిస్తున్నాం.గత 14 నెలల్లో రేంజ్ పరిధిలో 880 కేసుల్లో 2,516 మందిని అరెస్ట్ చేయడం జరిగింది. 95 మందిపై NDÖ, 61 మందిపై D యాక్ట్, 1,474 మంది పై సస్పెక్ట్ షీట్లు తెరవడం జరిగింది.గంజాయి అక్రమ వ్యాపారంలో పాల్గొన్న వారిపై 14 ఆస్తి కేసులు నమోదు చేసి, 13 మంది నిందితులపై రూ. R+.10,53,42,941 /- కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశాం.పోలీసులు మాత్రమే కాదు ప్రతి పౌరుడు ఈ యుద్ధంలో భాగస్వామి కావాలి. సమాజం నిలబడితేనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం. మన సమాజాన్ని డ్రగ్స్ రహిత ప్రాంతంగా మార్చడమే మా లక్ష్యం అని డీఐజీ పిలుపునిచ్చారు.

## విశాఖ ఎయిర్పోర్ట్ లో పవన్ కళ్యాణ్ ను కలిసిన జనసేన పార్టీ ఎమ్మెల్యేలు



**మునగపాక (మనసులో మాట) నవంబర్ 29..** హైదరాబాదు నుండి ప్రత్యేక విమానంలో విశాఖ ఏర్పాటుకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎయిర్ పోర్ట్ నుండి రోడ్డు మార్గాన షీలా నగర్ మీదగా సముద్రిక ఫంక్షన్ హాల్లో చేరుకొని నావెల్ మ్యూజికల్ కార్యక్రమంలో పాల్గొననున్న పవన్ కళ్యాణ్.. విశాఖ ఎయిర్ పోర్ట్ లో పవన్ కళ్యాణ్ కు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్,వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, కొనతాల రామకృష్ణ, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న మళ్ళ సురేంద్ర



**అనకాపల్లి, నవంబర్ 29 (మనసు లో మాట):** విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ విఐపి లాంచ్ లో శనివారం కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్ల సురేంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభత్వంలో కేంద్రవిమానాయాన శాఖ మంత్రి గా వున్నా సమయం లో బోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి అవుతున్న సందర్భంలో రామ్మోహన్ నాయుడు కు సురేంద్ర శుభాకాంక్షలు తెలియజేశారు.



## చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్స్ టూర్ కి సురేష్ ఎంపిక

**విమాడుగుల నవంబర్ 29 (మనసులో మాట)..** సీనియర్ ఎల్ఐసి ఏజెంట్ అయిన పాలకుర్తి సురేష్ కుమార్ టూర్ కి ఎంపికయ్యారు. శనివారం మాడుగుల. మిషన్ ఎక్సెంట్ అబ్రాడ్ టూర్ కి మనదేశంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్స్ 86 మంది సభ్యులు ఎంపికయ్యారు. అందులో మాడుగులకు చెందిన పాలకుర్తి సురేష్ కుమార్ అర్హత సాధించారు. విశాఖపట్నం డివిజన్ అర్హత సాధించే వియత్నం దేశంలో ఎల్.ఐ.సి.ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతాప్ మరియు ఎల్ఐసి ముంబై సెంటర్ ఆఫీస్ క్లియా డిపార్ట్మెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ స్వర్ణలత చేతుల మీదుగా పాలకుర్తి సురేష్ కుమార్ కు సన్మానంచేసారు.

## బెట్టింగ్ యాప్స్ తక్షణమే రద్దు చేయాలి

### ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు డిమాండ్




విజయనగరం: (మనసులో మాట) నవంబర్ 29:: స్థానిక కాంప్లెక్స్ వద్ద ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు ఆధ్వర్యంలో ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ రద్దు చేయాలనీ శనివారం దర్న నిర్వహించారు. ఈ సందర్భంగా బూర వాసు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో యువత, ఆడపిల్లలపై,ప్రమాదకరంగా మారిన ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ తక్షణమే రద్దు చేయాలి ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ యాజమాన్యాపై తగిన చర్యలు తీసుకోవాలని, ఆ యాప్స్‌లో తక్కువ ధరకే వడ్డీ ఇస్తామని అలాగే బెట్టింగ్ తగినంత అమౌంట్ ఇస్తామని చెప్పి చెప్పుతున్నారు అలా నమ్మిన యువత ఆ యాప్స్ డౌన్లోడ్ చేసుకొని వాటికీ బానిసలు అవుతూ ఆ వడ్డీలు కట్టలేక వాళ్ల జీవితాలను సర్వ నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఆడపిల్లల అశ్రీలత ఫోటోలు పెట్టి బ్లాక్ మెయిల్ చేస్తూ ఆడపిల్లలపై అగత్యాలకు పాల్పడుతూన్నారు. వెంటనే ఆ యాప్స్ ను రద్దుచేసి యువతకు,ఆడపిల్లలకు ప్రజలకు రక్షణ కల్పించి యువతకి ఉద్యోగులు కల్పించే విధంగా చర్య లు తీసుకోవాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. చర్యలు తీసుకోని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలియజేస్తున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలి



**కోటవురట్ల(మనసులో మాట) నవంబర్ 29:** కోటవురట్ల మండలంలో స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం గొట్టివాడ గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను పర్యవేక్షించారు. సర్వే ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఖాళీ స్థలాలు, ఇళ్లకు కొలతలు వేసి నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి సర్వే వివరాలను తెలియచేయాలన్నారు. ఖాళీ స్థలాలు, ఇళ్లకు సంబంధిత యజమానులకు యాజమాన్య హక్కు పత్రాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల యజమానులు వారి ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెట్టుకోవడానికి లేదా విక్రయించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. సర్వే బృందానికి గ్రామాల్లో ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

## శనివారం వారపు సంతలో

# క్రిస్మస్ పండగ సందడి



**హుకుంపేట నవంబర్ 29 (మనుసులో మాట )..** మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే వారపు సంత ఈసారి పండగ వాతావరణాన్ని తలపించింది. నెలాఖర్‌తో పాటు క్రిస్మస్ పండగ సమీపిస్తున్న నేపథ్యంలో సంత మార్కెట్ మొత్తం ఉత్సాహభరితంగా మారింది. గ్రామీణ ప్రజలు పెద్ద సంఖ్యలో సంతకు తరలివచ్చి వారి అవసరాలకు సరిపోయే వస్తువులను కొనుగోలు చేశారు. ప్రధానంగా క్రిస్మస్ పండగను దృష్టిలో ఉంచుకుని కొత్త దుస్తుల కొనుగోలు కోసం ప్రజలు వస్త్ర దుకాణాల వద్ద భారీగా గుమిగూడారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ పండగకు కొత్త బట్టలు కొనుగోలు చేయడంలో ఆసక్తి చూపారు. మహిళల కోసం చీరలు, పిల్లల కోసం రంగురంగుల దుస్తులు, పురుషుల కోసం షర్టులు, ప్యాంట్లు వంటి వస్త్రాలకు మంచి గిరాకీ కనిపించింది.
సంతలో కూరగాయలు, పండ్లు, కోళ్ల మాంసం, చేపలు, గృహోపకరణాలు, పండగలకు అవసరమైన అలంకరణ సామగ్రి అమ్మకాలు కూడా జోరుగా సాగాయి. ముఖ్యంగా క్రిస్మస్ అలంకరణలకు ఉపయోగించే స్టార్ లైట్లు, కాగితపు అలంకరణలు, బెలూన్లు మొదలైనవి ఎక్కువగా విక్రయమయ్యాయి. నెలాఖర్ కావడం, పండగ కావడంతో ప్రజలు ముందస్తు కొనుగోళ్లకు మొగ్గు చూపారని వ్యాపారులు తెలిపారు.
సంతకు పరిసర గ్రామాల నుంచి కూడా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ జనసంచారంతో కిటకిటలాడాయి. వాహనాల రద్దీ కొంతసేపు ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలిగించింది. పోలీసులు, సిబ్బంది రద్దీని నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు. వ్యాపారులు మాట్లాడు తూ, గత కొన్ని వారాలుగా మందగించిన వ్యాపారం క్రిస్మస్ పండగతో మళ్లీ పుంజుకుందని తెలిపారు. నెలాఖర్ జీతాలు చేతికందడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయని అన్నారు. ప్రజలు కూడా పండగ వాతావరణం సంతోషాన్ని నింపుతోందని, సంతలో కావాల్సిన అన్ని వస్తువులు ఒకే చోట లభించడం ఆనందంగా ఉందని అభిప్రాయపడు తున్నారు. మొత్తానికి శనివారం జరిగిన వారపు సంత క్రిస్మస్ పండగ సందడితో కళకళలాడుతూ వ్యాపార, కొనుగోలు కేంద్రంగా మారింది. రాబోయే వారాల్లో పండగ మరింత దగ్గర పడుతున్న నేపథ్యంలో సంతల్లో ఇంకా ఎక్కువ సందడి ఉండనుందని అంచనా వేస్తున్నారు.

## గణిత భోధన లో ఆమె 'రూటే సపరేటు'




**ఎస్. రాయవరం, నవంబర్ 29,(మనసులో మాట):** సమాజంలో ఏస్థాయికి చెందిన వ్యక్తి కైనా,ఏవృత్తికైనా, ఉద్యోగానికైనా గణిత శాస్త్రం అవసరం. సకల శాస్త్రాలుకు మూలం గణితం. ఒక దేశాభివృద్ధి ఆదేశ ప్రజల గణిత శాస్త్రంపైనే ఆధారపడి ఉంటుఃది. అటువంటి గణిత శాస్త్రం భోధనలో ఎస్. రాయవరం మండలం రేవుపోలవరం హైస్కూల్ లో పనిచేస్తున్న స్వర్ణగౌరి అనే గణిత ఉపాధ్యాయురాలు విద్యార్ధులులో గణిత శాస్త్రం పట్ల తనదైన శైలిలో అసక్తి పెంచుతున్నారు. గణిత భోధనలో ఆమె శైలి విద్యార్ధులను ఆకర్షించటంతో మేథ్స్ పట్ల విద్యార్ధులలో అధిక మార్కులుసాధించాలనే అకాంక్ష పెరుగుతుంది. ఇటీవల స్వర్ణగౌరీ పదవ తరగతి విద్యార్థులు కు త్రికోణమితిలో కీలకాంశాలను భోదించిన తీరు ఆకర్షిస్తుంది. త్రికోణమితి నిజ జీవితంలో ఉపయోగాలును వివరించారు. భవనాలు రూపకల్పన, వంతెనలు,రోడ్లు,డ్యాములు నిర్మాణం, సముద్రం, ఆకాశంలో ప్రయాణ దిశనులెక్కించ విధానాన్ని ఉదాహారణలు తో భోదించారు. అంతేకాకుండా వైద్యరంగంలో స్కానింగ్ టెక్నాలజీ లో శరీర భాగాల కోణాలు, కదిలిక విశ్లేషించడానికి, నక్షత్ర స్థానాలను కచ్చితంగా గుర్తించడానికి ఉపయెగాన్ని తెలిపారు. త్రికోణమితి తో జిపి ఎస్ నావిగేషన్ సిస్టమ్ లో దురాలు, తరంగదిశ అంచనా వేయడానికి, పర్వతాల ఎత్తులు లెక్కించడానికి, భూమివ్యాసాన్ని లెక్కించడానికి, యానిమేషన్ లో వస్తువులును కదిలించడంవంటి ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుందని స్వర్ణ గౌరి విద్యార్ధులుకు వివరించారు. 10 పరీక్షలలో గణిత లో అధిక మార్కులు సాధించే మెళుకవలను విద్యార్ధులుకు భోదించారు. ఆమె భోధన తీరుపట్ల వివిధ పాఠశాల ఉపాధ్యాయులు నుండి ప్రశంసలు అందుకుంటున్నారు.

### గంటా జన్మదిన వారోత్సవాల్లో భాగంగా కశింకోట లో

## పేదలకు అన్నదానం దుప్పట్లు పంపిణీ



**కశింకోట, నవంబర్ 29 మనసులో మాట..** మాజీ మంత్రి, భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాలలో భాగంగా గంటా యువసేన ఆధ్వర్యంలో ఐదవ వ రోజు మేజర్ పంచాయతీ కశింకోట గ్రామంలో శ్రీ సత్య సాయి ఆశ్రమం నందు 150 మంది వృద్ధులు వికలాంగులకు అన్నదానం దుప్పట్లు రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి. కసింకోట మండల టిడిపి అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గని రమణమూర్తి మాజీ డిసిసిబి డైరెక్టర్ పిఎసిఎస్ చైర్మన్ సిద్దిరెడ్డి శ్రీనివాసరావు మాజీ ఎంపీపీ పెంటకోట రాము మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల సతీష్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో నైనంశెట్టి రమణారావు మండల ఐటీడీపీ అధ్యక్షులు.గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకునాయుడు. గంటా యువసేన కన్వీనర్ గొంతీన గంగాధర్ మండల తెలుగు యువత అధ్యక్షులు ఉగ్గిని నాయుడు బాబు . గ్రామపార్టీ అధ్యక్షులు తాకాశి కృష్ణ నారిపల్లి ప్రసాద్ మండల ఐటీడీపీ సెక్రటరీలు రామకృష్ణ . వీరబ్రహ్మం మండల డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు కొనేటి శివ గణేష్ , ఆశ్రమ నిర్వాహకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జీవన ఎరువులు వాడకం వలన భూమి సారం పెరుగుతుంది

### - ఆత్మ పథక సంచాలకులు అప్పలస్వామి



**మునగపాక, నవంబర్ 29, (మనసులో మాట)..** మునగపాక మండలం, మునగపాక గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ( ఆత్మ ) వ్యవసాయ శాఖ నానోయూరియా ప్రదర్శన కేత్రమూ మరియు జీవన ఎరువులు ప్రదర్శన కేస్త్రం పరిశీలించడానికి గాను ఆత్మ పథక సంచాలకులు (పిడి) అప్పలస్వామి విశాఖపట్నం వారు, మునగపాకమండలం, వాడ్రపల్లి గ్రామంలో నానో యూరియా ప్రదర్శన క్షేత్రము పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడుతూనానో యూరియా స్ప్రే చేయడం ఉపయోగాలు గురించి రైతులకు తెలిపారు.ఒక ఎకరాకు 500 ఎం ఎల్ చొప్పున నానో యూరియా స్ప్రే చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా రైతులు ఈ నానో యూరియా స్ప్రే చేసుకోవడం వలన వరి పొలం పైరు పచ్చగా ఉంటుందని తెలిపారు. ఈ నానో యూరియా స్ప్రే చేయడం వలన వరి పొలం వేపుగా పెరుగుతుందని ఈ నానో యూరియా 500 ఎం ఎల?రీదు 225 రూపాయలని తెలిపారు. ఈ నానో యూరియా ని అన్ని రకాల పంటలకు వాడుకోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నానో యూరియా ప్రదర్శన కెత్రం వాడ్రాపల్లి గ్రామంలో మల్ల శేషు రైతుని ఎంపిక చేసి ఈ నానో యూరియా స్ప్రే చేయించడం జరిగిందని తెలిపారు. మల్ల శేషనే రైతు ఈ నానో యూరియా బాగా పనిచేస్తుందని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆత్మ కి తెలిపారు.నానో యూరియా పశుగ్రాసం మరియు గడ్డి కి స్ప్రే చేయడం వలన గడ్డి పచ్చగా వేపుగా పెరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా చూచుకొండ గ్రామంలో జీవన ఎరువులు ప్రదర్శన క్షేత్రం ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పలస్వామి గారు పరిశీలించడం జరిగింది, అప్పలస్వామి గారు మాట్లాడుతూ జీవన ఎరువులు ప్రదర్శన క్షేత్రం యొక్క ఉపయోగాలు గురించి రైతులకు వివరించారు. ఈ జీవన ఎరువులు అయినటువంటి, అజిటో బ్యాక్టీరియా, పాస్ఫ బ్యాక్టీరియా, అజో స్పైరిలం ఒంటి జీవన ఎరువులు వాడడం వలన భూమి సారం పెరుగుతుందని, ఈ ప్రదర్శన క్షేత్రం యొక్క ముఖ్య ఉద్దేశం అని చూచుకొండ రైతులకు తెలిపారు. ఈ జీవన ప్రదర్శన క్షేత్రం రైతు అయినటువంటి పెంటకోట శివ మాట్లాడుతూ ఈ జీవన ఎరువులు పశువులు గతంలో కలిపి వెయ్యడము వలన పంట వేపుగా పచ్చగా పెరిగిందని రైతు చాలా సంతోషంగా తెలిపారు.పతి రైతు కూడా జీవన ఎరువులు అయినటువంటి కె ఆర్ బి, పి ఎస్ బి వంటి జీవన ఎరువులుని వాడాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పలస్వామి గారు రైతులకు వివరించారు. ఒక ఎకరాకు 500 ఎం ఎల్చొప్పున పొడిగత్తంలో కలుపుకొని పొలంలో జల్లు కావాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జోష్ణ కుమారి, ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, రైతులు వాడ్రాపల్లి మల్ల శేషు, చూచుకొండ గ్రామం రైతు లు పెంటకోటి శివ, పెంటకోట హరే రామ్ రైతులు పాల్గొన్నారు.




## రైతు బజారు ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రిలే నిరాహారప్రదేశ్...

**అనకాపల్లి రూరల్,నవంబర్29 మనసులో మాట..** ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్ లో రైతు బజార్ ఏర్పాటు చేయాలని రిలే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ తదితరులు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఎంతో కష్టపడి పండించినటువంటి పంటలను అనకాపల్లి ప్రజలకు విక్రయించడానికి వచ్చినటువంటి రైతులకు ఒక రైతు బజార్ ఏర్పాటు చేయాలని కోరుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వ నాయకులు పట్టించుకుంటలేదు అన్నారు. ఒకప్పుడు అనకాపల్లికి మూడు నాలుగు కిలోమీటర్ల దూరం నుండి ఆకుకూరలో కూరగాయలు వస్తూ ఉండేవి గృహ నిర్మాణం పెరగడం వల్ల పరిశ్రమలు పెరగడం వల్ల ఇప్పుడు 15 16 కిలోమీటర్ల దూరం నుండి కూరగాయలు పండించిన రైతులు ఎన్నో బాధలు పడుతూ అనకాపల్లి ప్రజలకు ఆకు కూరలు కూరగాయలు అందిస్తున్నారు. ఎండకు ఏంటి వానికి తడిచి చలికి వణుకుతూ ఎన్నో బాధలు పడుతున్నారు అయినప్పటికీ రాజకీయ నాయకుల్లో చలనం లేకుండా పోయింది అని తెలిపారు. మన ఆకలి తీర్చడానికి వచ్చిన రైతన్న ప్రతిరోజు బాధపడుతూ తను ఇంటికి వెళుతున్నాడు మేము వారి కడుపు నింపడానికి అనకాపల్లి వస్తే మేము నివసించడానికి చిన్న నీడ కూడా ఇవ్వడం లేదని ఆవేదన పడుతున్నాడు ఎప్పటికే చాలామంది రైతులు వ్యవసాయాన్ని మానేశారు బహు కొంత మంది మాత్రమే వ్యవసాయం చేస్తున్నారు ఇతను కాపాడుకోకపోతే ఆహార భద్రత కోల్పోతాం రైతును గౌరవిద్దాం రైతును కాపాడుకుందాం రైతన్నకు అండగా ఉందాం జై రైతన్న జై జై రైతన్న అంటూ నినాదాలు చేశారు. మొదటిరోజు దీక్ష కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు చోడవరం నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ వేగి మహాలక్ష్మి నాయుడు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్త అట్ల పోయింది నారాయణరావు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్త ముత్యాల నారాయణరావు పెంటకోట రమణ బాబు జి వెంకటేశ్వరావు న్యాయవాది ఏ శంకర్ ఎం విజయశంకర్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

### నాటుసారా నిర్మూలనకు

## మీ వంతు సహకారం ఉండాలి

### మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ లకు,ఎంపీటీసీ లకు ఎస్ఐ వివరణ



కొయ్యూరు నవంబర్ 29 (మనసులో మాట): అల్లూరి జిల్లా కొయ్యూరు మండల కేంద్రం లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బడుగు రమేష్ అద్యక్షతన ఈరోజు సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ లు, ఎంపీటీసీలు గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని మాట్లాడారు. ఈ విషయానికి కొయ్యూరు ఎస్ఐ కిషోర్ వర్మ స్పందిస్తూ సర్పంచులు, ఎంపీటీసీలు నాటుసారా, బెల్ట్ షాపులు నిర్మూలనకు మేము పోలీసు శాఖ తరపున చర్యలు తీసుకుంటామని, దానికి మీ వంతు సహకారం కూడా మాకు ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, వైస్ ఎంపీపీ నూకాలమ్మ, మంప ఎస్ఐ శంకర్రావు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో

## ఉపాధ్యాయుల క్రీడా సందడి



**హుకుంపేట నవంబర్ 29 (మనసులో మాట)..** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఉపాధ్యాయులు ఉత్సాహంగా క్రికెట్ ఆటల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. ఉపాధ్యాయుల మానసిక ఆరోగ్యం, ఒత్తిడిని తగ్గించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ క్రీడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ వంటి క్రీడలను ఏర్పాటు చేశారు. సంవత్సరమంతా విద్యార్థులకు బోధన, పాఠ్యపుస్తకాలు, పరీక్షల నిర్వహణతో బిజీగా ఉండే ఉపాధ్యాయులకు ఒక్క రోజు అయినా ఆటవిడుపు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ క్రీడా కార్యక్రమాల్లో మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న పురుష, మహిళా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొందరు ఉత్సాహంగా బ్యాటింగ్, బౌలింగ్ చేస్తూ క్రికెట్ మైదానాన్ని సందడిగా మార్చగా, మరికొందరు త్రోబాల్ క్రీడలో ప్రతిభ చూపించారు. మైదానం మొత్తం హర్షాతిరేకాలతో మార్మోగింది. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, రోజూ విద్యా బాధ్యతలతో ఒత్తిడిలో ఉండే తమకు ఈ ఆటలు ఎంతో ఊరటనిచ్చాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తే శారీరకంగా, మానసికంగా మరింత ఉత్సాహంగా పనిచేయగలమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఉపాధ్యాయుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు స్థానిక విద్యాశాఖ అధికారులు, కళాశాల సిబ్బంది సహకారం అందించారు. చివరగా పాల్గొన్న ఉపాధ్యాయులను నిర్వాహకులు అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా పోటీలు కొనసాగుతాయని తెలిపారు. మొత్తానికి శనివారం నిర్వహించిన ఈ ఉపాధ్యాయుల క్రీడా కార్యక్రమం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించి, ఉపాధ్యాయులకు మానసిక విశ్రాంతిని అందించింది. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, చిన్నారావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో

# రైతులు అప్రమత్తంగా ఉండాలి

- మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్

**హుకుంపేట నవంబర్ 29 (మనసులో మాట)..** మండలంలో తుఫాన్ ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ శనివారం పత్రిక ప్రకటన ద్వారా సూచించారు. వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే కోసిన పంటను వెంటనే కుప్పలు వేసి భద్రపరచాలని సూచించారు. పొలాల్లో తెరిచి ఉంచితే వర్షాల కారణంగా ధాన్యం తడిసి నాణ్యత తగ్గడంతో పాటు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఇంకా కోతకు సిద్ధంగా ఉన్న పంటల విషయంలో పరిస్థితిని బట్టి కోతను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు.

కోత పూర్తయిన పంటలపై తప్పనిసరిగా టార్పాలిన్లు కప్పి ఉంచాలని, తద్వారా వర్షపు నీరు పంటపై పడకుండా రక్షణ కలుగుతుందని తెలిపారు. అవసరమైతే ఉప్పు ద్రావణం పిచికారీ చేసి తేమ నుంచి పంటను కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు వంటి పంటలు తుఫాన్ ప్రభావంతో సంభవించే నష్టానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉందని అన్నారు.

తుఫాన్ సమయంలో పంటలను రోడ్డుపక్కన, కాలువల వద్ద లేదా నీరు చేరే ప్రాంతాల్లో ఉంచకూడదని హెచ్చరించారు. వర్షాలు, గాలులకు పంట కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున రైతులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అవసరమైన రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.

మండలంలోని రైతులందరూ అధికారుల సూచనలను పాటించి ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పంటను కాపాడుకోవాలని వ్యవసాయాధికారి సుధాకర్ విజ్ఞప్తి చేశారు. తుఫాన్ తీవ్రతను బట్టి మరిన్ని సూచనలు ఇవ్వనున్నట్టు కూడా తెలిపారు.

## 2026 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు పెన్షన్ దారులు జీవన ప్రమాణ

# ధృవపత్రం సమర్పించాలి

## జిల్లా ఖజానా అధికారి వి. ఎల్. సుభాషిణి



**అనకాపల్లి, నవంబర్ 29 (మనసు లో మాట):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు తమ జీవన ప్రమాణ ధృవపత్రాలను 2026 జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 వరకు తప్పనిసరిగా సమర్పించవలసి ఉంటుందని జిల్లా ఖజానా అధికారి వి. ఎల్. సుభాషిణి తెలిపారు. నవంబర్-25 మరియు డిసెంబర్-25 నెలల్లో ఇప్పటికే సమర్పించిన ధృవపత్రాలు ఈ సంవత్సరానికి పరిగణించబడవని, అందువల్ల పెన్షన్‌దారులు కొత్త సంవత్సరానికి సంబంధించిన తాజా ధృవపత్రాలను నిర్దిష్ట గడువులోపే సమర్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

జీవన ప్రమాణ ధృవపత్రాన్ని జిల్లా ఖజానా కార్యాలయం, ఉప ఖజానా కార్యాలయాలు, మీసేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, బ్యాంకులు లేదా జీవన ప్రమాణ యాప్ ద్వారా కూడా సమర్పించ వచ్చని సుభాషిణి పేర్కొన్నారు. ధృవీకరణ ప్రక్రియలో ఆధార్ కార్డు, పెన్షన్ ఐడి లేదా పిపిఓ సంఖ్య, ఒటిపి కోసం మొబైల్ నెంబర్ మరియు బ్యాంక్ పాస్‌బుక్ దగ్గర ఉండాలని ఆమె తెలిపారు. పెన్షన్‌దారుల సౌకర్యం కోసం అన్ని కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## 45 జీవో క్రమబద్ధీకరణ పై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న

# విఆర్ఓల పై చర్యలుకు డిమాండ్

- టీడీపీ

**గాజువాక (మనసులోమాట) నవంబర్ 29..** కూటమి ప్రభుత్వము గాజువాక భూ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని దృఢ సంకల్పంతో ఆదేశాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో వీఆర్వోలు అనుసరిస్తున్న ద్వంద విధానాల వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని గాజువాక తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. దానిపై విచారించి గాజువాక మండల అధికారి తక్షణమే చర్యలు తీసుకోవాలని గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి గాజువాక మండల అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 301జీఓ పట్టాలపై అప్పటి యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన పనిచేసి ప్రజల మన్ననలు పొందుతే,,ఇప్పటి యంత్రాంగం తీవ్రంగా వైఫలించింది అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ఎన్నో ఆశలతో జీవోను తీసుకొని వస్తే దీనిని కార్యరూపం ధరచడంలో మండలాధికారం తీవ్రంగా వైఫల్యం చెందారన్నారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకోకపోతే తీవ్ర నిరసన చేపట్టవలసిన వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాజువాక బీసీ సెల్ అధ్యక్షులు తమిరె శివ ప్రసాద్. ప్రధాన కార్యదర్శి దొడ్డి సత్యరావు. జిల్లా టిడిపి కార్యదర్శి పెద్దాడ సోమనాయుడు 67 మరియు 87 టిడిపి ప్రధాన కార్యదర్శి బట్టప్రకాష్. కొమ్మనాపల్లి సింహాచలం. పల్లా వేణు. మురళి కన్నెపిల్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.




# పైప్ లైన్ లీకేజ్ తో వృధాగా పోతున్న త్రాగునీరు

**మునగపాక, నవంబర్ 29, మనసులో మాట..** మునగపాక మండలంలో అనేక గ్రామాలకు స్వచ్ఛమైన మంచి నీటిని అందించడానికి గతంలో ఏర్పాటు చేసిన పైప్లే లీకేజ్ వల్ల వేలాది లీటర్లు తాగునీరు వృధాగా రోడ్లపైకి పోతుంది. నాణ్యత లోపంతో ఏర్పాటు చేసిన ఈ పైప్ లైన్ అనేక చోట్ల లీకేజ్ ఏర్పడి వృధాగా పోతుంది. ఏలేరు కెనాల్ నుండి సంపత్ పురం వద్ద ఫిల్టర్ అయిన వాటర్ మునగపాక మండలంలోని అనే గ్రామాలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించడానికి ఏర్పాటు చేసిన మరమ్మతులకుగురై వృధాగా పోతుంది. అనకాపల్లి అచ్యుతాపురం మెయిన్ రోడ్ లో రోడ్లపైకి నీరు చేరడంతో ఆ రహదారిలో ప్రయాణం చేసే వాహందారులు, పాదచారులు నీటిలోనే వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. మునగపాక బైపాస్ కి వెళ్లే రహదారిలో మరమ్మతుకు గురైన పైప్ లైన్ ను సిబ్బంది పునరుద్ధించడానికి వెంటనే పనులు ప్రారంభించారు.



# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఎన్‌టీఏ లక్ష్యం

**అనకాపల్లి రూరల్ (మనసులో మాట) నవంబర్29 ..** రాష్ట్రం, జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నోబెల్ టీచర్ అసోసియేషన్ విశేష కృషి చేస్తోందని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్క శ్రీను బాబు, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు పేర్కొన్నారు. అనకాపల్లి పట్టణం, మండల పరిధిలోని పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శనివారం సంఘ ప్రతినిధులతో కలిసి వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం అవసరం మేరకు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా, అనుబంధంగా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రతీ నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి జీతాలు చెల్లించడానికి, పింఛన్లు అందజేయడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వం కాగితాలపై ప్రకటించిన కరువు భత్యాన్ని ఈ ప్రభుత్వం నగదు రూపంలో చెల్లించిందన్నారు. అలాగే ఇటీవల ప్రభుత్వం ఒక బకాయి కరువు భత్యాన్ని ప్రకటించి వెంటనే అందజేసిందన్నారు. ఉపాధ్యాయుల బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లించడానికి ప్రయత్నిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా ఉండేది కాదన్నారు. నేడు నేరుగా ముఖ్యమంత్రి వద్దకే వెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం అన్ని సంఘాల ప్రతినిధులు, వర్గాలకు వచ్చిందన్నారు. ఇటీవల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ శత శాతం పారదర్శకంగా జరిగిందన్నారు. డీఎస్సీ ని ప్రకటించి, పక్కా ప్రణాళికలతో రికార్డ్ స్థాయిలో నియామకాలు చేపట్టారన్నారు. దీంతో అన్ని పాఠశాలలో అవసరం మేరకు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. అలాగే గత కొన్ని ఏళ్ళు గా నిలిపి వేసిన పాఠశాలల నిర్వహణకు నిధులను విడుదల చేశారన్నారు. పి ఆర్ సి కమిటీ నియమించి, ముందస్తు కరువు భత్యాన్ని ప్రకటించే విధంగా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ విశేష కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల ఒత్తిడి తగ్గించి, బోధనకు ఎక్కువ సమయం కేటాయించే విధంగా ఆదేశాల కోసం కృషి చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులపై అధికారుల ఒత్తిడి లేకుండా చూస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉత్తరాంధ్ర జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవి రావు కూడా అన్ని విధాలుగా సహకరించి, పరిష్కరించడానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని, ఏకపక్షంగా వ్యవహరించే అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చేలా వ్యవహరిస్తున్న కొందరు అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నామన్నారు. బాధ్యతాయుతమైన హోదాల్లో ఉన్న అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలనుకుంటేనే ఈ జిల్లాలో కొనసాగాలన్నారు. లేని పక్షంలో మీ మాతృ శాఖలోని మీ ఒరిజినల్ పోస్ట్ లోనే విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థి కార్యదర్శి ఏవి నూకేష్, రాష్ట్ర ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, కృష్ణ మోహన్, ఉమామహేశ్వరి, లక్ష్మణ్ పాల్గొన్నారు




# సంతల్లో కుళ్లిన చేపలు, నిషేధిత క్యాట్‌ఫిష్‌ల అమ్మకాలు..

## కుళ్లిన చేపలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ.

## ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం - కరువైన అధికారుల తనిఖీలు

**హుకుంపేట నవంబర్ 29 (మనసులో మాట )** శనివారం నిర్వహించిన వారపు సంతలో కుళ్లిన చేపలు, నిషేధించబడిన క్యాట్ ఫిష్‌లను దర్జాగా విక్రయిస్తున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. తినరాని చేపల గురించి అవగాహన లేని మారుమూల గిరిజన ప్రజలను వ్యాపారులు లక్ష్యంగా చేసుకొని తక్కువ ధరలకు విక్రయిస్తూ వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

చేపల వ్యాపారులు తమ దుకాణాలపై ఎర్ర రంగు తార్పాలిన్ కప్పి, ఆ రంగు ప్రతిబింబం వల్ల చేపలు తాజాగా ఉన్నట్లుగా కనిపించేలా మోసానికి పాల్పడుతున్నారు. దీంతో అమాయక గిరిజన ప్రజలు అవి తాజాగా ఉన్నాయని నమ్మి కొనుగోలు చేసి అనారోగ్యానికి గురవుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. నిషేధం ఉన్న క్యాట్‌ఫిష్‌లను తినడం వల్ల ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ, అవగాహన లేకపోవడంతో చాలా మంది వాటిని కొనుగోలు చేస్తున్నారు. అధికారుల తనిఖీలు కరువవడంతో ఇలాంటి అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంతలో తూనికల్లో భారీగా వ్యత్యాసాలు, నాణ్యత లేని వస్తువులు, కాలం చెల్లిన సరుకులు విక్రయాలు జరుగుతున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. కూరగాయలు, పప్పులు, నూనెలు వంటి నిత్యావసర వస్తువుల్లో కూడా నకిలీ వస్తువులే ఎక్కువగా లభిస్తున్నాయని, దీనివల్ల వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కొన్నిచోట్ల పురుగుల మందులు కూడా బహిరంగంగా విక్రయించడంతో, సరైన అవగాహన లేక రైతులు వాటిని వినియోగించి పంట పొలాలు, ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్న ఘటనలూ చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

ఈ పరిస్థితి ఒక్క హుకుంపేట సంతలోనే కాకుండా పరిసర ప్రాంతాల సంతలన్నింటిలోనూ ఇదే తరహాలో కొనసాగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నకిలీ వస్తువులు, కుళ్లిన చేపలు, నిషేధిత మాంసాహార విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సంతలో కుళ్లిన చేపలు విక్రయిస్తున్నారన్న సమాచారంతో కొనుగోలుదారులు నేరుగా పంచాయతీ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీనిపై పంచాయతీ సెక్రటరీ సత్యనారాయణ, మహిళా పోలీస్ జ్యోతి, సచివాలయ సిబ్బంది వెంటనే స్పందించి చేపల దుకాణాల వద్ద తనిఖీలు నిర్వహించారు. కుళ్లిన చేపలను గుర్తించి వాటిని తొలగించారు. మరలా ఇలాంటి చర్యలకు పాల్పడితే వ్యాపారులపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.





## అభాగ్యులకు అన్నగా, అండగా అందరివాడిగా

# సేవలందిస్తున్న మొల్లేటి భోగేష్

## మానవత్వం పరిమళించి మంచి మనిషిగా బోగేష్ సేవలు

మునగపాక, నవంబర్ 29, మనసులో మాట

మునగపాక మండలం పాటి పల్లి గ్రామానికి చెందిన మొల్లేటి వెంకట బోగేష్ అభాగ్యులకు అండగా నిలుస్తూ, వారికి కష్టం వస్తే కంటికి రెప్పలా కాపాడుతూ గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్నులు పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మతిస్థిమితం లేకుండా ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులకు అండగా నిలుస్తూ వారికి అనునిత్యం ఆకలి తీరుస్తూ తన సేవా భావాన్ని చాటుకుంటున్నారు. గత కొన్ని నెలల నుండి రుషికొండ గీతం కాలేజీ వెళ్లే రోడ్డు చెన్నపట్నం సెంటర్లో మానసిక పరిస్థితి బాగాలేక తిరుగుతున్న ఒక వ్యక్తినిమాతృశ్రీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంకట భోగేశ్వర రావు రెడ్ క్రాస్ సిబ్బందికి సమాచారం అందించినారు. రెడ్ క్రాస్ సిబ్బంది అక్కడికి చేరుకొని ఆరిలోవసీఐ మల్లేశ్వర్సహకారంతో ఋషికొండ బీచ్ మొబైల్ పీసీ శ్రీనివాస్ సహాయంతో అతని అక్కడ నుండిరెడ్ క్రాస్ హోం కి తరలించారు.అతనికి స్నానం చేయించి మెరుగైన బట్టలు వేసి అక్కడినుండి మానసిక హాస్పిటల్ తరలించారు ఆరిలో పోలీసు వారికి మరియు మాతృ శ్రీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మోల్లేటి వెంకట బోగేస్కు మరియు రెడ్ క్రాస్ వారికి అక్కడ ఉన్నవారు ధన్యవాదాలు తెలిపినారు.

# ఈ రహదారుల్లో ప్రయాణం జరభద్రం బ్రదర్

**మునగపాక, నవంబర్ 29, మనసులో మాట..** మండలంలోని పలు గ్రామాలు రహదారులు పూర్తిగా మలుపులతో నిర్మాణం చేపట్టడం వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొండకర్ల జంక్షన్ నుండి ఉప్పవరం, మల్లవరం, జగన్నాథపురం, చూచుకొండ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి 28 మలుపులతో నిర్మాణం జరిగింది. ఈ రహదారుల ద్వారా ప్రయాణం చేసేటప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించకపోతే ప్రమాదపు తంచునపడినట్లే, అలాగే మునగపాక నుండి మూలపేట అనకాపల్లికి వెళ్లే రహదారి మలుపులతో నిండి ఉంటుంది. ఈ రహదారిలో ప్రయాణం చేసిన ప్రయాణికులు, వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే ప్రయత్నంలో పలు ప్రమాదాలు జరిగాయి. అలాగే తిమ్మరాజుపేట నుండి పెదపాడు, కాశీ పాలెం, పురుషోత్తపురం, పల్లపు ఆనందపురం, కుమారపురం, సూచుకొండ గ్రామాలకు వెళ్లే రహదారి అనేక మలుపులతో నిర్మాణం జరిగింది. రోడ్డుకు ఇరువైపులా చెట్లు వేపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించడంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ మార్గాల్లో ప్రయాణం చేసే వాహనదారులు ఆదమరచివెళ్లకుండా ప్రయాణంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



# బెర్రి బోరర్ పురుగు నివారణ గిరిజనులకు అవగాహన



**దుంబ్రిగుడ, నవంబర్ 29, (మనసులో మాట):** కాఫీ పంటను నాశనం చేసేందుకు విస్తరించిన బెరీ బోరర్ వ్యాధి పురుగును వివరించేందుకు గాను స్థానిక మండల కాఫీ శాఖ ఆధ్వర్యంలో గసబ పంచాయతి సిపిఎం సర్పంచ్ అధ్యక్షతన గరిడేల గ్రామంలో గిరిజనులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాఫీ శాఖ ఉద్యానవనాధికారి ఎస్ మత్స్య రాజు మాట్లాడుతూ కాఫీ బెర్రీ బోరర్ వ్యాధిని నివారించడానికి సేకరించిన కాఫీ పళ్ళను పల్పింగ్ చేసి, వేడి నీటిలో 2 నిమిషాలు ముంచాలన్నారు. అనంతరం బయటకు తీసి కాఫీ బెబీ పల్పర్ లో పల్పింగ్ చేసి సిమెంట్ కల్లల్లో ఆరబెట్టి తేమ శాతం 10.5 ఉండేటట్లు చూసుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం నుండి లైసెన్స్ పొందిన కోనుగోలుదారులకు మాత్రమే అమ్ముకోవాలని చెప్పారు. కాఫీ రైతులు ఏ రోజు విక్రయించిన కాఫీ వివరాలు ,కిలో గ్రాముల వివరాలు విడిగా మీ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కాఫీ లైజయన్ వర్కర్లకు తెలపాలన్నారు. కాఫీ రైతులంతా సమిష్టిగా కృషిచేసి బెర్రి బోరర్ పురుగును నివారించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గసబ , గుంటసీమ కించుమండ, కంద్రుమ్ , పోతంగి,కాఫీ లైజాన్ వర్కర్లు శివ, ధనుర్జయ్ , బోడన్న,స్వామి నాయుడు,గోపీనాథ్,స్థానిక వార్డు మెంబర్లు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు ఇంజన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**అచ్యుతాపురం నవంబర్ 29 మనసులో మాట..** కూటమి ప్రభుత్వం మత్సకారులను అన్ని విధాల ఆదుకుంటుందని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండలంలో అతిపెద్ద మత్స్యకార గ్రామం అయినటువంటి పూడి మడకలో మత్స్యకారులకు పి.ఎం.ఎం. ఎస్. వై పథకం క్రింద ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శనివారం ఇంజన్లను పంపిణీ చేశారు. పూడిమడకలో త్వరలో జట్టి నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులను పూర్తిగా ఆదుకుంటుందని వేటపరికరాలు ప్రభుత్వం రాయితీ పై అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ పరికరాలను అందజేస్తున్నటువంటి ప్రధాని మోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకీ, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి సుందరపు విజయ్ కుమార్ మరియు మత్స్యకారులందరూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన బిజెపి కూటమి నాయకులందరూ పాల్గొన్నారు.



మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మికంగా పాఠశాలలు

# తనిఖీ..

**పెదబయలు (మనసులో మాట) నవంబర్ 29:** పెదబయలు మండలంలో జిల్లా విద్యాశాఖ అధికారిఆకస్మికంగా పలు పాఠశాలలను సందర్శించడం జరిగింది. ముందుగా గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల సీత గుంట పాఠశాలను సందర్శించి ( తరల్) ప్రోగ్రామ్ యొక్క విద్యార్థుల స్థాయి. వివరాలు పరిశీలించారు.తర్వాత మండల ప్రజాపరిషత్ పాఠశాల సీత గుంటను సందర్శించి. విద్యార్థుల యొక్క గ్రూపులను పరిశీలించి విద్యార్థుల యొక్క సామర్థ్యాలను విద్యార్థులచే రాబట్టారు. విద్యార్థులకు కనీస సామర్థ్యాలను వచ్చునట్లు ఉపాధ్యాయులు బోధించాలన్నారు.

%ఖీూచీ%. ( ఎఫ్ ఎల్ ఎన్ సర్వే. మండలంలో. ప్రతి పాఠశాలలను పక్కాగా నిర్వహించాలన్నారు . డైట్ విద్యార్థులచే. నిర్వహిస్తున్న సర్వేను. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముసిడి పుట్టు నందు నిశితంగాపరిశీలించారు.అనంతరం %హ్ ాలఅ%'%ం% ( సెయింట్ ఆన్ పాఠశాలను సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల యొక్క. సిలబస్. నోట్ పుస్తకాలను పరిశీలించారు జిల్లా విద్యాశాఖ అధికారి వారు మాట్లాడుతూ జిల్లాలో%ఖీూచీ%( ఎఫ్ ఎల్ ఎన్ సర్వే ప్రతి పాఠశాలలో నిర్వహించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. డిసెంబరు 6 నుండి 100 రోజుల యాక్షన్ ప్లాన్ విధిగా ప్రతి ఉన్నత పాఠశాలలో అమలు చేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు అందరూ ఖచ్చితంగా అందరూ ఉత్తీర్ణులు అవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు.

జిల్లా విద్యాశాఖ అధికారి వారితో. మండల విద్యాశాఖ అధికారులు. కే. కృష్ణమూర్తి మరియు పుష్ప జోసెఫ్. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావు ఏటి డబ్ల్యు ఓ. జగత్ రాయ్. ఎంఐఎస్ కోఆర్డినేటర్ బాలరాజు ఎంఐఎస్ కోఆర్డినేటర్ బాలరాజు. ఉమా మహేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## పాయకరావుపేటలో కాంగ్రెస్ పార్టీ

# సంస్థాగత నిర్మాణం

### - ఏఐసిసి అబ్జర్వర్ సుశాంత్ మిశ్రా

**పాయకరావుపేట,నవంబర్ 29 మనసులో మాట.** అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం శనివారం జరిగింది.

పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయ కర్త మారుతి నారాయణ చక్రవర్తి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏఐసిసి అబ్జర్వర్ సుశాంత్ మిశ్రా ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ మేరకు అధ్యక్షుల నియామకం పట్ల పార్టీ నాయకులు,కార్యకర్తల నుంచి వ్యక్తిగత అభిప్రాయాలను సేకరించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సుశాంత్ మిశ్రా మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర,న్యాయ్ యాత్ర సమయంలో పలువురు మేధావులు, ఎన్జీవోలు,ప్రజా ప్రతినిధులు ఇచ్చిన సూచనల ఆధారంగా దేశవ్యాప్తంగా సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.దేశంలోని ప్రతి జిల్లాకూ ఏఐసీసీ,పీసీసీ అబ్జర్వర్లను పంపించి జిల్లా అధ్యక్షులు ఎంపికను ప్రజాస్వామ్య రీతిలో



నిర్వహిస్తున్నారని వెల్లడించారు. మిశ్రా మాట్లాడుతూ, "ప్రతి జిల్లాలో పార్టీ అధ్యక్షుల ఎంపిక నిష్పాక్షికంగా జరుగుతుందని మీరు ఎవరినైనా జిల్లా అధ్యక్ష పదవికి సూచించాలనుకున్నా, ఎవరైనా పోటీ చేయాలనుకున్నా నిర్భయంగా మీ అభిప్రాయాలను చెప్పండని తెలిపారు.అసెంబ్లీ కోఆర్డినేటర్ల నియామకంలో, మండల స్థాయి నాయకుల ఎంపికలో ఇదే విధానాన్ని కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడా సురేష్, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బోడా వెంకట్, పార్టీ సీనియర్ నాయకులు ఎంకేఎం శేఖర్ (బుజ్జి) కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు కర్రి హేమంత్, నక్కపల్లి మండల అధ్యక్షులు ప్రగడ చక్రధర్, మండల అధ్యక్షులు మోర్త సింహాచలం, ఎన్ఎస్ వి సత్యనారాయణ,నడింపల్లి నూకరాజు, చిట్టిమూరి సుబ్బారావు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# బినామీ పేర్లతో భూదోపిడికి సిద్ధం

### - మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



**నర్సీపట్నం ,నవంబర్ 29 (మనసులో మాట)..** వంద కోట్లు రూపాయలు విలువ చేసే 400 ఎకరాల ప్రభుత్వ భూమిని భూదోపిడి చేసేందుకు టీడీపీ సర్పంచ్లు తెర లేపారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. నర్సీపట్నం వైసీపీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ పరిధిలోని పరిశ్రమలు వస్తుండడంతో ఇదే అదుసుగా కూటమి నాయకులు బినామీ పేర్లతో భూదోపిడికి పాల్పడుతుంటే ఈ భూదోపిడీకి రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలు అందించి అవినీతి చర్యకు పాల్పడుతున్నారని తెలిపారు. తూతూ మంత్రంగా గ్రామసభ నిర్వహించి, పరిశ్రమల పేరుతో అధికార యంత్రాంగం అండదండలతో భారీ భూదోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. పరిశ్రమల కోసం భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరహారం పూర్తిగా చెల్లించడం లేదని మార్కెట్ ధర కంటే సగం ధర చెల్లించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు పూర్తిగా నష్టపరిహారం జగన్ ప్రభుత్వం చెల్లించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం ఎంపిపి రుత్తల సర్వేశ్వరరావు, మాకవరపాలెం పార్టీ అధ్యక్షులు చిటికెల వెంకటరమణ, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, మాజీ పార్టీ అధ్యక్షులు రుత్తల వాసు, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు బొడ్డు గోవిందు తదితరు నాయకులు పాల్గొన్నారు.



# దిబ్బ పాలెంలో అన్నదాత సుఖీభవ

**చీడికాడ నవంబర్ 29, (మనసులో మాట)..** కూటమి ప్రభుత్వం పేదలకు సూపర్ సిక్స్ పథకాలు ఇంటింటికి ప్రచార నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీటీసీ దారపు పెద్ది నాయుడు అన్నారు మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో ఎంపీటీసీ పెద్ది నాయుడు టిడిపి నాయకులు గౌరీపట్నం నానాజీ సచివాలయం సిబ్బందితో కలిసి ప్రభుత్వ పథకాలు పై ఇంటింటికి ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను ఇంటింటికి తెలియజేయడమే ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు సచివాలయం వ్యవసాయ సహయకులు రైతులు పాల్గొన్నారు.

# వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణ



**గాజువాక (మనసులోమాట) నవంబర్ 29..** గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్న ప్రసాద వితరణ ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో ఆలయ సేవకులు వారి ఆర్థిక సహాయంతో అన్న ప్రసాద వితరణ జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి వాంబే కాలనీ వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఏడు వారాలు నిష్టతోతో పూజ చేసి ఏడు ప్రదర్శనలు స్వామి వారి ఆలయం చుట్టూ తిరిగి ప్రదర్శలు చేసి స్వామివారిని కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తులకు ప్రగాఢ నమ్మకం. ఆలయ ప్రధాను అర్చకులు రాకేష్ శర్మ ఆచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకములు నిర్వహించారు.ఈకార్యక్రమంలో కొల్లు సూర్య ప్రకాష్ , పెంటకోట నాగేశ్వరరావు,పెంటకోట రాజు,ఉషారాణి, లక్ష్మ మ్మ,హిమాజా,పద్మ,కాంతమ్మ ,హిమాజా, చిట్టెమ్మ ,చిన్నమ్మ,ఉషారాణి ,సత్యవతి, రమణమ్మ, మంగమ్మా మరియు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ పోషకులు ఆలయానికి ఆర్థికంగా సహాయం చేసిన భక్తులందరూ పాల్గొన్నారు.

# జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు స్వాగతం పలికిన సూర్యచంద్ర



**నర్సీపట్నం, నవంబర్ 29 (మనసులో మాట)..** జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఐఎస్ఎస్ సమద్రికలో తూర్పు నౌకాదళం ఏర్పాటు చేసే కార్యక్రమానికి హాజరయ్యేందుకు శనివారం మధ్యాహ్నం విశాఖ ఎయిర్ పోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పవన్ కళ్యాణ్కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాడ హరినాధ్ పాల్గొన్నారు.

# పిఏసిఎస్ ల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలి

### రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ

**అనకాపల్లి, నవంబర్ 29 (మనసు లో మాట):** అనకాపల్లి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం శ్రీ గౌరీ పిఏసిఎస్, సిహెచ్ ఎన్ అగ్రహారం పిఏసిఎస్ పాలకవర్గ సభ్యులు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డవలెప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ టిడిపి ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ను మర్యాద పూర్వకంగా కలిసారు. అలాగే త్వరలో జరగబోయే పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు. అంతకుముందు తమను నియమించినందుకు వారికీ ధన్యవాదాలు



తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ పిఏసిఎస్ పాలకవర్గ సభ్యులు రైతులకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేయాలనీ సూచించారు. ఈ సంధర్భంగా పీలా గోవింద సత్యనారాయణ కు శ్రీ గౌరీ పిఏసిఎస్ చైర్మన్ కర్రి మహాలక్ష్మి నాయుడు, సిహెచ్ ఎన్ అగ్రహారం పిఏసిఎస్ చైర్మన్ బంటు రవి, డైరెక్టర్లు కాండ్రేగుల చిన్న, యల్లపు శ్రీనివాసరావు, గణిరెడ్డి రాజు, జెర్రిపోతుల రమణ లు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చదరం నాగేశ్వరరావు, జనసేన శ్రేణులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడ చూసినా కేంద్రం నిధులతోనే అభివృద్ధికి శ్రీకారం

### ఇచ్చేది ఎవరు. ఖర్చు చేసేది ఎవరు. తన అంటే తందాన అనే సూక్తులు వద్దు.అందరూ సమన్వయం కావాలి

**గూడెం/సీలేరు నవంబర్ 29:( మనసు లో మాట).** అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతంలో జరుగుతున్న ఏ అభివృద్ధి ఎక్కడ చూసినా ప్రదానమంత్రి ఆవాస్ యోజన.పీఎం ఇల్లు.గ్రామసడక్ యోజన. రహదారులు
పీఎం జలజీవన్. ద్వారా వాటర్ సదుపాయం.
ఉజ్వల పథకం ద్వారా ఎల్ పి జి గ్యాస్ కనెక్షన్లు. ఉచిత బియ్యం వంటి ఎన్నో పథకాలు కేంద్రం ప్రవేశపెట్టి రాష్ట్ర సమన్వయంతో అందిస్తుంటే మా మిత్ర బంధం ఎవ్వరు గొప్ప వారు చెప్పుకోవడం లో తగ్గేదే అంటున్నారు . ఇచ్చేది ఎవరు. ఖర్చు చేసేది ఎవరు లబ్ధిపొందేది ఎవరు. గతంలో ఎన్ టి రామారావు గారు రెండు రూపాయలకు. బియ్యం ఇస్తే దేవుడు అన్నారు.
రాజశేఖరరెడ్డి అయిదు రూపాయలకు బియ్యం ఇస్తే ఆయన్ని దేవుడు అన్నారు. మరి ఇప్పుడు రెండురూపయలు . లేదు.5 రూపాయలు లేదు .
5 సంవత్సరాల నుండి ఫ్రీ గా బియ్యం ఇస్తున్నందుకు. నరేంద్ర మోదీ గారిని కూడా అందరూ కూడా కృతజ్ఞత భావంతో హర్షించాలి కదా ఎందుకు ఇ రోజు సమదృష్టి ఐక్యత కలగడం లేదు. అని బీజేపీ నాయకులు వాపోయారు. అత్యధిక ఆర్థిక



వనరులు కలిగిన రాష్ట్రం అయిన సరే గ్రామ స్థాయినుండి సర్పంచ్ నుండి రాష్ట్ర%శీ% వరకు కేంద్రం సహకారం తప్పనిసరి భారతీయ జనతా పార్టీ గ్రామస్థాయిలో బలంగా లేదని చాలా మంది గుసగుసలు ఆడవచ్చు కాని గ్రామస్థాయినుండి ప్రపంచ దేశాల వరకు నరేంద్ర మోదీ గారు. ద్రౌపది ముర్ముము ఎవరు అనేది అందరికీ తెలుసు. ఎక్కడ వెళ్ళిన ఇ రోడ్డు ఎవరిచ్చారు అంటే నరేంద్ర మోదీ అని చెబుతున్నారు స్పష్టము అయిన నేమ్ బోర్డుకనిపిస్తున్నాయి . ఇల్లు ఏ పథకం నుండి వచ్చింది అని అడిగితే పీఎం ఆవాస యోజన. పి ఎం జె ఏ వై ద్రౌపది ముర్ముము రాష్ట్రపతి కోట మీద వచ్చింది అని చెబుతున్నారు. ఇప్పటికి సర్పంచులకు 14.15. ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల అభివృద్ధికి నిధులు వస్తున్న విషయం అందరికి తెలిసిందే. కూటమి పొత్తులో రాబోవు పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు పోటీచేసిన చోట గెలుపుకు ప్రజలు ఆశీర్వదిస్తే పంచాయతీ అభివృద్ధి సాధించగలుగుతారు అదృష్టం ప్రజల మద్దతు కలిసి ఒకవేల ఏకగ్రీవం చేస్తే. మన ప్రక్క రాష్ట్రం లో కేంద్రమంత్రి వర్యులు బండి సంజయ్ గారు ప్రకటన ఇచ్చిన విధంగా మనకు కూడా ఏకగ్రీవం అయిన పంచాయతీకి ఆర్థిక సంఘం నిధులతో పాటు పదిలక్షల నజరానా వచ్చే అవకాశం ఉంటుంది. ఇ విషయం పై పార్టీ నిర్ణయం తదుపరి స్పష్టమైన ఎన్నికల హామీ ఉంటుందని బీజేపీ సీనియర్ నాయకులు బొండ్ల చిరంజీవి తెలియజేశారు. ఏదైతే 2021.2022 లో పోటీచేసామో అందులోంచి బీజేపీ కార్యకర్త వున్న స్థానాలు . పొత్తులో బాగంగా ఖచ్చితంగా పోటీచేస్తాం . అప్పుడు ఎలావున్నామో ఇప్పుడు అలాగే ఉన్నాం . వైసీపీతో తలపడి పోటీ చేశాం నిలబడ్డాం. బెదిరింపులు. దాడులు ఎదుర్కొన్నా%శీ% . అప్పుడు ఇప్పుడు ఒకేలా ఉన్నాం. ఓటమికి కుంగిపోలేదు. గెలుపుకు పొంగిపోలేదు కర్తవ్యానికి పొత్తు విలువలకు లైన్ క్రాస్ చెయ్యకుండా కట్టుబడి ఉన్నాం. అధికారం ఉంటే ఒకలాగా. అధికారం లేకపోతే ఒకలాగా మేము ఉండబోము మా పార్టీ లోబడి కట్టుబడి పనిచేసే నాయకత్వం మాలో ఉంటుందని బీజేపీ నాయకులు చెప్పుకొచ్చారు.

# ఉపాధి హామీ పనులు ప్రారంభం...




**కె కోటపాడు, నవంబర్ 29, ( మనసులో మాట):** ఉపాధి హామీ పనులు ప్రారంభం కావడంతో ఉపాధి కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో శివారు లంకవానిపాలెం గ్రామంలో కోటి 97 లక్షల 939 రూపాయల అంచనా వ్యయంతో సరిహద్దుల్లో కందకాలు మట్టి తీత కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయని ఈసీ జె. కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ డి గోవిందు ఉపాధి పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తున్నారు.



# ఈయన ఈఓ.. ఓ కామపిశాచి

- దేవదాయ శాఖ అధికారి వ్యవహార శైలిపై సర్వత్రా నిరసన
- అందరి నోటా ఇతగాడి వికృత చేష్టలపైనే చర్చ..
- సోషల్ మీడియా వేదికగా వీడియోలు వైరల్..
- పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు
- మండిపడుతున్న హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు

రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29: "ఏమి సార్..పవిత్రమైన శాఖలో ఉంటూ ఈ వెకిలి చేష్టలు చేయడానికి ఓ సిగ్గూ, ఎగ్గూ లేదా?" అని అడుగుతున్నారు..వయసు మీద పడింది..ఆ వయసు, పదవికి తగ్గ హుందాతనంతో వ్యవహరించకుంటే ఎవరైనా "ఛీ ఛీ" అనే అంటారు. ఎవరో ఏమిటో చెప్పకుండా ఇవేమి మాటలనేగా మీ అనుమానం. అక్కడకే వస్తున్నా. కాకపోతే అతగాడి పదవి, వయసును బట్టి ఎవరో ఏంటో చెప్పడానికి మనసు రావటం లేదు కానీ..అతగాడి వికృత చేష్టలు చూసి ప్రతీ ఒక్కరూ దూషిస్తున్నారు. ఆగ్రహంతో మండిపడుతున్నారు. హిందూ ధార్మిక సంఘ సంస్థల ప్రతినిధులైతే రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రికి, ముఖ్యమంత్రికి, డిప్యూటీ సీఎంకు ఫిర్యాదులు చేయడానికి సిద్ధమవుతున్నారు. పవిత్రమైన దేవదాయ శాఖలో కీలక పదవిలో ఉండి రాసలీలలు ఏంటని ప్రశ్నిస్తున్నారు. గత కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాలలో ఇతగాడి వ్యవహార తీరుపై రకరకాల పోస్టులు, వీడియోలు, ఫోటోలు చూసిన తరువాత..ఇదేమి కామ పిశాచి..ఇంత దరిద్రంగా ప్రవర్తించే వ్యక్తికి దేవదాయ శాఖలో పనిచేసే అర్హత ఉందా, ఇలాంటి వారిని దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఎలా చూసీ చూడనట్టు వదిలేస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తులసి వనంలో గంజాయి మొక్క మాదిరిగా.. ఇలాంటి అధికారి ఒక్కరుంటే చాలు మొత్తం వ్యవస్థ భ్రష్టుపట్టడానికని ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇతగాడిని ఇలా విచ్చలవిడిగా వదిలేసిన దేవదాయ శాఖ అధికారులనూ నిందిస్తున్నారు. ఆ శాఖలో కొందరు అధికారుల కాసుల కక్కుర్తి కారణంగానే ఇటువంటి కామపిశాచి అధికారుల ఆటలు సాగుతున్నాయనే అపనిందలను దేవదాయ శాఖ మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఇతగాడు ఎక్కడ పనిచేస్తే అక్కడ కూతురు..కాదు కాదు మనుమరాలి వయస్సున్న అమ్మాయిలతో రాసలీలలట. ఇదేం బుద్ధిరా బాబూ. చేసే ఉద్యోగాన్ని బట్టైనా కాస్త మనసును నిగ్రహించుకోకుండా ఎవరి వెంట పడితే వారి వెంట అచ్చోసిన ఆబోతులా వెళ్ళిపోవడమేనా అంటున్నారు ప్రజలు. ఇతగాడు సాదాసీదా మనిషేమీ కాదు..దేవదాయ శాఖలో కీలకమైన అధికారిగా వ్యవహరిస్తూ..సోషల్ మీడియా వేదికగా దరిద్రపు పనులు అని నెటిజన్ల చేత తిట్లు తినడం చూస్తుంటే.. దేవదాయ శాఖ ఇంతలా భ్రష్టుపట్టిందేమిట్రా బాబూ అనుకోకుండా ఉండలేరు. ఈ కామ పిశాచి చూసేందుకు పెద్ద శాంతి దూత మాదిరిగా తెల్లని వస్త్రాలు ధరించి..భక్తుల్లో అగ్రగణ్యుడిలా ఫోజులిచ్చినా ఆడాళ్ళు కనిపించే సరికి లోపలున్న అసలు గుణం..అదే 'కామ రూపం' బయట పడిపోతోందట. మరి ఇదేమి దుర్గుణమో తెలియదు. దేనికైనా ఒక హద్దు ఉంటుంది. హద్దు దాటితే శిక్ష తప్పదు. పిల్లి పాలు తాగుతూ కళ్ళు మూసుకుని తనెనెవరూ చూడటం లేదనుకుంటుందట. అదే మాదిరి ఆ ఆలయ ఈఓ..ఒకవైపు తప్పులు చేసేస్తూ నా అంతటి తెలివైన వాళ్ళు లేరని తెగ మురిసిపోతున్నాడట. కానీ ఇతగాడి వికృత చేష్టలు తెలియని వారెవరూ లేరు. అందరికీ తెలుసు. కాకపోతే సమయం కోసం నిరీక్షణ. చేస్తున్న ఉద్యోగానికి విలువ ఇవ్వాలి..సంబంధిత శాఖ పరువు తీయకూడదని పూర్తి వివరాలు తెలియజేయటం లేదు. అంతేగాని ఎవరికీ భయపడి మాత్రం కాదు. వయసు 61 సంవత్సరాలు వచ్చినా..ఇతగాడు ఎక్కడ పనిచేస్తే అక్కడ బాలికలను, మనుమరాలి వయస్సు ఉన్న వారిని లోబర్చుకుని నీచమైన పనులు చేస్తుంటాడని ఒకరూ ఇద్దరూ కాదు..చాలామందే చెప్పారు. అందుకు సాక్ష్యంగా ఫొటోలు, వీడియోలు కూడా చూపిస్తున్నారు. డబ్బుతో ఎరవేసి వారి కాపురాలు కూల్చడం చాలా చాలా తప్పు. పదవుల కోసం, పదోన్నతుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మరీ అందలం ఎక్కుతున్నాడంటే..అసలు ఇంత డబ్బు ఎక్కడిది? అనే అనుమానం సంబంధిత శాఖ అధికారులకు రావాలి. కానీ వారూ లంచాలు తీసుకుంటున్నారు కాబట్టి తేలుకుట్టిన దొంగల్లా మాట్లాడలేకపోతున్నారని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఇంకా దారుణం ఏంటంటే.. దేవాలయం హుండీలో డబ్బులు కాజేయడంలో నేర్పరట. వార్నీ..గుడినీ గుడి ఆస్తులను కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారిదే. అటువంటిది ఇతగాడే దేవాలయం హుండీల సొమ్ము కైంకర్యం చేసేస్తుంటే ఇంకెవరు పట్టించుకుంటారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ అధికారి పనిచేసిన ప్రతి చోటా మహిళా ఉద్యోగులకు వాట్స్ యాప్ కాల్ చెయ్యమని సూచనలు..అందుకు ఒక జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు తాత్కాలిక సిబ్బంది సహాహకులుగా నియామకం చేసుకుంటాడు. ఇంకొందరు మహిళా ఉద్యోగులు కూడా ఇతగాడి వలలో పడ్డారని తెలిసింది. ఈ పైశాచిక పిశాచి దేవాలయ అధికారి అని చెప్పుకోవడానికి కూడా సిగ్గుగా ఉందని, పవిత్ర స్థలంలో అధికారిగా పనిచేస్తూ ఇలాంటి పనులు చేయటం తప్పు అని మరిచిపోయి "నవ్వితే నవ్వుదురు గాక..నాకేంటి" అన్నట్టు వ్యవహరించటం ఈ కామ పిశాచి తెగింపు ధోరణి పట్ల నలుగురూ ముక్కున వేలేసుకుంటున్నారు.

**ఆ వివాహితతో ఫంక్షన్ కు వచ్చాడట..**

ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలు, ఫోటోలు చూస్తే ఆ అధికారి కామ పైత్యం ఏ స్థాయిలో ఉందో చెప్పకనే తెలుస్తుంది. వీటిని చూసి.."అబ్బే..నేనొక ఫంక్షన్ కు వెళ్ళాను. అక్కడకు మా శాఖలో పనిచేసే ఉద్యోగిని కూడా వచ్చింది..అంతే" అంటున్నాడట. ఆ వీడియోలు చూస్తే ఫంక్షన్ హడావిడి, హంగూ ఆర్భాటం ఏమీ కనబడటం లేదు. పైపెచ్చు..ఒక లాడ్జికి ఆమెను తీసుకొచ్చినట్టు కనిపిస్తోంది. మళ్ళా అదే కారులో ఆ ఉద్యోగినితో సదరు అధికారి కూడా వెళ్ళిపోయారు. ఈ ఉద్యోగిని పనిచేసే చోట 'చక్రం' తిప్పేది ఈమేనట. ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగినికి ఇంత పెద్ద పెత్తనం ఎవరి వల్ల వచ్చింది?, ఎలా వచ్చింది?, ఉద్యోగులపై అజమాయిషీ చేయడానికి ఈమె ఎవరు?..ఈ ప్రశ్నలకు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ చేసి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. గుడి, గుడిలో హుండీ, భక్తుల ముడుపులు.. ఇవన్నీ ఆ భగవంతుడికే చెందాలంటే ముందు ఈ కామ పిశాచి అధికారిని అక్కడ నుండి బదిలీ చేయాలి. లేదంటే ఆలయ పరువు, శాఖ పరువు గోదావరిలో కలిసిపోతుంది. ఇప్పటికైనా దేవదాయ శాఖ అధికారులు కళ్ళు తెరిచి జరుగుతున్న దారుణాలను అరికట్టాలని కోరుతున్నారు. లేదంటే స్వయంగా దేవదాయ శాఖ మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎంలకు ఫిర్యాదు చేసేందుకు ధార్మిక సంఘాల ప్రతినిధులు సిద్ధమవుతున్నారు.



## భారతదేశ మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే
# మహిళా శక్తి దేశ అభివృద్ధిలో కావాలి
### - ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

అనపర్తి (మనసులో మాట) నవంబర్ 29:అనపర్తి మండలం రామవరం లోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన, ఆత్మ నిర్భర భారత్ మహిళా సమ్మేళనం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తో కలిసి ఎంపీ పురందేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న నాయకులు కార్యకర్తలతో ఆత్మ నిర్భర ప్రతిజ్ఞ చేయించారు. ఆత్మ నిర్భయ భారత్ అనే పేరుతో అద్భుతమైన కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారన్నారు. సెప్టెంబర్ 17న ప్రారంభమైన కార్యక్రమం డిసెంబర్ 25 అటల్ బీహార్ వాజ్పేయి జన్మదిన రోజు వరకు కొనసాగుతాయన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న మహిళా మణులు కలుపుకొని ముందుకు వెళ్లినట్లయితే భారతదేశం మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలని, చిరకాల కలను సహకారం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. మహిళలతో ప్రత్యేకించి కార్యక్రమాన్ని నిర్వహించి వారికి ఆత్మ నిర్భర భారత్, వికసిత్ గురించి అవగాహన కల్పించే దిశగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. స్వదేశీ వస్తువుల్ని వాడాలని, చేతి వృత్తుల కళాకారులను ప్రోత్సహించాలని, మహిళలు రైతులను గౌరవించాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సందేశాలతో కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ పురందేశ్వరిని గజమాలతో సత్కరించారు.

# భరత్ కు బంగారు బిస్కెట్లు నేనే ఇచ్చా..



- ఆ వ్యాపారికి ఇప్పటికీ డబ్బులు మాత్రం ఇవ్వలేదు
- భరత్ పై రామశర్మ సోషల్ మీడియా ద్వారా మరో బాంబ్
- నువ్వు నీ వార్డులో నెగ్గి నీ కేపబులిటీని నిరూపించుకో..
- మేయర్ అయి నీ రుబాబు కంటిన్యూ చెయ్యి
- నువ్వు నెగ్గుతావనే ఆశ అయితే నాకు లేదు..కానీ ట్రై చేయ్
- భరత్ బాల్య స్నేహితుడు రామశర్మ వరుస ఎపిసోడ్స్ తో సామాజిక మాధ్యమాలలో రచ్చ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29:** వైఎస్సార్ సీపీ నేత, ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ పై ఆయన బాల్య మిత్రుడు..పీ రామశర్మ సోషల్ మీడియా వేదికగా ఒకటొకటిగా వదులుతున్న వీడియోలు రాజమహేంద్రవరం నగరంలో తీవ్ర కలకలాన్ని సృష్టిస్తున్నాయి. వైసీపీ శ్రేణులలో ప్రధాన చర్చనీయాంశంగా మారుతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు భరత్ కు అన్నీ తానై చూసుకున్న రామశర్మ ఇప్పుడు ఎందుకు ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు?, అసలు భరత్ కు రామశర్మ కు మధ్య విభేదాలు ఎక్కడ తలెత్తాయి?, భరత్ గురించి రామశర్మ చెబుతున్న దాంట్లో వాస్తవం ఎంత?, అవాస్తవం ఎంత? తెలియడం లేదు. రామశర్మ చేసిన ఆరోపణలపై భరత్ స్పందించకపోవటం, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి స్పందిస్తూ భరత్ తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని..ఆయన ఇద్దరి పిల్లలపై ఉమా మార్కండేయ స్వామి సన్నిధిలో ప్రమాణం చేసి "నేను ఏ డబ్బులూ తీసుకోలేదని" చెబితే ప్రజలు నమ్ముతారన్నారు. అయితే దీనికీ భరత్ నుంచి ఎటువంటి సమాధానం లేదు.




ఇదిలా ఉంటే.. మొన్న రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం పెడుతున్నట్టు ప్రకటించి అనూహ్యంగా రామశర్మ ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. తనకు ఆరోగ్యం సహకరించకపోవటం వల్ల ప్రెస్మీట్ కు రాలేకపోయానని ఒక వీడియోలో వివరణ ఇచ్చుకున్నారు. తాజాగా రామశర్మ సోషల్ మీడియా వేదికగా మాజీ ఎంపీ భరత్ ను ఉద్దేశించి చేస్తున్న వీడియోలపైనే అందరి దృష్టి కృంద్రీకృతమై ఉంది. ఈ వీడియోలలో ఒకటి, రెండు, మూడు..ఇలా ఎపిసోడ్స్ మాదిరిగా రామశర్మ అస్త్రాలను సంధిస్తున్నారు. బాల్య మిత్రుడు కాబట్టి అక్కడక్కడ భరత్ ను ఒరేయ్, అరేయ్ అని సంభోదించినా..చాలా వరకూ మిత్రుడివి కదా..నీకు కొన్ని సూచనలు, సలహాలు ఇవ్వాలనుకుంటున్నాను అంటూ తానేమి చెప్పదలచుకున్నారో అది నర్మగర్భంగా చెప్పారు. అలాగే "ఒక జ్యూయలరీ షాపు వ్యాపారి నుంచి రూ.15 లక్షలు విలువ జేసే బంగారు బిస్కెట్లు..అతని వద్ద నుంచి నేనే తెచ్చి నీకిచ్చాను... మర్చిపోయి ఉంటావు..నీకు మతిమరుపు కదా..ఆ వ్యాపారికి ఇప్పటి వరకూ డబ్బులే ఇవ్వలేదట..తనేమీ అడగలేదు. నేనే చాల రోజులైందని ఫోన్ చేస్తే..చెప్పలేక చెప్పలేక చెప్పాడు..ఇచ్చేయ్యొచ్చు గదా భరత్".. అని మిత్రుడిలా రామశర్మ చెప్పారు. అటు తర్వాత రాజకీయ వ్యవహారాలు గురించి ప్రస్తావిస్తూ.. నీకు రాజకీయాలెందుకు చెప్పు అంటూ హితవు పలికారు. "కానీ..నీకు పదవి లేకపోతే ఉండలేవు..వచ్చే కార్పొరేషన్ ఎన్నికలలో మీ డివిజన్ నుంచి మేయర్ అభ్యర్థిగా పోటీ చెయ్యి. నెగ్గవనుకో..కాకపోతే ట్రై చేయ్. మేయర్ అయితే రుబాబు చేయవచ్చు. ఎంపీ స్థాయి వ్యక్తిని మేయర్ పదవి ఎందుకని అనుకోకు..ఏదో ఒక పదవి. ప్రయత్నించు. నీ కేపబులిటీని నిరూపించుకో" అని కాస్త చురకులు, దెప్పిపొడుపు మాటలతో భరత్ కు రామశర్మ బాల్య మిత్రుడు కాబట్టి హితవచనాలు పలికారు. అలాగే ఆర్థికపరమైన అంశాలు కూడా కొన్ని ప్రస్తావించారు. చివరిగా.. "ఒరేయ్ నన్ను కెలక్కు..నా మానాన్న నన్ను బ్రతకనీయ్..అన్నీ చెడి ఉన్నవాడిని, బికారిని. నువ్వు సినిమా చూపిత్తా చూపిత్తా అంటావు. బాగా అయితే ఆ ఒక్క సినిమాయే చూపిత్తావు. నేను సీరియల్ మాదిరి ఒకటి రెండు మూడు ఇలా వరుస ఎపిసోడ్స్ తో మొత్తం చూపిస్తా". నువ్వు, నీ అనుచరులు నాపై రకరకాల వీడియోలు, బెదిరింపు ఫోన్ కాల్స్ ఇలా చాలా వస్తున్నాయ్. వద్దురా. ఇవేమీ వద్దు. నన్ను నన్నులానే బతకనీయ్. కాదూ కూడదంటే సరే మరి తప్పదు కదా..చివరిగా ఒక మాట..మేయర్ పదవికి పోటీ చెయ్యి. సీరియస్ గానే చెబుతున్నాను" అని ఒక వీడియో సోషల్ మీడియాలో రామశర్మ వదిలారు. మరో వీడియోలో.. గోల్డ్ బిస్కెట్లు ఇచ్చిన వ్యాపారితో మాట్లాడినట్లుగా ఉన్న ఆడియోను పోస్ట్ చేశారు. ప్రస్తుతం రామశర్మ మాజీ ఎంపీ భరత్ ను టార్గెట్ చేస్తూ వదులుతున్న వీడియోలు, ఆడియోలపైనే వైసీపీ, టీడీపీ శ్రేణులు ఆసక్తికరంగా చర్చించుకోవడం కనిపిస్తోంది.

**ఆ అధికారిణికి గోల్డ్ బిస్కెట్లు ఎందుకిచ్చినట్టు?: సిటీ ఎమ్మెల్యే వాసు**

ఇదలా ఉంచితే..మరో వైపు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) కూడా శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గోల్డ్ బిస్కెట్ల వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఆ అధికారిణికి భరత్ ఎందుకు గోల్డ్ బిస్కెట్లు ఇచ్చారో, దాని వెనుక మర్మం ఏమిటో తెలియాలన్నారు. తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని, త్వరలోనే బయట పెడతానని ఎమ్మెల్యే వాసు చెబుతున్నారు. ప్రస్తుతం భరత్ ఒకవైపు బాల్య మిత్రుడు రామశర్మ, మరో వైపు రాజకీయ బద్ధ శత్రువు (ఈయనా ఒకప్పుడు మిత్రుడే) సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వరుసగా ఆరోపణాస్త్రాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చూడాలి..ఈ వ్యవహారం రాజకీయంగా ఎన్ని మలుపులు తిరుగుతుందో.

## జగన్ ఈవీఎంతో కాకుండా
# బ్యాలెట్ తో గెలిచాడా భరత్?!



- ప్రజాస్వామ్యంపై, ప్రజా తీర్పుపై నమ్మకం లేదా
- అధికారిణికి బంగారం బిస్కెట్స్ వ్యవహారం తేలుస్తాం
- అభివృద్ధి వేరు, సుందరీకరణ వేరు.. భరత్ చేసింది అభివృద్ధి కాదు
- ఫేక్ వీడియోలు ఎన్ని పెట్టినా ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- రాజమహేంద్రవరం ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరిస్తే సహించేది లేదు
- మొత్తం 341మందికి రూ. 3,27,84,177లు సీఎం ఆర్ఎఫ్ చెక్కులిచ్చాం
- వైసీపీ హయాంలో సీఎం ఆర్ ఎఫ్ కింద ఒక్క చెక్ అయినా ఇచ్చారా?
- మీడియా సమావేశంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వ్యాఖ్యలు
- 34మందికి రూ 25,37,483 సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29:** కష్టాల్లో ఉన్నవాళ్ళ విలువ తెలుసుకుని వాళ్ళను ఆదుకోవడం, విలువలతో కూడిన రాజకీయాలు చేయడం అనేది కూటమి ప్రభుత్వ ఆలోచన అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వానికి ప్రజల ఇబ్బందులు, సమస్యలు ఏ మాత్రం పట్టలేదని విమర్శించారు. అసలు ఆ దిశగా ఆలోచన కూడా చేయలేదన్నారు. స్థానిక తిలక్ రోడ్డు రెడ్డీస్ కన్వెన్షన్ హాల్ లో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ కొత్తగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద 32 మందికి చెక్కులు, రెండు ఎల్ ఓసీ లు కలిపి రూ. 25,37,48లు మంజూరు అయ్యాయని తెలిపారు. వాటిని లబ్దిదారులకు అందజేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు సిటీ నియోజక వర్గంలో మొత్తం 341మందికి రూ. 3,27,84,177లు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులిచ్చామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలలో కన్నా అత్యధిక సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇచ్చిన ఘనత రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దే చర్యలు ప్రారంభమయ్యాయని, అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ల సమక్షంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీ అద్భుతంగా ఉందని ఎమ్మెల్యే వాసు అన్నారు. ఎమ్మెల్యేల కంటే విద్యార్థులు బాగా మాట్లాడారని, అలాగే ప్రతిపక్షం ఎలా ఉండాలో, ఎలా మాట్లాడాలో కూడా విద్యార్థులు చెప్పారని ఆయన అన్నారు. ప్రతిపక్ష హోదా అనేది ప్రజలు ఇవ్వాలే తప్ప అడిగితే రాదని అన్నారు. ఇక ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావుతో విద్యార్థులకు నిర్వహించిన విలువల విద్యా సదస్సులో చాల మంచి విషయాలు బోధించారని, విద్యార్థులు కూడా ప్రశ్నలు వేసి సందేహాలు నివృత్తి చేసుకున్న తీరు బాగుందని అన్నారు. ప్రజల్లో కూడా ఇలాంటి కార్యక్రమాల పట్ల ఆనందం వ్యక్తం అయిందని, కూటమి ప్రభుత్వ పనితీరుకి నిదర్శనమని ఆయన అన్నారు.

**జగన్ ఏ సమస్యపై పోరాడుతున్నాడో అర్థం కావటం లేదు..**

జగన్ ఏ సమస్యపై పోరాడుతున్నాడో అర్థం కావడం లేదని, అందుకే ఆయన వస్తుంటే మీమర్స్ కి పండగలా ఉందని ఎమ్మెల్యే వాసు ఎద్దేవా చేశారు. జగన్ ఎక్కడికి వెళ్లినా, చివరకు కోర్టుకి వెళుతున్నా సరే, కార్యకర్తలను రండి, రండి అంటూ ఫోన్ల మీద ఫోన్లు చేసి రప్పించుకుంటున్నారన్నారు. చిన్న పిల్లలు స్కూలుకి వెళ్లకుండా ఉండటానికి రకరకాల కారణాలు సాకుగా చూపిస్తారని, అలాగే కోర్టుకి వెళ్లకుండా ఉండటానికి జగన్ రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారని ఎమ్మెల్యే వాసు వ్యాఖ్యానించారు. కోర్టులో ఫొటోలు ఎలా వస్తున్నాయని వైసీపీ వాళ్ళు అడుగుతున్నారని, అయితే చంద్రబాబుని అన్యాయంగా అరెస్టు చేయడమే కాకుండా జైలులో అడుగుపెడుతున్నపుడు ఫొటో ఎలా బయటకు వచ్చిందని ఎమ్మెల్యే వాసు నిలదీశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ కూడా రాకుండా చేశారని, పరిశ్రమలు పెట్టాలని వచ్చినవారు భయపడి వెళ్లిపోయేలా చేశారని ఎమ్మెల్యే వాసు అన్నారు. ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా మార్పు రాలేదన్నారు. ఇంకా జగన్ భ్రమల్లో ఉన్నారని, ఆయనను అనుసరించే భరత్ లాంటి శిష్యులు కూడా మళ్లీ ఎన్నికలు పెడితే నెగ్గేస్తామనే భ్రమల్లో ఉన్నారని అన్నారు. ఎకనామిక్ ఏక్టివిటీ జరిగితే పరిశ్రమలు వచ్చి, ఉద్యోగావకాశాలు వస్తాయని, తద్వారా రాబడి పెరుగుతుందని, కూటమి ప్రభుత్వం పెట్టుబడులు తీసుకొస్తోందని ఆయన తెలిపారు. అందులో భాగంగా రూ.100 కోట్ల విమాన శిక్షణ కేంద్రం తాను తీసుకొస్తున్నానని, ఇది ప్రయివేటు వ్యక్తులు స్థాపించే సంస్థ కనుక మరింత విస్తృతం అవుతుందని అన్నారు. తాము పనిచేసుకుంటూ పోతున్నామని, అయితే ఫేక్ వీడియోలు, అసత్య ప్రచారాలతో ఏదో చేయాలని వైసీపీ వాళ్ళు చూస్తున్నారని, వాళ్ళు ఎన్నిచేసినా , ఏం చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే వాసు అన్నారు. రాజమహేంద్రవరం ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యవహరిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఒక అధికారిణికి బంగారం బిస్కెట్లు పంపిన వ్యవహారానికి సంబంధించిన ఆధారాలు కూడా సమయం వచ్చినపుడు బయట పెడతామని ఆయన అన్నారు. మాట్లాడితే ఈవీఎం ఎమ్మెల్యే అంటున్నారని, మరి జగన్ ఈవీఎంతో కాకుండా బ్యాలెట్ తో నెగ్గాడా అని భరత్ ని ఉద్దేశించి ప్రశ్నించారు. ఈవీఎంల గురించి ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని విమర్శిస్తూ ప్రెస్ మీట్ పెట్టగలవా అని ఆయన సవాల్ చేశారు. మీడియా సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు కాశీ నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, వై శ్రీను, వర్రే శ్రీనివాసరావు, ఉప్పులూరి జానకి రామయ్య, బుడ్డిగ రవి, కంటిపూడి శ్రీనివాస్, కొయ్యల రమణ, కొల్లి బుజ్జి, కదలి రామకృష్ణ, బుడ్డిగ గోపాలకృష్ణ, కరగాని వేణు, కంటిపూడి రాజేంద్రప్రసాద్, తురకల నిర్మల, అగురు ధన్ రాజ్, మొకమాటి సత్యనారాయణ, కడియాల వీరభద్రరావు, కోసూరి చండీప్రియ, కానేటి ప్రభుదాస్, కానేటి కృపామణి, బర్ల గిరిజ, చింతా జోగినాయుడు, శ్యామ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## మిస్సింగ్ కేస్ ఛేదించిన పోలీసులు

**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 29..** కాకినాడ జిల్లా ఎస్.పి జి బిందు మాధవ్ ఐపీఎస్ మిస్సింగ్ కేసుల్లో తక్షణం స్పందించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంట వెంటనే ట్రేస్ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో జగ్గంపేట ఎస్.ఐ రఘునాధరావు ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ రామవరం గ్రామం భగత్ సింగ్ నగర్ కు చెందిన అనామిక వయస్సు 20 సంవత్సరములు మిస్సింగ్ కేసును ఎస్.పి బిందు మాధవ్ ఐపీఎస్ అందించిన సాంకేతిక పరిజ్ఞానంతో హైదరాబాద్ లోని ఖైరతాబాద్ కమిషనరేట్ ప్రాంతంలో అమెను ట్రేస్ చేసి పట్టుకోవడం జరిగింది.అనంతరం అమెను జగ్గంపేట పోలీస్ స్టేషన్ కు తరలించడం జరుగుతుంది.

## సివిల్స్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి


**అమలాపురం (మనసులో మాట) నవంబరు 29:** రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్టు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బీసీ సంక్షేమ శాఖ సాధికారత అధికారిని పి జ్యోతిలక్ష్మి దేవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనుటకు డిసెంబర్ 3వ తేదీ తో ముగుస్తుందని ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తు అమలాపురం బిసి వెల్ఫేర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ ఉచిత శిక్షణ కోసం ప్రవేశ పరీక్ష ఉంటుందని దీనిలో మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి బీసీ భవన్ గొల్లపూడి విజయవాడలో సివిల్ సర్వీసెస్ లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20 శాతం ఎస్టీలకు 14 శాతం రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10, ఇంటర్, డిగ్రీ మార్క్ లిస్టులు కుల,ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు రేషన్ కార్డు( లక్షరూపాయలు ఆదాయం ఉన్నవారు) ఆధార్ జిరాక్స్ బ్యాంక్ పాస్ బుక్ తో పాటు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు అప్లికేషన్ కు జతచేసి బీసీ కార్యాలయంలో దరఖాస్తును అందజేయాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 98660942 48 నెంబర్లో సంప్రదించవచ్చునని ఆమె తెలిపారు.

## పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ సర్వే



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29:** ప్రాథమిక స్థాయి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపు నిమిత్తం నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ సర్వే డీఎంహెచ్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో నిర్వహిస్తున్నట్టు సీఆర్ఎంటీ జయంతి శాస్త్రి తెలిపారు. తన కాంప్లెక్స్ పరిధిలోని బ్రాడీపేట ప్రాథమిక పాఠశాల, పవర్స్ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల, సిమెటరీ పేట ప్రాథమిక పాఠశాలలో సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక అండ్రాయిడ్ మొబైల్ ఆప్ ద్వారా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల స్థాయిని మదింపు చేస్తున్నామని, డిసెంబరు ఐదవ తేదీ నాటికి ఈ సర్వే ప్రక్రియ పూర్తవుతుందని శాస్త్రి తెలిపారు.

## వాడపల్లి వెంకన్న దర్శించిన నర్సాపురం టిడిపి ఇంచార్జ్ రామరాజు



**ఆత్రేయపురం( మనసులో మాట) నవంబర్ 29..** ఏడువారాల వెంకన్నగా పేరు పొందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం నరసాపురం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పోత్తూరి రామరాజు, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి చిత్రపటం అందజేశారు.

# కూటమి ప్రభుత్వంలో రైతే - రాజు

**- తణుకువాడ, శలపాకలో రైతన్నా మీకోసం - పంచ సూత్రాలతో రైతులకు ఆర్థిక ప్రగతి**

**- ఏఎంసీ చైర్మన్ అక్కల రీశ్వంత్ రాయ్ , కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**



**కాజులూరు (మనసులో మాట), నవంబరు 29:** కూటమి ప్రభుత్వ హయాంలో రైతే రాజని, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడం, ప్రకృతి సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం ఆధునిక పద్ధతుల ద్వారా ప్రకృతి సేద్యాన్ని తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ అక్కల రీశ్వంత్ రాయ్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పేర్కొన్నారు. శనివారం మండలంలోని తణుకువాడ, శలపాక గ్రామాలలో జరిగిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఇరువురు పాల్గొని అన్నదాతలతో మాట్లాడారు. వ్యవసాయ అధికారులతో కలిసి రైతన్నా మీకోసం కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే అంశాలతో పంచ సూత్రాలతో అన్నదాతలకు అండగా నిలవడానికి రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక లాభాలు వచ్చే పంటలను సాగుచేసి రైతులు ఆర్థికంగా పురోగతి చెందాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచుకుని ఆ దిశగా పంటలను సాగుచేస్తే మేలు చేకూరుతుందన్నారు. సేంద్రీయ వ్యవసాయంతో భూసార పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం కూడా లభిస్తుందని అన్నారు. వ్యవసాయాధికారులు సూచించిన విషయాలను జాగ్రత్తగా పాటించి వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలన్నారు. పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం కింద రెండు విడతల్లో పీఎం కిసాన్ పథకంతో కలిపి ఇప్పటికే రూ.14వేలు అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.13,500 మాత్రమే ఇచ్చి జగన్ ఇచ్చినమాట తప్పారని గుర్తు చేశారు. ఎ ఎం సి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూవ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించడంలో కూటమి ప్రభుత్వం ముందుందని తెలిపారు. అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతు రాజుగా మార్చాలన్న సంకల్పంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి అశోక్ , వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రశాంత్ , శ్రీనివాస వర్మ ,ఎ ఎం సి వైస్ చైర్మన్ దడాల నాగార్జున, తణుకువాడ పిఎసిఎస్ చైర్మన్ పితాని సతీష్, వల్లు అర్జున్ రావు, పితాని వీరభద్రరావు, చుండ్రు వీర్రాజు చౌదరి, తాడి మాచారెడ్డి, శలపాక సర్పంచ్ పోతు గనిరాజు, పోతురాజు భీమరావు, మాధవరపు చినబాబు, కామిరెడ్డి చక్రరావు, గోల్ల శ్రీను, పలివెల రాజు, రెడ్డి శేషారావు, అంగర కృష్ణ, నక్క శ్రీను, టి రామారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత - మనోజ్ రెడ్డి




**పెదపూడి (మనసులో మాట) నవంబర్ 29..** వ్యవసాయ రంగ అభివృద్ధి,రైతుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు అనపర్తి నియోజకవర్గ కన్వీనర్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పెదపూడి లో శనివారం మండల వ్యవసాయ అధికారి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం ప్రజా చైతన్య ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ శాఖ, రైతు సేవా కేంద్రాలను, సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు కోసం ఈ యాంత్రికరణ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ జుట్టుకు సూర్యకుమారి తెలిపారు. వ్యవసాయ శాఖ కరపత్రాలు నేతలు ప్రజాప్రతినిధులు రైతులకు పంపిణీ చేశారు. పెదపూడి మండల కన్వీనర్ పుట్టా గంగాధర్ చౌదరి, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, పెద్దడ ఉపసర్పంచ్ బొడ్డు శ్రీనివాసరావు, పెదపూడి ఎంపీడీవో నరేంద్ర రెడ్డి, తహశీల్దార్ సీతాపతి రావు, సాగునీటి సంఘాల అధ్యక్షులు కోరా రామన్న చౌదరి, సానా శ్రీనివాసరావు,ఆరుమిల్లి వాసు కూటమి నేతలు సహపురం మెర్ల చిన్నబాబు, జుత్తుక కృష్ణ, పలివెల బుజ్జి, కాకర రామాంజనేయులు, రైతు సేవా కేంద్రం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**కొత్తపేట (మనసులో మాట) నవంబర్ 29..** రాష్ట్రంలోని యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యువత, చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తారని, అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. వికసిత భారత్ 2047 లక్ష్యాలతో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ముందుకు సాగుతుందని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడుతుందని, యువత తమ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి. అలా చేస్తే ఎక్కడైనా రాణించగలరు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి అనేక పరిశ్రమలు, సంస్థలు రాబోతున్నాయని. అమరావతిలో కేంద్ర బ్యాంకులు, బీమా సంస్థల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన జరగడం అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన యువతీ, యువకులకు, అపాయింట్మెంట్ ఆర్డర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, ధరణాల రామకృష్ణ, జక్కంపూడి బాలాజీ, కముజు గంగాధర్, నల్ల రమణ, కొప్పిశెట్టి ప్రసాద్, కముజు శ్రీను తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎసైన్మెంట్ చట్ట సవరణను విరమించుకోవాలి

**ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు డిమాండ్**



**కాకినాడ(మనసులో మాట ),నవంబర్ 29:** దళితులు, బలహీనవర్గాలకు చెందిన అసైన్డ్ భూములను అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించుకున్న పెత్తందారులకు దొడ్డి దారిన 99 సంవత్సరాలు లీజుకు ఇవ్వడానికి రాష్ట్ర క్యాబినెట్ 9/77 అసైన్డ్ చట్టాన్ని పెత్తందారులకు అనుకూలంగా సవరించడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ఖండించారు. వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా కమిటీ సమావేశం శనివారం కాకినాడ సుందరయ్య భవన్లో జరిగింది.

ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర కేబినెట్ చేసిన ఈ సవరణతో 13 లక్షల ఎకరాలు ఆక్రమణకు గురైన అసైన్డ్ భూములను పెద్దలకు 99 సంవత్సరాలు లీజు పేరుతో పెద్దలకు కట్టబెట్టేందుకేనని విమర్శించారు. రాష్ట్రంలో అసైన్డ్ భూములను అమ్మకాలు, కొనుగోలు చేయరాదని ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదన్నారు. కానీ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్రీ హోల్డ్ నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆక్రమణదారులకే భూములు కట్టబెట్ట పూనుకుంది. దీనివల్ల లక్షలాది దళిత, బలహీన వర్గాల కుటుంబాలు భూములు కోల్పోతారు. కూటమి ప్రభుత్వం పేదలకు తీవ్రమైన ద్రోహం చేసిందని. రాష్ట్ర క్యాబినెట్ ఆమోదాన్ని వెంటనే ఉపసంబరించుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె సింహాచలం, కరణం ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమంగా మొక్కలు నాటాలి..

**ప్రాణవాయువును పెంచేందుకు వృక్షాలను పెంచాలి... - పర్యావరణంలో వాయు కాలుష్యాన్ని తగ్గించాలి - ఎన్ఎస్ఎస్ అధికారిణి కే. సుకన్య**




**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 29..** పర్యావరణంలో వాయు కాలుష్యాన్ని తగ్గించి ప్రాణవాయువు అందించేందుకు వృక్షజాతికి మించిన ఉత్తమ మార్గం మరొకటి లేనందున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి పెంపకం బాధ్యత చేపట్టాలని ఎన్ఎస్-ఎస్ అధికారిని కే. సుకన్య శనివారం పేర్కొన్నారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వి ఎస్ ఎల్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంటి ముందు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత చాపట్టాలని కోరారు. ప్రపంచంలో ప్రాణవాయువు తగ్గిపోతుందని వృక్షాలు అందరికి వేయడం కాల్చి వేయడం వంటి చర్యలతో భవిష్యత్ తరాలకు ఆక్సిజన్ ఉండకుండా నశించి పోతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా రోజు లక్షలాది వృక్షాలు మానవుడు చేసే తప్పుదాలకు బలైపోతున్నాయని తద్వారా ప్రపంచవ్యాప్తంగా వాయు కాలుష్యం ఏర్పడి భవిష్యత్తు తరాలు లేకుండా మనిషి జాతి కూడా నశించి పోతుందన్నారు. ఈ పరిస్థితులను అధిగమించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యతను కూడా చేపట్టి భావితరాలకు ప్రాణవాయువు దాతలుగా నివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెవి రాఘవరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.



## 'అనేకం' పద్య శతకం ఆవిష్కరణ

**-ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29:** రాజమహేంద్రవరం సాహిత్య రంగంలో ఈ తరానికి చెందిన ప్రముఖ కవులు, రచయితలలో ఎస్ఆర్ పృథ్వి ఒకరు. న్యాయ రంగన్ని విడిచి విశ్రాంతి జీవితం గడుపుతున్న వీరు నిరంతర రచనను ప్రవృత్తిగా స్వీకరించారు. వీరి కలం నుండి ఇప్పటికి సుమారు 60 గ్రంథ కుసుమాలు పుష్పించగా 48 గ్రంథాలు ముద్రించబడ్డాయి. 48వ గ్రంథం "అనేకం" ఈ రోజు ఉదయం ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో ఆవిష్కరించారు. "వేమన కవీంద్ర వింటివా వింత లెల్ల" మకుటంతో వ్రాసిన పద్య శతకం "అనేకం" ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో ఉప కులపతి ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ, ఆమె ఛాంబారులో ఆవిష్కరించి కవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ కోఆర్డినేటర్ డాక్టర్ తలారి వాసు కవి ఎస్ఆర్ పృథ్విని అభినందించారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్త కవి, శివ కుమార్ పెరిశెట్ల (నెల్లూరు) తదితరులు పాలోన్నారు. తొలుత రామోజీ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న సందర్భంగా నన్నయ విశ్వ విద్యాలయం ఉప కులపతి ఎస్ ప్రసన్నశ్రీని శివ కుమార్ పెరిశెట్ల, పృథ్వి అభినందించారు.ం

## తోట నరసింహం పరామర్శ



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 29..** జగ్గంపేట మండలం మర్రిపాక గ్రామంలో ఇటీవల మరణించిన కాపవరపు నూకపతిరావు కుటుంబ సభ్యులను జగ్గంపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి,మాజీ పార్లమెంట్ సభ్యుడు తోట నరసింహం పరామర్శించారు.ఆయన కుటుంసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.అధైర్య పడవద్దని, ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అనంతరం అయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి వరపుల సూరిబాబు, జగ్గంపేట నియోజకవర్గ శ్రామిక విభాగం అధ్యక్షుడు గుర్రం మహాలక్ష్మి, జగ్గంపేట టౌన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాపవరపు ప్రసాద్, గట్టి సతీష్ , రెడ్డి మోక నాయుడు, మర్రిపాక గ్రామ ఉపసర్పంచ్ కాటుమల్ల రవి, జగ్గంపేట మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మేంబర్ జగతం మణిదీప్, కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మేంబర్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ రావుల సురేష్ కుమార్, రామవరం గ్రామ ప్రధాన కార్యదర్శి బండి నాగేశ్వరరావు,మర్రిపాక గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్యలో రోడ్డుభద్రత పై స్పెషల్ డ్రైవ్



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 29..** జగ్గంపేట శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్లో రోడ్డు భద్రత ప్రమాణాలు,తనిఖీలలో భాగంగా పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె.ప్రసాద్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా విద్యార్థులు ప్రయాణిస్తున్న స్కూల్ బస్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెహికల్స్ కు ఉండవలిసిన పర్మిట్, ఎమర్జెన్సీ విండోస్, ఫైర్ ఎగ్జిట్,బస్సుల యొక్క కండిషన్, టైర్ లను ఈ సందర్భంగా అయన తనిఖీ చేయడం జరిగింది.అనంతరం పై విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా పలు రోడ్డు భద్రత అంశాలపై డ్రైవర్లకు,క్లీనర్లకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హైవే పై నిలుస్తున్న నీటితో సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తున్న వారికి ఇబ్బంది



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 29..** జగ్గంపేట మండలం జగ్గంపేట గ్రామంలో నేషనల్ హైవే 16 నందు వర్షాలు పడితే నీరు సర్వీసు రోడ్డు ఆనుకుని ఉన్న గట్టు వద్ద నిలిచిపోవడంతో అటుగా హైవేపై వెళ్తున్న వాహనాలు ఆ నీటిలోనుండి వెళ్లడం వల్ల పక్కన ఉన్న సర్వీస్ రోడ్ లో వెళ్లే వాహనదారులపై ఆ నీరు పడడం జరుగుతుందని,ఈ సమస్యను నేషనల్ హైవే అథారిటీ వారు పరిష్కరించాలంటూ టీడీపీ బీసీ సెల్ స్టేట్ సెక్రటరీ ఎస్వి ప్రసాద్ మీడియాకు తెలియజేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగ్గంపేట గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ఈ సమస్య ఉంది హైవే ఒంపు వలన వర్షాలు పడితే ఆ నీరు సర్వీస్ రోడ్డు ఆనుకుని ఉన్న హైవే వద్ద నీరు నిలిచిపోతుంది అటుగా హైవేపై వెళున్న వాహనాలు ఆ నీటిలో వెళ్లడం వల్ల పక్కనే దాన్ని ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డు లో ప్రయాణించే వాహనాదారులపై ఆ నీరు పడుతుందని సుమారు కాలు మునిగే విధంగా ఆ నీరు నిలిచిపోతుందని ఈ సమస్య గురించి ఆ రోడ్డు వద్ద మరమ్మత్తులు చేస్తున్న వారిని అడిగి చూడగా వారు ఇది చేయడం కుదరదు సార్ అని చెప్పడం జరిగిందని ఈ సమస్యనుప్రభుత్వానికి తెలియజేయడం కోసం మీడియాను కోరడం జరిగిందని ఈ సమస్యను త్వరగా నేషనల్ హైవే అథారిటీ వారికి తెలిసే విధంగా మీడియా వారు సహకరించాలని ఈ సందర్భంగా అయన తెలియజేసారు.

# పుష్కరాలకు ముందే అభివృద్ధి పనులను పూర్తి చెయ్యాలి

## శాఖల మధ్య సమన్వయంతో పనిచేయడం ముఖ్యం - మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి




**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29:** కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో గోదావరి పుష్కరాలు – 2027 ఏర్పాట్ల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు. పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించిన అన్ని శాఖల నుంచి పూర్తి స్థాయి హేతుబద్ధ నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి ఈ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు–2027 కోసం ముందస్తు ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సమగ్ర సమీక్ష జరిపామని తెలిపారు. ఈ సమావేశం రాబోయే పుష్కరాలకు ఒక శుభారంభం అన్నారు. ఉభయ గోదావరి జల్లాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా పుష్కరాలకు భారీ స్థాయిలో సన్నద్ధమవుతున్నట్టు తెలిపారు. శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, ఇప్పటికే అన్ని శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అంచనాలతో ముందుకొచ్చారని వివరించారు. పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్ ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించిందని, కేబినెట్ సబ్ కమిటీ కూడా ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. ఈ సారి పుష్కరాలు గతం కన్నా మరింత ప్రత్యేకంగా ఉండబోతున్నందున ఎలాంటి పొరపాటుకు అవకాశం లేకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలిపారు. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని రవాణా, మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు.

అలాగే ప్రతిష్ఠాత్మక అఖండ గోదావరి ప్రాజెక్టును పుష్కరాల నాటికి పూర్తి చేసి, భక్తులకు పర్యాటక అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. జిల్లాలో ప్రజా ప్రతినిధుల నుంచి సంబంధిత ప్రాంతాల పనుల వివరాలు సేకరించి, అన్ని ప్రతిపాదనల్లో చేర్చాలని కూడా మంత్రి సూచించారు. పుష్కరాలు నేపథ్యంలో రద్దీని సమర్థవంతంగా ఎదుర్కొనే క్రమంలో నిడదవోలు రైల్వే స్టేషన్ అభివృద్ధి చెయ్యాలని, స్పెషల్ ట్రైన్స్ ఆగేలా చూడాలని రైల్వే అధికారులు సూచన చేశారు. ఈ అంశంపై ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ అందుకు అనుసరించి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ గోదావరి పుష్కరాల నేపథ్యంలో శాఖల వారీగా ప్రతి అంశంపై కూలంకషంగా చర్చించినట్టు తెలిపారు. 2015 పుష్కరాలకు దాదాపు 5 కోట్ల మంది భక్తులు హాజరు కాగా, ఈసారి 7- 8 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనికి అనుగుణంగా రవాణా సదుపాయాలు, భోజనం, త్రాగునీరు, శానిటేషన్, భద్రత వంటి అంశాలలో ముందుగానే ప్రత్యేక వ్యూహాలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శాఖల వారీగా అంచనా నివేదికలు సిద్ధమైన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి పంపించి, అవసరమైన నిధులు పొందేందుకు కృషి చేస్తామని తెలిపారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో, ఘాట్ల అభివృద్ధి, రద్దీ నిర్వహణ, తాత్కాలిక సదుపాయాల ఏర్పాటు వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ 2015 పుష్కరాల నివేదికలను సమీక్షించి వాటి ఆధారంగా 2027 పుష్కరాలకు అవసరమైన ప్రతిపాదనలను హేతుబద్ధం గా సిద్ధం చేయాలని అన్ని శాఖలను ఆదేశించమని, అందుకు అనుసరించి ఆయా శాఖలు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. విభాగాల వారీగా ప్రతిపాదనలు, అంచనా ఖర్చులు, ఫేజ్–1, ఫేజ్–2 అమలు ప్రణాళికలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ సూచించారు. భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ పార్కింగ్ వ్యవస్థ ఉండాలన్నారు. ప్రజా ప్రతినిధులు సూచనలు అనుసరించి ఘాట్‌ల అభివృద్ధి, మురుగు నీటి పారుదల, శానిటేషన్ సిబ్బంది బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.



రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా 2015 పుష్కరాల్లో చేపట్టిన చర్యలు, ఈ సారి చేపట్టవలసిన అభివృద్ధి పనులపై సమగ్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రత్యేకంగా ఘాట్ మార్గాల విస్తరణ, రద్దీ అంచనాలు, నీటి నాణ్యత, తాత్కాలిక పార్కింగ్, శానిటేషన్, మొబైల్ కమాండ్ కంట్రోల్ యూనిట్లు మొదలైన అంశాలను వివరించారు.

**సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సూచనలు..**

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్టేషన్‌లో ప్రధాన రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రియల్ టైమ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అమలు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రా షుగర్, ఏపీ పేపర్ మిల్స్ కాలుష్య నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలని చెప్పారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఘాట్‌లు, రహదారులు, తాగునీటి సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బందికి గౌరవభత్యం ఇవ్వాలని, మురుగునీటి పారుదల వ్యవస్థను సజావుగా నిర్వహించాలన్నారు. నిధులు కేటాయింపు పై 2026- 27 రాష్ట్ర కేంద్ర బడ్జెట్ లో తగిన నిధులు ప్రతిపాదనకు మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి ద్వారా చొరవ చూపాలన్నారు.

ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలో చేపట్టవలసిన పనులను సమగ్ర ప్రతిపాదనల్లో చేర్చాలని కోరారు.

మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి మీడియాతో మాట్లాడుతూ.. పుష్కరాల ఏర్పాట్లను అత్యంత ఉన్నత స్థాయిలో నిర్వహించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి సమన్వయం చేసుకుంటున్నారని తెలిపారు. అధికారులకు రోడ్డు రవాణా, రైలు సేవలు, పారిశుధ్యం, నీటి నాణ్యత, రద్దీ నియంత్రణ, పర్యాటక సదుపాయాల , రవాణా సదుపాయాలు, దేవాలయాలు అభివృద్ధి, మౌలిక వసతులు కల్పన, వంటి అంశాల్లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా తగిన నిధులు విడుదల చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి తెలియజేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, డీఆర్వో టీ సీతారామ మూర్తి, అదనపు ఎస్పీ మురళీ కృష్ణ, ఆర్డీవో లు రాణి సుస్మిత, ఆర్ కృష్ణ నాయక్, జిల్లా అధికారులు కే గోపినాథ్, ఎస్బీవీ రెడ్డి, వీ శాంతామణి, కే బాలకృష్ణ, టీ తిలక్ కుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## జనసంద్రంగా తొలి తిరుపతి క్షేత్రం

**పెద్దాపురం ( మనసులో మాట) నవంబర్ 29..** పెద్దాపురం మండలం తొలి తిరుపతి క్షేత్రం శనివారం జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుండి శృంగార వల్లభ స్వామి దర్శనాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారి దర్శనాలకు తరలివచ్చిన భక్తుల ద్వారా స్వామివారికి శనివారం ఒక్కరోజే 2లక్షల10వేల 333 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డీ శ్రీనివాసరావు తెలిపారు. పెద్దాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ శంకర్ దంపతులు స్వామివారిని దర్శించారు. అర్చకులు వేద ఆశీస్సులు అందించగా, గ్రామ సర్పంచ్ మోయ్యిళ్ల కృష్ణమూర్తి, ఈవో వడ్డీ శ్రీనివాసరావు సెల్ఫ్ ఇన్స్పెక్టర్ విజయశంకర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఆలయంలో ఉదయం భక్తులకు పులిహోర ప్రసాదాన్ని అందించగా, మధ్యాహ్నం సుమారు 3200 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణ ఆచార్యులు శ్రీ భూ సమేత శ్రీశృంగార వల్లభ స్వామికి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణతో తొలి తిరుపతి క్షేత్రం మారుమోగింది. ఈ క్షేత్రాన్ని మీరు దర్శించి తరించండి.

### 3న శీలా వీర్రాజు సేకరించిన

## చిత్ర కళా పుస్తకాల బహూకరణ

### – యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చే తెలుగు వర్సిటీకి..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబర 29:** ప్రముఖ కవి, చిత్రకారుడు శీలా వీర్రాజు సేకరించిన జాతీయ అంతర్జాతీయ చిత్ర కళా పుస్తకాలను తెలుగు విశ్వ విద్యాలయానికి పద్మశ్రీ, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ద్వారా బహూకరించనున్నట్లు మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి మాదేటి రవి ప్రకాష్ ప్రకటించారు. డిసెంబరు 3వ తేదీ ఉదయం పది గంటలకు దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో తెలుగు యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య డీ మునిరత్నం నాయుడు ఈ పుస్తకాలను స్వీకరిస్తారని ఆయన శనివారం ప్రకటించారు. ప్రాణహిత కవి సన్నిధానం నరసింహ శర్మ అధ్యక్షతన జరిగే ఈ సభలో అమ్మ భగవాన్ శిష్యురాలు, భగవత్ ధర్మ మార్గ దర్శకురాలు సౌజన్య దాసాజీ, ఆంధ్ర విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యుడు పర్వతనేని సుబ్బారావు అభినందన ప్రసంగం చేస్తారని రవిప్రకాష్ తెలిపారు. సభలో భగీరధి ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ఎన్వీపీ ఎస్ఎస్ లక్ష్మి, బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి ప్రసంగిస్తారని రవిప్రకాష్ తెలిపారు.

### కోరం లేక సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్

## సమావేశం వాయిదా




**పెద్దాపురం (మనసులో మాట) నవంబర్ 29..** కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణా కృష్ణమూర్తి అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్లో 31 మంది సభ్యులకు సంబంధించి కేవలం ముగ్గురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీకి చెందిన బలుసు వాసు, సత్యవతి జయలక్ష్మి అనే మరో ఇద్దరు కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. ఇటీవల సామర్లకోట మున్సిపల్ చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కానీ కోర్టు ఉత్తర్వులు కారణంగా అవిశ్వాస తీర్మాన సమావేశం జరగలేదు. దీంతో తరచూ కౌన్సిల్ సమావేశాలు సక్రమంగా జరగని పరిస్థితి ఏర్పడింది. శనివారం కూడా యధావిధిగా కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినప్పటికీ సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ గంగిరెడ్డి అరుణ ప్రకటించారు. కౌన్సిలర్ల వ్యవహార శైలి కారణంగా పట్టణంలో అభివృద్ధి కుంటుపడుతుందని, ప్రజలు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలే తగిన గుణపాఠం చెప్పటం ఖాయమని అరుణ కృష్ణమూర్తి తెలిపారు.

## ఈవీఎంల గోడౌన్ ను పరిశీలించిన డీఆర్వో



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29:** ఈవీఎంల గోడౌన్‌ను శనివారం జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు చేపట్టే సాధారణ తనిఖీల్లో భాగంగా ఉదయం స్ట్రాంగ్ రూమ్ గోడౌన్‌ను సందర్శించినట్లు తెలిపారు. స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఉన్న ఈవీఎంల నిల్వ గదిని రాజకీయ పార్టీలు ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్వో టీ సీతారామ మూర్తి మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా భద్రపరిచిన ఈవీఎంలను పార్టీ ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసి, సంబంధిత రిజిస్టర్‌లలో సంతకాలు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లు నిరంతర సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచబడి ఉన్నాయని తెలిపారు. ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం కేంద్ర గిడ్డంగుల సంస్థలో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోడౌన్‌ను జిల్లా రెవెన్యూ అధికారి మాస వారీ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అర్బన్ తహసీల్దారు పాపారావు, టీడీపీ ప్రతినిధి ఆనంద్, తదితర ప్రతినిధులు హాజరయ్యారు.



### ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) పై సర్టిఫికేట్ కోర్స్ ఆరు రోజుల

## శిక్షణ శిబిరం ముగింపు

### – ఇంచార్జ్ ప్రిన్సిపల్ కె. వెంకటేశ్వరరావు

**ఏలేశ్వరం (మనసులో మాట) నవంబర్ 29..** ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్ ) పై శనివారం నాడు శిక్షణ శిభిరం ముగింపు కార్యక్రమాన్నిఘనంగా నిర్వహించారు. ఈ కళాశాల చెందిన విద్యార్థులకు నవంబర్ 24 వ తేది సోమవారం శిక్షణా తరగతులను ప్రారంభించగా 29 తేది వరకు 6 రోజుల పాటు కొనసాగింది.సర్టిఫికేట్ కోర్స్ శిక్షణ శిభిరాన్ని కళాశాల ప్రిన్సిపల్ డా. డి సునీత 24 తేదిన ప్రారంభించగా 6 రోజుల పాటు కొనసాగి శనివారం నాటితో ఇన్చార్జ్ ప్రిన్సిపల్ కె. వేంకటేశ్వరరావు ముగించారు. డా. యన్ . సి పరాశ రామ్ స్టేట్ లెవెల్ మెడికల్ ఆఫీసర్ కాకినాడ శిక్షకులుగ వ్యవహరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కట్లు కట్టడము రక్తము పోకుండా ఆపడము ఊపిరి ఆడడము కష్టముగా ఉన్నప్పుడు కుత్రిమ శ్వాస ఇవ్వడము ప్రాణాన్ని నిలపెట్టడము, ఉన్న గాయాన్ని ఎక్కువ కాకుండా చూడడము, బాధ నుండి బయటపడడానికి సహాయము చేయడము, రోడ్డు ప్రమాదములో గాయపడ్డ సమయమందు ఎటువంటి సహాయం అందించాలి అనే అంశాలు శిక్షణ కాలంలో నేర్పించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి డా . ప్రయాగ మూర్తి ప్రగడ. కె . సురేశ్ డా. మదీనా కన్వెనెర్స్ గా వ్యవహరించారు. 60 మంది విద్యార్థులకు రెడ్ క్రాస్ సొసైటి నుంచి సర్టిఫికెట్స్ అందించారు. అద్యాపకులు వి.రామా రావు డా. శివ ప్రసాద్ శ్రీలక్ష్మి వీరభద్ర రావు డా. బంగార్రాజు సతీశ్ మేరీ రోజలీనా పుష్పా రాజేష్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి నుంచి చైతన్య అధ్యాపకేత సిబ్బంది సత్యనారాయణ ధర్మ రాజు దివ్య రామలక్ష్మి కమల కళావతి పెద్ద సంఖ్యలో విద్యార్ధిని విద్యార్థులు పాల్గొన్నారు.



### పెద్దమల్లాపురం కేంద్రంగా

## నూతన ఐటీడీఏ ఏర్పాటుకు కేంద్రం సానుకూలం

### - కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి

**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 29..** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలో పెద్ద మల్లాపురం కేంద్రంగా నూతన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ( ఐటీడీఏ ) ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సందివారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత మంత్రిత్వ శాఖ నుండి లిఖిత పూర్వక సమాధానం వచ్చిందని తెలిపారు. ప్రత్తిపాడు నియోజవర్గంలో నాలుగు మండలాల్లో గిరిజన గ్రామాలతో పాటు, తుని నియోజకవర్గం, కోటనందూరు మండలంలో గిరిజన గ్రామాలను కలిపి నూతన ఐటిడిఏ ఏర్పాటు చేయాలని స్థానిక గిరిజనులు పోరాటం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రెండు నియోజకవర్గాల్లో 5 మండలాల్లో ఉన్న 59 గిరిజన గ్రామాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 18,440 పైబడి గిరిజనులు ఉన్నారని ఈ గ్రామాలు ప్రస్తుతం రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్నాయన్నారు. అయితే జిల్లాల పునర్విభజన తర్వాత రంపచోడవరం ఐటీడీఏ అల్లూరి సీతారామరాజు జిల్లా లో విలీనం



కావడంతో సమస్య మరింత జటిలమైందన్నారు. గిరిజనుల ఆకాంక్ష మేరకు నూతన ఐటిడిఏ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ ఏడాది అక్టోబర్ లో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం ను వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేయడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబంధిత కేంద్ర,రాష్ట్ర అధికారులకు లేఖలు రాయడం జరిగిందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి పెద్ద మల్లాపురం కేంద్రంగా నూతన ఐటిడిఏ ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నామని, రాష్ట్ర ప్రభుత్వం నుండి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే విషయాన్ని ఏపీ ప్రభుత్వానికి కూడా సమాచారం ఇచ్చినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ సూచనలు మేరకు పెద్దమల్లాపురం కేంద్రంగా నూతన ఐటీడీఏ ఏర్పాటుకు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తాజాగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు లేఖలు రాయడం జరిగిందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. నూతన ఐటీడీఏ ఏర్పాటు ద్వారా గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గిరిజనుడి చేరే అవకాశం ఏర్పడు తుందన్నారు. పెద్ద మల్లాపురం కేంద్రం గా ఐటీడీఏ ఏర్పాటు కోసం అవసరమైతే వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తుతానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

### కమ్యూనిస్టు ఉద్యమంలో

## తొలి పూర్తికాలం కార్యకర్తగా కృషి

### 24 వ వర్ధంతి సందర్భంగా సుందరయ్య భవన్ లో సిపిఎం ఘన నివాళి

**కాకినాడ (మనసులో మాట), నవంబరు 29:** తెలుగు నేలపై కమ్యూనిస్టు ఉద్యమ తొలి పూర్తికాలం కార్యకర్త కామ్రేడ్ నండూరి ప్రసాదరావు 24 వర్ధంతి సందర్భంగా శనివారం ఉదయం సుందరయ్య భవన్ లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వ శేషబాబ్జీ, నగర కమిటీ సభ్యులు కె. సత్తిరాజు లు నండూరి ప్రసాదరావు చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా దువ్వా శేష బాబ్జి, కె. సత్తిరాజు, కె. వీరబాబు లు మాట్లాడుతూ ముఖాస జమీందారీ కుటుంబంలో జన్మించిన నండూరి ప్రసాదరావు తన వాటాగా వచ్చిన ఆస్తిని పార్టీకి రాసి ఇచ్చేశారని తెలిపారు. తెలుగు నేలపై 1934లో కమ్యూనిస్టు ఉద్యమంలో తొలి పూర్తికాలం కార్యకర్తగా కృషి ప్రారంభించి చరిత్ర సృష్టించారని కొనియాడారు. బెనారస్ యూనివర్సిటీలో విద్యను అభ్యసించిన నండూరి ప్రసాదరావు ఎర్రజెండా చేతబట్టి కడవరకు కష్టజీవుల పక్షాన నిలబడిన ధన్యజీవి అని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడమే కాకుండా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కూడా ఒక దళానికి నాయకత్వం వహించారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడిగా ప్రజావాణి వినిపించారన్నారు. ఆలిండియా కిసాన్ సభ నాయకుడిగా పనిచేసిన నండూరి ప్రసాదరావు సిఐటియు ఆంధ్ర ప్రదేశ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా కార్మికోద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించారని తెలిపారు .నండూరి ప్రసాదరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన స్ఫూర్తితో నేటితరం కార్యకర్తలు ప్రజాసేవకు అంకితం కావాలని సిపిఎం పిలుపునిస్తోందన్నారు.



ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సిహెచ్. రాజ్ కుమార్, నగర కమిటీ సభ్యులు మలకా వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, సిహెచ్. వేణు లతోపాటు మేడిశెట్టి వెంకటరమణ, కె. సత్తిబాబు, చంద్రమళ్ళ పద్మ, యు సత్యనారాయణ, టి. రాజా, భారతి , నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# పౌర హక్కుల దినోత్సవం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29:** నవంబరు నెల నాలుగవ శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక 7వ వార్డు, 12వ సచివాలయంలో పౌర హక్కుల దినాన్ని నిర్వహించినట్టు తహసీల్దార్ పాపారావు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి డివిజనల్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దారు పాపారావు, టీడీపీ వార్డు ఇంచార్జ్ కోరుమిల్లి శేఖర్, వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు.
కార్యక్రమంలో ప్రజలు పింఛన్ల మంజూరు, రైస్ కార్డుల్లో పిల్లలను చేర్చడం, ఇండ్ల స్థలాల మంజూరు, గతంలో మంజూరైన స్థలాలు ఇంకా అప్పగించకపోవడం వంటి అంశాలపై తమ సమస్యలు, సందేహాలు వ్యక్తం చేశారు. అధికారులు ప్రజల ప్రశ్నలకు స్పందిస్తూ, సంబంధిత నిబంధనలు, ప్రస్తుత చర్యలపై స్పష్టమైన వివరణలు ఇచ్చారు. ఈ సందర్భంగా గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణలో సచివాలయ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అర్బన్ తహసిల్దారు పాపారావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. వార్డు ఇంచార్జ్ కోరుమిల్లి శేఖర్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖలకు తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

### మలి విడత ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్

# సద్వినియోగం చేసుకోండి

### - ఏపీఎం వేదకుమారి



**కిర్లంపూడి,(మనసులోమాట) నవంబరు 29..** చిరు వ్యాపారస్తులు ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను చేయించుకోవాలని కిర్లంపూడి ఏపీఎం వేదకుమారి అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో డిసెంబర్ 2న మంగళవారం ఉదయం 10 గంటల నుండి చిరు వ్యాపారస్తులకు ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు ఏపీడీఐసి ద్వారా సర్టిఫికెట్లు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండలంలో ఉన్న చిరు వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం వేదకుమారి పిలుపునిచ్చారు.

### గొల్లపాలెంలో

# కారు చోరీ



**కాజులూరు (మనసులో మాట) నవంబర్ 29..** గొల్లపాలెం గ్రామంలో కారు దొంగతనం జరిగినట్లు గొల్లపాలెం ఎస్సై ఎం. మోహన్ కుమార్ తెలిపారు. శనివారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.
నేతి భగవాన్ కు చెందిన ఇంటి గేటుకి వేసిన తాళం రాత్రి 12 గంటలనుంచి తెల్లవారుజాము 4.45 గంటల మధ్యలో పగలగొట్టి, ఇంట్లో ఉండే ల్యాప్‌టాప్‌తో పాటు హ్యుందాయ్ వెన్యూ కారు, నెంబర్ AP39KB 3736 దొంగిలించినట్లు చెప్పారు.సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి పోలీసు బృందం పరిశీలించి , క్లూస్ టీం వేలిముద్రలు సేకరించి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. ఈ కేసును నమోదు చేసి మరింత విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

# స్వమిత్ర సర్వే పురోగతిపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం



- డిసెంబర్ రెండో తేదీ నాటికి వేక్టరైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి...
- కాకినాడ జిల్లాలో 20017 రెవెన్యూ గ్రామాలను గుర్తించాము....
- క్షేత్రస్థాయిలో అధికారులు త్వరితగతిన సర్వే పూర్తిచేయండి..
- కాకినాడ జిల్లా కలెక్టర్ సమ్మోహన్ సగిలి అధికారుల ఆదేశం..

**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 29..** కాకినాడ జిల్లాలో జరుగుతున్న స్వమిత్వ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో సర్వే పూర్తిచేసేందుకు తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.
స్వమిత్వ సర్వే పురోగతిపై శనివారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ తన క్యాంపు కార్యాలయం నుంచి సర్వే, రెవెన్యూ, పంచాయితీ అధికారులతో కలిసి అన్ని మండలాల తహశీల్దార్లు, మండల సర్వేర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాలవారీగా గ్రౌండ్ ట్రూతింగ్, వెక్టరైజేషన్ ప్రక్రియ పురోగతిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఇంటి యాజమాన్య హక్కులను అందించడానికి భారత ప్రభుత్వం స్వమిత్వ పథకం ప్రారంభించిందన్నారు. ఈ పథకం కింద కాకినాడ జిల్లాలో 217 రెవిన్యూ గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు గ్రౌండ్ ట్రూతింగ్ 99 శాతం, వెక్టరైజేషన్ ప్రక్రియ 65 శాతం పూర్తి అయ్యాయిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సర్వే, రెవెన్యూ, పంచాయితీ అధికారులు క్షేత్రస్థాయిలోని మండల, గ్రామ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సమన్వయం చేసుకొని రానున్న డిసెంబర్ 02 నాటికి వెక్టరైజేషన్ ప్రక్రియ తప్పనిసరిగా నూరు శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే, మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన ఈ స్వమిత్వ పథకం పనులపై తక్కువ ప్రగతి కనబరిచిన మండలాల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సర్వే పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జూమ్ కాన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కె.శ్రీరమణి, ఏడీ సర్వే కె.శ్రీనివాసరావు, అన్ని మండలాల తహశీల్దార్లు, మండల, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

### 22ఏ భూములు క్షేత్రస్థాయిలో పునఃసర్వే చేసి

# ఆక్రమణలను నిరోధించాలి - ఆర్డీఓ మాధవి



**అమలాపురం (మనసులోమాట) నవంబరు29:** గ్రామాలలోప్రతిపాదిత 22 ఏ భూముల పునఃసర్వే కార్యక్రమం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తూ ఆక్రమ ణలను నిరోధిస్తూ నిజమైన హక్కుదారులకు హక్కుల సంక్రమింప చేయడంజరుగు తోందని అమలాపురం ఆర్డిఓ కే మాధవి తెలిపారు. శనివారం అమలాపురం రూరల్ మండల పరిధిలోని ఎ వేమవరంలో రెవెన్యూ సర్వే విభాగాలు సంయుక్తంగా ప్రతిపాదిత 22 ఏ భూములను క్షేత్రస్థాయిలో పునః సర్వే నిర్వహించారు. ఈ యొక్క సర్వేను ఆర్డీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే బృందానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సర్వేలో వివిధ మండలాలు, గ్రామాలు కావలసిన జాగ్రత్తతో పరిశీలన చేసి, భూముల స్థితిగతులను ధ్రువీకరిస్తూ సమగ్ర నివేదికలు రూపొందించడం జరుగుతుందన్నారు. 22 ఏ జాబితాలో ఉన్న భూములపై నిషేధాలను తొలగించి, భూమి యజమానులకు పూర్తి హక్కు లు కల్పించేందుకు ఈ చర్యలు తీసుకోవడంతో పాటుగా అక్రమ దారులను గుర్తించి తగిన చర్యలు చేపడతామని ఆమె చెప్పారు . బృందాలను నియమించి, ప్రధానంగా గ్రామ సభలతో కలిసి గ్రామ స్థాయిలో భూముల పరిశీలన జరుపుతున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం, భూము ల రికార్డులను సరిగ్గా పరిశీలించి, పక్కా సర్వే చేయడం జరుగుతోంది. ఈ పునఃసర్వే విధానం ద్వారా పేదలకు, నిజమైన భూమి యజమానులకు మధ్య న్యాయం సాధించే మార్గాలను అన్వేషించడం జరుగుతుందన్నారు. భూముల సర్వేలో పోకడ, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ గ్రామ వర్గాల వ్యవస్థాపకులతో క్షుణ్ణంగా సమీక్షించి సమన్వయం చేస్తూ,సర్వేను పూర్తిచేయాలని రెవెన్యూ శాఖ స్పష్టం చేసిందన్నారు. ఈ చర్యలు పల్లెల అభివృద్ధికి, వ్యవసాయ శ్రామికుల సంక్షోభ నివారణకు దోహదం జరిగేందుకు దోహదపడతాయని ఆమె వెల్లడించారు. ఈ సర్వేలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కే ప్రభాకర్ డిప్యూటీ తాహసిల్దార్ దివాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాలలో రోటరీ ప్రాజెక్టులు

### ఏజెన్సీ ప్రాంతాలలో చెక్ డ్యాముల ఏర్పాటు... - భావితరాల పిల్లలను రక్షించడమే రోటరీ ఆశయం...

### గిరిజన గ్రామాలలో రోటరీ సేవలు... - డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి వెల్లడి




**కాకినాడ (మనసులో మాట )నవంబర్ 29..** అల్లూరి జిల్లా పాడేరులో 19 గ్రామాలందు రోటరీ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తున్నామని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై కళ్యాణ్ చక్రవర్తి శనివారం వెల్లడించారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశంలో ముఖ్య అతిథిగా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షత వహించారు. 19 గిరిజన గ్రామాలలో సుమారు 9 కోట్ల రూపాయల వ్యయంతో వాటర్, ఎడ్యుకేషన్ టాయిలెట్ నిర్మాణం వంటి ప్రాజెక్టులను రోటరీ క్లబ్బు ఆధ్వర్యంలోచేపడుతున్నామని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. మరో ఐదు కోట్ల రూపాయలు వ్యయంతో చెక్ డ్యాముల మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందన్నారు. అదే విధంగా అవసరమైన ప్రాంతాలలో చెక్ డ్యాముల నిర్మాణానికి కూడా కృషి చేయడం జరుగు తుందన్నారు. సి ఎస్ ఆర్ నిధులు ఎంపీ లార్డ్స్ సహకారంతో చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కూడా చేపట్టే విధంగా కార్యక్రమాలను రూపొందించు కోవాల్సిందిగా ఆయా ప్రాంతాలలో ఉన్న రోటరీ క్లబ్బుల కార్యవర్గానికి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి సూచన చేశారు. మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి పెట్టామని కృష్ణాజిల్లా నుండి శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్న మహిళలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించదల్చామని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ప్రకటించారు. ఇప్పటికే మూడు వేల మందికి పైగా మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని మరో రెండు వేల మందికి కూడా ఇవ్వడానికి ప్లాన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పాఠశాల స్థాయిలో ట్రాఫిక్ నిబంధనలు మాదకద్రవ్యాల ద్వారా కలిగే దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించదల్చామని, దీనిపై డీజీపీ మరియు ఆయా జిల్లాల ఎస్పీల దృష్టికి తీసుకువెళ్లి అనుమతులు కూడా తీసుకోవడం జరిగిందని కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. మారక ద్రవ్యాలు సైలెంట్ కిల్లర్స్ గా ఆయన ప్రస్తావిస్తూ రానున్న తరాన్ని కాపాడేందుకు ఈ విధమైన కార్యక్రమాలను రోటరీ క్లబ్ చేపడుతోందని ఆయన ప్రస్తావించారు. ఇటీవల అనకాపల్లి జిల్లా ప్రాంతంలో పోలియో మహమ్మారి లక్షణాలు గుర్తించడం జరిగిందని అయితే వాక్సినేషన్ ద్వారా ఆ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అన్ని జిల్లాలందు పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి గుర్తు చేశారు. వీటికి అవసరమైన నిధులను రోటరీ సభ్యులు తమ మిత్రుల ద్వారా విరాళాల రూపంలో అందజేయాల్సిందిగా కోరారు. పేపర్ వినియోగ రహితంపై రోటరీ డిస్ట్రిక్ట్ దృష్టి పెట్టిందని అందుకనే డిజిటల్ డైరెక్టరీని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. రోటరీ వంటి అద్భుతమైన సేవ ప్రపంచాన్ని తనకు పరిచయం చేసిన డాక్టర్ ఎస్ వి ఎస్ రావుకు ధన్యవాదాలు తెలుపుకుంటూ వారి నుండి రోటరీ సేవలు ఏ విధంగా నిర్వహించాలో నేటికీ నేర్చుకుంటున్నారని వినమ్రంగా ప్రకటించారు. రోటరీ డిస్ట్రిక్ట్ లో రోటరీ క్లబ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ అగ్రభాగాన ఉందని ప్రశంసిస్తూ రోటరీ ఫౌండేషన్ కు విరాళాలు అందించడమే కాక ప్రాజెక్టు రూపంలో తిరిగి ఆర్థిక సహకారాన్ని పొందేందుకు ( ఎా జ ా క ్ ్ట ల న ు రూపొందించుకోవాల్సిందిగా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సూచించారు .ప్రతి క్లబ్ కు 500 డాలర్లు వరకు మ్యాచింగ్ గ్రాంట్ రూపంలో సహాయం చేసేందుకు ప్రాజెక్టుల ప్రతిపాదనను రోటరీ డిస్ట్రిక్ట్ కు అందజేయాల్సిందిగా సూచన చేశామని నర్సీపట్నం రోటరీ క్లబ్ ముందుకు వచ్చిందని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. రోటరీ బ్లడ్ బ్యాంకును సందర్శించిన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి స్వయంగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో పాల్గొని రక్త దానం చేయడం క్లబ్ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా లిఖించదగ్గ విషయంగా పి డి జి డాక్టర్ ఎస్ వి ఎస్ రావు అన్నారు. డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి స్ఫూర్తితో అసిస్టెంట్ రోటరీ గవర్నర్ చామ్స్ బ్యూటీ క్లినిక్ అధినేత అప్ప సాని కృష్ణకుమారి ,రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కార్యదర్శి ట్రస్ట్ హాస్పిటల్ కిడ్నీ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రవీణ్ సానా, క్లబ్ కోశాధికారి ఆదిత్య హాస్పిటల్ అధినేత ఉదయ్ చక్రవర్తులు కూడా రక్తదానాన్ని చేశారు. వీరందరికీ రోటరీ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి నల్లమిల్లి మాచారెడ్డి అందజేసిన సర్టిఫికెట్లను పిడిజి ఎస్ వి ఎస్ రావు చేతుల మీదుగా బ్లడ్ డోనర్స్ కు అందించి ప్రత్యేకంగా అభినందించారు .గోల్డెన్ జూబ్లీ క్లబ్ సందర్శనకు విచ్చేసిన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని ఘనంగా సత్కరించి జ్ఞాపకం అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ కార్యదర్శి ఈశ్వరరావు తోపాటు క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత డాక్టర్ పరశు రామ్ ప్రార్థన గీతాన్ని ఆలపించారు.

# పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

### - డిసెంబరు 6 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం -

**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 29:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపునకు మొదట ఈ నెల 30 గడువుగా నిర్ణయించినప్పటికీ, విద్యాశాఖ దాన్ని పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖదికారి షేక్ సలీం భాషా తెలిపారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు రూ.50 అపరాధ రుసుముతో, 10 నుంచి 12 వరకు రూ.200 అపరాధ రుసుముతో, 13 నుంచి 15 వరకు రూ.500 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించవచ్చన్నారు.
హాల్ టికెట్‌లో పేరు లేదా ఇతర వివరాలు తప్పుగా నమోదైతే, వాటిని సవరించుకోవడానికి డిసెంబరు 16 నుంచి 20 వరకు అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా తెలిపారు.



# ప్రభుత్వ సామాన్య ప్రధాన ఆసుపత్రిలో

### మహిళలను వేధిస్తున్న కామాంధుడి పై చర్యలు తీసుకోవాలి

**కాకినాడ (మనసులో మాట(నవంబర్,29..** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డ్స్ గా అధిక శాతం మహిళలే పని చేస్తున్నారు. మహిళల స్థితిగతులు తెలుసుకొని వారిని ఎంపిక చేసుకొని ఫోన్ల ద్వారా కామ వాంఛన తీర్చాలని లైంగిక వేధింపులకు గురి చేస్తున్న ధర్మా పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ఉదయం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలు తెలుసు కునేందుకు అధ్యక్షులు తోకల ప్రసాద్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి సమస్యను అడిగి తెలుసుకోగా మహిళల సెక్యూరిటీ గాడ్స్ పై జరుగుతున్న వేధింపులు బయటపడ్డాయని, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డ్స్ గా అధిక శాతం మహిళలే పనిచేస్తున్నారని, పి.ఎఫ్ ఖాతాలు ఎకౌంట్లో పడేలా చేస్తామని ఆసుపత్రిలో డబ్బులు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇవ్వకపోతే విధుల నుండి నిలుపుదల చేస్తామని బెదిరింపులు చేస్తున్నారని, కామ వాంఛను కోరికలు తీర్చాలని ఫుల్లుగా మద్యం సేవించి నెల రోజులుగా ఫోన్లు ద్వారా మహిళలని బెదిరిస్తున్నాడని ,మహిళను లైంగిక వేధిస్తున్న ధర్మాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రసాద్ డిమాండ్ చేసారు . రక్షణ కాస్తున్న మహిళలకే రక్షణ కరువైందని పిఎఫ్ ఖాతాలో జమ చేస్తామని 500 రూపాయలు వసూలు చేశారని, ఖాతాలో జమ అయినందుకు 1000 రూపాయలు ఫోన్ చెయ్ చేయాలని బెదిరిస్తున్నారని, లేదంటే విధులకు నిలుపుదల చేస్తామని సిఐటియుగా వార్నింగ్ ఇస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. మహిళను వేధింపులు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ప్రసాదు హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రి సూపర్డెంట్ కి, కాంట్రాక్టర్ కి సెక్యూరిటీ గార్డ్ బంధువులు, యూనియన్ ఆధ్వర్యంలో ఫిర్యాదులు తెలియజేశామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కె.వి.రామయ్య, ప్రధాన కార్యదర్శి ఎన్ అనిల్ కుమార్, కాటూరి రాజు, ఏ లావా, కే లక్ష్మి, అప్పారావు, శ్రీవల్లి, తదితరులు పాల్గొన్నారు.

### దీపావళి మందు పేలి గాయపడిన బాధితునికి

# రూ.30 వేలు ఆర్థిక సహాయం

### - అందచేసిన రమణారావు



**అమలాపురం (మనసులో మాట) నవంబరు 29:** ఇటీవల దీపావళి బాణాసంచా పేలి గాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న అమలాపురం మున్సిపల్ పరిధిలో 9 వార్డుకు చెందిన కుంచే రమేష్ కుమారుడు రణదీప్ దాస్ ను శనివారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. బాధితుడు వైద్యం నిమిత్తం రమేష్ కు రూ.30 ఆర్థిక సహాయాన్ని రమణారావు అందచేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాయం అందించిన రమణారావు కు రమేష్ అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్,మాకే సిద్దు,గూటం సాయి,గంటి చిరంజీవి,కంచర్ల జాన్సన్,గంటా లక్ష్మీ ప్రసాద్,నేరేడుమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### అమలాపురం లో డిశంబరు13న

# మాలల ఆత్మీయ సమ్మేళనం

### రెండు లక్షల మంది హాజరవుతారని అంచనా



**అమలాపురం (మనసులోమాట) నవంబరు 29:** వచ్చే నెల 13 వ తేదీన మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా 22 మండలాల మాల సంఘాల ముఖ్య నాయకులు నాయకులు తెలిపారు. శనివారం అమలాపురంలో జరిగిన ఒక కార్యక్రమం లో వారు మాట్లాడుతూ అమలాపురం రూరల్ మండలం కామనగరువు హైవే రోడ్ లో నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలోని ప్రతి మండలం నుండి మాల సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాల సంఘాల ముఖ్య నాయకులు డిబి లోక్. జంగా బాబురావు. ఇసుక పట్ల రఘుబాబు. రేవు తిరుపతిరావు గొల్లపల్లి డేవిడ్ రాజు. కాశి వెంకట్రావు. అయితాబత్తుల రాజశేఖర్. గెడ్డం సురేష్ బాబు. పెయ్యిల పరశురాముడు. నెల్లి లక్ష్మీపతి బడుగు జేమ్స్ పాల్ బొంతు బాలరాజు. పెనుమాల చిట్టిబాబు. నాగరపు వెంకటేశ్వరరావు. దేవరపల్లి శాంతకుమార్. చింతా రామకృష్ణ. బొంతు మణిరాజ్ నక్క చంద్రశేఖర్. ఈతకోట నగేష్. నాగ బత్తుల కొండా. కప్పల శ్రీధర్. రొక్కల నాగేశ్వరరావు. ఉండ్రు బాబ్జి. నక్కా సంపత్. తదితరులు పాల్గొన్నారు.



## ముగ్గుల పోటీల ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన

**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 29..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో స్వరాజ్య అభ్యుదయ సేవా సమితి ఎస్.ఏ.ఎస్.ఎస్ సీసీ ప్రీవెన్షన్ యూనిట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల ద్వారా హెచ్.ఐ.వి ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జగ్గంపేట స్థానిక రావులమ్మ తల్లి బిర్యానీ హోటల్ ప్రక్క ఏరియాలో శాస్ కార్యాలయం నందు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు డైరెక్టర్ యళ్ళ పద్మలత, ప్రాజెక్ట్ మేనేజర్ వాసంశెట్టి రాజేష్ మాట్లాడుతూ ఈ ముగ్గుల పోటీల ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు,సుఖ వ్యాధులు మరియు చికిత్స గురించి ఏ.అర్.టి మందుల గురించి తెలియజేయడం జరిగిందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో శాస్ సీసీ ప్రీవెన్షన్ యూనిట్ ప్రాజెక్ట్ సిబ్బంది అయిన ఏం.ఈ.ఏ సత్యనారాయణ,ఏ.ఎన్.ఏం సత్యవతి, ఫీల్డ్ వర్కర్స్ అనిల్ కుమార్,మణికుమారి,సూర్య చక్రవేణి, దేవి, పీర్ ఎడ్యుకేటర్స్ మరియు ఇతర మహిళలు పాల్గొనడం జరిగింది. గెలిచిన అభ్యర్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ యళ్ల పద్మలత చేతుల మీదుగా అందించడం జరిగిందని తెలిపారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం




**కాకినాడ (మనసులో మాట), నవంబరు 29:** ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కాకినాడ పట్టణంలోని శనివారం శాసనసభ్యులు గారి కార్యాలయం నందు కొండబాబు ప్రజా దర్బార్ నిర్వహించారు. వికలాంగ పింఛన్లు, వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డులు, భూ సమస్యలు తదితర సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు తెలుగుదేశం పార్టీ ప్రతివారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రజలు ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు, భూ సమస్యలు వంటి పలు అంశాలపై వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందని, ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రజా దర్బార్‌కు సంబంధించిన దరఖాస్తులను వర్గీకరించి, వాటిని వెంటనే సంబంధిత శాఖల అధికారులకు అందజేయడం జరుగుతుందని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



**ముమ్మిడివరం(మనసులో మాట) నవంబరు 29:** ముమ్మిడివరం కొండాలమ్మ చింత సమీపంలో మోటార్ సైకిల్ పై వెళ్తున్న ఒక వ్యక్తిని శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొనడం తో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబందించిన ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

### విజయాన్ని ఒక అలవాటుగా మార్చుకుంటే

# జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలం..

**- కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్ముహన్ సగిలి**



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 29..** విద్యార్థి దశ నుంచి వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ విజయాన్ని ఒక అలవాటుగా మార్చుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. జిల్లా నుంచి మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులతో జిల్లా కలెక్టర్ కలసి అభినందనలు తెలిపారు.

ఈనెల 26 తేది న అమరావతిలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో కాకినాడ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 8 మంది విద్యార్థులు, గైడ్ ఉపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కలసి జిల్లా విద్యాశాఖాధికారి పి. రమేష్ తో కలిసి సమావేశం అయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాక్ అసెంబ్లీలో పాల్గొన్న ప్రతి విద్యార్థితోను మాట్లాడి వారు పొందిన అనుభూతిని తెలుసుకున్నారు. విజయవాడ, అమరావతిలో చూసిన ప్రదేశాలు, కలిసిన వ్యక్తులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మారుమూల గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మాకు మాక్ అసెంబ్లీలో తమ నియోజకవర్గాల నుంచి ప్రాతినిథ్యం వహించడం చాలా సంతోషం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇతర మంత్రులను స్వయంగా కలవడం, అసెంబ్లీలో ప్రజా ప్రతినిధులు వ్యవహరించే తీరు, ఒక బిల్లు సభలో ప్రవేశ పెట్టడం దగ్గర నుంచి గవర్నర్ ఆమోదం పొందే అంతవరకు ఉన్న ఆయా దశలను తెలుసుకోవడం మంచి అనుభూతిని ఇచ్చిందని విద్యార్థులు అయన కి తెలిపారు. రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేలలో తమకు అవకాశం రావడం తమకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నామని విద్యార్థులు తమ అభిప్రాయాన్ని జిల్లా కలెక్టర్ తో పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలకు నాణ్యమైన విద్య ఇతర నైపుణ్యాలు అందించడంతోపాటు సమాజం పట్ల అవగాహన కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధికప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో జిల్లా నుంచి 8 విద్యార్థులు పాల్గొనడం శుభ పరిణామని ఆయన తెలిపారు. విద్యార్థి దశ నుంచే వచ్చిన ప్రతి చిన్న చిన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటు విజయాన్ని ఒక అలవాటుగా మార్చుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు తమ చుట్టుపక్కల సమాజం, వ్యక్తులు, పరిసరాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మాక్ అసెంబ్లీలో కాకినాడ జిల్లా నుంచి ఎనిమిది మంది విద్యార్థులు చక్కటి ప్రదర్శన చేశారని విద్యార్థులను, గైడ్ టీచర్లను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు ఎస్. స్వాతి (స్పీకర్, ప్రత్తిపాడు నియోజకవర్గ, ఏపీ మోడల్ స్కూల్ శంకవరం), పి. సత్యవెంకట్ (తుని ఎమ్మెల్యే జడ్పిహెచ్ఎస్ (బెండపూడి), బి.మానస(పిఠాపురం ఎమ్మెల్యే, జడ్పిహెచ్ఎస్ నాగులపల్లి), ఐ.అవినాస్(కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, జడ్పిహెచ్ఎస్ (గొల్లప్రోలు)బీ జి.శివ రాజేష్ (పెద్దాపురం ఎమ్మెల్యే, జడ్పిహెచ్ఎస్( ఉండూరు), ఎం. జాహ్నవి(కాకినాడ) అర్బన్ ఎమ్మెల్యే మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ చర్చి (స్క్వేర్), బి.సత్య రామాంజనేయులు (జగ్గంపేట )ఎమ్మెల్యే, జడ్పిహెచ్ఎస్ తామరాడ. పి. శివ,(జడ్పిహెచ్ఎస్ చిత్రాడ) గైడ్ టీచర్ డీవీవీ.అశోక్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య లో అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్

**- క్రీడలు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయి**

**- పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి**



**కాకినాడ(మనసులో మాట), నవంబరు 29:** స్థానిక శాంతినగర్ శ్రీ చైతన్య ప్రైమరీ విభాగంలో శనివారం అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. పాఠశాలల ఏ.జీ.ఎం సురేష్ నిర్వహణలో పాఠశాలల ఆర్.ఐ గోపీనాథ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేలంగి హై స్కూల్ పి.డి, కాకినాడ జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కే. శ్రీనివాస్ లు స్పోర్ట్స్ మీట్లో పాల్గొని శాంతికేతనాన్ని ఎగురవేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలలో గెలుపు, ఓటములు సహజమని, క్రీడలతో మనకు మంచి ఆరోగ్యం లభిస్తుందని చదువుతో పాటుగా సంస్కృతి, సంప్రదాయాలు నేర్చుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి ఏకాగ్రత అకుంఠిత దీక్ష ఉండాలని ఆటల్లో గెలుపొందిన ప్రతిసారి గెలుపు విలువ తెలుస్తుందన్నారు. ఆటలు ఆడడం వల్ల మనోవికాసం కలుగుతుందని ఇవి విద్యాపరంగానూ, ఉద్యోగ పరంగాను క్రీడలు ఎంతో ప్రయోజనం కల్గుతుందని ఆయన సూచించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్స్ వల్ల శారీరక శ్రమను చేయలేకపోతున్నారని తద్వారా వారు అనుకున్న స్థానానికి వెళ్లలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం క్రీడలలో గెలుపొందిన చిన్నారులకు మెడల్స్ ప్రశంసా పత్రాలను అందజేశారు. తదుపరి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని జట్టుకృత్యం అలవడుతుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరంజరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాకినాడ -2 ప్రిన్సిపాల్ సుల్తానా కాకినాడ -7 ఐ.పీ.ఎల్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర జోనల్ ఇంచార్జ్ శేషశ్రీ ప్రైమరీ ఇంచార్జ్ విశ్వప్రియ, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శైలజ, పి. ఈ. టి భీమన్న స్వామి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# అక్రమ లేఅవుట్ లు...

# సక్రమం చేసుకుంటారా!

**- క్రమబద్ధీకరణ కు ప్రభుత్వం అవకాశం ఇచ్చినా పట్టించుకోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు**

**- అనధికార లే అవుట్ లలో ప్లాట్లు కొంటె భవిష్యత్తు లో ఇబ్బంది - పట్టించుకోని అధికారులు**






**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 29:** అక్రమ లే అవుట్ లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లు సంపాదిస్తుంటే నిబంధనలు తెలియకుండా వాటిని కొనుగోలు చేసే వాళ్ళకి మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. డా. బీ. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జిల్లాలో 216 జాతీయ రహదారిని ఆనుకుని పెద్ద ఎత్తున అక్రమ లే అవుట్ లు వెలుస్తున్నా అధికారులు నోరు మెదపడం లేదు. పంట బోదెలు, మురుగు కాలువలు, సైతం లే అవుట్ లలో కలిపేసి ప్లాట్లు గా విక్రయించడానికి సిద్ధం చేస్తున్నారు. ఇవేమి తెలియని వినియోగదారులు ఈ ప్లాట్లు ను కొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు, అక్రమ లే అవుట్ లు ఉన్నాయి. వీటిని క్రమబద్ధికరణ చేసుకోవాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు. కానీ కొత్తగా లే అవుట్ లు వేసే వాళ్ళని పర్మిషన్ తీసుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలి. నగర పంచాయతీ పరిధిలో పల్లిపాలెం లో అనుమతులు లేకుండా లే అవుట్ లో ఏ విధమైన అనుమతులు తీసుకోకుండా గ్రావెల్ తో కప్పేస్తున్నారు. అలానే ముమ్మిడివరం మండలం చెయ్యేరు గున్నేపల్లి గ్రామం లో సత్తెమ్మ ఆలయం సమీపంలో పల్లంకుర్రు ప్రధాన రహదారి చెంతనే లే అవుట్ వేస్తున్నా ఎవరూ కూడా పట్టించుకోవడం లేదు.

**ఎల్. ఆర్. ఎస్ కు 30 శాతం మాత్రమే దరఖాస్తులు :**

అమలాపురం అర్బన్ డెవోలప్మెంట్ (అముడా ) పరిధిలో గుర్తించిన అక్రమ లే అవుట్ లలో 30 శాతం ప్లాట్లు కు మాత్రమే క్రమబద్ధికరణకు దరఖాస్తులు వచ్చాయి. సుమారు 3 వేలకి పైగా ప్లాట్లు ఉంటే ఉంటే ఇప్పటివరకూ 615 దరఖాస్తులు వొచ్చాయని సమాచారం. వీటిలో 10 ప్లాట్లు కు నిబంధనలు అనుగుణంగా క్రమబద్ధీకరించారు.

**చోద్యం చూస్తున్న అధికారులు :**

అక్రమంగా వెలిచిన లే అవుట్ లలో స్థలాలు కొనుగోలు చేస్తే తీవ్ర ఇబ్బందులు పడతారనే విషయం పై ఎటువంటి అవగాహన కల్పించటం లేదు అధికారులు. నిబంధనలు ఏమి తెలియని వారు ప్లాట్లు కొనుగోలు చేసి భవిష్యత్తు లో ఇదే అధికారులచే ఇబ్బందులు పడతారు. కాబట్టి అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



### పేదల గృహ కలలు సాకారం దిశగా

## కూటమి ప్రభుత్వం కృషి

**- ఎమ్మెల్యే కొండబాబు వెల్లడి**

**కాకినాడ (మనసులో మాట), నవంబరు 29:** పేద ప్రజల సొంతింటి కలలు సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. శనివారం సాయంత్రం నగరంలోని సంజయ్ నగర్ శివారులో నిర్మాణంలో కొనసాగుతున్న టిడ్కో గృహ సముదాయాన్ని ఆయన నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా 950 గృహాల నిర్మాణ పురోగతిపై అధికారులు నుండి వివరాలు సేకరించిన ఎమ్మెల్యే, అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పేదల గృహాలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందని విమర్శించిన ఆయన, కూటమి ప్రభుత్వం మాత్రం పేదవారి సొంతింటి కలలు నిజం చేసే దిశగా కృషి చేస్తోందని స్పష్టం చేశారు. జనవరి నెలలో గృహాలను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు. ఈ సందర్శనలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, టిపిఆర్ఓ శైలజ, టిడ్కో అధికారులు ఎస్.ఇ. గంగరాజు, డి. సురేంద్ర, ఏఈ మోహన్, మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత రమేష్ పాల్గొన్నారు.

## పురమిత్ర యాప్‌తో సేవలు సులభం

**- ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి . సత్యనారాయణ**



**కాకినాడ (మనసులో మాట), నవంబరు 29:** కాకినాడ: స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన కాకినాడ నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి. వి. సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం బాహ్య పర్యటనలో భాగంగా రేచర్లపేట మెయిన్ రోడ్డు, వినాయక కేఫ్ రోడ్డుపరిధిలో పారిశుధ్య పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడిన ఆయన, పారిశుధ్యంపై అవగాహనతో పాటు పురమిత్ర యాప్ ఉపయోగంపై సూచనలు అందించారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా కోరారు. “పారిశుధ్యం, మంచినీటి సమస్యలు, విద్యుత్ సమస్యలు వంటి ఏవైనా పౌర ఇబ్బందులను పురమిత్ర యాప్ ద్వారా అధికారులు వెంటనే తెలుసుకొని త్వరితగతిన పరిష్కరిస్తారు” అని ఇన్చార్జి కమిషనర్ తెలిపారు. రైతు బజార్ ప్రాంతంలో పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన ఇన్చార్జి కమిషనర్, రైతులతో మాట్లాడి మిగిలిపోయిన కూరగాయ వ్యర్థాలను డస్ట్‌బిన్‌లలో వేయాలని సూచించారు. అక్కడ పార్కింగ్ సమస్యలు అధికంగా ఉండటంపై కూడా స్పందించిన ఆయన, సరైన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్, శానిటేషన్ సూపర్వైజర్ సత్తప్ప నాయుడు,శానిటరీ ఇన్స్పెక్టర్లుసుదర్శన్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి సహాయనిధి


## చెక్కుల పంపిణీ

**- చెక్కులు పంపిణీ చేసిన డాక్టర్ చదలవాడ ఆదిత్య**

**- నియోజకవర్గంలో 623 మంది లబ్ధిదారులకు రూ.6.13 కోట్ల నిధులు పంపిణీ**



**పల్నాడు నవంబర్ 29,(మనసులో మాట):** నరసరావుపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద శనివారం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 16 మంది లబ్ధిదారులకు మొత్తం 9,84,940 రూపాయల విలువైన చెక్కులు పంపిణీ చేయబడ్డాయి. డాక్టర్ చదలవాడ ఆదిత్య మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిధుల పంపిణీలో అత్యధిక సంఖ్య పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధుల ద్వారా అవసరమైనవారికి సహాయం అందించడం ద్వారా ప్రజల సంక్షేమానికి కృషి చేయడమే లక్ష్యమని అన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 623 మంది లబ్ధిదారులకు రూ.6.13 కోట్ల నిధులు పంపిణీ చేశారని తెలిపారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం ద్వారా నరసరావుపేట, సంతగూడిపాడు, ములకలూరు, ఎండుగుంపాలెం, గోగులపాడు, కొత్తపల్లి, కర్లకుంట, పెద్దరెడ్డిపాలెం, పలపాడు, కంభంపాలెం వంటి ప్రాంతాల్లోని లబ్ధిదారులకు సహాయం అందింది. ముఖ్యమంత్రి సహాయనిధి కింద పంపిణీ చేసిన చెక్కులు వైద్య చికిత్స, ఇతర అత్యవసర అవసరాల కోసం ఉపయోగించబడతాయి. ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని అనేక మంది పౌరులకు వైద్య సహాయం అందే అవకాశం కల్పించబడింది.



## అమలాపురంలో ట్రాఫిక్ నియంత్రణ కు మరో అయిదు వంతెనలు అవసరం

# సహకరించండి

### ఆర్ అండ్ బి మంత్రి ని కోరిన ఎమ్మెల్యే ఆనందరావు

**అమలాపురం (మనసులోమాట) నవంబరు 29:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్య కేంద్రమైన అమలాపురంలో నిత్యం ట్రాఫిక్ రద్దీతో ప్రజలు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ను నియంత్రించాలంటే ప్రధానంగా ఐదు వంతెనలు నిర్మించవలసి ఉందని దీనికి మీ సహకారం అందిస్తే నిర్మాణం జరుగుతుందని అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు ఆర్ అండ్ బి మంత్రి బీసీ జనార్ధన రెడ్డిని కోరారు. శనివారం అమరావతి ఏపి సెక్రటేట్ లో ఎమ్మెల్యే ఆనందరావు మంత్రి ని కలిసి అమలాపురం పట్టణం ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటోందని. దాని నియంత్రణకు చర్యలు తీసుకోవడం జరిగిందని అందులో భాగంగా రెండు వంతెనల నిర్మాణం చేపట్టానని మరో 5 వంతె నలకు వచ్చే వేసవి లో శంకుస్థాపన చేయనున్నట్లు ఆర్ అండ్ బి మంత్రి జనార్దన్ రెడ్డి కి ఎమ్మెల్యే ఆనందరావు వివరించారు. దీనిలో భాగంగా రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసానని ఎమ్మెల్యే ఆనందరావు చెప్పగా మంత్రి మాట్లాడుతూ తన పరిధిలో అవకాశం ఉన్నంత వరకు నిధులు మంజూరు చేస్తానని మంత్రి జనార్దన్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. అనంతరం నియోజక వర్గంలో పలు రోడ్ల నిర్మాణంకోసం మంత్రికి ఎమ్మెల్యే వినతిపత్రం సమర్పించారు.

# పాము హల్ చల్

### 60 సం. ల వయసు గల నల్ల త్రాచు పాము



**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 29..** ముమ్మిడివరం మండలం మహిపాల చెరువు లో పాము హల్ చల్ చేసి చుట్టు ప్రక్కల వాళ్ళని భయభ్రాంతులకు గురి చేసింది. బొక్కా చంద్రరావు అనే వ్యక్తి ఇంట్లో శనివారం నల్ల తాచుపాము ప్రవేశించింది. దీంతో ఇంట్లోని వ్యక్తులు ఆందోళన కి గురయ్యారు. వెంటనే అప్రమత్తమై స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం అందించడం తో గణేష్ వర్మ వెంటనే అక్కడికి చేరుకొని పామును చాకచక్యంగా బంధించారు. అనంతరం వర్మ మాట్లాడుతూ పాముకు సుమారు 60 సంవత్సరాల వయసు ఉంటుందని ఈ పామును నిర్మానుష్య ప్రాంతంలో వదిలిపెడతానని తెలిపారు. ఎవరికైనా పాములు కనిపిస్తే తనకు సమాచారం అందిస్తే నేను వాటిని పట్టుకొని సురక్షిత ప్రాంతాల్లో విడిచిపెడతానని పేర్కొన్నారు

## కాజులూరు డిప్యూటీ ఎంపీడీవోగా ముద్రగడ

### గ్రామాభివృద్ధి లక్ష్యాలకు కొత్త ఉత్సాహం



**కాజులూరు (మనసులో మాట) నవంబర్ 29..** కాజులూరు మండలం డిప్యూటీ ఎంపీడీవోగా ముద్రగడ సత్యనారాయణ మూర్తి బాధ్యతలు స్వీకరించనన్నారు. శనివారం మీడియాకు అందిన సమాచారం ప్రకారం, గ్రామాభివృద్ధిని వేగవంతం చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల సీనియర్ పంచాయతీ కార్యదర్శులను డిప్యూటీ ఎంపీడీవో లుగా పదోన్నతి కల్పించింది. ఈ క్రమంలో కే గంగవరం మండలం కూళ్ల పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న ముద్రగడ సత్యనారాయణమూర్తిని పదోన్నతి కల్పించి కాజులూరు డిప్యూటీ ఎంపీడీవో గా నియమించింది. సత్యనారాయణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరిస్తారు.

# డిసెంబరు 5 న మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్ కు ఘనంగా ఏర్పాట్లు

### - మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29:** తూర్పు గోదావరి జిల్లాలో డిసెంబరు 5న విద్యా శాఖ ఆధ్వర్యంలో 956 పాఠశాలల్లో (ప్రాథమిక %-%711, ప్రాథమికోన్నత %-%59, ఉన్నత పాఠశాలలు%-%186) "మెగా పేరెంట్%-%టీచర్ మీటింగ్" నిర్వహిస్తున్నట్లు, అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని జిల్లా మంత్రి, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో కలిసి విలేఖరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం కార్యక్రమంలో జిల్లా మొత్తం 93,399 మంది విద్యార్థులు, 2 లక్షల మందికి పైగా తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం" ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ సభ్యులను ఒక వేదిక పైకి తీసుకువచ్చి, పాఠశాల%-% సమాజ అనుసంధానాన్ని మరింత బలపరిచేలా కార్యక్రమాలు రూపొందించడం జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో విశాఖపట్నంలో మెగా పేరెంట్%-%టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే సమయంలో తూర్పు గోదావరి జిల్లాలో కూడా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, విద్యార్థుల వ్యక్తిగత వికాసం, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంపు లక్ష్యంగా ఉందని మంత్రి చెప్పారు. తూర్పు గోదావరిలో డిసెంబరు 5న జరగబోయే మెగా పేరెంట్%-%టీచర్ మీటింగ్ ను ప్రతి పాఠశాలకు చెందిన తల్లిదండ్రులు, విద్యార్థులు విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. కార్పొరేట్ స్కూల్‌లకు పరిమితమైన పేరెంట్%-%టీచర్ సమావేశాన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ అందుబాటులో ఉంచడం, విద్యార్థుల వ్యక్తిగత వికాసం, పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంపు వంటి లక్ష్యాలను సాధించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 93,300 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నట్లు మంత్రి తెలిపారు. పాఠశాలల మౌలిక సదుపాయాలు, బోధన నాణ్యతపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు, సూచనలు ప్రభుత్వానికి తెలియ జేయడానికి ఈ కార్యక్రమం ఉత్తమ వేదికగా ఉపయోగ పడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ మెగా పేరెంట్%-%టీచర్ మీటింగ్ ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, పాఠశాలల విద్యా ప్రమాణాల పెంపు, తల్లిదండ్రుల భాగస్వామ్యం మరింత విస్తరించడం సాధ్యమన్నారు. ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, ప్రాజెక్టుల ప్రదర్శనలు, ప్రత్యేక ఆహార కార్యక్రమాలు విద్యార్థుల అభ్యసనాన్ని బలపరిస్తాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాల ఈ కార్యక్రమాన్ని అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ, తరగతి ఉపాధ్యాయులతో వ్యక్తిగత అంచనా చర్చలు, విద్యార్థుల క్రీడా కిట్లు, జాదూ పిటారా కిట్లు, సైన్స్ ప్రాజెక్టులు, ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు, పూర్వ విద్యార్థులు ప్రతిభావంతమైన పాల్గొనవలసిందిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, ఎమ్మెల్సీ రాజశేఖర్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ డీఈని తక్షణం రీకాల్ చేయండి

### మున్సిపల్ డీఈపై కౌన్సిలర్‌లు - వాడిగా వేడిగా కౌన్సిల్ సమావేశం





**రామచంద్రపురం(మనసులో మాట) నవంబరు 29..** పట్టణ అభివృద్ధికి ఏమాత్రం సహకరింగే కుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ డీఈ శ్రీకాంత్‌ని వెంటనే రీకాల్ చేయాలని కౌన్సిల్ సభ్యులు చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమీషనర్ కేవీవీఆర్‌కే రాజులను డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన శనివారం జరిగింది. తొలుత అజెండాలోని 16 అంశాలను సభ్యుల ఆమోదం కొరకు చదివి విపించారు. వాటిని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వెల్ల వాటర్ ప్రాజెక్టుకు సంబందించి మోటారు రిపేర్ల కొరకు రూ. 3లక్షలు వినియోగంపై పెట్టిన 12వ అంశానికి వైస్ ఛైర్మన్ కోలమూరి శివాజీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ తొలుత చైర్ పర్సన్ వెల్లి వాటర్ ప్రాజెక్టు వద్ద ఏవేవి రిపేర్లు వచ్చాయో పరిశీలించాలని కోరారు. 14వ అంశంగా సుప్రింకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని కుక్కలు తిరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులకు కమీషనర్ కేవీఆర్ఆర్‌కు రాజు సభుయలకు వివరించారు. కుక్కలకు ప్రత్యేక షెల్టర్‌ను ఏర్పాటు చేయటం, వాక్సినేషన్, వంటివాటిని వివరించారు. దీని కోసం డంపింగ్ యార్డు వద్ద ఒక ప్రత్యేక స్థలంలో గతంలో కట్టిన భవనాన్ని వినియోగించే నిమిత్తం అనుమతిని కౌన్సిల్ సభ్యులను కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పెంటపాటి శ్రీదేవి మాట్లాడుతూ పట్టణంలో ప్రతీవార్డులోను వంద నుంచి 150వ వరకు కుక్కలున్నాయని, వాటిని తక్షణ తరలించాలని కోరారు. కుక్కల తిరగకుండా సుప్రిం కోర్టుమార్గదర్శకాలను పాటిస్తు వెంటనే చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. అజెండా పూర్తి అయిన తరువాత సభ్యులంతా లేని తాను మున్సిపల్ డీఈ మూలంగా వార్డుల్లో అభివృద్ధి పనులు కుంటిపడి తీవ్రమైన వ్యతిరేకతను చూడాల్సి వస్తుందని, వెంటనే డీఈని రీకాల్ చేయాలని ముక్తకంఠంతో విన్నవించారు. కాంట్రాక్టర్‌లను వేధిస్తున్నారని, తోటి ఉద్యోగులపైన వివక్షత చూపిస్తూ ఎటువంటి పనులు జరగకుండా అడ్డుకట్ట వేస్తున్నారని ఆరోపించారు. కౌన్సిలర్స్ అనే గౌరవం కూడా లేకుండా డీఈ వ్యవహరిస్తున్నారని కౌన్సిల్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈ వ్యవహార శైలి మూలంగా ప్రజల్లో చులకనగా మారుతున్నామని, మేము కావాలో. డీఈ శ్రీకాంత్ కావాలో మీరే తేల్చుకోవాలంటూ కమీషనర్‌కు, చైర్ పర్సన్ కౌన్సిలర్‌లు అల్టిమేటం జారీ చేశారు. మున్సిపల్ కౌన్సిల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పార్టీలకు అతీతంగా వైఎస్ఆర్ సీపీ, టీడీపీ, జనసేన సభ్యులందరూ కలిసి డీఈపైన ఫిర్యాదు చేయటం ఇదే మొదటి సారి అని అయితే అయన కింది స్థాయి సిబ్బందిపై పెట్టే వేధింపులు సభలో చర్చించటం అవమానకంగా ఉంటుందని జనసేన కౌన్సిలర్ అంకం శ్రీనివాసు దుయ్యబట్టారు. మున్సిపల్ విప్ వాద్రేవు సాంబప్రసాద్ మాట్లాడుతూ డీఈ శ్రీకాంత్ ఎన్నిసార్లు చెప్పినా తన వైఖరి మార్చుకోవటం లేదని, ఈయన గతంతో పనిచేసిన చోట కూడా ఇదే విధంగా వ్యవహరిస్తే ఆయనను రీకాల్‌చేశారని గుర్తు చేశారు. కార్యాలయంలో కాంట్రాక్టర్లు, కౌన్సిలర్‌లు, ఉద్యోగులు కేవలం డీఈ మూలంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతన్నార,ఇ తక్షణమే ఆయనను సెలవుమీద పంపించాలని ముక్త ఖంఠంతో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ రాజు, చైర్ పర్సన్ శ్రీదేవిలు డీఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా ఆయన పొంతన లేని సమాధానం చెప్పటంతో సంతృప్తి చెందని కౌన్సిలర్‌లు ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం చైర్ పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ సమన్వకమిటీని వేసి సమస్యను పరిష్కరించాలని కమీషనర్ రాజును ఆదేశించారు. వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు అధికారులు పాల్గొన్నారు.

### రైతులు సేంద్రియ వ్యవసాయం కోసం

# అవగాహన పెంచుకోవాలి



**గండేపల్లి. మనసులో మాట నవంబర్ 29..** గండేపల్లి మండలం మల్లేపల్లిలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్ రావు సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని, అన్నదాతలు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావుపిలుపునిచ్చారు.రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే రెండు విడతల అన్నదాత సుఖీభవ నిధులు పీఎం కిసాన్ నిధులతో కలిపి కర్షకుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. శనివారం గండేపల్లి మండలం మల్లేపల్లిలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి రైతన్నా మీకోసం కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం అన్నదాతలకు అందిస్తున్న పెట్టుబడి సాయంతో పాటు వివిధ పథకాల గురించి వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు అండగా నిలిచేందుకు రైతన్నా మీకోసం పేరుతో ప్రభుత్వం చైతన్యవంతమైన కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్,ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచ సూత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ - పి. యం. కిసాన్ పథకం కింద రెండు విడతల్లో ఒక్కొక్కరికి రూ. 14 వేల వంతున అందజేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.13,500 మాత్రమే ఇచ్చి మాటతప్పిందన్నారు.అందరూ వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. మహిళా రైతులకు 35శాతం సబ్సిడీ తో పాటు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయం మీద దృష్టి పెట్టాలన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి రైతులకు అన్నివిధాలా ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. డ్రోన్లు తదితర ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహనతో ముందుకు వెళ్లాలని సూచించారు. పురుగుమందులు, ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. క్యాన్సర్, దీర్ఘకాలిక రోగాలు పెరగడానికి కారణం రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగమేనని తెలిపారు. రైతులంతా ప్రకృతి సేద్యంపై దృష్టి పెడితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలో రైతు బాంధవుడు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో రైతుల అభివృద్ధి కొరకు నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలగ రెడ్డి భద్రరావు, తెలగ రెడ్డి ప్రకాష్, జనసేన జిల్లా కార్యదర్శి రామకుర్తి నరసింహ, గ్రంధి నాగబాబు, కోటేశ్వరరావు, చింతపల్లి భద్రరావు, నూకరాజు, దుర్గయ్య వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## బాలోత్సవంలో బొబ్బిల్లంక విద్యార్థుల ప్రతిభ

### గోదావరి బాలోత్సవంలో బొబ్బిలంక విద్యార్థులకు అభినందనల వెల్లువ..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 30:** స్థానిక ఎస్ కేవీటీ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రారంభమైన 'మూడవ గోదావరి బాలోత్సవం'లో బొబ్బిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జానపద నృత్యం, విచిత్ర వేషధారణ పోటీలలో పాల్గొని ప్రతిభ కనపరిచారు. ఉత్సవానికి హాజరైన ప్రముఖుల మన్ననలను పొందారు. పాఠశాల ఉపాధ్యాయిని రేష్మ ఆధ్వర్యంలో విద్యార్థులు చక్కటి ప్రతిభను కనపరిచారు, వారిని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి, తిరుమల సంస్థల అధినేత తిరుమల రావు తదితరులు అభినందించారు.

### శ్రీ మందేశ్వర శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వాహణాధికారి

# జె. సత్యనారాయణకు ఘన వీడ్కోలు

### నూతన బాధ్యతలు స్వీకరించిన రాపాక శ్రీనివాస్




**కాకినాడ మ(నసులో మాట) నవంబర్ 29..** కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలో ఉన్న శ్రీ మందేశ్వర శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానాల కార్యనిర్వాహణాధికారి జె. సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జె. సత్యనారాయణ గత ఆరు సంవత్సరాలుగా ఈ ఆలయాలకు కార్యనిర్వాహణాధికారిగా పనిచేశారు. ఈ కాలంలో ఆలయ అభివృద్ధి పనులు, ధార్మిక కార్యక్రమాల విస్తరణ, నిర్వహణ వ్యవస్థ సమర్థత పెంపు వంటి అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారని అధికారులు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ నిర్వహణను చక్కదిద్దడంలో ఆయన చూపిన కర్తవ్య నిబద్ధతను అందరూ ప్రశంసించారు.

**కొత్త ఈఓగా రాపాక శ్రీనివాస్ బాధ్యతలు**

ప్రస్తుతం సర్పవరం శ్రీ భావనారాయణ స్వామి దేవాలయం ఇంచార్జి కార్యనిర్వాహణాధికారిగా పనిచేస్తున్న రాపాక శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతగా ఇంద్రపాలెం శ్రీ మందేశ్వర శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయాల ఈఓగా నియామకం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. భక్తులకు ఉత్తమ సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తామని తెలిపారు. పదవీ విరమణ సందర్భంగా జె. సత్యనారాయణకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువా, బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు మాట్లాడారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సత్యనారాయణ సేవలు మరువలేనివి. ఆలయ అభివృద్ధి శుభ్రీకరణ పనులు, భక్తులకు అనుకూల వాతావరణం కల్పించడం వంటి విషయాల్లో ఆయన చేసిన కృషి విశేషం అని పేర్కొన్నారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ సేవ చేయడం నా భాగ్యంగా భావిస్తున్నానన్నారు. ఈ ఆరు సంవత్సరాలు ఎంతో సంతృప్తికరంగా గడిచాయనీ, సహకరించిన అధికారులు, సిబ్బంది, భక్తులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోలు కె నాగేశ్వరరావు, ఎన్ఎన్ వీరభద్రరావు, ఆర్ రాజేశ్వరరావు, వి ఫణీంద్ర కుమార్, సోమరాజు, శివ బాబు, వేణు, లక్ష్మణ్, శ్రీనివాస్ , దేవాదాయ సిబ్బంది సిహెచ్ రాజు, ఎస్ రాజ్ కుమార్, కళ్యాణ్, లక్ష్మణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

### పురపాలక శాఖ మంత్రిని కోరిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



**పల్నాడు, నవంబర్ 29, (మనసులో మాట ):** నరసరావుపేట మున్సిపాలిటీలో బీపీఎస్-ఎల్ఆర్ఎస్ పథకం కింద అనేక కీలక అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల మంజూరు చేయాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చడలవాడ అరవింద బాబు పురపాలక శాఖ మంత్రి పి. నారాయణను కోరారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా విస్తరణతో పాటు ఇతర ప్రజా సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన కొత్త పనులను ప్రతిపాదించారు. ఈ పనుల జాబితా, అంచనాలతో కలిసి మున్సిపల్ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలను అందజేశారు. ఈ ప్రతిపాదించిన పనులు ముఖ్యంగా పేదవర్గాల నివాస ప్రాంతాలు, వనరులు తక్కువగా ఉన్న కాలనీలు,ఇప్పటివరకు అభివృద్ధి పనులు చేయని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అందుబాటును మెరుగుపరచడానికి ఉద్దేశించబడ్డాయి. ఈ పనుల అమలు ద్వారా ఆ ప్రాంతాల్లో ఉన్న ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నేపథ్యంలో బీపీఎస్ఎల్ఆర్ఎస్ పథకం కింద ప్రతిపాదించిన కొత్త అభివృద్ధి పనులకు వెంటనే పరిపాలనాత్మక అనుమతి (అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్) జారీ చేయాలని అవసరమైన నిధులను విడుదల చేయాలని మంత్రిని ఎమ్మెల్యే ఎమ్మెల్యే కోరారు. ఈ పనులకు అనుమతి నిధుల విడుదల అయితే, నరసరావుపేట పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి సాధ్యమవుతుందని, పట్టణం రూపురేఖలు మారేలా అవకాశం ఉందని ఎమ్మెల్యే వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి నారాయణ తప్పకుండా నరసరావుపేట మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.



## చెప్పులు బయటపెడితేనే... ఆస్పత్రి లోనికి ఎంట్రీ..

### తాళ్లరేవు సామాజిక ఆస్పత్రిలో కొత్త నిబంధన రోగులు అభ్యంతరం

**తాళ్లరేవు (మనసులో మాట), నవంబరు 29:** స్థానిక సామాజిక ఆస్పత్రిలో రోజుకొక నిబంధన పెడుతుండటంతో రోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులెవరైనా సరే వారి చెప్పులను బయట విడిచిరావాలని ఆస్పత్రి సూపరెంటెండెంట్ కొత్తగా నిబంధన విధించారు. అంతటితో ఆగకుండా చెప్పులను బయట పెట్టేవిధంగా చెప్పుల స్టాండ్ ను కూడా ఏర్పాటు చేసారు. పొరపాటున ఎవరైనా చెప్పులతో లోపలికి వెళితే మళ్ళీ వారిని వెనక్కి తిరిగి పంపించి చెప్పులు బయటపెట్టి రావలసిందిగా చెప్పడంతో రోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రికి అనేక వ్యాధులతోనూ, గాయాలతోనూ అనేక మంది వస్తుంటారని చెప్పులు లేకుండా ఎలా లోపలికి వెళతామని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా లోపలికి వెళ్లివచ్చేలోపు చెప్పులను ఎవరైన దొంగిలిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్ణయంపై స్థానిక నాయకులు, ప్రజలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రికి 90శాతానికిపైగా నిరుపేదలే వస్తారని, వారికి రోజుకొక నిబంధన పెట్టడం దారుణమన్నారు. ఆస్పత్రిలో సరైన వైద్యం అందించాలి తప్ప ఇటువంటి నిబంధనలు ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రి థియేటర్లోకిగాని, మెటర్నిటీ వార్డులలో ప్రవేశానికి ఈ నిబంధన పెడితే బావుంటుందని, అంతేగాని ఓపిలోకి, క్యాజువ్యాలిటీలోకి కూడా చెప్పులు వేసుకురాకూడదని నిబంధన పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. రోగులకు నిబంధనలు పెట్టి వైద్యులు, సిబ్బంది మాత్రం చెప్పులతో తిరగడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. నిబంధనలు కేవలం సామాన్య ప్రజలకేగాని వారికి వర్తించవా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులను కూడా సంప్రదించకుండా సూపరెంటెండెంట్ అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తాళ్ళరేవు డిప్యూటీ ఎంపీడీవోగా రమణ



**తాళ్లరేవు (మనసులో మాట), నవంబర్ 29:** తాళ్ళరేవు మండలం డిప్యూటీ ఎంపీడీవోగా వీ జే వి రమణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. శనివారం మీడియాకు అందిన సమాచారం ప్రకారం, గ్రామాభివృద్ధిని వేగవంతం చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల సీనియర్ పంచాయతీ కార్యదర్శులను డిప్యూటీ ఎంపీడీవో లుగా పదోన్నతి కల్పించింది. ఈ క్రమంలో తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న వి జె వి రమణకు పదోన్నతి కల్పించి తాళ్ళరేవు డిప్యూటీ ఎంపీడీవోగా నియమించింది. రమణకు పదోన్నతి రావడం పట్ల ఎంపీపీ రాయుడు సునీత గంగాధర్, ఎంపీడీవో లక్ష్మణరావు కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

## రెండవ రోజు ఘనంగా దత్తసప్తాహ మహోత్సవాలు



**పిఠాపురం (మనసులో మాట) నవంబరు 29:** పిఠాపురం పట్టణంలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానం నందు దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం శ్రీపాద శ్రీ వల్లభ స్వామి వారి పాదుకులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు.

**పాదగయ క్షేత్రంలో స్వయంభు దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు**

పాదగయ్య క్షేత్రంలో గల స్వయంభు దత్తాత్రేయ స్వామి వారికి దత్త సప్తహ మహోత్సవాల్లో భాగంగా రుద్రాభిషేకాలు నిర్వహించారు అనంతరం గులాబీ అర్చన చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకున్నారు.

### కాకినాడ పోలీసుల ఆధ్వర్యంలో వివిధ కేసులలో

# 350 గ్రాములు బంగారం..

- 12 కిలోల 400 గ్రాములు వెండి ఆభరణాలు స్వాధీనం
- ఆరు కేసుల్లో 12 మంది ముద్దాయిలు అరెస్టు
- వెండి ధర 59 లక్షల అరవై వేలు చోరీ సొత్తు స్వాధీనం
- 40 లక్షలు విలువైన బంగారం స్వాధీనం
- 1960 వేల విలువైన వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 29..** కాకినాడ జిల్లా పోలీసు శాఖ వివిధ కేసులలో సుమారు 350 గ్రాముల బంగారం, 12 కిలోల 400 గ్రాముల వెండి ఆభరణాలు మొత్తంగా రూ. 59,60000రూపాయలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని మొత్తం 6 కేసులలో 12 మంది ముద్దాయిలను అరెస్ట్ చేయడం జరిగినదని, ఇందులో బంగారం రూ 40 లక్షలు, వెండి రూ 19,60,000 విలువ గలవని కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ శనివారం వెల్లడించారు . ఈ చోరీ కేసులకు సంబంధించిన పూర్వపరాలు ఎలా ఉన్నాయి. అన్నవరం ఇంటి దొంగతనం కేసు నమోద్దైంది. దీనిలో 172 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసున్నామని చెప్పారు. ఒక ముద్దాయి సిహెచ్ ఎల్లాజీ (పాత ముద్దాయి) అరెస్ట్ చేశామనిఆయన తెలిపారు. ఇతనిపై గతంలో 20 బైక్ దొంగతనాలు, రెండు హెచ్ పి కేసులు కలవు. ప్రత్తిపాడు గోల్డ్ షాప్ చోరీ కేసు మొత్తం 11 కేజీల వెండి ఆభరణాలు దొంగతనం. నిందితులు 11 మంది (7 మంది కార్ గ్యాంగ్ ం 4 మంది (లోకల్ గ్యాంగ్) వీరిలో 9 మంది నిందితులను అరెస్ట్, ఇద్దరు కార్ గ్యాంగ్ సభ్యులు పరారీలో ఉన్నారు. వీరిపై కావలి, నల్లజర్ల పీ.ఎస్ లలో కూడా కేసులు ఉన్నాయి.జగ్గంపేట తుని విజయవాడ పరిధిలో జరిగిన బ్యాగ్ లిఫ్టింగ్ కేసులు నమోదు కాగా జగ్గంపేట పోలీసులు మొత్తం 176 గ్రాముల బంగారు ఆభరణాలు (విలువ సుమారు రూ. 20 లక్షలు) స్వాధీనం చేశారు. కేసులు నమోదయి ఉన్నాయని చెప్పారు.

(ఏ ) జగ్గంపేట పోలీస్ స్టేషన్ లో బాధితురాలు రమాదేవి అన్నవరం నుంచి జె వి ఆర్ వరకు ప్రయాణంలో బ్యాగ్ లోని హారం ం 2 నెక్లెస్‌లు వెరసి 95 గ్రాములు చోరీ కేసు

(బి ) జగ్గంపేటబాధితురాలు: ఆర్ . కుమారి ఆర్ టీ సి కాంప్లెక్స్ వద్ద జత ముత్యాలు, జత చెవిదిద్దులు, రింగ్ మొత్తం 11 గ్రాములు చోరీ.

( సి ) ఎన్టీఆర్ జిల్లా గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని లెనిన్ సెంటర్ బస్ స్టాప్ వద్ద జరిగిన చోరీ 55 గ్రాములు బంగారం మాయం.

(డి (తుని పట్టణం లో గొల్ల అప్పారావు సెంటర్ వద్ద జరిగిన ఘటన జరిగింది. ఈ చోరీ కేసుల 15 గ్రాములు చోరీ జరిగింది.

అంతర్‌జిల్లా మహిళా దొంగల గ్యాంగ్ అరెస్ట్ నవంబర్ 28వ తేదీన పెద్దాపురం ఎస్డిపిఓ శ్రీహరి రాజు ఆధ్వర్యంలో, జగ్గంపేట సీఐ వై ఆర్ కే , ఎస్ ఐ లు టీ రఘునాథరావు, జి . సతీష్ తదితరుల బృందం అరెస్టు చేసిన వారిలో గేరక వరలక్ష్మి, యాగరిపల్లి కాల్వగట్టు, తాడేపల్లిగూడెం గతంలో 6 కేసులు కలవు సఖినేటిపల్లిలో రెండు నూజివీడులో రెండు , ఏలూరు మూడు టౌన్ లోఒకటి తల్లపూడిఒకటి రెండవ నిందితురాలు మరసాని సత్యవేణి ఏ ఎర్ర సాని సత్యవేణి వద్ద నుండి స్వాధీనం జగ్గంపేట, తుని, గవర్నర్‌పేట తదితర 4 కేసులకు సంబంధించిన మొత్తం 176 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం. అభినందనలు తెలిపారు. ఈ కేసుల విజయవంతమైన విచారణ, నిందితుల అరెస్టులో ప్రత్యేక పాత్ర పోషించిన జగ్గంపేట సి ఐ వై ఆర్ కే శ్రీనివాస్ రావు తోపాటు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, కిర్లంపూడి ఎస్సై జి . సతీష్, పోలీస్ కానిస్టేబుల్ జై రామ్, జగ్గంపేట, కిర్లంపూడి పోలీసుల బృందాన్ని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ అభినందించారు. మీరు చెబితే ఈ నోట్‌ను పత్రికా శీర్షిక, బుల్లెట్ పాయింట్లు, సోషల్ మీడియా కోసం చిన్న వర్షన్, లేదా ఇంగ్లీష్ ప్రెస్ నోట్ రూపంలో కూడా సిద్ధం చేసి ఇస్తాను. ప్రత్తిపాడు జువెలరీ షాప్ దొంగతనం కేసు రికవర్డ్ ప్రాపర్టీ 11 కేజీల వెండి వస్తువులు ఉన్నాయి. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. గత సెప్టెంబర్ 24వ తేదీ అర్ధరాత్రి సమయంలో ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో గల శ్రీ సురేష్ జువెలరీ షాప్ షట్టర్ పగులగొట్టి గుర్తు తెలియని దొంగలు సుమారు 11 కేజీల వెండి ఆభరణాలు దొంగిలించారు. దుకాణ యజమాని గొంతిన సురేష్ ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయబడింది.

దర్యాప్తు వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ప్రత్తిపాడు ఎస్ ఐ ఎస్. లక్ష్మీకాంతం ప్రత్యేక బృందాలతో చేపట్టిన దర్యాప్తులో నెల్లూరుకు చెందిన ప్రధాన నిందితుడు షేక్ ఫక్రుద్దీన్ బిషనై, అ త ని సహచరులు, మధ్యప్రదేశ్ దకాయిటీ గ్యాంగ్ సభ్యులతో కలిసి మొత్తం 10 మంది ఈ దొంగతనంలో పాల్గొన్నట్లు నిర్ధారించారు.

అరెస్టయిన 6 మంది నిందితులు షేక్ ఫక్రుద్దీన్ బిషనై ప్రధాన నిందితుడు కాగా రెండవ నిందితుడు కేషు మెహదా ( మధ్యప్రదేశ్) మూడవ నిందితుడు బారిక్ సింగ్ ( మధ్యప్రదేశ్ ) నల్గొవ నిందితుడు రఘాన్ హాటియా ( మధ్యప్రదేశ్ ) ఐదవ నిందితుడు హీరు ( మధ్యప్రదేశ్ ) ఆరవ నిందితుడు వెంవారం కల్లు మెహదా ( మధ్యప్రదేశ్ )గా ఉన్నారు. ఈ ఆరుగురిని నల్లజర్ల పోలీస్ స్టేషన్ లో పరిధిలో దొంగతనం కేసులో అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు.ప్రధాన నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా, దొంగిలించిన వెండి వస్తువులను తాడేపల్లిగూడెం మండలం, తాడేపల్లిలోని కర్రీ సాయి చంద్రారెడ్డికి అమ్మడానికి ఇచ్చినట్లు తేలింది.తణుకు జైలులో ఉన్న అతన్ని పి టీ వారెంట్ పై తీసుకువచ్చి విచారించగా, అతని ఇంటి వద్ద నుండి మొత్తం 11 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేయడం జరిగింది. ఇంకా మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు , నెల్లూరుకు చెందిన ఇద్దరు ముద్దాయిలు అరెస్ట్ కావాల్సి ఉంది. అన్నవరం ఇంటి దొంగతనం కేసు అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధి లో 16 తులాలు బంగారు ఆభరణాలు, 1కే జి 40 గ్రాముల వెండి వస్తువులు రికవరీ చేసి కేసు నమోదు చేశారు. ఈ దొంగతనం గత సెప్టెంబర్ నెల 4వ తేది రాత్రి 10.30 గంటలకు గాయత్రి కాలనీ మెట్ట అన్నవరం గ్రామానికి చెందిన గుత్తిన పవన్ హరిప్రసాద్ ఇంటికి దొంగలు వెనుక తలుపు పగులగొట్టి ప్రవేశించి దొంగతనం చేశారు. దర్యాప్తు అనంతరం అరెస్టు చేసి ముద్దాయి చినమాన ఎల్లాజీ ఏ రాజు చేపల ఉప్పాడ, (భీమిలి మండలం ), విశాఖపట్నం జిల్లా అనేవాడిని నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసి అతని వద్ద నుండి మొత్తం ప్రాపర్టీ పూర్తిగా రికవరీ చేశారు. ఈ రెండు కేసులను విజయవంతంగా ఛేదించినందుకు కాకినాడ జిల్లా ఎస్ పి జి.బిందు మాధవ్ అభినందించిన అధికారులు సిబ్బంది పెద్దాపురం ఎస్ డి పి ఓ డి శ్రీహరి రాజు ప్రత్తిపాడు సీఐ బి సూర్య అప్పారావు, ప్రత్తిపాడు ఎస్ ఐ ఎస్ లక్ష్మీకాంతం అన్నవరం ఎస్ ఐ జె.శ్రీహరి బాబు , అదనపు ఎస్ ఐ ఎల్.ప్రసాద్ , ప్రత్తిపాడు, అన్నవరం పోలీస్ స్టేషన్ల సిబ్బంది.

## జూనియర్ కళాశాలలకు నూతన భవనాలు కావాలి

- విద్యారంగంలో మతోన్మాద విధానాలు తిప్పి కొట్టాలి
- యు కొత్తపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి
- పిఠాపురం నుండి కాకినాడ వరకు ప్రత్యేక బడి బస్సులు వేయాలి



**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 29:** విద్యార్థి ఉద్యమాల రథసారథి భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా మహాసభలు పిఠాపురంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నవంబర్ 29,30 తేదీల్లో పిఠాపురంలో జరుగుతున్న 30వ జిల్లా మహాసభలు సందర్భంగా పట్టణంలో ఆర్.టి.సి కాంప్లెక్స్ నుండి ఉప్పాడ బస్ స్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది.అనంతరం ఉప్పాడ సెంటర్ లో భారీ బహిరంగ సభ నిర్వహించారు.బహిరంగ సభకు మండలం అధ్యక్షురాలు జి.చిన్ని అధ్యక్షత వహించారు.ఈ బహిరంగ సభకు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రామ్మో హన్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం విద్యారంగంలో మతోన్మాద విధనాలు అమలు చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానాన్ని,ఎల్ ఓ సి ఎఫ్ విధానాలు ద్వారా విద్యార్థులో శాస్త్రీయ దృక్పథం తోలగించి, అశాస్త్రీయ భావాలు చోప్పిస్తుంది అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ద్వారా పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం భుజాన్ని వేసుకుని అమలు చేస్తుందని అమలు చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు మూసి వేయడం కోసం వస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో 3,4,5 తరగతులను విలీనం పేరుతో, మోడల్ పేరుతో పాఠశాలను వెళ్లిన చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను అడిగేటువంటి విద్యార్థి సంఘాలను విద్యాసంస్థల్లోకి అనుమతించబోమని ఇచ్చినటువంటి ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు కల్పించిన రాజ్యాంగ హక్కును ఈ ఉత్తర్వులు విస్మరిస్తున్నాయి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అందరికీ ఉచితంగా విద్యను అందిస్తామని చెప్పి, నేడు అధికారులకు వచ్చిన రెండు సంవత్సరాలు పూర్తవుతున్న ఉచిత విద్య హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. పీజీ విద్యార్థులకు గుదిబండగా ఉన్నటువంటి జీవో నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 6400 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ అవతరణ దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించి విద్యార్థులందరూ, రాజకీయ నాయకులుగా తయారు కావాలని చెప్పినటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ రాష్ట్రంలో ఎందుకు విద్యాసంస్థల్లో ఎన్నికలు నిర్వహించడం లేదని విమర్శించారు. తక్షణమే విద్యాసంస్థల్లో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ బహిరంగ సభను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం గంగ సూరిబాబు మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యల కోసం పట్టించుకోని డిప్యూటీ సీఎం రాష్ట్రంలో ఉన్న సమస్యలు అన్నిటిని నేనే పరిష్కారం చేస్తున్నానని చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. పిఠాపురం నియోజవర్గంలో ఉన్నటువంటి ఆర్ఆర్ బి హెచ్ ఆర్ జూనియర్ కళాశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని వెంటనే నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. పిఠాపురం నియోజవర్గంలో ప్రధానంగా ఉన్నటువంటి గొల్లప్రోలు జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించి, నూతన భవన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉప్పాడ కొత్తపల్లి మండలానికి ప్రభుత్వం జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి అని జిల్లా కార్యదర్శి ఎం.గంంగాసూరిబాబు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండలం కార్యదర్శి కె.సిద్దు సభను ముగింపు పలికారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సాయిత్, అమృత,నాని, సంతోష్ , జైరామ్, వడ్డి కాసులు, మండలం నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.






## ప్రజలు పోరాటాల్లోకి రావాలి

### పరంజ్యోతి 20వ వర్ధంతి సభలో వక్తలు పిలుపు

**రామచంద్రపురం(మనసులో మాట)నవంబరు29..** ప్రజానీకం హక్కులు కోల్పోతున్నారని, హక్కులు కాపాడుకోవడానికి హక్కులు కల్పించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజల పోరాటాలోనికి రావాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర సీనియర్ నాయకులు కామ్రేడ్ ఎం దుర్గ ప్రసాద్ పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ జే వెంకటేశ్వర్లు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి పి వెంకట్ నాయుడు ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఎం యేసు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్ రఘువులు తదితరులు పిలుపునిచ్చారు. స్థానిక చెలికాని రామారావు భవనంలో అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు జె సత్తిబాబు అధ్యక్షతన కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి 20వ వర్ధంతి సభ శనివారం జరిగింది, ముందుగా పరంజ్యోతి చిత్రపటానికి పూలమాలలు వేసి వక్త లు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో కార్మికులు, దళితులు, ఉద్యోగులు, ప్రశ్నించే వారిని హతమార్చే దుర్మార్గమైన ప్రభుత్వం అధికారంలో ఉన్నాయన్నారు. ఈ ప్రభుత్వాలను గద్దె దించాలంటే పోరాటం తప్ప వేరే మార్గం లేదన్నారు. ఈ ప్రభుత్వాలు కేవలం సామ్రాజ్యవాదుల కోసం పెట్టుబడిదారుల కోసం మాత్రమే పనిచేస్తున్నాయని ప్రజల రక్షించుకోవాల్సిన ప్రభుత్వమే ప్రజలు భక్షిస్తుందని వారన్నారు, ఇలాంటి పోరాటాల్లో ముందుకు వచ్చి పోరాడమే కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతికి అర్పించే నిజమైన నివాళులు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుబ్బల ఆదినారాయణ, గంటా బాలరాజు, మహిళా సంఘం జిల్లా నాయకులు జె సత్య వేణి గ్యాస్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గణేష్ గుండుపల్లి మంగమ్మ పలివెల సుబ్బయ్య పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి

### కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 29:** గోకవరం మండలం తంటికొండ, రంపయర్రంపాలెం, వెదురుపాక గ్రామాలలో పలు కుటుంబాలను కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రంపయర్రంపాలెం గ్రామ టిడిపి అధ్యక్షుడు సత్యం పెద్దబ్బులు తండ్రి శ్రీరామ్మూర్తి ఇటీవల కాలంలో మరణించారు. అదే గ్రామానికి చెందిన కసిరెడ్డి రవి మాతృమూర్తి ఇటీవల కాలంలో మరణించారు. ఆ కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని నవీన్ తెలియజేశారు. తంటికొండ గ్రామంలో పెద్ద చెరువు చైర్మన్ బదిరెడ్డి రవి సోదరుడు రాంబాబు ఇటీవల మృతి చెందారు. బద్దిరెడ్డి రాంబాబు సీనియర్ గుమస్తాగా పంచాయతీ ద్వారా ప్రజలకు అనేక సేవలందించడం జరిగింది. అదే గ్రామానికి చెందిన తంటికొండ దేవస్థానం డైరెక్టర్ చింతల నాగు తండ్రి సూర్యారావు మరణించారు. దళిత నాయకుడు పల్ల నరేష్ పెద నాన్న పల్ల బాబ్జి ఇటీవల కాలంలో మృతి చెందారు. తంటికొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గెద్దం బాబు బావ యేట వెంకటేశ్వర్లు, అదే గ్రామానికి చెందిన పూడి రాజు ఇటీవల బైకు ప్రమాదానికి గురై మరణించడం జరిగింది . శనివారం ఆ కుటుంబ సభ్యులను నవీన్ పరామర్శించి వారికి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్ కుమార్ , సూరంపాలెం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉంగరాల రాము, మండల కన్వీనర్ పిల్లా చంటిబాబు, మంగరౌతు రామకృష్ణ, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, బద్దిరెడ్డి బాబి, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్, భూపతిపాలెం స్కూల్ చైర్మన్ గల్లా రాము, నారా ప్రసాద్, మలిరెడ్డి సిరి, పోసిన ప్రసాద్, కోట సత్యవతి, గెద్దం బాబు, పప్పుల రాఘవులు, నరాల మురళి, జాజుల అవతారం, కోలా ఏసుబాబు పాల్గొన్నారు.

## డివిజన్ స్థాయి పోటీలకు టీచర్స్ మహిళల త్రో బాలు పురుషుల క్రికెట్టు ఎంపిక



అనపర్తి (మనసులో మాట) నవంబరు 29: స్కూల్ ఎడ్యుకేషన్ కమీషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న టీచర్స్ గవర్నమెంట్కు సంబంధించి ఎంపిక ఉదయం స్థానిక ఎస్ డి బి గర్ల్స్ హై స్కూల్ అనపర్తి నందు నందు మహిళల త్రోబాల్ ఎంపికలు, మరియు మధ్యాహ్నం ఎస్ ఆర్ జెడ్ పి పి హైస్కూల్ (బాలుర ) అనపర్తి నందు పురుషుల క్రికెట్ సెలెక్షన్స్, ఎం ఈ ఓ 2 శ్రీ నల్లమిల్లి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి.

అనపర్తి మండలానికి ఎంపికైన పురుషుల క్రికెట్ జట్టు, మహిళల త్రోబాల్ జట్టు డిసెంబర్ 13,14 తేదీలలో, రాజమహేంద్రవరం డివిజన్ స్థాయి పోటీలలో పాల్గొంటాయని, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ టీవీఎస్ రాఘవరెడ్డి తెలిపారు, ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్రీ. పడాల శ్రీనివాసరెడ్డి, మండలంలోని పీడీలు, రాజేశ్వరి, ప్రభాకరరెడ్డి, మనోహర్, సతీష్, దుర్గాప్రసాద్, ప్రియాంక, హేమలత పాల్గొన్నారు.



మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# బాలల్లో ప్రతిభా వికాసానికి బాలోత్సవం దోహదం

## గోదావరి బాలోత్సవం ప్రారంభ సభలో మంత్రి కందుల దుర్గేష్ - అంబరాన్నంటిన బాలల సంబరాలు..





**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29:** పిల్లల్లో వ్యక్తిత్వ వికాసానికి గోదావరి బాలోత్సవం ఎంతగానో దోహదం చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం నగరంలోని ఎస్ కేవీటీ డిగ్రీ కళాశాలలో శనివారం మూడవ 'గోదావరి బాలోత్సవం' అత్యంత సందడి వాతావరణంలో విద్యార్థుల కేరింతల మధ్య కోలాహలంగా ప్రారంభమైంది. జాతీయ పతాకాన్ని మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. అనంతరం బాలోత్సవ పతాకాన్ని గోదావరి బాలోత్సవ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, తిరుమల విద్యా సంస్థల అధినేత నున్న తిరుమలరావు, ఆహ్వాన సంఘం అసోసియేట్ అధ్యక్షుడు సీనియర్ జర్నలిస్టు ఎస్వీవీ కృష్ణకుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ సభకు కృష్ణకుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పిల్లల్లో నిగూఢంగా అనేక రకాల సృజనాత్మక శక్తులు ఉంటాయన్నారు. వాటిని బయటపెడితే సమాజంలో అత్యున్నత స్థానానికి వెళ్ళి కళాకారులుగా, క్రీడాకారులుగా, దేశానికి ఉపయోగపడే నాయకులుగా వారు ముందుకు రావడానికి అవకాశం ఉంటుందన్నారు. పండుగ వాతావరణంలో జరుపుకుంటున్న ఈ బాలోత్సవం కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. పిల్లలు సరైన మార్గంలో నడుస్తున్నారా లేదా అసాంఘిక కార్యక్రమాలలో పాలు పంచుకునే విధంగా వెళ్తున్నారా, లేకపోతే వారికి సరైన మార్గదర్శనం అందుతోందా లేదా అనే బాధ అందరిలో ఉందని, అందుకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లలో కళల పట్ల, సాత్విక ఆలోచనల్లో ఆల్ రౌండ్ పర్సనాలిటీ డెవలప్ చేసుకోవడంలో ఇలాంటి ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సరైన సమయంలో సరైనటువంటి రీతిలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తులసికి మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో చదువుకునే పిల్లలు అందరూ ఒకే వేదికపైకి వచ్చి కలిసి మెలిసి మాట్లాడుకుంటే భవిష్యత్తులో వారి వ్యక్తిత్వం మరింత వికసిస్తుందని చెప్పారు.

పిల్లలు చదువుకుని ఉద్యోగాలకు వెళ్ళాలంటే గ్రూప్ డిస్కషన్ ప్రధానం. అక్కడ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలు కొంచెం చురుకుగా ఉంటారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల వారిలో బెరుకుదనం పోతుంది ఆలోచనా శక్తి పెరుగుతుందని అన్నారు. ప్రతి పాఠశాలలో జరిగే కార్యక్రమాలతో పాటు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే పిల్లల్లో ఉన్న సృజనాత్మక శక్తి బయటికి వస్తుందని అన్నారు. వక్తృత్వం, వ్యాసరచనం, ఏక పాత్రాభినయం, నాటకాలలో వేసే పాత్రలు, క్రీడలు ఇలా అన్నిటినీ పిల్లల్లో వెలికి తీస్తే వారి యొక్క విద్యతో సంపూర్ణంగా వికసిస్తారని నమ్ముతున్నానని మంత్రి తెలిపారు. ఈ బాలోత్సవం ఇప్పుడు ముచ్చటగా మూడవ పర్యాయం, ఇది శత వసంతాలు కొనసాగాలని మంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమంలో పాలు పంచుకున్నందుకు తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. నిరంతరం రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శల్లో గడిపే మాకు ఇంత మంది పిల్లలను చూడటం ద్వారా మా మైండ్ కూడా చక్కగా మారుతుందని, మేము బాగా పని చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

ఎస్కేవీటీ కళాశాల వీరేశలింగం పంతులు స్థాపించిన కళాశాల అని, ఈ విద్యాసంస్థ తనకు మాతృ సంస్థ అని, ఎందుకంటే తాను డిగ్రీ ఇక్కడే చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. తనకు ఇది చాలా ఇష్టమైన కళాశాల అని, ఒక నాయకుడిగా కూడా ఎదగడానికి ఉపయోగపడిన కళాశాల ఇది. ఆ రోజుల్లో కళాశాల స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నికై ఈ రోజు పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో మంత్రి అయ్యానని ఎంతో గర్వంగా చెప్పారు. అలాంటి వేదికను తయారు చేసిన ఈ ఎస్కేవీటీ కళాశాలకు ఆజన్మాంతం రుణపడి ఉంటానన్నారు. భావి భారత పౌరులైన విద్యార్థులను అన్ని రకాలుగా తీర్చిదిద్దడానికి గోదావరి బాలోత్సం చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. సమాజ హితం కోసం చేస్తున్న ఈ ప్రయత్నం పిల్లలు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు

అవకాశం ఉంటుందన్నారు. తద్వారా సమాజ సేవకు పునరంకితం అయ్యే అవకాశం ఉంటుందని, బాలోత్సవంలో పాల్గొంటున్న విద్యార్థులంతా తమ ప్రతిభ పాటవాలను క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ పిల్లల అభ్యున్నతి మూడు అంశాలపై ఆధార పడి వుంటుందన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో ఏర్పడిన మూసతత్వం వల్ల, ఎక్కువ మార్కులు సాధించడమే పిల్లవాడి ప్రతిభకు గీటురాయిగా మారిపోయిందన్నారు. దీని వల్ల పిల్లల జ్ఞాపకశక్తికి ఇస్తున్న ప్రాధాన్యం మిగిలిన అంశాలకు ఇవ్వడం లేదన్నారు. దీని వల్ల పిల్లలలో సృజనాత్మకత తగ్గిపోతోందని, సమాజం నుంచి, పరిసరాల నుంచి నేర్చుకోవడంలో విద్యార్థులు వెనకబడిపోతున్నారని అన్నారు. ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలు విద్యార్థులకు అందుబాటులో రావడంతో పిల్లల ఆలోచనపై ఏయే అంశాలు ఎలాంటి ప్రభావాలు ఎంత మేరకు చూపుతున్నాయో అంచనా వేయడం కష్టంగా మారిందన్నారు. ఒక్కొక్క విద్యార్థిని ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పిల్లల్లో విశాలమైన మనస్తత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపుదల చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థ వల్ల పిల్లలు నాలుగు గోడల మధ్య బందీకాబడుతున్నారని అన్నారు. బలవంతపు విద్యతో చిన్నారుల బాల్యాన్ని సమాజం హరిస్తోందని తెలిపారు. సామాజిక శాస్త్రాలను వక్కన పెట్టేసి కంప్యూటర్ చదువులకే ప్రాధాన్యత పెరిగిపోయిందన్నారు. సమాజ అభివృద్ధికి అవసరమైన చదువులను పాలకులే హత్య చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజ మార్పునకు అవసరమైన విద్యను అందించేందుకు తల్లిదండ్రులు, విద్యావేత్తలు, పాలకులు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు గోదావరి బాలోత్సవం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. తిరుమల విద్యా సంస్థల అధినేత నున్న తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులంతా మొబైల్స్తో కుస్తీ పడుతున్నారని అన్నారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలుగులోకి రావడానికి అవకాశం లేకుండా పోతోందన్నారు. బాలోత్సవంలో పాల్గొంటున్న విద్యార్థులు కేవలం బహుమతుల కోసం కాదని, తమలో ఉన్న సృజనాత్మకతను బయటకు తెచ్చేందుకు బాలోత్సవాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ విద్యార్థులను బట్టీ చదువులకే పరిమితం చేస్తుందని సీసీసీ ఎండీ పంతం కొండలరావు అన్నారు. అందుకు తల్లిదండ్రులు కూడా కారణమవడం బాధాకరమని అన్నారు. చిన్నారులకు అవసరమైన పునాదిని నిర్మించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాలకులు దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రముఖ నాట్యాచారి సప్పా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చిన్నారుల జీవితాన్ని లక్షల ఖర్చు పెట్టి జైలులో పెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ విద్యార్థులు బట్టీ చదువులతోనే ఉంటే వారిలో మానసిక పరివర్తన, వారిలో దాగివున్న సృజనాత్మకత ఎప్పుడు వెలుగులోకి వస్తుందని ప్రశ్నించారు. గోదావరి బాలోత్సవ లక్ష్యాలను ఆహ్వాన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ పీ తులసి వివరించారు. ఈ సందర్భంగా గోదావరి బాలోత్సవం థీమ్ సాంగ్ ను మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి కంది వాసుదేవరావు, ఎస్ కేవీటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాద్యం, ఎల్ఐసీ సీనియర్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, అమరావతి బాలోత్సవం నిర్వాహకులు టీ క్రాంతికుమార్, గోదావరి బాలోత్సవం ఆర్గనైజర్లు సవీణకుమారి, కోలా సత్యనారాయణ, పువ్వుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.





# మెగా దంత వైద్య శిబిరం రెండో రోజు విజయవంతం

- విజయవంతంగా రెండవ రోజు
- పాఠశాల విద్యార్థులకు మెడికల్ కిట్లు అందజేత

**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 29:** జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల నియో ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో పిఠాపురం రెడ్డి రాజా కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న మెగా దంత వైద్య శిబిరం శనివారం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది. నిర్వాహకులు జనసేన పార్టీ వీర మహిళ డాక్టర్ సునీత దివ్యరాజు మాట్లాడుతూ రెండో రోజు 1500 మందికి రోగులకు చికిత్స అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 25వేల మంది ప్రజల దంతా ఆరోగ్యం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి స్ఫూర్తితో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా వైడి రామారావు రెండవ రోజు జరిగిన ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ సొసైటీ చైర్మన్ వై డి రామారావు ఇచ్చేశారు ప్రజల ఆరోగ్యానికి సేవలు అందించడం గొప్ప విషయమని ఆయన కొనియాడారు. ఈ వైద్య శిబిరంలో తూర్పుగోదావరి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోగినేని తరుణ్ చైల్డ్ లేబర్ కమిషనర్ వేదుకూరు సూర్యనారాయణ పాల్గొన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు నిర్వాహకులు వైద్య బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 30వ తేదీ ఆదివారం కూడా ఈ మెగా దంత వైద్య శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. పిఠాపురం వాసులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని పిలుపునిచ్చారు.

# ఐక్య క్రిస్మస్ పోస్టర్ ఆవిష్కరణ



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 29:** పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామంలో పిఠాపురం నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ప్రత్యేక సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ పిఠాపురం అసోసియేషన్ ల నాయకులు పాల్గొన్నారు. 2025 డిసెంబర్ రెండవ తేదీ మంగళవారం పిఠాపురం పట్టణంలో జరిగే 18వ ఐక్య క్రిస్మస్ ఆరాధన కార్యక్రమం యొక్క పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే ఎలీషా మాట్లాడుతూ పిఠాపురంలో జరుగుతున్న ఐక్య క్రిస్మస్ ఆరాధన మనందరి ఐక్యతను తెలియజేసే గొప్ప పండగని కొనియాడారు. డిసెంబర్ రెండవ తేదీ మంగళవారం పిఠాపురం పట్టణంలో అంబేద్కర్ భవన్ నందు ఐక్య క్రిస్మస్ జరుగుతుందని తెలిపారు. ఈ క్రిస్మస్ ఆరాధన ప్రతి గ్రామంలో నుండి క్రైస్తవ సోదరులు పాల్గొనాల్సిందిగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. క్రిస్మస్ ఆరాధనలో పి జాన్ లాజర్స్ రాజమండ్రి వారిచే గొప్ప సువార్త వర్తమానం అందించబడుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున పాల్గొని ప్రభువైన క్రీస్తు నామమున పరిశుద్ధ పరచబడుదురని ప్రేమతో ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ శ్యాంసన్, ఎలీషా, పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బేటీ బచావో బేటీ పడావో..

# బాల్ వివాహ్ ముక్త్ భారత్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 29:** బేటీ బచావో బేటీ పడావో, బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళాభివృద్ధి- శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం, కడియంలో శనివారం అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాలల రక్షణ అధికారి జీ క్రాంతిలాల్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ మంచిగా చదువుకుని అభివృద్ధి చెందుతూ, వ్యక్తిగత భద్రత కూడా చాలా అవసరమని తల్లితండ్రులు, గురువులు చెప్పిన మాట వింటూ అభివృద్ధి చెందాలన్నారు. అలాగే మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరు స్పర్శ తగిలితే చాలా సంతోషంగా, చాలా ఆనందంగా, చాలా ఆహ్లాదకరంగా అనిపిస్తుందో అది మంచి స్పర్శ అని ఇది కేవలం తల్లిదండ్రులు ద్వారా మాత్రమే కలుగుతుందని చెప్పారు. చెడు స్పర్శ అనేది ఎవరు మనల్ని ముట్టుకుంటే చాలా చికాగుగా అనిపిస్తుందో, ఎవరు ముట్టుకుంటే ఇబ్బందిగా ఉంటామో, ఎవరు ముట్టుకుంటే అసహ్యంగా అనిపిస్తుందో అది చెడు స్పర్శ అని చెప్పారు. బాలల యొక్క శరీర రహస్య భాగాలను ఎవరు కూడా ముట్టుకోడానికి వీలులేదు, ఎవరైనా ముట్టుకోడానికి ప్రయత్నిస్తే ఖచ్చితంగా డోంట్ టచ్ అని చెప్పాలని తెలియజేశారు. మీ యొక్క ఉజ్వల భవిష్యత్తు బంగారు బాట వెయ్యాలి, జీవితంలో ఎప్పుడు తల ఎత్తుకునేలా జీవించాలి అటువంటి ఉన్నత శిఖరాలకు అందరూ ఎదగాలని చెప్పారు. అలాగే బాలలపై లైంగిక వేధింపుల నిర్మూలన వ్యతిరేక చట్టం -2012 గురించిన విషయాలు, బాల్య వివాహ నిషేధ చట్టం-2006 గురించి వివరించారు. కనీస వివాహ వయస్సు అబ్బాయికి 21 సంవత్సరాలు, అమ్మాయికి 18 సంవత్సరాలు నిండకుండా వివాహం జరిపిస్తే అది బాల్య వివాహం అవుతుందని, ఈ విధంగా జరిగిన బాల్య వివాహానికి ఎవరైతే సహకరిస్తారో, చేస్తారో, చేయడానికి ప్రయత్నిస్తారో వారిపై బాల్య వివాహ నిషేధ చట్టం-2006 ప్రకారం రెండు సంవత్సరాలు జైలు శిక్ష లేదా లక్ష రూపాయలు జరిమానా లేదా రెండూ విధించబడతాయి అని తెలియజేశారు. కాబట్టి ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే సంబంధిత బాల్యవివాహ నిషేధ అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్ లైన్ -1098, పోలీస్-100 మరియి 112 అనే నెంబర్లకు కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, అలాగే వ్యక్తిగత భద్రత, సంరక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అలాగే బాలికలు ఒంటరిగా ఉండకూడదన్నారు. అలాగే ఒంటరిగా ఎక్కడికి వెళ్ళకూడదని అలా వెళ్తే వేధింపులకు గురయ్యే అవకాశం ఉందని, అలాగే మద్యం సేవించినవారికి దూరంగా ఉండాలి, సొంత తండ్రి మద్యం సేవించి వచ్చిన తండ్రికి కూడా దూరంగా ఉండాలనన్నారు. ఎందుకంటే తండ్రి మంచివాడే కానీ మద్యం మంచిది కాదని తెలియజేశారు. అలాగే వస్త్రాధారణ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. స్థానిక తహసీల్దారు ఎం సునీల్ కుమార్ మాట్లాడుతూ అమ్మాయిలు చాలా భద్రంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకుంటూ సమాజంలో ఉన్న విషయాలు గ్రహిస్తూ మంచిగా చదువుకుని జీవితం మంచి స్థాయికి ఎదగాలన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐసీడీఎస్ సుపర్వైజర్ యు శిరీష, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అవుట్ రీచ్ వర్కర్ ఎస్ పావని, వన్ స్టాప్ సెంటర్ పారా మెడికల్ ఏ సరస్వతి, హాస్టల్ వార్డెన్ ఏఏవీ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు

# ఆదివారం సాయంత్రానికి పూర్తి





**ఏలూరు/ఉంగుటూరు, నవంబరు 29 (మనసులో మాట)..** ఉంగుటూరు మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను శనివారం సాయత్రం జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, సంబంధిత అధికారులులతో కలసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పరిశీలించారు. ఉంగుటూరు మండలం గొల్లగూడెం హెలిప్యాడ్, నల్లమాడు ప్రజావేదిక మరియు కేడరు సమావేశ సభాస్థలి, గోపినాథపట్నం యన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్ల లబ్ధిదారులు గృహాలను, తదితర ప్రాంతాలను పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు డిసెంబరు 01వ తేదీన (సోమవారం) ఉంగుటూరు మండలం పర్యటన ఖరారు అయిన నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లను ఆదివారం సాయంత్రానికి పూర్తిచేస్తామని అన్నారు. ఉంగుటూరు మండలం గొల్లగూడెం హెలిప్యాడ్, నల్లమాడు ప్రజావేదిక మరియు కేడర్ సమావేశ సభాస్థలి, గోపినాథ పట్నం యన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్లు పంపిణీ మరియు లబ్ధిదారులు గృహాలు, తదితర ప్రాంతాలను పరిశీలించామని తెలిపారు. ఏక్కడ ఏఒక్క చిన్న పొరపాటు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వివిధ శాఖల అధికారులు కేటాయించిన పనులు పూర్తి చెయ్యుటలో నిమగ్నమై ఉన్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆదివారం సాయంత్రానికి పూర్తి చెయ్యాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని అన్నారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన అసాధారణ భద్రతా ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామన్నారు. హెలిప్యాడ్, లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ గృహాలు, ప్రజావేదిక, తదితర ప్రాంతాలు, ముఖ్యమంత్రి పర్యటన ప్రదేశాలకు, కాన్వాయ్ మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి జల్లెడ పట్టామని అన్నారు. పర్యటనలో ఏటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా సాగేందుకు భద్రతా ఏర్పాట్లును కట్టుదిట్టం చేశామని అన్నారు. పర్యటన పూర్తయ్యేంత వరకు నిరంతరం భద్రతా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
ఆదివారం 30 నవంబర్ 2025 | పేజీ : 16

# మున్సిపల్ బడ్జెట్ సమావేశం

**పలమనేరు నవంబర్ 29( మనసులో మాట) :** పలమనేరు పురపాలక సంఘం సంబంధించి శనివారం ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం, మరియు 12 గంటలకు సాధారణ సమావేశం పలమనేరు మున్సిపల్ చైర్మన్ చాముండేశ్వరి అధ్యక్షతన పలమనేరు పురపాలక సంఘం నందు నీలం సంజీవరెడ్డి కౌన్సిల్ హాల్ లో సమావేశం నిర్వహించడం జరిగింది. పురపాలక సంఘం బడ్జెట్ నందు79,795,500 ఇంత వ్యయం అవుతుందని కౌన్సిల్ హాల్ లో తెలపగా అందుకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. కౌన్సిల్ హాల్ నందు కొద్దిసేపు టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య రసా బస గా సమావేశం ముగిసింది. 12 గంటలకు సాధారణ సమావేశం నిర్వహించగా ఇందులో ఆక్రమణలు తొలగించాలని కౌన్సిలర్ నాగరాజ్ అధికారులను నిలదీశారు. అందుకు దీటుగా కౌన్సిలర్ బిఆర్సి కుమార్ పట్టణంలో ఉన్న ఆక్రమణలు మొత్తం తొలగించాలని అధికారులను కోరారు. విద్యానగర్ పాఠశాల వద్ద నిర్మిస్తున్న భవనానికి ప్లాన్ అనుమతులు ఎలా ఇచ్చారని అధికారులను నిలదీశారు. అనంతరం గత బడ్జెట్ కంటే ఈసారి ఐదు లక్షలు అధికంగా ఉందని కౌన్సిలర్ కోదండరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కౌన్సిలర్ మురళీకృష్ణ మాట్లాడుతూ... మదనపల్లి రోడ్ నందు రేకుల షెడ్ లో టిఫన్ అంగిడిని ఎలా తొలగిస్తారని అధికారులను నిలదీశారు. అదేవిధంగా దండపల్లి రోడ్ లో అనుమతి లేని పట్టాలో నిర్మించుకున్న దానిని కూడా తొలగించాలని తెలిపారు. అక్కడ వినాయక గుడి కి ఆ స్థలాన్ని ఇవ్వాలని అధికారులను కోరారు. సాధారణ సమావేశం అజెండాలో 15 అంశాలకు కూడా ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.





## తెదేపా కార్యాలయంలో ప్రజా దర్బార్



### - నిర్వహించిన పరిటాల శ్రీరామ్

**ధర్మవరం నవంబర్ 29 (మనసులో మాట)..** పట్టణం లోని ఎర్రగుంట సర్కిల్ లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున వినతులు అందించడానికి ప్రజలు హాజరయ్యారు. ముఖ్యంగా ధర్మవరం పట్టణంలో గల 40 వార్డులలో సిసి రోడ్లు, సిసి డ్రైన్లు నిర్మించాలని వార్డు ప్రజలు పరిటాల శ్రీరామ్ కు వినతులు అందజేశారు. అదేవిధంగా పట్టణంలో చెత్త సేకరణ జరగడంలేదని చెత్త సేకరణ చేసే ఆటోలు, ట్రాక్టర్లు చెత్త కలెక్షన్ కు తిరగడం లేదని మురికి కాలువలను 15 రోజులకు ఒకసారి కూడా శుభ్రపరచడం లేదని తెలిపారు. అదేవిధంగా పట్టణంలో లో-వోల్టేజ్ సమస్య అధికంగా ఉందని విద్యుత్ హెచ్చుతగ్గులతో పలు వార్డులలో కరెంటు గృహోపకరణాలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ప్రజలు. పట్టణంలో గల వార్డులలో ఇనుప కరెంటు స్తంభాలు అధికంగా ఉన్నాయని వర్షం వచ్చినప్పుడు ఇనుప స్తంభాలకు కరెంటు షాక్ వస్తుందని తక్షణమే ఇనుప పోల్స్ స్థానంలో సిమెంట్ పోల్స్ వేయాలని ప్రజలు విన్నవించారు. ధర్మవరం పట్టణంలో గల పలు వార్డులలో నివాస గృహాలపై కరెంటు వైర్లు ఉన్నాయని వాటిని సరిచేయాలని వార్డు ప్రజలు కోరారు. ప్రజా దర్బార్ కు హాజరైన ఎలక్ట్రిసిటీ ఏ.డి, ఏ.ఇ లతో మాట్లాడిన పరిటాల శ్రీరామ్ కరెంటు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. అన్ని సమస్యలపై అర్జీలు తీసుకున్న పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ సమస్యలన్నింటినీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని, వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అదేవిధంగా ఈ సమస్యల అన్నింటిని వార్డు నాయకులకు తెలియజేసి అధికారులను వెంబడి తీసుకుని వెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ఏడి, ఏఈ లతోపాటు తెదేపా ముఖ్య నాయకులు హాజరయ్యారు.

## చిగిచెర్లలో ఘనంగా రాష్ట్రస్థాయి జూడో పోటీలు ప్రారంభం

### ధర్మవరం నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి






**ధర్మవరం నవంబర్ 29 (మనసులో మాట)..** 69వ ఆంధ్రప్రదేశ్ ఎస్ జీ ఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో ఛాంపియన్‌షిప్ (2025-26) కు చిగిచెర్ల ప్రభుత్వ జెడ్పీ హై స్కూల్ వేదిక అయ్యింది అని, ఇటువంటి క్రీడలు ప్రారంభం కావడం శుభదాయకమని ధర్మవరం నియోజకవర్గం క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇక్కడ జరుగుతున్న అండర్-14 , అండర్-19 విభాగాలకు చెందిన బాల, బాలికలకు పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ నుంచి క్రీడాకారులకు 600 టి షర్టులను ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను పరిటాల కుటుంబం ప్రోత్సహించడంలో ముందుంటుందన్నారు. క్రీడలతోనే విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని వారికి చేయూతగా తమవంతుగా సహాయ సహకారాలు అందించేందుకు పరిటాల కుటుంబం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యంగా పరిటాల శ్రీరామ్ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో ముందుంటారన్నారు.




## కామ్రేడ్ హైదర్ వలీ సంతాప సభ



**ధర్మవరం నవంబర్ 29 (మనసులో మాట).** కామ్రేడ్ హైదర్ వలీ సంతాప సభను స్థానిక ఎన్జీవో హోం నందు సిపిఎం పార్టీ సిఐటియు నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి,ఓబులు , జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు(జెవివి) డాక్టర్ ఆది శేషు, శ్రామిక మహిళ కన్వీనర్ డి,దిల్షాద్ పాల్గొన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, (సిఐటియు సీనియర్ నాయకులు)ఎస్హెచ్ బాష, సిపిఐ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అయూబ్ ఖాన్, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ట్రాన్స్పోర్ట్ రంగం జిల్లా కార్యదర్శి పెడబల్లి బాబా, ఈ సందర్భంగా మాట్లాడుతూ కామ్రేడ్ హైదర్ వలి గత 16 సంవత్సరాల కాలంగా ఆటో కార్మికుడిగా, స్థానిక సిఐటియు నాయకుడిగా, ఉమ్మడి జిల్లా ట్రాన్స్పోర్ట్ రంగం అధ్యక్షుడిగా ఎన్నో సేవలు అందించారని, ఆటో కార్మికుల హక్కులకై ఎన్నో పోరాటాలలో పాల్గొన్నారని, ఆయన లేని లోటు పార్టీకి, సంఘానికి, తీర్చలేనిదన్నారు. కార్మికుల సమస్యలే కాకుండా, స్థానికంగా ఎవరికి ఏ సమస్య వచ్చినా వారి సమస్య తీర్చడానికి కృషిచేసేవారన్నారు. ఇలాంటి వ్యక్తి మామధ్య భౌతికంగా లేకున్నా, ఆయన ఆశయాలు మా వెంటే ఉంటాయన్నారు. ఈ సందర్భంగా కామ్రేడ్ హైదర్ వలి సంతాపంతెలియజేస్తు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జెవి రమణ, ఎల్ ఆదినారాయణ,చేనేత రంగం నాయకులు గుంపు హరి, ఖాదర్ బాషా, వెంకటనారాయణ, వెంకటస్వామి, ట్రాన్స్పోర్ట్ రంగం నాయకులు, ఎస్. రఫీ,అబ్బాస్, ఖలీల్,అంగన్వాడి యూనియన్ నాయకులు దీన, విజయలక్ష్మి, అరుణ, ఆశ వర్కర్స్ నాయకురాలు ఇర్ఫాన, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఏం,బాబు, ముకుంద, లక్ష్మీ ఓబులేసు, వెంకటేష్, శ్రీ సత్య సాయి వాటర్ వర్కర్స్ నాయకులు ఈశ్వరయ్య. తదితర కార్మికులు పాల్గొన్నారు.

## మాధవి జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ



**పలమనేరు నవంబర్ 29( మనసులో మాట) :** మదర్ తెరిసా మరియు మాధవి జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో శనివారంమాదక ద్రవ్యాల వినియోగం వాటి వలన కలిగే అనర్థాలు అను అంశంపై పిల్లలతో ఒక ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ జెడ్పీ హైస్కూల్ గంగవరం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొని ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నం చేశారు. ఈ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులకు, అధ్యాపకులకు కళాశాల కరస్పాండెంట్ ఎం. రవీంద్రబాబు, చైర్మన్ ఎం.ఆర్ సునీల్, అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి,అభినందనలు తెలియజేశారు.

## కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధంకండి

### సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్ వి నరసింహారావు పిలుపు

చిత్తూరు జిల్లా సిఐటియు నూతన రథసారదులు


కె. విజయ అధ్యక్షులు


జె. గిరిధర్ గుప్తా ప్రధాన కార్యదర్శి


జ్యోతిరావు కోశాధికారి

పలమనేరు నవంబర్ 29 ( మనసులో మాట):సిఐటియు 9వ జిల్లా మహాసభ లు పలమనేరులో గత రెండు రోజులు పాటు జరిగిన మహాసభలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్. వి నరసింహారావు మాట్లాడుతూ... జిల్లాలో కార్మికుల సమస్యలపై ఇప్పటికే అనేక పోరాటాలు చేసిన కార్మిక సంఘంగా సిఐటియు గుర్తింపు పొందిదన్నారు. భవిష్యత్తులో కూడా ఇంకా కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంపిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై జిల్లాల్లో కూడా ఐక్యం చేసి పోరాటాలు చేయాలనిపిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ... జిల్లాలో అంగన్వాడి,ఆశ, విఓఏ కార్మికుల సమస్యలపై కలెక్టర్ కేంద్రంగా అనేక పోరాటాలు నిర్వహించారు. స్కీం వర్కర్ సమస్యలే కాకుండా జిల్లాలో పంచాయతీ కార్మికులు, అమాలి కార్మికులు, బిల్డింగ్ వర్కర్స్ సమస్యలపై ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలపై, బోయకొండ గంగమ్మ దేవస్థానం కార్మికుల సమస్యలపై, ఆటో కార్మికుల సమస్యలపై భారీ పోరాటాలు చేయడం జరిగిందని భవిష్యత్తులో కూడా పరిష్కారం కానీ కార్మికుల సమస్యల కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. దఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షులు విజయ, ప్రధాన కార్యదర్శి గిరిధర్ గుప్త, కోశాధికారి జ్యోతిరావు, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, మమత,షకీలా,గంగ కార్యదర్శులు,శ్రీదర్ బాబు,శివ,గోవిందప్ప, సుబ్బలక్ష్మి లతో 15 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్ష కార్యదర్శులు విజయ, గిరిధర్ గుప్తాలు మాట్లాడుతూ... జిల్లాలో కార్మికుల సమస్యలపై నిరంతరం కార్మికుల అండగా ఉంటూ పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో సిఐటియు ను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు.

ఉత్సాహవంతులైన విలేకరులకు, నిరుద్యోగులకు.. కంచర్ల మీడియా గ్రూప్ అభయం
KANCHARLA MEDIA GROUP
BEYOND MEDIA, INTO HEARTS
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మరియు డిజిటల్ మీడియాలో సరికొత్త సంచలనం
"కంచర్ల మీడియా"
అద్భుత ఉద్యోగ అవకాశం
సంబంధిత ఉద్యోగాలు
మార్కెటింగ్ టీమ్ లీడర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, జిల్లా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, స్ట్రింగర్స్/ రూరల్ రిపోర్టర్స్, సర్క్యులేషన్ ఇంచార్జ్‌లు, డీటీపీ ఆపరేటర్స్, సబ్ ఎడిటర్స్, డెస్క్ ఇంచార్జ్‌లు, యాడ్ డిజైనర్స్, కంటెంట్ రైటర్స్, యాంకర్స్/ న్యూస్ ప్రెజెంటర్స్, ప్రోగ్రామ్ మేనేజర్లు, వీడియో ఎడిటర్స్, వీడియో గ్రాఫర్స్, అకౌంటెంట్, రిసెప్షనిస్ట్, ఆఫీస్ బాయ్స్
అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత
కొత్తవారికి అవకాశం
స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వబడును.
జీతం రూ.10,000/- నుండి రూ.40,000/- లు వరకు
కంచర్ల మీడియా గ్రూపులో అవకాశం... మీ భవిష్యత్తుకు భరోసా..
నేరుగా సంప్రదించండి
విశాఖపట్నం : 81257 15809
విజయవాడ : 77805 44489
వేదిక & ఇంటర్వ్యూ తేదీ :
కంచర్ల మీడియా గ్రూప్ | విశాఖపట్నం - విజయవాడ - తిరుపతి - హైదరాబాద్ 0891 - 4540746
Email 1 :admin@kancharlatv.com, Email 2 :marketing.kancharlamedia@gmail.com, Email 3 :kancharlavijayawada@gmail.com
YUPKAR TV | మనసులో మాట | SSLS creations

# మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**వరంగల్, నవంబర్29:** మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించలేమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌నుంచి వందే భారత్‌రైలులో వరంగల్‌కు కిషన్‌రెడ్డి చేరుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సెంట్రల్ ఆర్కాలజీ అధికారులతో కలిసి వెయ్యి స్థంబాల ఆలయాన్ని ఆయన సందర్శించారు. అభివృద్ధి పనులు ఆలస్యంపై అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించి ఘనంగా నిర్వహిస్తోంది. అయితే జాతీయ పండుగగా ప్రకటించాలని ఏళ్లుగా డిమాండ్ ఉంది. దీనిపై తాజాగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. దేశంలో ఏ జాతరకు జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. దేశంలో ఏ ఉత్సవాలకు జాతీయ హోదా లేదని తెలిపారు. మేడారానికి కూడా ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. వరంగల్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హెరిటేజ్ సిటీ, స్మార్ట్ సిటీకి నిధులు ఇచ్చామన్నారు. వెయ్యి స్తంభాల ఆలయంలో మండపం పునర్నిర్మాణం చేశామని చెప్పారు. భద్రాచలం రూ. 50 కోట్లు, రామప్పను రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రసాద్ స్కీమ్‌లో రామప్ప, భద్రాచలం, జోగులాంబ ఆలయాన్ని డెవలప్ మెంట్ చేస్తున్నామని తెలిపారు. మేడారం జాతర విషయాన్ని కేంద్ర ట్రైబల్, టూరిజం మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

# రాజకీయ కోలాహలం

### ముగిసిన తొలిదశ నామినేషన్ల గడువు



హైదరాబాద్, నవంబరు 29: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. రాష్ట్రంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే. శనివారంతో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. తొలి రోజే సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు సర్పంచి పదవుల కోసం 3,242 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1,821 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 4901 నామినేషన్లు దాఖలు. రెండో రోజు వార్డు మెంబర్ల స్థానాలకు 9643 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8198 నామినేషన్లు, 11502 వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలు అయినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 189 మండలాల్లోని 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనున్నది. 30వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు. డిసెంబర్ 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు చేపట్టి వార్డు సభ్యులు, సర్పంచుల ఫలితాలను వెల్లడిస్తారు.

# ఐ అంటే ఇంటర్నెట్

### రవి నుంచి కీలక సమాచారం సేకరణ
### మూడు రోజుల కస్టడీ అనంతరం చంచల్‌గూడకు తరలింపు

**హైదరాబాద్, నవంబరు 29:** ఐబొమ్మ పూర్తిపేరు 'ఇంటర్నెట్ బొమ్మ' అని ఈ కేసులో అరెస్టయిన ఇమంది రవి వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని అనుకున్నట్లు తెలిపాడు. డొమైన్‌లో సాంకేతిక సమస్యతో 'ఎల్' అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వెల్లడించాడు. శనివారంతో నిందితుడి రెండో విడత కస్టడీ పూర్తయ్యింది. ఇందులో భాగంగా పోలీసులు అతడిని 3 రోజులపాటు ప్రశ్నించి.. కీలక సమాచారం సేకరించారు. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి పోలీసులకు రవి వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాల్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవేనని చెప్పాడు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. ఈ క్రమంలో అతను పోలీసుల ముందు సంచలన విషయాలు వెల్లడించాడు. రవి మెయిల్ అకౌంట్స్ రిట్రైవ్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు.. ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్స్‌లో 21వేలకు పైగా సినిమాలను గుర్తించారు. పైరసీ వెబ్‌సైట్స్ నుంచి సినిమాలు రికార్డింగ్ చేసినట్టు గుర్తించారు. ఓటీటీలో వచ్చే సినిమాలను కూడా రికార్డింగ్ చేసినట్టు రవి అంగీకరించినట్లు తెలిసింది. రికార్డింగ్ చేసిన ఆడియోలు, వీడియోల క్వాలిటీ పెంచేందుకు.. కరేబియన్ దీవుల్లో ఔట్‌సోర్సింగ్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి రవి పోలీసులకు వివరించాడు. తాను నిర్వహించిన వెబ్‌సైట్లపై కూడా క్లారిటీ ఇచ్చాడు. ఐబొమ్మ పూర్తిపేరు ఇంటర్నెట్ బొమ్మగా వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని.. బొమ్మను ఇంటర్నెట్‌లో చూపిస్తున్నందుకే ఐబొమ్మ అని పేరు పెట్టినట్లు చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం పేరు పెట్టాలని భావించినట్లు తెలిపాడు. అయితే డొమైన్‌లో సాంకేతిక సమస్యతో ఒ అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవే అని రవి అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.




# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

### స్టోరేజీకి అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్, నవంబరు 29 (మనసులో మాట)::** తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్‌తో తెలంగాణ ముందుకు పోతుందని భట్టి వెల్లడించారు. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తీర్చి దిద్దుతున్నామని, హైదరాబాద్ గ్లోబల్ హబ్ కాబోతోందని భట్టి తెలిపారు. 2047 వరకు మూడు ట్రిలియన్‌ల ఎకానమికి చేరుకోవాలనేది లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు కావలసిన పెట్టుబడులకు అవసరమైనది విద్యుత్ అన్నారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ప్లానింగ్ చేస్తున్నాం.. పవర్ డిమాండ్ రాష్ట్రంలో పదేళ్లుగా పెరుగుతుందని తెలిపారు. తాజాగా ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. 2014 నుంచి విద్యుత్తు 14.2 డిమాండ్ గ్రోత్ ఉందన్నా రు. 2020-2021 నుంచి 5.44 గ్రోత్, 2024-25లో 9.8శాతం గ్రోత్ కనిపించిందని వెల్లడించారు. 2025 నుంచి 34, 35 వరకు తెలంగాణలో 6.4 గ్రోత్ ఉండే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మూసి ప్రక్షాళన.. ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడుల ఒప్పందం.. పరిశ్రమలు.. డేటా సెంటర్లతో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారబో తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 8.50 గ్రోత్ ఉండబోతుంది.. 2047కి లక్ష 39వేల మె గావాట్ల విద్యుత్ అవసరం.. తెలంగాణలో 2026 ఏప్రిల్ నాటికి 24769 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంది.. వాడే విద్యుత్తులో 50 శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలి.. ఎనర్జీ స్టోరేజ్ ప్లాన్ గతంలో లేదు.. పదేళ్ల క్రితం ప్లాన్ చేసుకుని ఉంటే బాగుండేది.. అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ స్టోరేజ్ ప్లానింగ్ లేదు.. గ్రీన్ పవర్ ఎనర్జీ స్టోరేజ్‌కి తెలంగాణ అనుకూలం.. పదేళ్లుగా ఇలాంటి ప్రయత్నాలు చేయలేదు.. కానీ ఏపీ మొదలుపెట్టింది.. తెలంగాణలో మాత్రం ఆ ప్రయత్నమే లేదు.. థర్మల్ పవర్ కంటే.. గ్రీన్ ఎనర్జీ వస్తుంది.. కానీ తెలంగాణ అందుకోలేక పోయింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత.. డిలైట్ లాంటి వాళ్ళను నివేదిక ఇవ్వండి అని అడిగాం.. ఒక్కరోజు బ్లాక్ ఔట్ అయితే 1500 నుండి 2000 కోట్లు నష్టపోతం.. అని వెల్లడించారు.

గ్రీన్ ఎనర్జీ.. దేశ, ఆయా రాష్ట్రాల అభివృద్ధికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ అనే చర్చ జరుగుతుందని అన్నారు. పారిస్‌లో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం తప్పకుండా గ్రీన్ ఎనర్జీ ఉండాలని అగ్రిమెంట్ చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంలో గుర్తు చేశారు.




# దంపతులను బురిడీ కొట్టించి 3.5 కోట్లు దోపిడీ



### ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు
### క్షుద్రపూజలతో భయపెట్టాడు,
### అందినకాడికి దోచుకుని ఆపై బెదిరింపులు

**వనపర్తి, నవంబర్29:** ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆరోగ్యం బాగుచేయాలని తనను ఆశ్రయించిన దంపతులను క్షుద్రపూజల పేరుతో భయపెట్టి ఏకంగా రూ.3.50 కోట్లు కొట్టేశాడో నకిలీ గురువు. ఈ ఘటన కర్నూలు జిల్లా ఆదోని మండలం బైచిగేరిలో చోటుచేసుకుంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవట్లేదని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరులో ఉంటున్న వెంకటయ్య, పద్మ దంపతులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బైచిగేరి గ్రామానికి చెందిన దుర్గాసింగ్‌కు దేవుడు వస్తాడని, అక్కడికి వెళ్తే ఆరోగ్యం కుదుట పడుతుందని ఎవరో చెబితే కొన్ని రోజుల కిందట దంపతులు అక్కడికి వెళ్లారు. దీన్ని ఆసరాగా చేసుకున్న దుర్గాసింగ్ వారికి కట్టుకథలు చెప్పారు. మీ పొలంలో నిధి ఉందని, అది తీసేంత వరకూ మీకు, మీ పిల్లలకు ప్రాణహాని ఉంటుందని భయపెట్టాడు. ఆ నిధి తీస్తానని చెప్పి వారి నుంచి రూ.80 లక్షలు కాజేశాడు. ఓ రోజు రాత్రి బాధితుల స్వగ్రామం ఉండవల్లి శివారులోని వారి పొలంలో క్షుద్రపూజలు చేశాడు. అనంతరం ఇక్కడ అమ్మవారి విగ్రహం బయటపడిందని చెప్పి మూడడుగుల ఎత్తున్న విగ్రహాన్ని దంపతులకు చూపించాడు. ఈ విగ్రహాన్ని ఇంట్లో పెట్టుకుంటే ప్రాణహాని ఉంటుందని, అమ్మేస్తే రూ.కోట్లు వస్తాయని నమ్మబలికాడు. విగ్రహం కొనుగోలుకు విదేశాల నుంచి కొందరు దిల్లీకి వచ్చారని చెప్పి, ఐదు సార్లు బాధితులను దిల్లీకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో వారి నుంచి సుమారు రూ.3.50 కోట్లు వసూలు చేశాడు. చివరికి మోసపోయామని గ్రహించిన దంపతులు తమ డబ్బు తిరిగివ్వాలని దుర్గాసింగ్‌ను కోరారు. దాంతో అతడు బెదిరింపులకు దిగాడు. 'గ్రామంలోకి అడుగు పెడితే చంపేస్తామని దుర్గాసింగ్‌తో పాటు ముకుంద అనే వ్యక్తి మమ్మల్ని బెదిరించారు. దీనిపై పెబ్బేరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. గత నెల ఆదోనికి వచ్చి డీఎస్పీతో పాటు తాలూకా పోలీసు సీఐకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు' అని దంపతులు ఎమ్మెల్యే వద్ద బోరున విలపించారు. ఎమ్మెల్యే ఆదోని డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడగా, సాక్ష్యాలు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని డీఎస్పీ తెలిపారు.






# డాక్టర్‌ను ట్రాప్ చేసి 14 కోట్లు కొట్టేశారు!

### కొంపముంచిన ఫేస్‌బుక్‌పరిచయం
### ఆమె సూచనతో పెట్టుబడి పెట్టి దివాళా
### చైనీస్‌సైబర్ ఫ్రాడ్‌గ్యాంగ్‌గా గుర్తింపు

**హైదరాబాద్, నవంబరు 29:** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఓ డాక్టర్ సర్వం పోగట్టుకున్నాడు. మోసాలను అడ్డుకునేందుకు పోలీసులు ఎన్నో రకాలు చర్యలు తీసుకున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో దూసుకుపోతున్నారు. ప్రజలను మోసం చేస్తూ భారీగా డబ్బులను కొట్టేస్తున్నారు. తమ మాయ మాటలతో ప్రజల బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను ఈజీగా సొంతం చేసుకుంటున్నారు. యాప్‌లను, కొత్త లింక్‌లను ఓపెన్ చేయెుద్దని, ఓటీపీలు చెప్పవద్దని పోలీసులు పదే పదే చెబుతున్నారు. అయినా కూడా సైబర్ నేరగాళ్లు రోజుకో రకం మోసాలకు తెరతీస్తున్నారు. తాజాగా తెలంగాణలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఓ డాక్టర్..సైబర్ నేరగాళ్ల వలలో పడి పెద్ద మొత్తంలో నగదును పోగుట్టుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ డాక్టర్‌ను సైబర్ కేటుగాళ్లు ఎంతో ఈజీగా ట్రాప్ చేశారు. పెట్టుబడుల పేరుతో దాదాపు రూ.14 కోట్లను స్వాహా చేశారు. సదరు నేరగాళ్లు డాక్టర్‌ను సోషల్ మీడియా ద్వారా సంప్రదించారు. మోనిక మాధవన్ పేరుతో ఫేస్‌బుక్‌లో డాక్టర్‌కు మెసేజ్ చేశారు. ఆపై నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్ లింక్ పంపించారు నేరగాళ్లు. చాలా పెద్ద మొత్తంలో లాభాలు వచ్చాయని డాక్టర్‌ను నమ్మించారు. అయితే డబ్బు విత్ డ్రా చేయాలంటే ట్యాక్స్ కట్టాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. మొదట డాక్టర్ దానిని పట్టించుకోకపోవడంతో ట్యాక్స్ పే చేయాల్సిందే అంటూ అతడిపై సైబర్ నేరగాళ్లు తీవ్ర ఒత్తడి తీసుకొచ్చారు. ఇక డబ్బులు భారీగా వస్తాయన్న భ్రమలో డాక్టర్ కూడా వచ్చే డబ్బు కోసం ఉన్న డబ్బును సైబర్ నేరగాళ్లకు సమర్పించుకున్నాడు. తాను ట్యాక్స్ పే చేసినప్పటికీ అవతలి నుంచి ఎలాంటి నగదు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సైబర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డాక్టర్‌కు వచ్చిన మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చింది?... ఎవరు పంపారు? అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏది ఏమైనా సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీ మొత్తంలో నగదును పోగుట్టుకోవద్దని ప్రజలకు సైబర్ పోలీసులు మరోసారి హెచ్చరించారు.



# దీక్షా దివస్ పేరుతో డ్రామాలు

### బిఆర్ఎస్ నేతలపై మండిపడ్డ సీతక్క

**హైదరాబాద్, నవంబరు 29:** బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసేవాళ్లని.. అధికారం పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని డిమాండ్ చేశారు. అది చెపివుంటే ప్రజలు గమనించే వారని అన్నారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందన్నారు. ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వీటిని అడ్డుకునే కుట్రతోనే దీక్షా దివస్ పేరుతో బిఆర్ఎస్ నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ది పొందింది కేసీఆర్ కుటుంబమేనని అన్నారు. అమరులు పోయారు ..వారి కుటుంబాలు పోయాయని అన్నారు. కానీ బిఆర్ఎస్ నేతలు మాత్రం కోట్లకు పడగలెత్తారని మండిపడ్డారు. ఆ పార్టీ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయి. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం.. లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీక్షా దివస్ పేరుతో చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరని మంత్రి అన్నారు. కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో ఆమెపై అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరయ్యారు.

# హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు

### 3న సీఎం చేతుల మీదుగా ప్రారంభం

### పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన పొన్నం



**సిద్దిపేట, నవంబరు 29:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలో భాగంగా డిసెంబర్ 3వ తేదీన హుస్నాబాద్‌లో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో హుస్నాబాద్ పట్టణ శివారులోని ఏనె వద్ద మైదానంలోని బహిరంగ సభ ప్రాంగణాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. పోలీసులకు మంత్రి పొన్నం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలన ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన అభివృద్ధి, ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులపై ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల సహకారంతో మిగిలిన సమస్యలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిష్కరించి ముందుకెళ్లే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల మధ్యలో కేంద్రంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సభకు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ దీక్షా దివస్

### సిద్దిపేటలో హరీష్ రావు బైక్ ర్యాలీ ■ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ నివాళి



**హైదరాబాద్, నవంబర్ 29:** రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. సిద్దిపేటలో అంబేద్కర్ విగ్రహానికి హరీశ్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్‌లోనూ దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ భవన్‌కు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడ్డారని పేర్కొన్నారు. తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే అని చెప్పారు. ఖమ్మంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, చంద్రావతి పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దీక్షా దివస్ సందర్భంగా సంగారెడ్డిలో అమరవీరులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్ ఇతర బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు.

# కేసీఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు

### కొందరు మూర్ఖులు కనిపించడం లేదంటున్నారు

- కేసీఆర్‌ది దొంగదీక్ష అన్న వారికి ఉద్యమం ఏంతెలుసు
- కాంగ్రెస్ నేతలపై మండిపడ్డ బీఆర్ఎస్ నేత కేటీఆర్



**హైదరాబాద్, నవంబరు 29:** కొందరు మూర్ఖులు కేసీఆర్ కనిపించడం లేదని అంటున్నారని.. గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ దీక్ష.. దొంగ దీక్ష అని మాట్లాడుతున్నారని.. అడ్డమైన మాటలు కొందరు మాట్లాడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. సింహం తన గాధను తాను చెప్పుకోకపోతే, వేటగాడు చెప్పే పిట్టకథనే నిజం అనుకుంటారు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో అప్పుడే వస్తారని తెలిపారు. ఎదురుదాడి ఎలా చెయ్యాలో కేసీఆర్‌కు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదన్నారు. నాయకుడిని నాయకుడే అంటారని.. అర్భకుడిని అర్భకుడే అంటారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడితే తనకు అహంకారం అంటారని.. కానీ తాను ఇలానే మాట్లాడుతానని.. ఏం చేసుకుంటారో చూసుకోండి అని అన్నారు. మహాభారతంలో పాండవులు హీరోలు.. విలన్లు కౌరవులు అని.. అలాగే రామాయణంలో హీరో శ్రీరాముడు... విలన్ రావణుడని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ కథలో హీరో ఉన్నాడు... శకునులు, మారీచులు ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. చరిత్రను మలుపు తిప్పిన రోజు కేసీఆర్ దీక్ష చేసిన రోజు అని చెప్పుకొచ్చారు. సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న కేసీఆర్ నినాదం సునామీ సృష్టించిందన్నారు. కేసీఆర్ దీక్ష విఫలం కావాలని చాలా మంది ప్రయత్నం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ అనే పదాన్ని ఎవరూ తుడిచివేయలేరని స్పష్టం చేశారు. టైం బాగాలేనప్పుడు గ్రామ సింహాలు కూడా పులుల్లా గర్జిస్తాయంటూ ఎద్దేవా చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అననోళ్ళు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. మొదటి నుంచి విలన్ పాత్ర పోషిస్తున్నది కాంగ్రెస్ పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైఎలక్షన్స్‌కు రావాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి సవాల్ విసిరారు. సోనియా గాంధీని బలిదేవత అన్నది ఇప్పుడున్న ముఖ్యమంత్రి అని గుర్తుచేశారు. సోనియా గాంధీకి అసెంబ్లీలో ధన్యవాదాలు తెలిపిన సంస్కారి కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ దొంగ దీక్ష అయితే ఆనాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విరమించమని చెప్పిందని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకుందామని దీక్షా దివస్ సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ హీరోలను విలన్లుగా చిత్రీకరిస్తుందని విమర్శించారు. కాళేశ్వరం మీద కుట్ర జరిగిందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను బాంబులు పెట్టి కూల్చివేసే ప్రయత్నం జరిగిందన్నారు. గులాంల ఎగురులాట కొంత కాలమే... వచ్చే కాలమంతా గులాబీలదే అంటూ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# భూములు అమ్ముకునే కుట్ర

- గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం
- సీఎం రేవంత్‌పై సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ ఆరోపణలు



**సిద్దిపేట, నవంబరు 29:** గ్లోబల్ సమ్మిట్ పెట్టి భూములు అమ్ముకునేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం రియల్ వ్యాపరమం కోసమే ఈ సమ్మిట్ అని ఆరోపణలు చేశారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ..నవంబర్ 29వ తేదీ ఒక చరిత్ర.. ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు ఇదని చెప్పుకొచ్చారు. ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేశారు. సిద్దిపేటలో జరిగిన ఉద్యోగుల గర్జన ఒక చరిత్ర అని వివరించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష ఒక చరిత్ర.. ఎన్నో త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు.'తెలంగాణ రాష్ట్రం కోసం మాజీ సీఎం కేసీఆర్ పోరాడారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేసీఆర్ పోరాటం గురించి మూర్ఖంగా మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9వ తేదీ తెలంగాణ రాష్ట్ర ప్రకటన కేసీఆర్ దీక్ష ఫలితమే. మిలియన్ మార్చ్ మా వంతు.. మిలియన్‌ల కొద్దీ డబ్బు మూటలు కట్టి ఢిల్లీకి పంపుడు కాంగ్రెస్ వంతు. తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డికి కోదండ రామ్ దగ్గర అయ్యారు. మన నిధులు, మన నీళ్లు మనకు దక్కేలా చేసింది కేసీఆర్. కృష్ణానది నీళ్ల పంపకంపై ఆంధ్రప్రదేశ్.. తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా ట్రిబ్యునల్ ముందు మూడు రోజులుగా వాదిస్తుంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఈ విషయంపై మాట్లాడటం లేదు. తెలంగాణ రాష్ట్ర మూడు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచాలని చూడొద్దు. తెలంగాణ రావడంతోనే మన రాష్ట్రం పచ్చని మాగాణిగా మారి పంటలు పండుతున్నాయి. రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పోరాట చరిత్ర ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం దీక్ష దివస్ జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన ఉద్యమకారుడు అందెశ్రీకి నివాళులు అర్పించారు నాయకులు. అంతకుముందు దీక్షా దివస్ సందర్భంగా సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా నుంచి పొన్నాల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఆవరణలో ఉద్యమ స్ఫూర్తి పైలాన్‌ను తిరిగి ఆవిష్కరించారు.

# దీక్షా దివస్ అంటే స్వాతంత్ర్య దినోత్సవమే

- తెలంగాణ వచ్చేదాకా దీక్ష విరమించని కెసిఆర్
- భువనగిరి దీక్షా దివస్‌లో మాజీమంత్రి జగదీశ్ రెడ్డి




**యాదాద్రి భువనగిరి, నవంబరు 29:** కేసీఆర్ నా శవయాత్ర.. తెలంగాణ జైత్ర యాత్ర ఒకేసారి జరగాలి అన్నారని.. అప్పటిదాకా దీక్ష విరమించేది లేదని పట్టుబట్టారని అంటూ ఆనాటి ఘటనలను మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. ఆనాటి ఆంధ్రా పోలీస్‌లు, నాయకులు ఎన్నో జిమ్మిక్కులు చేశారని.. అయినా అన్నింటిని ఛేదించి తెలంగాణ సాధించామన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివస్ వేడుకల్లో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 29 దీక్ష దివస్ మనందరికీ స్వాతంత్ర్యం తెచ్చిన రోజు అని తెలిపారు. దేశానికి ఆగస్టు 15 ఎలాగో, మనకు నవంబర్ 29 అలాగేనన్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి, మొక్కవోని పట్టుదలతో దీక్ష చేసి, ఢిల్లీ మెడలు వంచిన రోజనరి పేర్కొన్నారు. కేసీఆర్ దీక్ష చేసిన 11 రోజులు ఒక్కోక్షణం ఒక్కో భయంతో గడిపామని.. తమ నేతకు ఏమైనా అయితే తెలంగాణ ఎటు పోతుందో అని కన్నీరు పెట్టామన్నారు. కే హైదరాబాద్ లేకుండా తెలంగాణ అన్నారని.. అప్పుడు కేసీఆర్ గుండె లేని మనిషి వున్నా లేనట్లే హైదరాబాద్‌తో కూడిన తెలంగాణనే కావాలని పట్టుబట్టారన్నారు. ఢిల్లీ గడగడ లాడిపోయిందని.. తెలంగాణ బెబ్బులిలా నిలబడి బరిగీసి కొట్లాడింది.. లక్ష్యం ముద్దడినం అంటూ గుర్తు చేశారు. కేసీఆర్ అంటే తెలంగాణ తెచ్చిన ముఖ్యమంత్రి.. తెలంగాణ కోసం చావు అంచుల దాకా, పేగులు తెగే దాకా కొట్లాడిన ఉక్కు మనిషి కేసీఆర్ అన్నారు. అలాంటి కేసీఆర్‌పై ఇప్పుడు కాంగ్రెస్ దొంగలు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని.. తస్మాత్ కొడుకుల్లారా.. కేసీఆర్‌పై నోరు జారితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి దేవుడని.. అందరి గుండెల్లో గూడు కట్టుకున్న మహానేత మా కేసీఆర్ అన్నారు. కేసీఆర్ సైనికులుగా మేమంతా తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పని చేశామని.. ఇప్పుడు వస్తున్న 24 గంటల కరంట్, మంచి నీళ్లు, పాడి పంటలు, తెలంగాణ ఆదాయం అన్ని అన్ని కేసీఆర్ సాధించినవేనన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు అనుభవిస్తున్న పదవులు అన్ని కేసీఆర్ తెచ్చినవేనని.. కేసీఆర్‌పై కుట్రలు చేయని పార్టీ లేదని.. ఎప్పుడు పిల్లి శాపనార్థాలు పెడతారని విమర్శించారు. ఇప్పుడు కూడా కేసీఆర్ ఆరోగ్యం బాగాలేదని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని.. కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. తెలంగాణ అభివృద్ధి జరిగిగేది ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని.. తెలంగాణ వాదులపై తుపాకీ ఎక్కుపెట్టిన దుర్మాగుడు రేవంత్.. ఆయన పాలనే ఇప్పుడు నడుస్తుండడం దౌర్భాగ్యమన్నారు. తెలంగాణలో లాఠీ, లూఠీ పాలన నడుస్తుందని.. తెలంగాణ కాంగ్రెస్ విముక్త రాష్ట్రంగా అయ్యేంత వరకు పోరాటం చేద్దామంటూ పిలుపునిచ్చారు.

# స్వార్థ రాజకీయాల కోసం అసత్యపు ఆరోపణలు



**జైనూర్:** స్వార్థ రాజకీయాల కోసం ఏళ్ల తరబడి పార్టీ కోసం పని చేసిన నాయకులపై ఆసిఫాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్ నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని జైనూర్ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం అజ్మీరా శ్యామ్ నాయక్ కెరమెరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చారని చెప్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి శాసనసభ ఎన్నికల్లో తిరగడానికి శ్యామ్ నాయక్ వాహనం సమకూర్చడంతో పాటు డబ్బులు ఇచ్చానని చెబుతున్న నువ్వు ఆధారాలతో సహా బయట పెట్టాలని, లేనిపక్షంలో పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. 2008 నుంచి నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తగా అంచెలంచెలుగా ఎదిగిన చరిత్ర నాదైతే, కేవలం ఎమ్మెల్యే టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన చరిత్ర నీదన్నారు. దిగజారుడు రాజకీయాలకు శ్యామ్ నాయక్ కేరాఫ్ అడ్రస్ గా మారారని ఎద్దేవా చేశారు. కొమురంభీం జిల్లాలో కష్టకాలంలో ఉన్న సమయంలో ఆదివాసీ విభాగం కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ గా బాధ్యతలు తీసుకోవడం జరిగిందని, ఆ సమయంలో మీరు ఎక్కడ ఉన్నారో ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతున్న క్రమంలో శ్యామ్ నాయక్ పార్టీ కోసం పనిచేయాల్సింది పోయి చౌకబారు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. అప్పటి డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సిఫారసు మేరకు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేట్ పదవి కట్టబెడితే జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు.

# సమిష్టి కృషితో బాధితులకు సత్వర న్యాయం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.ప్రభాకర్ రావు





**ఆదిలాబాద్:** న్యాయ, పోలీస్, ఆబ్కారీ, జైలు శాఖల అధికారులు సమిష్టి కృషితో బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు కాంప్లెక్స్ లో కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్‌తో కలిసి న్యాయ అధికారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధా న న్యాయమూర్తి మాట్లాడుతూ దీర్ఘకాలి కంగా పెండింగ్ కేసులతో పాటు ఫోక్సో, గంజాయి వంటి కేసులను ప్రాధా న్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. జిల్లా కోర్టులోని వివి ధ విభాగాల్లో అక్టోబర్ వరకు 7310 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, 98 కేసులు దీర్ఘాకాలికంగా పెండింగ్ ఉన్నా యని తెలిపారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ 18 భూ సేకరణ కేసుల రూ.66 లక్షలకు సంబంధించిన వివ రాలను సీసీఎల్ఏ నుంచి ఇరిగేషన్, ఆర్థిక శాఖకు పం పించి వాటి పరిష్కారానికి కృషి చేస్తు న్నామని తెలిపారు. ఏజెన్సీ ఏరియాలో సివిల్ సూట్ల్స్ కేసు లను శనివారం విచారణ జరపడం జరుగుతుందని, పాత ఏజెన్సీ కేసులను ఆర్డీఓ, సబ్ కలెక్టర్ పరిధిలో విచారణకు పంపడం జరుగుతుందని తెలిపారు. జైలు, ఆబ్కారీ, డ్రగ్ లకు సంబంధించి లోక్ అదాలత్ పెండింగ్ కెసులను పర్యవేక్షి స్తూ, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం జల్ సంచాయి జన్ భాగిదారి విభాగంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నందుకు గాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, ఎస్పీ, అధికారులు కలెక్టర్‌ను సన్మానించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు వివేక్ కుమార్, లక్ష్మి కుమారి, సిఎం రాజ్యలక్ష్మి, డి హుస్సేన్, మౌనిక, పోలీస్, జైలు, అబ్కారీ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

**జన్నారం:** కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండల అభివృద్ధికై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో జన్నారం మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, కలమడుగు మాజీ సర్పంచ్ బొంతల మల్లేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు.





# అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరిక

**ఆదిలాబాద్:** అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని నాగమల్యాల్ గ్రామస్తులు, గ్రామ పటేళ్లు, తాజా మాజీ సర్పంచ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని, అధికార పార్టీతో కలిసి మా ఊరును అభివృద్ధి పథంలో నడిపించుకుంటామని అన్నారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ గత పదేళ్లుగా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉందని, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. నాగమల్యాల్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ లు భీముడు, నారాయణ, గ్రామ పటేళ్లు గంగారాం, తోట గంగాధర్ గంగారాం, యువ నాయకులు మహేందర్, మండల అధ్యక్షులు ఆడే వసంతరావు, కుంటాల మాజీ సర్పంచ్ అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బానోత్ వసంత్, జాదవ్ కపిల్ దేవ్, ఆడే రమేష్, వసంతరావు, ఎండి సద్దాం, మౌలానా, గజ్జల అశోక్, గట్టు అశోక్, సంతోష్, దేవేందర్, లక్ష్మణ్, నాయకులు గ్రామస్తులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలి




**నేరడిగొండ:** ప్రతిఒక్కరు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. శనివారం సంజయ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠ శాల రిజర్వ్ పోలీస్ లైన్‌లో పౌర హక్కుల రోజు సంద ర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి అదనపు కలెక్టర్, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 26న ఘనంగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకున్నామని అన్నారు. అన్ని వర్గాల వారికీ రాజ్యాంగం ద్వారానే హక్కు రావడం జరిగిందని తెలిపారు. చదువుతో గౌరవం లభిస్తుందని, ప్రతిఒక్కరు చదువుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అరవర్చుకోవాలని, ఆడపిల్లలకు పరిమితులు విధించకుండా తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. సమాజంలో మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి చెడిపోతున్నారని, జిల్లా యంత్రాంగం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరు చట్టాన్ని గౌరవించాలని, సేవాభావం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు విదేశీ విద్య నిధి కింద ప్రభుత్వం రూ.20లక్షలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, అర్బన్ తహశీల్దార్ శ్రీనివాస్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సామజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన బోరంచు

**ఆదిలాబాద్:** దండేపల్లి మండలంలోని నర్సాపూర్ లో గల పద్మావతి గార్డెన్స్ లో శనివారం జరిగిన ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ సోదరుడు ఎస్సై పురుషోత్తం %-%సాయి సుష్మల రిసెప్షన్ కు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు నలిమెల నవీన్ రెడ్డి, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





# బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

**ఖానాపూర్:** బీఆర్ఎస్ పార్టీలో కాంగ్రెస్ పార్టీ బిర్నంది సోమార్‌పేట్ మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ నీటి సంఘం చైర్మన్ బండారి పుష్ప రవీందర్ లు చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ ఖానాపూర్ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ శనివారం కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బండారి లక్ష్మీరాజంతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ పార్టీ చూపుతున్న కట్టుబాటు, శ్రద్ధే తమ చేరికకు ప్రధాన కారణమని కొత్తగా చేరిన నాయకులు తెలిపారు. ప్రజలకు అండగా నిలుస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని భూక్యా జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు ఈ చేరికలు మరింత బలాన్నిస్తాయని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ బలోపేతం దిశగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన




**నేరడిగొండ:** అత్యవసర పరిస్థితితుల్లో గుండె పోటు వచ్చిన వ్యక్తి ప్రాణాలను సీపీఆర్ ద్వారా కాపాడవచ్చని వైద్యాధికారి ఎండి సద్దాం అన్నారు. శనివారం మండలంలోని తేజాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మనిషి ఆకస్మికంగా షాక్ కు గురైనప్పుడు సీపీఆర్ ద్వారా రక్షించవచ్చని తెలిపారు. విద్యార్థులు అత్యవసర పరిస్థితితుల్లో సీపీఆర్ చేసి ఆపదలో ఉన్నవారిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి

## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**నార్నూర్:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు ఘన విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పిలుపునిచ్చారు. శనివారం నార్నూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు లోకండె దేవ్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి సమస్యలు, అభివృద్ధి అవసరాలను తీర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రజల్లో నమ్మకం ఏర్పర్చాలని సూచించారు. పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామాల్లో సమన్వయం పెంచుకుంటూ అభ్యర్థుల విజయానికి పాటుపడాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, సర్పంచ్ ఆశావహులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కంగ్రాట్స్ సుగుణక్క

**ఆదిలాబాద్:** ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణను శనివారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని నివాసంలో కాంగ్రెస్ శ్రేణులతో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





## సర్పంచ్ అభ్యర్థిగా పెందూర్ నందా నామినేషన్

**వాంకిడి:** వాంకిడి మండలంలోని ఖమన గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పెందూర్ నందా శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలతో కలిసి గ్రామ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతానని , గ్రామ ప్రజలు తమను అత్యధిక మెజారిటీ గెలిపించాలని కోరారు.

## పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే



**మంచిర్యాల:** లక్ష్మీనగర్‌లో గల శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన గ్రాండ్ పేరెంట్స్ పలు ఆటల్లో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో సమాజంలో ప్రస్తుతం ఎదుగుతున్న పిల్లలకు పెద్దలని గౌరవించాలనే నైతిక విలువలు పెంపొందుతాయనిపాఠశాల ప్రిన్సిపల్ అయ్యుబ్ పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ఆట్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



**తాండూర్:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా మహిళా సాధికా రత కేంద్రం సౌజన్య విజయ అన్నారు. ఐసీడీఎస్ మాదారంలో శనివారం నిర్వహించిన సెక్టార్ మీటింగ్ లో బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించా రు. బాల్య వివాహం జరగడంతో కలిగే నష్టాల గురించి వివరించారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాల్య వివాహాన్ని గుర్తించినప్పుడు వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1098,181, 100కు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహం జరిగితే రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా వంటి కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా భద్రత కోసం కార్డెన్ సెర్చ్



**రెబ్బెన:** ప్రజల భద్రత కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం (కార్డెన్ సెర్చ్) నిర్వహిస్తున్నట్లు రెబ్బెన సీఐ కె సంజయ్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ నికిత పంథ్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు రెబ్బెన మండలం పుంజుమెర గూడ గ్రామంలో శనివారం పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 31 బైక్‌లు, 4 వాహనాలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి, గుడుంబా, రేషన్ సరఫరా వంటివి తమ దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లోనూ కావద్దని, అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. మద్యం, డబ్బులు పంపిణీ చేసే వారి గురించి నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన ఎస్సై ఏ వెంకటకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హలో జర్నలిస్టు.. ఛలో హైదరాబాద్

- డిసెంబర్ 3న జర్నలిస్టు మహా ధర్నాకు తరలి రండి
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్



**వాంకిడి, నవంబరు 29:** జర్నలిస్టుల సమస్యలతో ఆనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీయూడబ్ల్యూజే ( ఐజేయూ ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వాంకిడి మండల కేంద్రంలో జర్నలిస్టుల మహా ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో బతుకులు మెరుగు పడతాయని తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి , పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కూడా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాకపోవడం సిగ్గుచేటు అన్నారు. అక్రెడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య భీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 3 తేదీన హైదరాబాద్ లోని సమాచార కమిషనర్ కార్యాలయం ఎదుట మహా ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేష్ చారి, రాధాకృష్ణ చారి, సినియర్ పాత్రికేయులు దుర్గం సునీల్ , పాత్రికేయులు అల్లోజ రవీంద్ర చారి, విభుతి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వ ప్రసాద్‌పై విమర్శలు చేయడం సరికాదు

- స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేద్దాం
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వసంతరావు



**ఆసిఫాబాద్ :** మాజీ డిసిసి అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు పై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి అజ్మేరా శ్యాం నాయక్ విమర్శలు చేయడం సరి కాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వసంతరావు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయం ఆవరణలో విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్, పార్టీ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెరమెరిలో డిసిసి సమక్షంలో శ్యాం నాయక్ విశ్వప్రసాద్ పై మాట్లాడడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయం కావడంతో పార్టీని గెలిపించుకోవాల్సింది పోయి సొంత పార్టీ నాయకులపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్యాం నాయక్ ఓటమికి మాజీ డిసిసిని బాధ్యుణ్ణి చేయడం సరైన విధానం కాదన్నారు. కాంగ్రెస్ నాయకుడు అనిల్ గౌడ్ తో పాటు ఆయన భార్యపై, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పై చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నట్లు తెలిపారు. డిసిసి సమక్షంలో ఇంతగా మాట్లాడుతున్నప్పటికీ ఆమె స్పందించకపోవడం ఆయనకు వత్తాసు పలుకుతున్నట్లు ఉందన్నారు. జిల్లాలో పార్టీ బలంగా ఉందని దానిని దీనికి నిదర్శనమే ఎంపీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ అన్నారు. నూతన డిసిసి ఇటువంటి వాటిని భవిష్యత్తులో జరగకుండా చూడాలని సూచించారు. కాంగ్రెస్ కార్యకర్తలు అంత విశ్వప్రసాద్ తోటే ఉన్నారని ఆయనకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో జిల్లాలో అన్ని సర్పంచులు కైవసం చేసుకునేలా ప్రయత్నం చేస్తామన్నారు. ఎన్నికల సమావేశాల్లో ఎన్నికల్లో గెలుపు కోసం మాట్లాడాలి తప్ప సొంత నాయకులను విమర్శించకూడదని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అసద్ , గుర్నులే నారాయణ, సలీం, రవీందర్, సాయి, కలీం, జావిద్, మహేష్ గౌడ్ వివిధ మండలాలు నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా చర్యలు

**జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**




**ఆసిఫాబాద్ :** ప్రీ ప్రైమరీ పాఠశాలలను సమర్ధవంతంగా నిర్వహించి ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ పాఠశాలలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు 41 మంది ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లకు శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 41 ప్రీ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని, పాఠశాలలకు వచ్చే విద్యార్థులను అంగన్వాడి కేంద్రాల కంటే మెరుగ్గా విద్య అందుతుందనే కలిగించాలని తెలిపారు. ముఖ్యంగా 3 సం.ల నుండి 6 సం.ల వరకు పిల్లలకు బ్రెయిన్ డెవలప్మెంట్ అధికంగా ఉంటుందని, చిన్న పిల్లలకు చక్కని ప్రేమ ఆప్యాయతలతో బోధించాలని, వారి అభిరుచిని తెలుసుకోవాలని తెలిపారు. వారితో పెయింటింగ్ వేయించాలని, పిల్లలకు సిలబస్ లోని అంశాలతో పాటు మంచి విలువలు నేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ఇన్స్ట్రక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్గదర్శకాలను సమర్ధవంతంగా అమలు చేయాలి

**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**



**సిర్పూర్ టీ:** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మార్గదర్శకాలను సమర్ధవంతంగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లాలోని సిర్పూర్ (టి ) మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరుగుతున్న ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది సమన్వయం, ఎన్నికల సామాగ్రి పంపిణీ అంశాలలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని, విధులలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే ఉన్నత అధికారులను సంప్రదించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ రోజు అమలు చేయవలసిన ఎన్నికల ప్రవర్తన నియమావళి, భద్రత చర్యలు, రవాణా, కమ్యూనికేషన్, త్రాగునీరు, విద్యుత్ ఇతర ప్రాథమిక సదుపాయాల లభ్యతను ముందుగానే పరిశీలించుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నియమాలకు లోబడి నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, విధులలో సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మత్యాగం చేసిన వారికన్నా మీరు గొప్పా?

- శ్రీకాంతచారి ఆత్మత్యాగం గుర్తుకు రావడం లేదు
- గద్దర్, కోదండరాం, అందె శ్రీ, గూడ అంజయ్యలను ఎందుకు విస్మరించారు
- కేటీఆర్ వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**హైదరాబాద్, నవంబరు 29:** తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగాల కంటే కేసీఆర్ దీక్షను పెద్దదని చెప్పుకోవడం సరైందా అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన దీక్ష నిజంగా ఎలా జరిగిందో ప్రజలందరికీ తెలుసని, ఆ దీక్షను మహోన్నతంగా చూపించడానికి బీఆర్ఎస్ ప్రయత్నం చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి, యాదయ్య, ఇషాన్ రెడ్డి, కానిస్టేబుల్ కిష్టయ్య వంటి అమరవీరుల త్యాగాలు ఎంత గొప్పవో గుర్తు చేశారు. అలాంటి త్యాగాలను పక్కన పెట్టి కేసీఆర్ దీక్షను ప్రోత్సహించడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ నాటకమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు చూపుతున్న గౌరవం ప్రత్యేకమని, కేసీఆర్ మాత్రం ఉద్యమకారులను జైల్లో పెట్టిన చరిత్ర కలిగి ఉన్నాడని దయాకర్ అన్నారు. తెలంగాణ ప్రజల రుణం తీర్చుకునే పనిలో రేవంత్ రెడ్డి ఉన్నారని, ఆయన పాలన మానవతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కేసీఆర్ దీక్షపై విమర్శలు చేస్తే కేటీఆర్ ఎందుకు అంత అసహనం చూపుతున్నాడని దయాకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో పనిచేసిన కాలంలో తెలంగాణ కోసం చిన్నారెడ్డి సంతకాల సేకరణలో మహేష్ గౌడ్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. సాగరహారం రోజున కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ ఉన్నారని కూడా ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకత్వంపై దయాకర్ ఘాటు వ్యాఖ్యలు చేస్తూ.. కాంగ్రెస్ విలీనానికి కేసీఆర్ అవకాశవాద రాజకీయాల వల్లే అడ్డుపడ్డాడని, మిలియన్ మార్చ్‌ను కూడా వ్యతిరేకించాడని తెలిపారు. గద్దర్, కోదండరాం, అందె శ్రీ, గూడ అంజయ్య వంటి ఉద్యమకారులు కేసీఆర్‌కు నచ్చరని అన్నారు. ఉద్యమ సమయంలో మరణించిన శ్రీకాంతాచారిని బీఆర్ఎస్ గుర్తు చేసుకోవడం లేదని ఎత్తి చూపారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ ఏర్పడిందని కేసీఆర్ అనేకసార్లు చెప్పినా, అదే సోనియా గాంధీని తర్వాత అవమానించడం అతని స్వభావానికి నిదర్శనమని దయాకర్ చెప్పారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను చంపడానికి కేసీఆర్ ప్రయత్నించాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యి సోనియా గాంధీకి తెలంగాణ బహుమతి ఇచ్చారని, బీఆర్ఎస్‌గా మారిన రోజే కేసీఆర్ పార్టీలో తెలంగాణ ఆత్మ చనిపోయిందని విమర్శించారు. అందె శ్రీ అంత్యక్రియల సందర్భంగా రేవంత్ రెడ్డి చూపిన మానవత్వం అందరిని ఆకట్టుకుందని అన్నారు. కేటీఆర్ రాజీవ్ గాంధీపై వ్యాఖ్యలు చేస్తే సహించబోమని దయాకర్ హెచ్చరించారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో 420 ముద్ర వేసుకున్న నాయకులు మాత్రమే మిగిలారని, సర్పంచ్ ఎన్నికల్లో సెంటిమెంట్ కోసం హడావిడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమం పేరిట రాష్ట్రాన్ని దోచుకున్నవారు బీఆర్ఎస్ నాయకులేనని వ్యాఖ్యానించారు.

# 16 ఏండ్ల క్రితం ఉద్యమాన్ని మలుపుతిప్పిన దీక్ష

ఆనాటి రోజులు గుర్తు చేసుకున్న కేటీఆర్, హరీశ్



**హైదరాబాద్, నవంబర్ 29:** దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమం నాటి రోజులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక మలుపుగా నిలిచిన రోజు 2009 నవంబర్ 29 అని అన్నారు. రాష్ట్ర సాదనకు 16 ఏండ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు నాంది పలికిందని అన్నారు. తెలంగాణ గమ్యాన్ని మార్చిన చారిత్రాత్మక రోజు అని తెలిపారు. కరీంనగర్‌లో కేసీఆర్‌ను అరెస్టు చేసిన సమయంలో ప్రజల్లో నుంచి వచ్చిన ఆగ్రహ జ్వాలలు తెలంగాణ ఉద్యమానికి కొత్త ఊపు ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు అప్పటి పరిస్థితులను గుర్తుచేస్తూ ఆనాడు కరీంనగర్‌లో తీసిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అలాగే దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమం నాటి రోజులను బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు గుర్తుచేసుకున్నారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో 2009 నవంబర్ 29న ప్రారంభించిన ఆమరణ దీక్ష, ఉద్యమ గతిని మలుపు తిప్పిందని.. సరికొత్త చరిత్రకు నాంది పలికిందని.. తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసిందని తెలిపారు. 'రానే రాదు, కానే కాదు' అన్న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును సబ్బండ వర్గాలను ఏకం చేసి సుసాధ్యం చేసి చూపిన ఘన చరిత కేసీఆర్‌ది అని కొనియాడారు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష సాధనకు అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర కేసీఆర్‌ది అని అన్నారు. పదవులే కాదు, తెలంగాణ కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడ్డ ధీరత్వం కేసీఆర్‌ది అని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. నాలుగు కోట్ల ప్రజల్లో మార్మోగే 'జై తెలంగాణ' అనే రణ నినాదం కేసీఆర్ అని అన్నారు. నవంబర్ 29న కేసీఆర్ దీక్ష లేకుండా డిసెంబర్ 9 ప్రకటన లేదు. డిసెంబర్ 9 ప్రకటన లేకుండా తెలంగాణ రాష్ట్రమే లేదని స్పష్టం చేశారు. దశాబ్దాల పోరాటంతోనే తెలంగాణ సిద్ధించింది తప్ప పాలకుల దయాదాక్షిణ్యాలతో కాదన్నది అక్షర సత్యమని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ దీక్షా కాలం ఉద్యమ జ్ఞాపకాలు నా గుండెలో పదిలంగా ఉన్నాయని.. జై తెలంగాణ అని నినదిస్తున్నాయి.. తెలంగాణ స్ఫూర్తిని నిత్యం రగిలిస్తున్నాయని అన్నారు.




# రేవంత్ సొంతూరులో సర్పంచ్ ఏకగ్రీవం

పోటీచేసే వారి నుంచి ఒకరిని ఎన్నుకోవాలని నిర్ణయం

**కొడంగల్, నవంబరు 29:** సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లె సర్పంచ్ ఏకగ్రీవమైంది.. ఎస్సీకి రిజర్వ్ అయిన కొండారెడ్డిపల్లె సర్పంచ్ పదవికి 15 మంది పోటీ పడ్డారు. చివరికి సర్పంచ్ ఎన్నికను గ్రామ పెద్దలు ఏకగ్రీవం చేశారు.. 15 మందిలో ఒకరి పేరును సీల్డ్ కవర్‌లో ప్రకటించనున్నారు. ఎవరి పేరు వచ్చినా గ్రామం మొత్తం సమిష్టిగా ఆ నిర్ణయాన్ని గౌరవించాలనేది గ్రామ నాయకత్వం అభిప్రాయంగా చెబుతున్నారు. మరోవైపు.. మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు నేటితో పూర్తయ్యింది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించినట్టు అధికారులు తెలిపారు. గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తుండగా శుక్రవారం సర్పంచి పదవులకు 4,901 నామినేషన్లు వచ్చాయి. దీంతో మొత్తం నామపత్రాల సంఖ్య 8,198కి చేరింది. అటు మొన్న, నిన్న కలిపి వార్డు సభ్యులకు 11,502 నామినేషన్లు దాఖలైనట్టు అధికారులు వెల్లడించారు. తొలి విడతలో 4,236 సర్పంచ్, 37,440 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ డిసెంబర్ 3. డిసెంబర్ 11న మొదటి దశ ఎన్నికలు జరుగుతాయి. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# లండన్‌లో కేసీఆర్ - దీక్షా దివస్ వేడుకలు




**లండన్:** లండన్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి (తెలంగాణ భారాస) యూకే విభాగం ఆధ్వర్యంలో కేసీఆర్ దీక్షా దివస్‌ను అత్యంత ఘనంగా నిర్వహించారు. నవంబర్ ఇరవై తొమ్మిది, రెండువేల తొమ్మిది నాడు 'తెలంగాణ వచ్చుడో – కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో కేసీఆర్ గారు చేపట్టిన దీక్ష, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఒక కీలక ఘట్టంగా భావిస్తూ ఈ రోజును దీక్షా దివస్‌గా జరుపుకున్నారు. యూకేలోని వివిధ ప్రాంతాల నుంచి తెలంగాణ భారాస నాయకులు, తెలంగాణ వాదులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. యూకే విభాగం అధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ గారు చేసిన శాంతియుత తెలంగాణ పోరాటం ప్రపంచానికే ఆదర్శమని, రాబోయే తరాలకు మన తెలంగాణ చరిత్రను, కేసీఆర్ గారి చరిత్రను చెప్పడం మనందరి బాధ్యత అని ఉద్ఘాటించారు. సీనియర్ భారాస నాయకులు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సహ వ్యవస్థాపకులు రాఘవేంద్ర యాదవ్ ప్రసంగిస్తూ, తెలంగాణ ప్రజల దశాబ్దాల కలను సాకారం చేసే క్రమంలో తన ప్రాణాలను పణంగా పెట్టి, సకల జనులను ఏకం చేసి, శాంతియుత పోరాటంతో రాష్ట్రాన్ని సాధించి పెట్టిన కేసీఆర్ గారి ఉద్యమ ప్రస్థానం ప్రపంచానికే ఆదర్శమని కొనియాడారు. ఉపాధ్యక్షులు హరి గౌడ్ మరియు రవి కుమార్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య ఉద్యమానికి మహాత్మా గాంధీ గారు ఎంచుకున్న అహింసా పద్ధతిని మన తెలంగాణ గాంధీ అయిన కేసీఆర్ గారు పాటించి, రాష్ట్ర సాధనోద్యమంలో ఎటువంటి హింసకు తావు లేకుండా, శాంతియుత మార్గంతో ఏదైనా సాధించవచ్చనే గొప్ప సందేశాన్ని భారత దేశ పౌరులకే కాకుండా, ప్రపంచానికి చూపిన గొప్ప స్ఫూర్తిదాత కేసీఆర్ గారని ప్రశంసించారు. ఉపాధ్యక్షులు సత్యమూర్తి చిలుముల మరియు సతీష్ రెడ్డి మాట్లాడుతూ, లండన్ నుండే కేసీఆర్ గారు తలపెట్టిన దీక్ష నుంచి నేటి వరకు వారికి మద్దతుగా ఉంటూ, చేపట్టిన కార్యక్రమాలు, ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ గారి నాయకత్వాన్ని బలపర్చడం మన చారిత్రక అవసరమని, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వారి వెంట ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూకే విభాగం అధ్యక్షుడు నవీన్ రెడ్డి, సీనియర్ భారాస నాయకులు రాఘవేంద్ర యాదవ్, ఉపాధ్యక్షులు హరి గౌడ్ నవాపేట్, సతీష్ రెడ్డి గొట్టిముక్కుల, సత్యమూర్తి చిలుకుల, రవి రేటినేని, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ కడుదుల, మాజీ అధ్యక్షులు అశోక్ గౌడ్ దూసరి, సలహా మండలి ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ జెల్ల, సలహా సభ్యులు దొంతుల వెంకట్ రెడ్డి, ఐటీ కార్యదర్శి రవి ప్రదీప్ పులుసు, కోశాధికారి సురేష్ బుడగం, సామాజిక మాధ్యమాల సమన్వయకర్తలు అంజన్ రావు, అబ్దుల్ పాల్గొన్నారు.

## సర్పంచ్ పదవికి పోటీలో
# మాజీ మావోయిస్ట్

శివంగలపల్లి సర్పంచ్ స్థానానికి పోటీకి సిద్ధం

**రాజన్న సిరిసిల్ల, నవంబరు 29:** తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి మాజీ మావోయిస్టు నేత జ్యోతి బరిలోకి దిగుతున్నారు. మావోయిస్టు పార్టీలో 19 సంవత్సరాలుగా పనిచేసి ప్రజా సమస్యల పోరాటానికి కృషి చేశానని, 2023 సంవత్సరంలో సంవత్సరంలో లొంగిపోయిన అనంతరం, గ్రామంలో ప్రజల సమస్యలపై దృష్టి సాధించినట్లు తెలిపారు. మూడేళ్ల క్రితం లొంగి పోయిన మాజీ మావోయిస్టు నేరెళ్ల జ్యోతి సర్పంచిగా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా శివంగలపల్లికి చెందిన నేరెళ్ల జ్యోతి 2005లో దళ సభ్యురాలిగా చేరారు. కోనరావుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠ శాలలో 2001లో పదో తరగతి చదివిన జ్యోతి.. 19 ఏళ్ల ప్రస్థానంలో జిల్లా కమిటీ సభ్యురాలి స్థాయికి చేరారు. రాష్ట్ర ప్రెస్ ఇన్ ఛార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2023లో అనారోగ్య కారణాలతో కరీంనగర్ ఎస్పీ సుబ్బారాయుడు ముందు లొంగిపోయారు. ప్రస్తుతం గ్రామంలోనే ఉంటున్న జ్యోతి పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో శివంగలపల్లి సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. ప్రజాసేవ చేసే అవకాశం కోసం సర్పంచి పోటీలో నిల బడినట్లు జ్యోతి తెలిపారు.

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు దారుణం

వెంటనే క్షమాపణలు చెప్పాలి: ఎమ్మెల్యే అనిరుధ్



**హైదరాబాద్, నవంబరు 29:** కోనసీమపై తెలంగాణ నాయకుల దిష్టి పడిందని ఏపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అనడం తప్పు మాత్రమే కాదు, దారుణమని మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఎప్పుడూ మేము ఆంధ్రప్రదేశ్ సంక్షేమానికే మద్దతు ఇచ్చామని, రెండు రాష్ట్రాలు సౌహార్దంతో అభివృద్ధి చెందాలని కోరుకుంటామన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర విభజన అడ్డుపడిందంటే మాత్రం ఊరుకోమన్నారు. పవన్ కళ్యాణ్ వెంటనే భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల గురించి, తెలంగాణ ప్రాంతం గురించి తప్పుగా మాట్లాడితే సహించబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో ఆంధ్ర కాంట్రాక్టర్లు కోట్లు రూపాయల స్కామ్ చేసిన సందర్భాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో వారి భరతం పడతామని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి హెచ్చరించారు. పవన్ కళ్యాణ్‌కు తెలంగాణలో అభిమానులు ఉన్నారని, ఆయన సినిమాలను తెలంగాణ ప్రజలు ఎప్పుడూ బహిష్కరించ లేదని గుర్తుచేశారు. ప్రజల మధ్య విభేదాలు రేకెత్తించే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.

# సర్పంచ్ ఎన్నిక కోసం ఎస్ఐ రాజీనామా



**కోదాడ, నవంబరు 29:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతుంది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కోదాడ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పులి వెంకటేశ్వర్లు తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించారు. స్వస్థలం కోదాడ మండలం గుడిబండ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆయన స్వచ్ఛంద పదవి విరమణ చేశారు. పుట్టిన ఊరికి సేవ చేయడమే లక్ష్యంగా ఇంకా 5 నెలల సర్వీస్ ఉండగానే వీఆర్ఎస్ తీసుకున్నట్లు వెల్లడించారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన గుడిబండలో మొత్తం జనాభా 4,486. ఓటర్లు 3,813. వార్డులు 12. ఆదివారం నుండి నామినేషన్ల స్వీకరణ

# సీఎం రేవంత్‌తో శుభలేఖ సుధాకర్‌భేటీ

రవీంద్రభారతిలో ఎస్పీబీ విగ్రహావిష్కరణకు ఆహ్వానం




**హైదరాబాద్, నవంబర్29:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీనటుడు, శుభలేఖ సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 15న రవీంద్ర భారతి ఆవరణలో దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. రవీంద్ర భారతి ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు ఎస్పీ బాలు కుటుంబం తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. పక్రియ కొనసాగనుంది.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

మంత్రి పొంగులేటికి ఫెడరేషన్ వినతి



**హైదరాబాద్, నవంబర్ 29 (మనసులో మాట):**

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూకే.ఎఫ్) రాష్ట్ర కమిటీ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. శనివారం హైదరాబాద్ లోని సచివాలయంలోని తన చాంబర్లో టీడబ్ల్యూజేఎఫ్ అడ్ హక్ కమిటీ కన్వీనర్ పి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య ఉపాధ్యక్షులు బి. .రాజశేఖర్, పి రాధిక, గుడిగ రఘు, కార్యదర్శి ఈ చంద్రశేఖర్, హెచ్ యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్, నాయకులు అచ్చిన ప్రశాంత్ తదితరులు మంత్రిని కలిశారు. దాదాపు గంటపాటు జర్నలిస్టుల సమస్యంపై చర్చించారు. వెంటనే అక్రిడిటేషన్లు ఇవ్వాలనీ, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ స్కీం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇండ్లస్థలాల విషయంలో కొత్త విధానం తీసుకురావాలని మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో.. ఇండ్లస్థలాల సమస్యలపై జర్నలిస్టు సంఘాలు, సీనియర్ జర్నలిస్టుతో సమావేశం నిర్వహించి పరిష్కరించాలని కోరారు. చనిపోయిన జర్నలిస్టులకు రూ. 20 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు. మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగా... రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమటీలు ఏర్పాటు చేయాలనీ, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి అటాక్స్ కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి పొంగులేటి...త్వరలో జర్నలిస్టుల సంఘాలతో సమావేశం నిర్వహించి సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఫెడరేషన్ నాయకులకు హామీ ఇచ్చారు. అంతకుముందు సమాచార శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డిఎస్ జగన్ లను కలిసిన టి డబ్ల్యూ జె ఎఫ్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు.

# దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వారు చిరస్మరణీయులు

## వీరనారి అవార్డుల ప్రదానోత్సవంలో సీపీ సజ్జనార్

హైదరాబాద్, నవంబరు 29 (మనసులో మాట):



దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలను మర్చిపోకూడదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. సైనిక్‌పురి ఎంకే రావు వె-ంమోరియల్ హాల్లో శనివారం బొండాడ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన వీరనారి అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇండో పాక్ యుద్ధంలో అనేకమంది అమరులయ్యారని, వారి త్యాగాలను స్మరించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా 51 మంది మాజీ సైనిక ఉద్యోగులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో బొండాడ గ్రూప్ ఛైర్మన్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్ పోలీసు శాఖ మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీఐటీ సెంట్రల్ ఇన్వెస్ట్ గేషన్ టీమ్‌ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ సన్నాహాలు చేస్తున్నారు. సెన్సేషనల్ కేసులతో పాటు కీలక కేసులను సీఐటీకి బదిలీ చేసేలా చర్యలు తీసుకోనున్నారు. సాధారణ కేసులతో సంబంధం లేకుండా సీఐటీ టీమ్ ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం అవుతుందని భావిస్తున్నారు పోలీస్ ఉన్నతాధికారులు. కేసు దర్యాప్తు దగ్గర నుంచి కోర్టులో ఛార్జ్ షీట్స్, ట్రయల్ వరకు సీఐటీ టీమ్ మానిటర్ చేసే విధంగా అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

# స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసం

## ముఠాను అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు




హైదరాబాద్, నవంబరు 29 (మనసులో మాట):

స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ముంబయిలో ఇద్దరిని అరెస్టు చేయగా.. వారిలో ప్రధాన నిందితుడు రవికుమార్‌తో పాటు మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సమకూరుస్తున్న శివేంద్ర అశోక్ సింగ్ ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి ట్రేడింగ్ పేరుతో రూ.12.30 లక్షలు మోసం చేసినట్లు సమాచారం. నిందితులపై దేశవ్యాప్తంగా 12 కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితుల విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వీరిని వలపన్ని పట్టుకున్నారు.

# ఏకగ్రీవం జాబితాలో మరో గ్రామం

## చిన్నఅడిశర్లపల్లి పంచాయతీపై ఏకాభిప్రాయం

నల్లగొండ, నవంబరు 29 (మనసులో మాట):

సర్పంచ్ ఏకగ్రీవంలో మరో గ్రామం చేరింది. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా గ్రామస్థులు ఏకగ్రీవానికి మొగ్గుచూపారు. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచిగా వెంకటయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధి కోసం రూ.51.30 లక్షలు సొంత నిధులు సమకూరుస్తానని ఆయన గ్రామస్థుల ఎదుట అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆ మొత్తాన్ని గ్రామంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి వినియోగించాలని గ్రామపెద్దలు తీర్మానించినట్లు సమాచారం. వాస్తవానికి ఇక్కడ మూడో విడతలో ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే, గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా సర్పంచిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కేబీఆర్ పార్క్ వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్

## నేడు ప్రారంభించనున్న జీహెచ్ఎంసీ

హైదరాబాద్, నవంబరు 29 (మనసులో మాట):

భాగ్యనగరంలో తొలిసారిగా ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్ అందుబాటులోకి రానుంది. ఆదివారం నుంచి జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద జీహెచ్ఎంసీ ప్రారంభించనుంది. ఇప్పటికే మల్టీ లెవెల్ పార్కింగ్‌కు ట్రయల్ రన్ పూర్తి చేసింది. నగరంలో ఇదే మొదటి ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్. ఉదయం, సాయంత్రం సమయంలో వాకింగ్‌కు వచ్చేవారితో పాటు చుట్టుపక్కల్లోని స్థానికులు వాహనాలను పార్కింగ్ చేసుకునే సదుపాయం కల్పించింది. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మల్టీలెవెల్ పార్కింగ్ వ్యవస్థను నిర్మించింది నవ నిర్మాణ్ అసోసియేట్స్. ఒకేసారి 72 కార్లు పార్కింగ్ చేసే సదుపాయం ఉంది. డిజైన్, బిల్డ్, ÷నాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ మోడల్‌లో మల్టీ లెవెల్ పార్కింగ్‌ను నిర్వహించనుంది నవ నిర్మాణ అసోసియేట్. ముందగానే పార్కింగ్ బుక్ చేసుకునేందుకుగానూ నావిగేషన్, ఇతర సర్వీసుల కోసం ఒక మొబైల్ యాప్‌ను తీసుకురానుంది.

# బాలసాని నిర్మలకు అరుదైన గౌరవం

## గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం

రామగుండం, నవంబరు 29 (మనసులో మాట)::

రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని అల్లూరు ప్రాంతానికి చెందిన చిరు మహిళా వ్యాపారి బాలసాని నిర్మలకు అరుదైన గౌరవం దక్కింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో జనవరి 26న అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం వచ్చింది. ఈమేరకు శనివారం సాయంత్రం నగర పాలక కార్యాలయంలో అదనపు కలెక్టర్, కమిషనర్ జే. అరుణ శ్రీ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. స్వశక్తితో ఎదగాలనుకునే మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నిర్మల చిరు వ్యాపారిగా పీఎం స్వనిధి పథకంలో పేరు నమోదు చేసుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో మొదటి విడత రుణం రూ.10వేలు పొంది తన ఇంట్లో ఒక చిన్న దుకాణం ప్రారంభించింది. తన కాళ్లపై తాను నిలబడాలన్న సంకల్పంతో ప్రారంభించిన ఆమె ప్రయాణంలో సకాలంలో రుణం తీర్చి రెండవ విడత రూ.20వేలు అందుకొని అందులోనే చీరల వ్యాపారం చేపట్టింది. ఆ వ్యాపారం విజయవంతం కావడంతో మూడో విడతగా రూ.50వేలు కూడా పొంది వ్యాపారాన్ని విస్తరించింది. నగదు రహిత లావాదేవీలు నిర్వహించిన వీధి వ్యాపారులకు ప్రభుత్వం అందించిన క్యాష్ బ్యాక్ ప్రోత్సాహాన్ని కూడా సద్వినియోగం చేసుకొని అత్యధికంగా రూ.5,340 క్యాష్ బ్యాక్ సంపాదించింది. దీంతో ఆమెకు జనవరి 26న న్యూఢిల్లీలో జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తన భర్త బాలసాని రవికుమార్ గౌడ్ తో కలిసి పాల్గొనడానికి మిషన్ డైరెక్టర్, మెప్మా నుంచి ఆహ్వానం లభించింది. పారిశ్రామిక ప్రాంతంలోని మహిళలు, యువతులు సమయాన్ని వృథా చేయకుండా స్వయంకృషితో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అదనపు కలెక్టర్ అరుణ శ్రీ పేర్కొన్నారు.

# వ్యవస్థలకు ఎందుకీ అవస్థలు..?

ఎలిశెట్టి సురేష్ కుమార్, జర్నలిస్ట్, 9948546286. 7995666286




వ్యక్తులు
ప్రారంభించిన సంస్థలు
వ్యవస్థలుగా ఎదిగి
చరిత్ర సృష్టిస్తే..
సృష్టిస్తూ ఉంటే..

ఒక పెద్ద వ్యవస్థ..
అంటే ప్రభుత్వం ఆరంభించిన సంస్థలు
ఉక్కు కర్మాగారాలు..
షిప్ యార్డులు..
కొన్ని బ్యాంకులు..
కొద్ది కొద్దిగా విమానాశ్రయాలు..
ఏమో..రానున్న రోజుల్లో
రైల్వేస్టేషన్లు..
బస్ స్టాండులు..
ఇంకా ఇంకా చాలా..
ప్రైవేట్..అంటే వ్యక్తుల
చేతుల్లోకి వెళ్ళిపోతున్నాయే..

అంతేనా..
ఒక వ్యక్తి..పోనీ కొందరు వ్యక్తుల సమూహం..
చేతుల మీదుగా ఊపిరి పోసుకున్న ఆస్పత్రులు
కార్పొరేట్ ఆస్పత్రులుగా
ఎదిగి అత్యున్నత..
అత్యాధునిక వసతులతో
లక్షలాది మందికి
జీవం పోస్తుంటే...
కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టగలిగే.. గలిగే ఏంటి..
ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు
ఆ స్థాయిలో ఎందుకు వైద్య సౌకర్యాలు కల్పించడంలో విఫలం అవుతున్నాయో..

అలాగే..విద్యారంగం కూడా..
ప్రైవేట్ రంగంలో
కాన్వెంట్ల నుంచి
పీజీ వరకు..
ఇంజనీరింగ్...
మెడిసిన్..
ఇంకెన్నో కోర్సులు...
అత్యున్నత ప్రమాణాలతో
విద్యాబోధన చేస్తుంటే..

ఎన్నో వనరులు..
కోట్ల రూపాయల నిధులు..
అందుబాటులో ఉండే సర్కారు ఆధ్వర్యంలో విద్య ఇలా దీనంగా..
డీలాగా..ఛ్..!

సర్కార్ ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో హాయిగా..సాఫీగా సాగిపోవాల్సిన రెండు
అతి ముఖ్య వ్యవస్థలు
విద్య..వైద్యం..
ప్రైవేట్ అధీనంలో..
స్పష్టంగా చెప్పాలంటే
ఆధిపత్యంలో
నడుస్తుండడం వల్ల
సామాన్యుడికి అందుబాటులో లేక
మళ్లీ ప్రభుత్వమే ఈ రెండు కీలక సౌకర్యాల కోసం
కొన్ని పథకాలు అమలుచేస్తూ..

ప్రజల సొమ్మును ప్రజల కోసం ఖర్చు చేస్తూ ప్రైవేట్ పరం చేస్తూ అదేదో ప్రజలకు మహోపకారం చేస్తున్నట్టు బిల్డప్పులు ఇస్తుంటే జ్ఞానం కొరవడి వెర్రి జనం ఆయా పథకాలు అమలు చేస్తున్న నాయకులను మహానేతలుగా కొనియాడుతున్న
చిత్రమైన పరిస్థితి..
దుస్థితి అనాలేమో..!

ఇంకేవీ ఉచితం అక్కర్లేదు..
విద్య..వైద్యం చాలు..
ఇలా చెప్పింది
అబ్దుల్ కలాం..
అటల్ బిహారీ వాజపేయి..
మరి ఆ రెండే ఈ రోజున
అతి కష్టమైన..క్లిష్టమైన
పరిస్థితిలో
కొట్టుమిట్టాడుతున్నాయి.

బ్రతకడం నేర్పించే..
బ్రతికించే
ఈ రెండు వ్యవస్థలు
పేద..మధ్యతరగతి జనాలకు అందుబాటులో ఉండని దుర్భర..
దౌర్భాగ్య స్థితి...!
వైద్యం ఎంత దయనీయ స్థితిలో అందని మావి..
ఎండమావి అయిందో..
ఆ పరాకాష్ట మొన్నటి
కోవిడ్ ఎపిసోడ్లో..
ముఖ్యంగా రెండో వేవ్ లో చూసాం..
ప్రభుత్వ ఆస్పత్రులు అవసరమైన స్థాయిలో వైద్యం అందించలేక
ఒక దశలో చేతులెత్తేసిన దుస్థితి దాపురిస్తే మరోపక్క
ప్రైవేట్ ఆస్పత్రులు సందట్లో సడేమియాల్లా
కోట్లాది రూపాయలు
మూటకట్టుకుని
మహర్దశను సాధించాయి..

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కథలు..
సర్కార్లది హీనచరిత్ర..
ప్రైవేటుది మరోచరిత్ర..!
ప్రభుత్వాలది
ఫెయిల్యూర్ స్టోరీ..
ప్రైవేటుది సక్సెస్ కహానీ!!

ఇదీ పరిస్థితి..
ఎక్కడుంది లోపం..
ఎవరిది పాపం..
ఇంకెవరికి శాపం..
మరెవరికి ధూపం..
ఇదంతా ఎవరికి కోపం!?
మొత్తానికి
ఈ వైఫల్యమైనా..
విజయమైనా..
వ్యవస్థది కాదు..
వ్యక్తులదే..
ప్రైవేటు విజయం
క్రెడిట్ అధిపతులది..
సర్కార్ల వైఫల్యం
బాధ్యత నిస్సందేహంగా
అధికార్లది..
ఖచ్చితంగా అధినాయకులది..!!

అదేదో సినిమాలో
ఓ డైలాగ్ ఉంటది..
మందు కొట్టినోడు
సెడిపోయాడు గాని
మందు కొట్టెట్టినోడు
ఎప్పుడూ సెడిపోలేదని..
అలాగే ఎప్పుడైనా
ఏ ప్రభుత్వం హయాంలోనైనా
ప్రజలు చెడిపోయారు గాని
ప్రభుత్వాలను నడిపిన
వ్యక్తులు చెడిపోలేదు..!
ఇంతకీ ఆ సినిమా కూడా
ఇంతసేపూ మనం చెప్పుకున్న కథకు
తగ్గ టైటిలే..

**సొమ్మొకడిది..**
**సోకొకడిది!**

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు

- అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం
- ఫేక్ కాల్స్ ఎత్తి సమాచారం ఇవ్వరాదు
- అనుమానం ఉటే 1930కు ఫిర్యాదు చేయాలి
- ప్రజలను అప్రమత్తం చేసిన హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్



**హైదరాబాద్, నవంబరు 29:** డిజిటల్ అరెస్ట్ పేరుతో దేశవ్యాప్తంగా పెరుగుతున్న కొత్త రకం సైబర్ మోసాల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ యూనిట్ తాజాగా ప్రజలకు ముఖ్య హెచ్చరిక జారీ చేసింది. ఇలాంటి మోసాలు హైదరాబాద్‌లో కూడా విస్తరిస్తున్నాయి. నకిలీ పోలీస్, సీబీఐ, ఈడీ, కస్టమ్స్, లేదా కోరియర్ కంపెనీల అధికారులుగా నటిస్తూ కాల్ చేసే మోసగాళ్లు, మనీ లాండరింగ్, టెర్రరిజం, నార్కోటిక్స్ కేసులు, ట్రాఫికింగ్ వంటి తీవ్ర నేరాల్లో కేసులు నమోదయ్యాయని చెప్పి ప్రజలను భయపెట్టి డబ్బు లాక్కోవడం ఈ స్కాం కీలక లక్ష్యంగా పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కాల్స్ ద్వారా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. బాధితులకు వీడియో కాల్ లేదా ఫోన్ ద్వారా అరెస్ట్ చేస్తున్నాం అని నటిస్తూ, ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని, వారెంట్లు జారీ అయ్యాయని నమ్మించి మోసం చేస్తారని హెచ్చరించారు. మోసగాళ్లు తమ కుట్రను బలపరచేందుకు నకిలీ వారెంట్లు, లేఖలు వంటి కట్టుకథల డాక్యుమెంట్లు తయారు చేసి పంపిస్తారు. అనుమానం లేకుండా ఉండేందుకు కుటుంబ ప్రతిష్టకు హాని కలుగుతుందని చెప్పి ఒత్తిడి పెంచుతారు. కేసు నుండి బయటపడాలంటే భారీ మొత్తం డబ్బు సేకరించి సుప్రీం కోర్టుకు డిపాజిట్ చేయాలి అని చెప్పి వెంటనే ట్రాన్స్ఫర్ చేయి-ంస్తారు. కుటుంబ సభ్యులకు చెప్పొద్దని హెచ్చరిస్తూ సోషల్ ఇంజినీరింగ్ పద్ధతులను వినియోగిస్తారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ యూనిట్ ప్రజలకు స్పష్టమైన సూచనలు ఇస్తోంది.. డిజిటల్ అరెస్ట్ అనే దాంట్లో ఏమీ లేదు. నిజమైన పోలీసులు ఎప్పుడూ ఫోన్, లేదా వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు. కాలర్ స్పూఫ్ చేయబడవచ్చు కాబట్టి ఏ అధికారిక కాల్ వచ్చినా వెంటనే నమ్మేయకూడదు. పాన్, ఆధార్, బ్యాంక్ వివరాలు వంటి వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని ఎవరితోనూ పంచకూడదు. అనుమానం వచ్చిన వెంటనే కాల్‌ను కట్ చేసి, కాలర్ ఇచ్చిన నంబర్లకు తిరిగి కాల్ చేయకుండా, స్థానిక పోలీస్ స్టేషన్ లేదా ప్రభుత్వ అధికారిక హెల్ప్‌లైన్‌ద్వారా మాత్రమే ధృవీకరించాలి. మెసేజ్లు, స్క్రీన్‌షాట్లు, కాల్ లాగ్స్ వంటి సాక్ష్యాలను భద్రపరచడం కూడా చాలా ముఖ్యమని అధికారులు తెలిపారు. ఇలాంటి మోసాలు ఎదురైనపుడు వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని లేదా ఫిర్యాదు చేయాలని సూచించారు. తాజా అప్డేట్ల కోసం హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ అధికారిక సోషల్ మీడియా పేజీలను,ఖాతాలను ఫాలో కావాలని చెప్పారు. డిజిటల్ ప్రపంచం వేగంగా మారుతున్న కొద్దీ మోసగాళ్ల పద్ధతులు కూడా అధునాతనంగా మారుతున్నాయి. ఒక్క ఫోన్ కాల్, ఒక్క మెసేజ్ కూడా భారీ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు.

# ప్రభుత్వ స్థలంలో విల్లాలు కట్టి అమ్మకం

## రెయిన్‌బో మెడోస్ నిర్మాణ సంస్థ మోసం

**హైదరాబాద్, నవంబరు 29:** సంగారెడ్డి జిల్లాలోని కిష్టారెడ్డిపేటలో రెయిన్‌బో మెడోస్ నిర్మాణ సంస్థ పాల్పడిన అతిపెద్ద రియల్ ఎస్టేట్ మోసం తాజాగా వెలుగు చూసింది. ప్రభుత్వ స్థలంలో విల్లాలను కట్టి 40కోట్లకు మోసం చేసింది. రెవెన్యూ అధికారులు ఈ తతంగాన్ని చోద్యం చూశారే తప్ప నిలదీయలేదు. హెచ్ఎండీఏ ఆమోదించిన లేఅవుట్‌గా నమ్మించి, పలు సర్వే నంబర్లలో ఏకంగా 40 విల్లాలను అక్రమంగా నిర్మించి అమాయక ప్రజలకు విక్రయించారు. ఇటీవల రెవెన్యూ అధికారుల సర్వేలో ఈ విల్లాలన్నీ సర్వే నంబర్లు 198, 199, 204, 208, 210లలోని ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, కొనుగోలు దారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విల్లాల కోసం ఒక్కో కుటుంబం రూ. 90 లక్షల నుంచి రూ. 1.1 కోటి వరకు వెచ్చించింది. మొత్తంగా, బాధితులు సుమారు రూ. 40 కోట్లకు పైగా పెట్టుబడిని నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ మోసం వెలుగులోకి రాగానే, తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఆందోళనకు దిగారు. గతంలోనే కొందరు బాధితులు అనుమానం వ్యక్తం చేసినప్పుడు, ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే తాము తీసుకున్న డబ్బు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని రెయిన్‌బో మెడోస్ సంస్థ లిఖితపూర్వక ఒప్పందం (ఓక్షజ) ఇచ్చింది. అయి-ంతే, ఇప్పుడు అది ప్రభుత్వ స్థలం అని నిర్ధారణ కావడంతో, నిర్మాణ సంస్థ స్పందించకుండా ముఖం చాటేయడంతో



బాధితులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తమ ఇళ్లు ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు తేలడంతో, హెచ్ఎండీఏ, ఎంఆర్ఓ, ఆర్డిఓ వంటి ప్రభుత్వ వ్యవస్థలు ప్రభుత్వ భూమిని తనిఖీ చేయకుండా ఈ నిర్మాణాలకు ఎలా అనుమతి ఇచ్చాయని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తమను మోసం చేసిందని ఆరోపిస్తూ, సంస్థ భాగస్వాములైన ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి ప్రసాద్, ఎన్.వి. నరసింహారావులపై క్రిమినల్ కేసు నమోదు చేసి, తమకు అయిన నష్టాన్ని పూర్తిగా తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం, బాధితులు అమీన్‌పూర్ పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందో, బాధితులకు న్యాయం జరుగుతుందో లేదో తెలియాల్సి ఉంది.

# 9 ప్రపంచ రికార్డుల ముంగిట కోహ్లీ



క్రికెట్ ప్రపంచంలో కింగ్ కోహ్లీగా ప్రఖ్యాతి గాంచిన విరాట్ కోహ్లీకి నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న మూడు వన్డే మ్యాచ్‌ల సౌతాఫ్రికా సిరీస్ చాలా కీలకం కానుంది. ఇది కోహ్లీకి కేవలం ఒక సాధారణ సిరీస్ కాదు, ఏకంగా తొమ్మిదికి పైగా అరుదైన ప్రపంచ రికార్డులను తన ఖాతాలో వేసుకునే అద్భుతమైన అవకాశం. అత్యంత వేగంగా 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేయడం నుంచి, ఒకే ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించడం వరకు... ఈ సిరీస్‌లో విరాట్ కొట్టే ప్రతి పరుగు చరిత్ర సృష్టించనుంది. విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో 51 సెంచరీలతో, టెస్టుల్లో 51 సెంచరీలు సాధించిన సచిన్ టెండూల్కర్ రికార్డుతో సమంగా ఉన్నాడు. ఈ సిరీస్‌లో విరాట్ కేవలం ఒక్క సెంచరీ సాధిస్తే, వన్డేల్లో 52 సెంచరీలు పూర్తి చేసుకుంటాడు. తద్వారా అతను ఏ ఒక్క ఫార్మాట్‌లో అయినా అత్యధిక సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మెన్‌గా నిలిచి, సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తాడు. ఈ అరుదైన రికార్డు కోసం యావత్ క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగంగా పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కూడా కోహ్లీ ముందున్నాడు. విరాట్ 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేయడానికి 327 పరుగులు మాత్రమే అవసరం. రాబోయే 23 ఇన్నింగ్స్‌లలో విరాట్ ఈ పరుగులు చేస్తే, అత్యంత వేగంగా 28,000 పరుగులు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశం ఉంది. అలాగే, ప్రస్తుతం విరాట్ ఖాతాలో 27,673 అంతర్జాతీయ పరుగులు ఉన్నాయి. అతను కేవలం 344 పరుగులు చేస్తే, శ్రీలంక దిగ్గజం కుమార సంగాక్కర (28,016 పరుగులు)ను అధిగమించి, సచిన్ టెండూల్కర్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన రెండవ బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. ఈ సిరీస్‌లో విరాట్ సౌతాఫ్రికాపై, భారత గడ్డపై కూడా అనేక ప్రత్యేక రికార్డులు సాధించే అవకాశం ఉంది. కేవలం ఒక సెంచరీ సాధిస్తే, సౌతాఫ్రికాపై 6 వన్డే సెంచరీలు చేసిన ప్రపంచంలోనే ఏకైక బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. అలాగే, గెలిచిన మ్యాచ్‌లలో మరో 14 పరుగులు చేస్తే, సౌతాఫ్రికాపై భారత్ విజయాలలో 1000 వన్డే పరుగులు చేసిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టిస్తాడు. SENA (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలపై గెలిచిన వన్డే మ్యాచ్‌లలో అత్యధిక పరుగులు చేసిన ప్రపంచ రికార్డుకు కేవలం 16 పరుగులు దూరంలో మాత్రమే ఉన్నాడు. స్వదేశంలో ఒక 50ం స్కోరు సాధిస్తే, భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక 50ం స్కోర్లు చేసిన రికార్డును సొంతం చేసుకుంటాడు. అంతేకాకుండా, ఒక హాఫ్ శతకం సాధిస్తే, దేశీయ మైదానాల్లో 100 హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్న ఏకైక ఆటగాడిగా అరుదైన మైలురాయిని చేరుకుంటాడు.

# ఆయుష్ మాత్రే సిక్సర్ల వర్షం



2025-26 సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ 2025-26) లో భాగంగా జరిగిన ఎలైట్ గ్రూప్ %ూ% మ్యాచ్‌లో విదర్భ, ముంబై జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ముంబై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ టీ20 మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై కేవలం 17.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ముంబై తరపున అద్వితీయ సెంచరీ చేసిన ఆయుష్ మాత్రే ఈ విజయానికి ప్రధాన రూపశిల్పి అయ్యాడు. మ్యాచ్ ప్రారంభంలో, టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ తొలి వికెట్‌కు 115 పరుగులు జోడించడం ద్వారా మంచి ఆరంభాన్ని ఇచ్చింది. అథర్వ టైడే 64 పరుగులు, అమన్ మొఖడే 61 పరుగులు సాధించారు. అయితే, ఈ ఇద్దరు ఆటగాళ్లు అవుట్ అయిన తర్వాత ఆరుగురు బ్యాట్స్‌మెన్ రెండంకెల స్కోరును చేరుకోకపోవడంతో విదర్భ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఒకప్పుడు 200 కంటే ఎక్కువ స్కోరు చేసిన విదర్భ చివరికి 192 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ భారీ స్కోరును ఛేదించే క్రమంలో, 18 ఏళ్ల ఆయుష్ మాత్రే ముంబై తరపున చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఆయుష్ మాత్రే కేవలం 53 బంతుల్లోనే అజేయంగా 110 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో, ఆయుష్ మాత్రే 8 ఫోర్లు, 8 సిక్సర్లు బాదాడు. అతను కేవలం ఫోర్ల ద్వారా 80 పరుగులు చేశాడు. ఆయుష్ మాత్రేతో పాటు సూర్యకుమార్ యాదవ్ కూడా 30 బంతుల్లో 35 పరుగులు చేశాడు. అదే సమయంలో, శివమ్ దూబే 19 బంతుల్లో 205.26 స్ట్రైక్ రేట్‌తో అజేయంగా 39 పరుగులు చేసి జట్టును విజయపథంలో నడిపించాడు. శివమ్ దూబే కూడా 3 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు. ఫలితంగా, ముంబై కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించింది.

# నేడు భారత్, దక్షిణాఫ్రికా తొలి వన్డే

## రాంచీ వేదికగా జరగనున్న మొదటి మ్యాచ్

## వన్డే సిరీస్‌లో సత్తా చాటాలని భావిస్తోన్న భారత్





రాంచీ: టెస్ట్ సిరీస్‌లో ఘోరంగా ఓడిపోయి దాదాపు అయిదారు దశాబ్దాల చెత్త రికార్డులను ఖాతాలో వేసుకున్న టీమిండియా వన్డే సిరీస్‌లో సత్తా చాటాలని భావిస్తోంది. ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతం గంభీర్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్ కోసం రెండు జట్లు సిద్ధంగా ఉన్నాయి. వన్డే సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ నవంబర్ 30, 2025న రాంచీ వేదికలో భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. టెస్ట్ సిరీస్ ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందని క్రికెట్ ప్రేమికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అందుకు కారణంగా దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి పెద్ద ఆటగాళ్ళు జట్టులో ఉన్నారు. కనుక వన్డే సిరీస్ కోసం అభిమానులు చూస్తున్నారు. పటిష్ట టీమిండియా వన్డే సిరీస్ లో సఫారీలపై నెగ్గుతారని సంకేతాలు కనిపిస్తున్నాయి. భారత్, దక్షిణాఫ్రికా మధ్య మొదటి వన్డే రాంచీలో స్టేడియం కాంప్లెక్స్‌లో ఆదివారం నాడు జరగనుంది. అయితే స్టేడియానికి వెళ్లి చూడలేని వారు హాయిగా ఇంట్లో కూర్చుని లైవ్ స్ట్రీమింగ్, టీవీ ప్రసార ఆప్షన్లు ఉన్నాయి. వాటి గురించి క్రికెట్ అభిమానులు తెలుసుకోవాలి. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో రాణించిన సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నారు. దీంతో అభిమానుల చూపులన్నీ వాళ్లపైనే ఉండనున్నాయి. ఈ ఇద్దరూ బ్యాటింగ్‌లో రాణిస్తే, జట్టుకు భారీ స్కోర్ ఖాయం. సౌతాఫ్రికాపై విరాట్ గత రికార్డులు బాగుండడం, రోహిత్ శర్మ భీకర ఫామ్‌లో ఉండడం భారత్‌కు కలిసొచ్చే అంశాలు. ఇక రెగ్యులర్ కెప్టెన్ శుభమన్ గిల్, శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా దూరమయ్యారు. మహమ్మద్ షమి, బుమ్రా, సిరాజ్ లాంటి సీనియర్ పేసర్లలో ఒక్కరూ లేకుండా ఒక పెద్ద జట్టుతో భారత్ వన్డే సిరీస్ ఆడుతుండడం చాలా ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న సౌతాఫ్రికాను భారత యువ పేసర్లు ఏ మేరకు కట్టడి చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. కెప్టెన్ గిల్ గైర్హాజరులో సీనియర్ ఆటగాడు KL రాహుల్ జట్టును నడిపించనున్నాడు. రోహిత్‌కుతో యశస్వీ జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. తర్వాత విరాట్ రానున్నాడు. తిలక్ వర్మ, రిషభ్ పంత్, KL రాహుల్‌తో పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ ఉంది. మరో సీనియర్ రవీంద్ర జడేజాకు తుది జట్టులో చోటు ఖాయం కాగా, అతడికి తోడు మరో ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్ సుందర్ లేదా నితీశ్ కుమార్ రెడ్డిని ఎంచుకునే అవకాశం ఉంది. వన్డేలేలో కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ రికార్డ్ మెరుగ్గానే ఉంది. ఇప్పటిదాకా 12 మ్యాచ్‌ల్లో టీమ్ఇండియాకు రాహుల్ నాయకత్వం వహించాడు. అందులో 8 వన్డేల్లో భారత్ గెలిచింది. మరో నాలుగింట్లో ఓడింది. ఓవరాల్‌గా విన్నింగ్ పర్సెంటేజీ 67 శాతంగా ఉంది.

సీనియర్లకు లేకపోవడంతో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణకు తొలి వన్డేలో ఛాన్స్ దక్కే ఛాన్స్ ఉంది. మరి ఈ యువ ఆటగాళ్లు అనుభవజ్ఞులైన సఫారీ బ్యాటర్లకు ఎలా కళ్లెం వేస్తారో చూడాలి. ఒకరకంగా చెప్పాలంటే ఈ పేస్ త్రయానికి మాత్రం సౌతాఫ్రికా సిరీస్ కఠిన పరీక్ష కానుంది. టెస్టు సిరీస్ గెలిచిన ఉత్సాహంలో ఉన్న సఫారీలు వన్డే సిరీస్‌లోనూ సత్తాచాటాలని పట్టుదలతో ఉన్నారు. కెప్టెన్ బవుమా, మార్‌క్రమ్, రికిల్‌టన్, డికాక్, డేవిడ్ బ్రెవిస్, బ్రీట్జ్‌కేలతో బ్యాటింగ్ విభాగం దుర్భేద్యంగా కనిపిస్తోంది. కార్బిన్ బాష్, మార్కో యాన్సెన్ వంటి నాణ్యమైన ఆల్‌రౌండర్లు ఉండగా స్పిన్ భారం కేశవ్ మహారాజ్ మోయనున్నాడు. స్టార్ పేసర్లు రబాడా, నోకియా దూరమైన నేపథ్యంలో ఎంగిడి నేతృత్వంలోని బౌలింగ్ దళం ఎంతమేర రాణిస్తోందో చూడాలి. నెమ్మదిగా ఉండే రాంచీ పిచ్‌పై భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం లేదు. టాస్ గెలిచిన జట్టు తొలుత బౌలింగ్ తీసుకునే అవకాశం ఉంది. కాగా టీమిండియా, దక్షిణాఫ్రికా మధ్య రాంచీ వేదికగా జరగనున్న మొదటి వన్డే మ్యాచ్ జియోహాట్‌స్టార్ యాప్, జియో హాట్‌స్టార్ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షంగా ప్రసారం చేయనున్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఎప్పటిలాగే, మ్యాచ్‌ని చూడటానికి అభిమానులు జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ కలిగి ఉండాలి. టీవీలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ చూడాలనుకునే వారు స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో మ్యాచ్ లైవ్ చూడవచ్చు. టాస్ ఆట ప్రారంభానికి 30 నిమిషాల ముందు, అంటే మధ్యాహ్నం 1:00 గంటలకు వేస్తారు. టాస్ తర్వాత భారత్, దక్షిణాఫ్రికా జట్ల ప్లేయింగ్ %శ×% ప్రకటిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు డే అండ్ నైట్ వన్డే ప్రారంభం కానుంది. వాస్తవానికి భారత్‌లో సిరీస్ కనుక ఉదయం వేళ నుంచి సాయంత్రం వరకు మ్యాచ్ ఉంటుందని ఆశించిన ఫ్యాన్సుకు నిరాశే ఎదురవుతోంది.

### భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్: పూర్తి స్క్వాడ్‌లు

భారత్ పూర్తి ఆటగాళ్లు- రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ (కెప్టెన్), తిలక్ వర్మ, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, రుతురాజ్ గైక్వాడ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, అర్షదీప్ సింగ్, ధ్రువ్ జురెల్

దక్షిణాఫ్రికా పూర్తి ఆటగాళ్లు - టెంబా బావుమా (కెప్టెన్), ఓట్నీల్ బార్ట్‌మన్, మాథ్యూ బ్రీట్జ్‌కే, ర్యాన్ రికెల్టన్, ఐడెన్ మార్క్రమ్, కార్బిన్ బోష్, డెవాల్డ్ బ్రెవిస్, నాంద్రే బర్గర్, క్వింటన్ డి కాక్, రూబిన్ హెర్మన్, కేశవ్ మహారాజ్, టోనీ డి జోర్జీ, మార్కో జాన్సెన్, లుంగి ఎంగిడి, ప్రెనెలాన్ సుబ్రాయెన్

# టీమిండియాలో ద్రవిడ్, లక్ష్మణ్‌లాంటి బ్యాటర్లు లేరు

**క్రీజులో పాతుకుపోయి ఓపికగా ఆడే నైపుణ్యం లేదు**

**క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు**



ప్రస్తుత భారత జట్టులో రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్‌లాంటి స్పెషలిస్ట్ టెస్ట్ బ్యాటర్లు లేరని క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ అన్నాడు. టీ20, వన్డేలు ఎక్కువగా ఆడటంతో క్రీజులో పాతుకుపోయి ఓపికగా ఆడే నైపుణ్యం భారత బ్యాటర్లకు లేకుండా పోయిందని అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయిన సంగతి తెలిసిందే. ఈ ఘోర పరాజయంతో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో భారత్ జట్టు సంధి దశలో ఉంది. తాజాగా భారత జట్టు ప్రదర్శనపై స్పందించిన కపిల్ దేవ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ప్రస్తుతం భారత ఆటగాళ్లు ఎక్కువగా టీ20లు, వన్డే మ్యాచ్‌లు ఆడుతున్నారు. దాంతో బ్యాటర్లకు బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై ఆడే అవకాశం రావడం లేదు. స్పిన్, పేస్‌కు అనుకూలించే పిచ్‌లపై బ్యాటర్లు చాలా ఓపికగా ఆడాలి. అలాగే ప్రత్యేకమైన నైపుణ్యం కలిగి ఉండాలి. ప్రస్తుతం మన దగ్గర క్రీజులో పాతుకుపోయే రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ వంటి స్పెషలిస్ట్ బ్యాటర్లు లేరు. టెస్ట్‌ల్లో బ్యాటింగ్ అంటే క్రీజులో పాతుకుపోవడమే. స్పిన్, పేస్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రత్యేకమైన నైపుణ్యం ఉండాలి. కానీ టర్న్, బౌన్స్ ఎక్కువగా ఉండే పిచ్‌లపై బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదు. ఈ తరహా పిచ్‌లపై ఫుట్‌వర్క్ చాలా కీలకం. కానీ రిషభ్ పంత్ శైలి వేరు. ఎందుకంటే దూకుడుగా ఆడటమే అతని స్టైల్. రిషభ్ పంత్‌ను డిఫెన్స్ ఆడమని మనం చెప్పలేం. ఎందుకంటే పంత్ సిక్స్‌లు, ఫోర్లతో ఎదురువిరుచుకుపడి, ప్రత్యర్థి జట్టును కకావికలం చేయగల సమర్థుడు. అలాంటి నైపుణ్యమున్న అతనికి మనం నెమ్మదిగా ఆడి 100 బంతుల్లో 20 పరుగులు చేయమని చెప్పలేం. అతను అలా చేయలేడు కూడా'అని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు.

# స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసిన ముంబై ఇండియన్స్

## మహిళా ప్రీమియర్ లీగ్ కోసం భారీ కసరత్తు

రెండుసార్లు మహిళా ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్, మహిళా ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం ఒక స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసింది. వేలానికి ముందు ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న ముంబై ఇండియన్స్, వేలంలో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ అమెలియా కెర్ కోసం ఏకంగా రూ.3 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించింది. పాత ఆటగాళ్లైన షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజన సజీవన్ మళ్లీ జట్టులోకి రావడంతో ముంబై జట్టు మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ముంబై ఇండియన్స్ ఫ్రాంఛైజీ యజమాని నీతా అంబానీ, తాము గతేడాది జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నవంబర్ 27) జరిగిన మహిళా ప్రీమియర్ లీగ్ వేలం గురించి మాట్లాడిన ముంబై ఇండియన్స్ సహ-యజమాని నీతా అంబానీ, వేలం రోజు చాలా ఉత్సాహంగా, కొన్నిసార్లు టెన్షన్‌గా కూడా గడిచిందని అన్నారు. 2025లో ఛాంపియన్‌గా నిలిచిన జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయడమే తమ ప్రధాన వ్యూహమని ఆమె వెల్లడించారు. కీలకమైన ఆటగాళ్లు తిరిగి జట్టులోకి రావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వేలంలో అమెలియా కెర్ తిరిగి జట్టులోకి రావడం అలాగే షబ్నిమ్ ఇస్మాయిల్, సైకా ఇషాక్, సజన సజీవన్, సంస్కృతి గుప్తా వంటి నలుగురు భారతీయ ప్లేయర్లు మళ్లీ రావడం ముంబై ఇండియన్స్‌కు పెద్ద బలం అని ఆమె అన్నారు. అంతేకాకుండా రాహిలా ఫిర్దౌస్, నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ వంటి యువ ప్రతిభావంతులతో పాటు, పూనమ్ ఖేమ్నార్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్, నికోలా కేరీలను కూడా ముంబై ఇండియన్స్ ఫ్యామిలీలోకి స్వాగతించారు. ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు, నాట్ సైవర్-బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి కమలిని వంటి ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. వేలంలో ఇటీవల టీ20 ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన అమెలియా కెర్, ఫాస్ట్ బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ తిరిగి రావడం కోర్ టీమ్‌ను మరింత పటిష్టం చేసింది. ప్రపంచ కప్ విజేత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా న్యూఢిల్లీలో జరిగిన వేలానికి హాజరై, వేలం టేబుల్‌పై వ్యూహాలను రచించడంలో కీలక పాత్ర పోషించారు. వేలంలో తన అనుభవం గురించి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. "నేను మొదట్లో కొంచెం కంగారు పడ్డాను, కానీ మేము ప్రణాళిక చేసిన విధానం, అందరి భాగస్వామ్యం నాకు చాలా బాగా నచ్చింది. నీతా అంబానీ ఎప్పుడూ జట్టుకు సపోర్టుగా ఉండి మాకు అండగా నిలుస్తారు. మా పాత సహచరులలో ఎక్కువ మందిని మేము తిరిగి పొందాము. ఇది ఆ ఆటగాళ్లపై జట్టుకు ఉన్న నమ్మకాన్ని చూపుతుంది" అని అన్నారు. ముంబై ఇండియన్స్ విజయాలలో సైకా, సజన, సంస్కృతి వంటి ఇండియన్ ప్లేయర్లు కీలక పాత్ర పోషించారు. వారు టోర్నమెంట్‌లో ఎదుగుతున్న స్టార్ ప్లేయర్‌లుగా నిలిచారు. ముంబై ఇండియన్స్ జట్టు.. అనేక ప్రపంచ కప్‌ల విజేత అయిన నికోలా కేరీ, యువ ఫాస్ట్ బౌలర్ మిల్లీ ఇల్లింగ్‌వర్త్ అనే ఆస్ట్రేలియన్ జోడీని కూడా తమ జట్టులో చేర్చుకుంది. అలాగే యంగ్ ఇండియన్ టాలెంటుకు సపోర్ట్ ఇచ్చే తమ విధానానికి అనుగుణంగా, భారతీయ ఆల్‌రౌండర్‌లు నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ్‌లను కూడా కొనుగోలు చేసింది. వీరిద్దరూ తొలిసారి డబ్ల్యూపీఎల్ లో ఆడనున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




# ఓటీటీ వేదికగా శివ విడుదల చేస్తాం: నాగ్

ఒకప్పటి కల్ట్ క్లాసిక్ 'శివ' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మరోసారి సందడి చేసిన క్రమంలో.. ఇప్పుడీ చిత్రాన్ని ఓటీటీలోకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నాగార్జున చెప్పారు. తాజాగా గోవా వేదికగా జరిగిన ఇఫి వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'శివ' గురించి, ఏయన్నార్ చిత్రాల గురించి మాట్లాడారు. శివ' రీరిలీజ్ వెర్షన్ ఓటీటీలో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి . ఇప్పటికే పలు సంస్థలతో చర్చలు జరిపాం. ఎంతో కష్టపడి దీన్ని 4కే వెర్షన్‌లోకి మార్చాం. అందరూ చూసి ఎంజాయ్ చేయాలనే తపనతోనే ఓటీటీలో విడుదల చేయాలని అనుకుంటున్నాం. ఇప్పుడు గొప్ప టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. సినిమాలను 4కే లోకి ఎలా మార్చాలో అర్థమైంది. ఏఐ వచ్చిన తర్వాత ప్రతి పని సులభమైంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో మంచి సాంకేతికత అందుబాటులో ఉందని చెప్పారు. ఏయన్నార్ అలనాటి అనేక అపూర్వ సినిమాలను 4కే వెర్షన్‌లోకి మార్చాలంటే నెగెటివ్స్ లేవని చెప్పారు. అధునాతన సాంకేతిక హంగులతో ఏయన్నార్ పాత చిత్రాలను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఉన్నా.. రైట్స్, నెగెటివ్స్ లేకపోవడంతో సాధ్యం కావట్లేదని నాగార్జున తెలిపారు. తన 100వ చిత్రం నుంచి కూడా త్వరలోనే అప్‌డేట్స్ వస్తాయని తెలిపారు. అలాగే అఖిల్ తదుపరి చిత్రం 'లెనిన్' పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.



## ప్రభాస్ లుక్ కనిపించకుండా వంగా జాగ్రత్తలు

**ఆరు నెలలపాటు పబ్లిక్ ఈవెంట్‌లకు దూరంగా రెబల్**




ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న మోస్ట్-అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'స్పిరిట్' గురించి ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల మొదలవ్వగా, దర్శకుడు సందీప్ వంగా ప్రభాస్ లుక్ విషయంలో అత్యంత గోప్యత పాటిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' సినిమాలోని ప్రభాస్ పాత్ర లుక్‌ను అభిమానులకు సర్‌ప్రైజ్‌గా ఉంచాలని సందీప్ వంగా గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే, ఈ లుక్ లీక్ అవ్వకుండా ఉండేందుకు, రాబోయే ఆరు నెలల పాటు ప్రభాస్‌ని పబ్లిక్ ఈవెంట్స్‌కు దూరంగా ఉండాలని కోరినట్లు సమాచారం. పబ్లిక్ ఈవెంట్లు, ఎయిర్‌పోర్ట్‌లలో ప్రభాస్ కనిపిస్తే, ఆయన లుక్‌ను అభిమానులు లేదా మీడియా ఫొటోలు తీసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, కొన్ని నెలల పాటు ఎలాంటి ప్రచార కార్యకలాపాలు లేదా బహిరంగ కార్యక్రమాలకు హాజరు కాకూడదని ప్రభాస్, సందీప్ వంగా నిర్ణయించుకున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినా సందీప్ వంగా ప్రభాస్‌ను ఏ విధంగా ప్రెజెంట్ చేయబోతున్నారో చూడాలనే ఉత్సాహం మాత్రం వారిలో ఎక్కువగా ఉంది. 'స్పిరిట్' చిత్రంలో త్రిప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్, కాంచన ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.




## వారణాసి టైటిల్ సమస్య ఎదుర్కొంటోందా?

ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. 2027లో రాబోతున్న ఈ సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించినప్పటి నుంచి సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా 'వారణాసి' అనే టైటిల్‌ను తెలుగులో గతంలోనే వేరే నిర్మాణ సంస్థ రిజిస్టర్ చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజాగా ఈ టైటిల్ వివాదం పరిష్కారమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేరే నిర్మాణ సంస్థ కేవలం తెలుగులో మాత్రమే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకోవడంతో, చిత్ర బృందం తెలుగు వెర్షన్ టైటిల్‌లో స్వల్ప మార్పు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ సినిమా పలు భాషల్లో విడుదల కానున్నందున, తెలుగులో మాత్రం 'రాజమౌళి వారణాసి' అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇతర అన్ని భాషల్లో మాత్రం 'వారణాసి' అనే ఒరిజినల్ టైటిల్‌నే కొనసాగించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై చిత్ర యూనిట్ త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ఖలేజా సినిమా టైంలో కూడా ఇలా టైటిల్ వివాదం ఎదుర్కోగా.. మేకర్స్ ఆలోచించి మహేశ్ ఖలేజా అనే పేరుతో విడుదల చేయగా.. వివాదం సద్దుమణిగింది.



## స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా?

ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమె ఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## అప్పులు తీర్చిన ఆపద్బాంధవుడు శ్రీవిష్ణు

**దర్శకుడు వేణు వుడుగుల ఎమోషన్**



తెలంగాణ నేపథ్యంలో వాస్తవిక అంశాలతో కూడిన సినిమాలు తీసే దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వారిలలో వేణు వుడుగుల ఒకరు. నీది నాది ఒకే కథ(2018), విరాట పర్వం ఇలా తీసింది రెండు చిత్రాలే అయిన మంచి దర్శకుడిగా స్థానాన్ని నిలుపుకున్నాడు. తాజాగా అతడి నిర్మాణంలో వచ్చిన చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం సూపర్‌హిట్‌ను అందుకుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ.. తన మొదటి సినిమా హీరో శ్రీవిష్ణు చేసిన సహాయాన్ని గుర్తు చేసుకుని ఇటీవల భావోద్వేగానికి లోనయ్యారు. శ్రీవిష్ణు కథానాయకుడిగా వేణు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'నీది నాది ఒకే కథ' (2018). ఈ సినిమా సమయంలో తన ఆర్థిక ఇబ్బందుల గురించి వేణు తాజాగా మాట్లాడుతూ.. నా మొదటి సినిమా ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు, నేను కొన్ని తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాను. అప్పులు చాలా ఉండేవి. ఒకరోజు నన్ను శ్రీవిష్ణు చూసి ఎందుకు మీరు ఇలా ఉంటారు ఎప్పుడు ఏదో బాధతో అని అడిగాడు. ఏమైన అప్పులు ఉన్నాయా అంటూ తెలుసుకున్నాడు. నేను కూడా చిన్న చిన్నవే అంటూ చెప్పాను. దీంతో నా పరిస్థితి తెలుసుకున్న శ్రీ విష్ణు ఆ మరుసటిరోజే నాకున్న అప్పులన్నీ తీర్చేశాడు. ఆయనకు ఏం అవసరం ఇది చేయడానికి.. అయిన కూడా చేశాడు. ఆరోజు శ్రీవిష్ణు చేసిన సహాయాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన నా సినిమాకు కేవలం హీరో మాత్రమే కాదు, నా కష్టకాలంలో నాకు అండగా నిలబడిన ఒక దైవంగా భావిస్తాను అంటూ వేణు చెప్పుకోచ్చాడు.



## దుమ్మురేపుతున్న .. పేరుగల్ల పెద్దిరెడ్డి ఫోక్ సాంగ్

తెలంగాణ జానపద గాయని, నృత్యకారిణి నాగదుర్గ నుంచి తాజాగా విడుదలైన పాట 'పేరుగల్ల పెద్దిరెడ్డి' ప్రస్తుతం యూట్యూబ్‌లో మరియు సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది. తెలంగాణ ఫోక్ సాంగ్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ, ఈ కొత్త పాటతో మరోసారి ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. పేరుగల్ల పెద్దిరెడ్డి అంటూ వచ్చిన ఈ పాట తండ్రి మీద ప్రేమతో కూతురు చెబుతున్న నేపథ్యంలో ఉంది. పల్లెటూరి వాతావరణాన్ని, జానపద లయను ప్రతిబింబిస్తూ ఈ పాట ఆకట్టుకుంటుంది. ఎప్పటిలాగే, నాగదుర్గ ఈ పాటలో తనదైన శైలిలో చేసిన ఎనర్జిటిక్ డ్యాన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. శుక్రవారం విడుదలైన ఈ పాట కొద్ది గంటల్లోనే యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌ను సాధిస్తూ ట్రెండింగ్‌లో నిలిచింది. ప్లలె జానపద పాటల అభిమానుల మధ్య ఈ పాట క్రేజీ హిట్‌గా మారడంతో నాగదుర్గ ఖాతాలో మరో విజయవంతమైన జానపద పాట చేరింది. ఈ పాటకు బుల్లెట్ బండి లక్ష్మణ్ సాహిత్యం అందించగా.. మమత రమేష్ పాడింది. మదన్ కే సంగీతం అందించాడు.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861